ఈనాడు

విజయవాడ 26-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 166

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పది తర్వాత ఎంచుకునే కోర్సులతోనే మంచి భవిత

- అవకాశాలు అందరికీ సమానం.. అవగాహనతోనే ముందుకెళ్లాలి
- ఈనాడు ప్రతిభ- రిసొనెన్స్ వెబినార్‌లో నిపుణులు

ఈనాడు, హైదరాబాద్: అవకాశాలు అందరికీ సమానంగా ఉంటాయని, అవగాహనతో ముందుకు వెళ్తేనే మంచి భవిత ఉంటుందని నిపుణులు స్పష్టం చేశారు. ఏ కోర్సునూ తక్కువగా అంచనా వేయాల్సిన అవసరం లేదని అన్నింటికీ సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆదివారం ఈనాడు ప్రతిభ, రిసొనెన్స్ విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహించిన వెబినార్‌లో రిసొనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు, ఇంటర్‌బోర్డు రిటైర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వంగపల్లి సుబ్బారావు, విద్యావేత్త డాక్టర్ మోతుకుల నారాయణ పాల్గొన్నారు.

అంతా ఐఐటీ మోజులో పడటం సరికాదు

సుబ్బారావు: ఇంటర్‌లో తీసుకునే గ్రూపు.. విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. విద్యార్థులు స్వీయ మదింపుతో కోర్సును ఎంచుకోవాలి. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, నిపుణుల సలహాలతో మంచి నిర్ణయం తీసుకోవాలి. గతంలో ఇంటర్‌లో 14 కోర్ గ్రూపులుండేవి. ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉన్నాయి. అంతా ఐఐటీ మోజులో పడటం సరికాదు. ఆర్ట్స్ కోర్సులతోనూ కెరీర్ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి... టెక్నికల్ కోర్సులకూ వెళ్లొచ్చు. సివిల్స్ లేదా గ్రూప్స్ లక్ష్యంగా ముందుకు వెళ్లొచ్చు. ఎంబీఏ చేద్దామనుకునేవారు మ్యాథ్స్ సబ్జెక్ట్ కలిగి ఉంటే సాఫ్ట్‌వేర్ వైపు సైతం వెళ్లొచ్చు. టెక్నికల్, నాన్ టెక్నికల్ దేంట్లోనైనా రాణించవచ్చు.


వెబినార్‌లో పాల్గొన్న రిసొనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు, విద్యావేత్త డాక్టర్ మోతుకుల నారాయణ, ఇంటర్‌బోర్డు రిటైర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వంగపల్లి సుబ్బారావు

ఇంటర్ తర్వాత ఏం చేయాలో స్పష్టత అవసరం

పూర్ణచంద్రరావు: ఇంటర్ తర్వాత ఏం చేయాలనే అంశంపై స్పష్టతతో గ్రూపును ఎంపిక చేసుకోవాలి. నైపుణ్యాలను, సామర్థ్యాలను అంచనా వేసుకొని నిర్ణయానికి రావాలి. వృత్తి విద్యా కోర్సులతోనూ చక్కటి ఉపాధి లభిస్తుంది. ఎంపీసీ విద్యార్థులకు జేఈఈ అనేది పాపులర్ ఎగ్జామ్. దానికి ప్రిపేర్ అయితే దేశ వ్యాప్తంగా ఉన్న పలు ఇంజినీరింగ్ కాలేజీల్లో సుమారు 15 లక్షల ఇంజినీరింగ్ సీట్లకు పోటీ పడే అవకాశం ఉంటుంది. నలభై రకాల ఇంజినీరింగ్ ఎంట్రన్స్‌లు ఉన్నాయి. తెలంగాణలో 4 లక్షల మంది ఇంటర్‌లో చేరుతుంటే 2.75 లక్షల మంది ఎంపీసీ తీసుకుంటున్నారు. బైపీసీ తీసుకునే వారికి ఎంబీబీఎస్ లేదా బీడీఎస్ లక్ష్యంగా నీట్ ఉంటుంది. రాష్ట్రంలో ఫార్మసీ, అగ్రికల్చర్, లైఫ్ సైన్సెస్ కోర్సులకూ అవకాశం ఉంటుంది. డాక్టర్ సీటు రాకున్నా అనేక కోర్సులు కెరీర్ ఆప్షన్లుగా ఉన్నాయి.

ఎక్కువ మార్కులు వచ్చాయని కాకుండా..

నారాయణ: టెన్త్‌లో ఎక్కువ మార్కులు వచ్చాయని ఎంపీసీ, బైపీసీకి వెళ్లకుండా కుటుంబ నేపథ్యం, అభిరుచి, కెరీర్ గైడెన్స్, స్పష్టమైన లక్ష్యంతో గ్రూపును ఎంచుకోవాలి. ఆసక్తి, కృషి, పట్టుదల, విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు తీసుకుపోతుంది. ఏ విషయంలో నెగ్గుకు రాగలరో.. ఏ గ్రూపులో ఏ అవకాశాలు ఉన్నాయో తెలుసుకున్నాకే ముందడుగు వేయాలి.

నిపుణుల కీలక సూచనలు

- ఇంగ్లిష్ మీడియం మాత్రమే గొప్ప అవకాశాలు ఇస్తుందనేది అపోహ. తెలుగు మీడియం అయినా సబ్జెక్ట్‌తోపాటు ఆంగ్లంలో నైపుణ్యం పెంచుకోవడం తప్పనిసరి.
- ఇంటర్‌తో పాటు స్కిల్, వృత్తివిద్యా కోర్సులతో ఉపయోగం ఉంటుంది.
- పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులతోనూ ఉద్యోగావకాశాలున్నాయి.
- ఇంటర్‌లో సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ దాదాపు ఒకటే.
- ఒత్తిడిని తగ్గించేలా కనీసం రోజుకు గంట సేపు ఆటలు, యోగా వంటి వాటితో ఇంటర్ విద్యార్థులకు విశ్రాంతినివ్వాలి.
- ఎక్కువ సేపు చదివితేనే ఎక్కువ చదువు వస్తుందనేది సరికాదు.
- లక్ష్యం సరిగా లేనపుడు.. ప్రతిభ ఆధారంగా అంచనాలు లేకపోవడంతో ఒత్తిడి.
- ఎవరి శక్తి సామర్థ్యాలను వారు అంచనా వేసుకోవాలి. పోలిక మంచిది కాదు.

అజాతశత్రువుల్లో వాజ్‌పేయీది ముందువరస

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


వాజ్‌పేయీ విగ్రహ ఆవిష్కరణలో వెంకయ్యనాయుడు. చిత్రంలో సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, పీవీఎన్ మాధవ్ తదితరులు

విజయవాడ పటమట, న్యూస్‌టుడే: రాజకీయాల్లో అజాతశత్రువుగా నిలవడంలో వాజ్‌పేయీ ముందువరుసలో ఉంటారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని పాతబస్తీ కేబుల్ మార్కెట్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'వాజ్‌పేయీ చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు పాఠ్యాంశాల్లో చేర్చాలి. రాజకీయాల్లో విలువలు గల వ్యక్తి ఆయన. వాజ్‌పేయీ ప్రసంగాలు భావితరాలకు అవసరం. విద్యార్థులు, యువత వాటిని వినాలి. ఆయన పాలన సుపరిపాలనకు ఆదర్శం' అని వివరించారు. 'భారతరత్న అటల్‌జీ స్మృతి ఉద్యాన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ, దేశం శాశ్వతమని పలుసందర్భాల్లో వాజ్‌పేయీ అన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎన్టీఆర్ జిల్లా భాజపా, జనసేన అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

తితిదే జేఈవోగా డాక్టర్ ఎ.శరత్ బాధ్యతల స్వీకరణ


తితిదే జేఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఎ.శరత్. చిత్రంలో కుటుంబసభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే నూతన జేఈవో (విద్య, వైద్యం)గా డాక్టర్ ఎ.శరత్ ఆదివారం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సెల్ ఏఈవో సుశీల, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎ.శరత్ తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్.. నూతన జేఈవోను శాలువాతో సత్కరించి అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యం మనుగడ

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో ప్రొఫెసర్ నాగేశ్వర్, జి.నిర్మల, లక్ష్మణరావు, బాలసుబ్రహ్మణ్యం, గేయానంద్ తదితరులు

విజయవాడ (రాఘవయ్యపార్క్, కొడాలి, కృష్ణలంక), న్యూస్‌టుడే: రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'భారత రాజ్యాంగం - సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, 'సర్' పేరుతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయా రాష్ట్రాల గవర్నర్లు వ్యవహరించిన తీరు.. రాజ్యాంగం ప్రమాదంలో పడిందనేందుకు నిదర్శనాలని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థలే రాజ్యాంగానికి సవాళ్లు విసురుతున్నాయన్నారు. సర్ పేరుతో ఓటర్ల జాబితాల నుంచి పౌరుల పేర్లను తప్పిస్తున్నారని, వారు దేశ పౌరులో కాదో నిర్ధారించే అధికారం ఎన్నికల సంఘానికి లేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఎటు దారితీస్తుందో అర్థం కావడం లేదన్నారు. లాయర్లు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ భారతదేశ మూలాలకు సెక్యులరిజం పునాది అని, డాక్టర్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి మహనీయులు సెక్యులరిజం భావనలను బలపరిచారని తెలిపారు. లౌకిక భావనల స్ఫూర్తితోనే భారత స్వాతంత్ర్యోద్యమం విజయం సాధించిందన్నారు. 'శాస్త్రీయ దృక్పథం- రాజ్యాంగం' అన్న అంశంపై మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం, హేతుబద్ధ ఆలోచనలు, మానవత.. సమాజ అభివృద్ధికి కీలకమైన అంశాలన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ ముఖ్యాంశాలు, పీఠికపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్య హక్కులు, విట్ అమరావతి స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ చక్రా బెనర్జీ 'భారత రాజ్యాంగం-పీఠిక' అనే అంశాలపై మాట్లాడారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, డాక్టర్ ఎం.గేయానంద్, జి.నిర్మల, జి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ పీఠిక, భారత రాజ్యాంగం-ముఖ్యాంశాలు అనే రెండు పుస్తకాలను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు.

చేనేతలకు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

జాతీయ చేనేతల సమాఖ్య డిక్లరేషన్


కాకినాడ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మల్లాది కృష్ణారావు, ఎమ్మెల్యే కొండబాబు తదితరులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జాతీయ చేనేత సమాఖ్య (ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్) కాకినాడ డిక్లరేషన్‌ను ప్రకటించింది. కాకినాడలో ఆదివారం జరిగిన సమాఖ్య జాతీయ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఈ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఏపీ, తెలంగాణలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి చేనేత సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ చేనేత సమాఖ్య అధ్యక్షుడిగా పప్పు దుర్గారమేష్ (ఏపీ), ప్రధాన కార్యదర్శిగా బోళ్ల రాజేశ్వర్ (తెలంగాణ), కోశాధికారిగా హనుమంతప్ప (ఏపీ) తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, పుదుచ్చేరి తరఫున ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాది కృష్ణారావు, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితరుల సమక్షంలో కాకినాడ డిక్లరేషన్ ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. కేంద్రంలో చేనేతలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలని, కేంద్రం రద్దు చేసిన జాతీయ చేనేత బోర్డును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

తుపాకీ పేలి.. ఏఆర్ కానిస్టేబుల్ మృతి


పి.పెద్దయ్య

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా డోన్ రైల్వే ఔట్ పోస్టులో తుపాకీ మిస్ ఫైర్ అయి ఏఆర్ కానిస్టేబుల్ పి.పెద్దయ్య (49) మృతిచెందారు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దయ్య విధుల్లో భాగంగా హుబ్బళ్లి - విజయవాడ రైలులో గుంతకల్లు నుంచి డోన్ వరకు వచ్చారు. తన విధులు ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తుపాకీని అప్పగించేందుకు సిద్ధమయ్యారు. గన్‌ను అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో తూటా పేలి, ఎడమ దవడ నుంచి లోపలికి దూసుకెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దయ్యను తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆయన మృతిచెందారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. మృతుని స్వగ్రామం కర్నూలు జిల్లా సి.బెళగల్. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం నుంచి తక్షణ సాయం కింద రూ.లక్ష నగదును మృతుడి కుటుంబ సభ్యులకు జీఆర్పీ డీఎస్పీ శ్రీనివాసాచారి అందజేశారు.

ప్రియుడి కుటుంబంపై పెట్రోలుతో దాడి చేసిన మహిళ మృతి

నగరంపాలెం, చేబ్రోలు, న్యూస్‌టుడే: ప్రియుడి కుటుంబసభ్యులపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో గాయపడిన కె.దుర్గ(27) ఆదివారం మృతిచెందారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన మల్లేష్‌తో తెనాలి సీఎం కాలనీకి చెందిన దుర్గకు కొంత కాలంగా వివాహేతర సంబంధం ఉంది. వారిమధ్య విభేదాలు రావడంతో శనివారం రాత్రి దుర్గ.. ప్రియుడి ఇంటికి వచ్చి తనతోపాటు తెచ్చుకున్న పెట్రోలును అతని కుటుంబసభ్యులపై పోసి నిప్పంటించారు. ఈ క్రమంలో ఆమెపైనా పెట్రోలు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమెను శనివారం రాత్రి వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి ఆదివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. దుర్గకు ఒక కుమారుడు ఉండగా, కొంత కాలంగా భర్తకు దూరంగా ఉంటున్నారని పోలీసులు తెలిపారు. ఘటనలో గాయపడిన మల్లేష్ కుటుంబసభ్యులు చికిత్స అనంతరం ఇంటికి వెళ్లినట్లు పేర్కొన్నారు.



సంపన్నుల మైండ్ సెట్ ఎలా ఉంటుందంటే..

- విలాసాల కోసం కాకుండా తమ పురోగతికి దోహదపడే నైపుణ్యాల కోసం ఖర్చు చేస్తారు.
- అన్నింటికన్నా సమయానికి ఎక్కువ విలువ ఇస్తారు.
- తమ ఆదాయం నుంచి ముందుగా మదుపు చేసిన తర్వాతే ఖర్చుల గురించి ఆలోచిస్తారు.

– అలోక్ తివారీ, ఇన్వెస్టర్

అన్ని జిల్లాల్లో 'లీగల్ ఎయిడ్ క్లినిక్'లు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ వెల్లడి

పార్వతీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'లీగల్ ఎయిడ్ క్లినిక్'లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ వెల్లడించారు. ఇందుకు జిల్లా, మండల స్థాయిల్లో 'పారా లీగల్ వాలంటీర్ల' సేవలను ఉపయోగించుకునేలా పది రోజుల్లో కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా పార్వతీపురంలో ఏర్పాటుచేసిన 'లీగల్ ఎయిడ్ క్లినిక్'ను ఆదివారం ఆయన ఆరంభించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతున్న కృషిని అభినందించారు. హైకోర్టు లీగల్ అథారిటీ ఛైర్మన్‌గా వివిధ సందర్భాల్లో సమీక్ష నిర్వహించినప్పుడు న్యాయసేవలకు సంబంధించిన పథకాలు పటిష్ఠంగా అమలు కావడంలేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. న్యాయ సేవలు, చట్టంలోని అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. న్యాయ, కార్యనిర్వాహక విభాగాలు కలిసి న్యాయసేవలకు సంబంధించిన పథకాల ఫలితాలను ప్రజలకు అందజేయడానికి 'లీగల్ ఎయిడ్ క్లినిక్' ఉపకరిస్తుందన్నారు. న్యాయస్థానాల్లో ఉన్న వివాదాలను మధ్యవర్తుల చొరవతో రాజీమార్గంలో పరిష్కరించేందుకు వీలుగా నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి, మధ్యవర్తిత్వంలో శిక్షణ ఇవ్వనున్నట్లు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ తెలిపారు. లీగల్ ఎయిడ్ కౌన్సెలర్లకు ప్రస్తుతం సానుకూలంగా పరిష్కరించిన కేసులకు సంబంధించే పారితోషికాన్ని అందిస్తున్నామని, ఇకపై భిన్నఫలితం వచ్చిన కేసులకు కూడా చెల్లింపునకు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి, విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, న్యాయాధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురంలో 'లీగల్ ఎయిడ్ క్లినిక్'ను ప్రారంభిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్. చిత్రంలో కలెక్టర్ ప్రభాకరరెడ్డి, విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, ఇతర అధికారులు

బైక్‌పై వెళ్తూ ఇద్దరి సజీవ దహనం

చేనుకు కంచెగా వేసిన విద్యుత్ తీగలు తగిలి దుర్ఘటన


తలపల రమేష్ మేకల గణేష్

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులకు పొలం చుట్టూ కంచెగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగలడంతో అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలోని తూర్పురొంపిదొడ్ల మజారా గ్రామం బొనిగిరావులపాడు రెవెన్యూ పరిధిలో చోటుచేసుకోగా, ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుల బంధువుల వివరాల మేరకు.. తూర్పురొంపిదొడ్లలోని ఎస్టీ కాలనీకి చెందిన తలపల రమేష్ (18), మేకల గణేష్ (18) పిల్లాపేరువాగులో చేపలు పట్టేందుకు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. ఇదే మార్గంలోని బొనిగిరావులపాడులో వింజమూరు మండలం గోళ్లవారిపల్లికి చెందిన రైతు ఎం.వెంకటేశ్వర్లు 100 ఎకరాల్లో కంది పంటను కౌలుకు సాగు చేస్తూ.. చుట్టూ విద్యుత్తు తీగలు కంచెగా ఏర్పాటు చేశారు. అటుగా చేపల వేటకు వెళ్తున్న యువకులు.. బైక్ అదుపు తప్పడంతో విద్యుత్తు తీగలపై పడ్డారు. వెంటనే మంటలు చెలరేగడంతో వాహనంతో సహా కాలి బూడిదైపోయారు. గణేష్ తండ్రి ఫిర్యాదు మేరకు.. రైతు వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వాలీబాల్ ఆడుతూ యువకుడి మృతి


జావిద్

నల్లచెరువు, న్యూస్‌టుడే: వాలీబాల్ ఆడుతూ ఓ యువకుడు కుప్పకూలి మృతి చెందాడు. ఈ విషాద ఘటన అనంతపురం జిల్లా నల్లచెరువు మండలం కె.పూలకుంటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఖలీల్, మాబ్జాన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలతో పాటు కుమారుడు జావిద్(19) ఉన్నారు. జావిద్‌కు ఆటలంటే ఇష్టం. చదువుకునే సమయంలో ఎక్కువగా మైదానంలోనే గడిపేవాడు. పదో తరగతి ఫెయిల్ కావడంతో ఓ దుకాణంలో పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం జావిద్ స్నేహితులతో కలిసి వాలీబాల్ ఆడుతూ కోర్టులోనే కుప్పకూలాడు. వెంటనే అతడిని మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు.. గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో అతడి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రసవ వేదన.. నడక యాతన

రెండు కి.మీ. నడిచి ఆసుపత్రి చేరిన గర్భిణి


నడవలేక మార్గమధ్యలో ఇబ్బంది పడుతున్న గర్భిణి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామానికి రహదారి సౌకర్యం లేక నిండు గర్భిణి.. పురిటినొప్పులతో 2 కి.మీ. దూరం నడుచుకుంటూ ఆసుపత్రి చేరుకున్న ఘటన ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి పంచాయతీ గోగులబందకు చెందిన గర్భిణి జర్సింగి కళావతికి ఆదివారం పురిటినొప్పులు వచ్చాయి. గ్రామానికి రహదారి లేక కుటుంబసభ్యులు, ఆశా కార్యకర్త ఆమెను నడిపించుకుంటూ 2 కి.మీ. దూరంలోని బచ్చింత వరకు తీసుకువెళ్లారు. తీవ్రమైన నొప్పులతో ఇబ్బంది పడుతూనే ఆమె నడక సాగించారు. తర్వాత బచ్చింత నుంచి ఆటోలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కళావతి మగబిడ్డకు జన్మనివ్వగా.. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. ప్రభుత్వం స్పందించి బచ్చింత-గోగులబంద మధ్య రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యమాలతోనే మహిళలకు సమానత్వం

- మాజీ ఎంపీ బృందా కారాట్
- ఐద్వా 14వ మహాసభలు ఘనంగా ప్రారంభం



మహాసభ వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు... చిత్రంలో జూలకంటి రంగారెడ్డి, పుణ్యవతి, బృందా కారాట్, మరియం ధవాలే, సుభాషిణీ అలీ, పీకే శ్రీమతి, మల్లు లక్ష్మి, జ్యోతి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: మహిళలు సమాజంలో, కుటుంబంలో, ఆర్థిక వ్యవస్థలో ముఖ్య పాత్ర పోషిస్తున్నప్పటికీ... శ్రమకు తగ్గ గుర్తింపు, హక్కులు వారికింకా దూరంగానే ఉన్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్యాట్రన్, మాజీ ఎంపీ బృందా కారాట్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై హింస పెరుగుతోందని, ప్రజాస్వామ్య హక్కులు, లౌకికవాదం తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని... కేంద్రంలోని భాజపా-ఆరెస్సెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే ఇందుకు కారణమని ఆమె ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా 14వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభయ్యాయి. సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ బస్‌భవన్ మైదానంలో జాతీయ మహాసభ నిర్వహించారు. అంతకుముందు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బస్‌భవన్ సమీపంలోని మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి జెండాను ఆవిష్కరించగా, నటి రోహిణి మహాసభను ప్రారంభించారు. 26 రాష్ట్రాల నుంచి 850 మంది అతిథులు హాజరయ్యారు.

మహిళల అభివృద్ధికి అడ్డంకులవే: శాంతా సిన్హా

ఆరోగ్య సమస్యలు, బాలికా విద్యలో వెనుకంజే దేశంలో మహిళల అభివృద్ధికి అసలైన అడ్డంకులని ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత శాంతా సిన్హా పేర్కొన్నారు. 'ప్రతి మహిళకు ఉచిత, నాణ్యమైన ఆరోగ్య సేవలు హక్కుగా అమలు కావాలి. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను ప్రతి అమ్మాయి హక్కుగా నిర్ధారించాలి. ప్రజారోగ్య వ్యవస్థ ప్రైవేటీకరణ దిశగా వెళ్లిపోవడంతో వైద్య ఖర్చులు మహిళలకు భారంగా మారాయి. ఎన్నికలప్పుడు ఇచ్చే రూ.2-3 వేలకు ఆశపడొద్దు. ఒకవేళ తీసుకున్నా మనస్సాక్షి ప్రకారమే ఓటేయాలి' అని ఆమె కోరారు.

★ ఐద్వా మహాసభల్లో తమిళనాడుకు చెందిన రాణి, బిహార్‌కు చెందిన బీబీ రుక్సార్, పుదుచ్చేరికి చెందిన యువ పర్వతారోహకురాలు దివ్య, రాజస్థాన్‌కు చెందిన రజియా బానును సత్కరించారు. సదస్సులో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవునిపై విశ్వాసమే విజయానికి తొలిమెట్టు

బైబిల్ మిషన్ మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్


వాక్యోపదేశం చేస్తున్న రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ ★ ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులు

పెదకాకాని, న్యూస్‌టుడే: 'యేసుప్రభు సందేశం, మహోత్సవాల ఆశీస్సులు బైబిల్ మిషన్ మహోత్సవాల్లో పాల్గొన్న ప్రతి విశ్వాసికీ అందుతాయి. దేవునిపై విశ్వాసమే మనిషి విజయానికి తొలిమెట్టు' అని బైబిల్ మిషన్ మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఆదివారం 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత పెదకాకాని స్వస్తిశాల సంగీతబృందం క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించింది. అనంతరం రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ భక్తులను ఉద్దేశించి వాక్యోపదేశం చేశారు. 'భిన్న సంస్కృతులు, ప్రాంతాలు, భాషలు తదితర విభేదాలను విడనాడి సమైక్యతను చాటడం సంతోషంగా ఉంది. ఎదుటివారిపై ప్రేమ కనబరిచినవారు దేవుని వారసులుగా స్థానం సంపాదిస్తారు' అని తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ రెవరెండ్ జె.ఆగమనరావు, రెవరెండ్ డి.సుధాకర్ తదితరులు దైవసందేశాలు అందించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ ప్రశాంత్ కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యుల సారథ్యంలో వివిధ కమిటీల సహకారంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఈనాడు

విజయవాడ 26-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 166

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





కల్లోలిత ప్రపంచంలో శాంతిదూత భారత్

సార్వత్రిక సామరస్యతకు పాటుపడుతున్నాం

అన్ని రంగాల్లో మహిళల ముద్ర

జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

దిల్లీ: ప్రపంచంలోని వేర్వేరు ఖండాల్లో భౌగోళిక-రాజకీయ కల్లోలం అలముకున్న ప్రస్తుత తరుణంలో భారతదేశం ఒక శాంతిదూతలా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. సోమవారం జరగనున్న 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. "సార్వత్రిక సామరస్యతకు భారత్ ఎప్పటినుంచో పాటుపడుతోంది. యావత్ ప్రపంచంలో శాంతి పరిఢవిల్లాలని మనం ప్రార్థనలు చేస్తుంటాం. (మిగతా 2లో)

ఐదుగురికి పద్మ విభూషణం


ధర్మేంద్ర సింగ్ దేవోల్ (కళలు)


వి.ఎస్.అచ్యుతానందన్ (ప్రజా సంబంధాలు)




నోరి దత్తాత్రేయుడు (వైద్యం)

- ధర్మేంద్ర, అచ్యుతానందన్, మరో ముగ్గురికి దేశ రెండో అత్యున్నత పురస్కారం
- నోరి దత్తాత్రేయుడు, మమ్ముట్టి సహా 13 మందికి పద్మ భూషణం
- మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, డాక్టర్ జి.వి.రావు, డాక్టర్ విజయానంద్‌రెడ్డి, క్రికెటర్లు రోహిత్‌శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్ సహా 113 మందికి పద్మశ్రీ
- తెలంగాణ నుంచి ఏడుగురికి, ఏపీ నుంచి నలుగురికి
- ఎన్నికలు జరిగే తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళలకు ప్రాధాన్యం

ఈనాడు - దిల్లీ

దివంగత దిగ్గజ బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ సహా ఐదుగురికి దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు, ప్రఖ్యాత మలయాళ నటుడు మమ్ముట్టి, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు విజయ్ అమృత్‌రాజ్‌సహా 13 మందిని పద్మ భూషణ్‌కు ఎంపిక చేసింది. టాలీవుడ్ సీనియర్ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌సహా 113 మందికి పద్మశ్రీలను ప్రకటించింది. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కళ, సామాజిక సేవ, ప్రజా సంబంధాలు, శాస్త్ర, సాంకేతికత, ఇంజినీరింగ్, వాణిజ్యం, పరిశ్రమ, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌర సేవల రంగాల్లో విశేష కృషి చేసిన 131 మందికి ఈ పౌర పురస్కారాలను ఆదివారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ పౌర పురస్కారాలను విజేతలకు ప్రదానం చేస్తారు. (మిగతా 2లో)

మరిన్ని వివరాలు లోపలి పేజీల్లో

వారు సమాజ నిర్మాతలు

పద్మ అవార్డు గ్రహీతలకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా. వారి అద్భుత నైపుణ్యం, అంకితభావం, భిన్న రంగాల్లో వారు అందించిన సేవలు సమాజ నిర్మాణంలో ఎంతో కీలకం. తరతరాలకు వారు స్ఫూర్తినిస్తుంటారు

- ప్రధాని నరేంద్ర మోదీ

ఏ రాష్ట్రానికి ఎన్ని..

మహారాష్ట్ర	16
తమిళనాడు	13
ఉత్తర్‌ప్రదేశ్	12
పశ్చిమబెంగాల్	11
కేరళ	8
కర్ణాటక	8
తెలంగాణ	7
గుజరాత్	5
ఆంధ్రప్రదేశ్	4
మధ్యప్రదేశ్	4
ఒడిశా	4

తెలుగు పద్మశ్రీలు


చంద్రమౌళి గడ్డమణుగు, దీపికారెడ్డి, రాజేంద్రప్రసాద్, డాక్టర్ జి.వి.రావు, కృష్ణమూర్తి బాల సుబ్రమణియన్, వెంపటి కుటుంబశాస్త్రి, డాక్టర్ కుమారసామి తంగరాజ్, మాగంటి మురళీమోహన్, మామిడాల జగదీశ్‌కుమార్, పి.విజయానంద్‌రెడ్డి, రామారెడ్డి మామిడి, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

సూర్యనారాయణా.. వేద పారాయణా

తిరుమలలో సప్తవాహనాలపై శ్రీనివాసుని వైభవం

అరసవల్లిలో సూర్య భగవానుడికి వైభవంగా మహాక్షీరాభిషేకం 2లో

శుభాంశు శుక్లాకు అశోక చక్ర




- రోదసి యాత్రికుడికి అత్యున్నత శౌర్య పురస్కారం
- మరో వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తి చక్ర

13లో

అదనపు ఎస్పీ రవి మనోహరాచారికి రాష్ట్రపతి పోలీసు సేవా పతకం


రవి మనోహరాచారి

మరో 15 మంది పోలీసులకు సేవా పతకాలు 13లో

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకుర్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం 2లో

మరో ముగ్గురు ద.మ.రైల్వే సిబ్బందికి పోలీస్ మెడల్స్



అనంతపురం ప్రజలు భేష్



ప్రధాని ప్రశంస

మన్ కీ బాత్‌లో అక్కడి జలసంరక్షణ చర్యలు ప్రస్తావించిన మోదీ 13లో

అమరావతికి చట్టబద్ధత



ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు

- సంబంధిత కేంద్ర మంత్రులతో టచ్‌లో ఉండండి
- సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్వోదయ పథకంలోకి తెచ్చి అభివృద్ధి చేయాలి
- ఉత్తరాంధ్ర-రాయలసీమల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ సాధించాలి
- ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ విషయంలో ఆయా శాఖల కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులను నిరంతరం సంప్రదించాలని తెదేపా ఎంపీలకు సూచించారు. రాష్ట్రానికి ఇంకా ఏం సాధించవచ్చనే అంశంపై నిరంతరం ఆలోచిస్తూ కేంద్రం నుంచి నిధులు సాధించాలన్నారు. ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకంతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పోలవరం-నల్లమలసాగర్‌లను ప్రాధాన్యాంశాలుగా తీసుకొని ప్రస్తావించాలన్నారు. ఎంపీలంతా పొత్తు ధర్మం పాటించాలని సూచించారు. (మిగతా 14లో)

ధర్మపరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి


సిక్కు మతపెద్దలు బహూకరించిన కృపాణంతో పవన్‌కల్యాణ్

- గురు తేగ్ బహదూర్ బలిదానం పొరుగుదేశాల్లో హిందూ మైనారిటీల వేదనను గుర్తుచేస్తోంది
- త్యాగంతోనే ధర్మపరిరక్షణ సాధ్యమని ఆయన చాటి చెప్పారు
- షాహిదీ సమాగమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: తల్వార్‌తో కాదు త్యాగంతోనూ ధర్మ పరిరక్షణ సాధ్యమని చాటిన మహనీయుడు గురు తేగ్ బహదూర్ అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ధర్మం కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర ఆయనదని, అందుకే దేశం ఆయనను కీర్తిస్తోందని కొనియాడారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ప్రముఖ సిక్కు గురువు తేగ్ బహదూర్ 350 షాహిదీ సమాగమంలో పవన్ కల్యాణ్ ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. (మిగతా 2లో)

వందల కి.మీ. దూరం చిన్నబోతుంది! 13లో

శత్రు దేశాల యుద్ధ నౌకలే లక్ష్యంగా యాంటీ షిప్ హైపర్‌సోనిక్ గ్లైడ్ మిసైల్

గణతంత్ర వేడుకల్లో తొలిసారి ప్రదర్శన

భారత్‌దే టీ20 సిరీస్


అభిషేక్ శర్మ

గువాహటి: న్యూజిలాండ్‌తో మూడో టీ20లో భారత్ అదరగొట్టింది. హ్యాట్రిక్ విజయాలతో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. అభిషేక్ శర్మ (68 నాటౌట్), సూర్యకుమార్ యాదవ్ (57 నాటౌట్) మెరుపులతో ఆదివారం సూర్య సేన 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. బుమ్రా, హార్దిక్, రవి బిష్ణోయ్ కూడా భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. .. వివరాలు ఛాంపియన్‌లో

హెచ్-1బీ దరఖాస్తుదారులకు షాక్

వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027కు మార్పు • స్లాట్ల కొరతతో తలెత్తిన సమస్య

ఇంటర్నెట్‌డెస్క్

భారతీయ వృత్తి నిపుణుల అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. వారి హెచ్-1బీ వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూల అపాయింట్‌మెంట్లు 2027లోకి మారాయి. కొత్త ఇంటర్వ్యూల స్లాట్లకు కొరత ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వేలమంది వృత్తి నిపుణులు భారత్‌లోనే చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. మరికొందరి ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయి. భారత్‌లోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు భారీగా పెరిగిపోయాయి. ఫలితంగా వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మారాయి. గత నెలలో వీటిలో తొలిసారి జాప్యం చోటుచేసుకుంది. అప్పుడు ఇంటర్వ్యూలను ఈ ఏడాది మార్చికి మార్చాల్సివచ్చింది. ఆ తర్వాత అక్టోబరుకు.. ఇప్పుడు 2027కు మారినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దిల్లీ,



ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు లేవు. దీంతో ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు వాయిదా వేయాల్సి వచ్చింది. 2027 సంవత్సరం మధ్యలోకి అవి చేరాయి.

భారత్‌కు తిరిగి వెళ్లొద్దంటున్న నిపుణులు

ప్రస్తుతం అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు వీసా స్టాంపింగ్ కోసం తిరిగి భారత్‌కు వెళ్లవద్దని ఇమిగ్రేషన్ నిపుణులు సూచిస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ సంస్థ భాగస్వామి ఎమిలీ న్యూమన్ మాట్లాడుతూ.. తాము గత 50 రోజుల్లో భారత్ కోసం కొత్త వీసా ఇంటర్వ్యూల స్లాట్లు ఉన్నట్లు చూడలేదన్నారు. అదే సమయంలో అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు కూడా భారత్‌లో స్టాంపింగ్ ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం ప్రయత్నించడంలేదని చెప్పారు. 2027 వరకు ఎటువంటి రెగ్యులర్ అపాయింట్‌మెంట్లు లేవని 'అమెరికన్ బజార్' వెల్లడించింది. ఇప్పటికే స్టాంపింగ్ కోసం భారత్‌కు వచ్చిన వారికి కూడా ఇంటర్వ్యూలు రద్దయినట్లు చెప్పారని తెలిసింది. జనవరి, ఫిబ్రవరిలో అపాయింట్‌మెంట్లు ఉన్నవారికి కూడా తేదీల మార్పుపై ఈ-మెయిల్స్ వచ్చాయి.

భార్యాపిల్లలు ఒకచోట.. తల్లిదండ్రులు మరో చోట: వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు చేరుకొన్న వేలమంది వృత్తి నిపుణులు తిరిగి అమెరికా వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. (మిగతా 2లో)



తిరుమలలో సప్తవాహనాలపై శ్రీనివాసుని వైభవం

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: రథసప్తమి పర్వదినం తిరుమల కొండపై ఒకరోజు బ్రహ్మోత్సవాలను తలపించింది. అత్యంత వైభవంగా నిర్వహించిన మహోత్సవంలో భారీగా తరలివచ్చిన భక్తకోటి వివిధ వాహన సేవలను దర్శించుకున్నారు. శ్రీనివాసుడు సప్తవాహనాలపై ఊరేగుతూ ఆదివారం భక్తులను కటాక్షించారు. ఉషోదయాన సూర్యప్రభ వాహనంతో ప్రారంభమైన సప్తవాహన సేవోత్సవం రాత్రి చంద్రప్రభ వాహనంతో పరిసమాప్తమైంది. సూర్యనారాయణమూర్తిగా, సర్వభూపాలునిగా వివిధ అవతార విశ్వరూప వైశిష్ట్యం ప్రదర్శిస్తూ శ్రీమలయప్పస్వామి సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు అభ్యంగనమాచరించారు. పుష్కరిణిలో అర్చకులు చక్రస్నానాన్ని నిర్వహించారు. హనుమంత వాహనసేవ ఆఖరులో చిరుజల్లులు పడటంతో కొంతసేపు ఘటాటోపం కింద వాహన సేవను నిర్వహించారు. తిరుమల జన సంద్రం కావడంతో రాంభగీచా వద్ద తోపులాటతో భక్తులు ఇబ్బందిపడ్డారు. తితిదే ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు సదాశివరావు, పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, సురేష్‌కుమార్, భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీమలయప్పస్వామి

సూర్యనారాయణా.. వేద పారాయణా

అరసవల్లిలో సూర్య భగవానుడికి వైభవంగా మహాక్షీరాభిషేకం

శ్రీకాకుళం నగరం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. 'రథసప్తమి సప్తాహ' పేరుతో నిర్వహించిన ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం సూర్యభగవానుడి జయంతి కావడంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఆలయంలో మహాక్షీరాభిషేకం నిర్వహించారు. కన్నుల పండువగా సాగిన వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి నిజరూపం దర్శనాన్ని చూసి భక్తులు తరించారు. రథసప్తమి ఆదివారం రావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. పక్కా ఏర్పాట్లు చేసినా రద్దీ నియంత్రణ అధికారులకు సాధ్యం కాలేదు. దర్శనాలు ఆలస్యం కావడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, న్యాయమూర్తులు స్వామిని దర్శించుకున్నారు.



ఆలయం వద్ద భక్తుల సందోహం

ఐదుగురికి పద్మ విభూషణం

(మొదటి పేజీ తరువాయి)

- పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిలో 19 మంది మహిళలు, ఆరుగురు విదేశీయులు /ఎన్ఆర్ఐ /పీఐఓ /ఓసీఐలు ఉన్నారు.
- 16 మందికి మరణానంతరం ప్రకటించారు.
- పద్మ విభూషణ్‌కు ఎంపికైన ఐదుగురిలో ముగ్గురు కేరళకు చెందినవారే.

పద్మ విభూషణ్

1. ధర్మేంద్ర సింగ్ దేవోల్	కళలు	మహారాష్ట్ర
2. కె.టి.థామస్	ప్రజా సంబంధాలు	కేరళ
3. ఎన్.రాజం	కళలు	ఉత్తర్ ప్రదేశ్
4. పి.నారాయణన్	సాహిత్యం, విద్య	కేరళ
5. వి.ఎస్.అచ్యుతానందన్	ప్రజా సంబంధాలు	కేరళ

పద్మ భూషణ్

1. అల్కా యాజ్ఞిక్	కళలు	మహారాష్ట్ర
2. భగత్ సింగ్ కోశ్యారీ	ప్రజా సంబంధాలు	ఉత్తరాఖండ్
3. కల్లిపట్టి రామసామి పళనిస్వామి	వైద్యం	తమిళనాడు
4. మమ్ముట్టి	కళలు	కేరళ
5. నోరి దత్తాత్రేయుడు	వైద్యం	అమెరికా
6. పీయూష్ పాండే	కళలు	మహారాష్ట్ర
7. ఎస్‌కె.ఎం.మైలానందన్	సామాజిక సేవ	తమిళనాడు
8. శతావధాని ఆర్ గణేశ్	కళలు	కర్ణాటక
9. శిబు సోరెన్	ప్రజా సంబంధాలు	ఝార్ఖండ్
10. ఉదయ్ కొటక్	వాణిజ్యం-పరిశ్రమలు	మహారాష్ట్ర
11. వి.కె.మల్హోత్రా	ప్రజా సంబంధాలు	దిల్లీ
12. వెల్లప్పల్లి నటేశన్	ప్రజాసంబంధాలు	కేరళ
13. విజయ్ అమృత్‌రాజ్	క్రీడలు	అమెరికా

పద్మ విభూషణుల విశిష్టతలివీ...

ధర్మేంద్ర

1935లో పంజాబ్‌లో పుట్టిన ధర్మేంద్ర సీనియర్ నటుడు దిలీప్ కుమార్ స్ఫూర్తితో ముంబయికి చేరి సినిమా హీరో అయ్యారు. ఫూల్ ఔర్ పత్థర్ (1966)తో మొదలైన ఆయన విజయ పరంపరలో 'అనుపమ, యాదోన్ కీ బారాత్, చుప్కే చుప్కే, సత్యకామ్, మేరా గావ్ మేరా దేశ్ లాంటి ఎన్నో ఆణిముత్యాలున్నాయి. అమితాబ్‌తో కలిసి నటించిన 'షోలే' ఆయన సినీ జీవితంలో మైలురాయి. వివాదాలకు దూరంగా, నిర్మాతల హీరోగా పేరు తెచ్చుకోవడంవల్లే మరే బాలీవుడ్ హీరోకు సాధ్యం కాని రీతిలో త్రిశత చిత్రాల్లో ఆయన నటించగలిగారు. సినిమాల్లోకి రాకముందే ప్రకాశ్ కౌర్‌తో ధర్మేంద్రకు వివాహం కాగా, సహ నటి హేమా మాలినిని సైతం ప్రేమించి పెళ్లాడారు. సూపర్ హిట్ జోడీగా వీరిద్దరూ కలిసి 28 చిత్రాల్లో నటించారు. 2004లో రాజస్థాన్‌లోని బీకానేర్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ధర్మేంద్ర నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసినా, ముక్కుసూటిగా మాట్లాడే తన మనస్తత్వానికి రాజకీయాలు సరిపడవని ఆ తర్వాత దూరంగా ఉండిపోయారు. కుమారులు సన్నీ దేవోల్, బాబీ దేవోల్ బాలీవుడ్‌లో నటులుగా స్థిరపడ్డారు. గతేడాది నవంబరులో కన్నుమూసిన ధర్మేంద్ర నటించిన చివరి చిత్రం 'ఇక్కీస్' ఈ నెల 1న విడుదలైంది. 2012లో ధర్మేంద్రను 'పద్మ భూషణ్'తో సత్కరించిన భారత ప్రభుత్వం.. తాజాగా దేశ రెండో అత్యున్నత పురస్కారమైన 'పద్మ విభూషణ్'ను (మరణానంతరం) ప్రకటించింది.

కేటీ థామస్



కేరళకు చెందిన థామస్ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి. 1937 జనవరి 30న కేరళలోని కొట్టాయం జిల్లాలో జన్మించిన ఆయన 1996 మార్చి 29 నుంచి 2002 జనవరి 30 వరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. అంతకుముందు 1985 నుంచి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందేంతవరకూ కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2007లో పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత కేరళ జ్యుడీషియల్, లీగల్ రీఫార్మ్స్ కమిటీ ఛైర్మన్‌గా పని చేశారు.


డాక్టర్ ఎన్.రాజం

డాక్టర్ ఎన్.రాజం ఉత్తర్ ప్రదేశ్ నుంచి పద్మ విభూషణ్‌కు ఎంపికైనప్పటికీ ఆమె 1938 ఏప్రిల్ 8న చెన్నైలో జన్మించారు. వయొలిన్ విద్వాంసురాలుగా వాసికెక్కారు. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో పేరు పొందారు. మనుషుల స్వరాన్ని తలపించేలా వయొలిన్‌ను పలికించడంద్వారా ఆమె 'సింగింగ్ వయొలినిస్ట్'గా ప్రఖ్యాతి గడించారు.



బనారస్ హిందూ యూనివర్సిటీలో మ్యూజిక్ ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం పని చేశారు. 1984లో పద్మశ్రీ, 2004లో పద్మ భూషణ్, 1990లో సంగీత నాటక అకాడమీ, 2012లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లు పొందారు. ఉత్తర్ ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్‌గానూ సేవలందించారు. ప్రఖ్యాత కర్ణాటక సంగీతకారుడు విద్వాన్ ఎ.నారాయణ అయ్యర్ కుమార్తె అయిన ఆమె కర్ణాటక, హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం సంపాదించారు.

పి.నారాయణన్




1936 మే 28న కేరళలోని మనకాడ్ అనే గ్రామంలో నారాయణన్ జన్మించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వేల మందిని ఆ సంస్థ పరిధిలోకి తెచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఆరెస్సెస్, జన సంఘ్ భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 1975లో కోళికోడ్ నుంచి ప్రారంభించిన జన్మభూమి పత్రికకు మేనేజర్‌గా, ప్రత్యేక కరస్పాండెంట్‌గా, ఎడిటర్‌గా పని చేశారు. 1992లో అదే పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా పదోన్నతి పొందిన ఆయన 2000 సంవత్సరం వరకు అదే పదవిలో కొనసాగారు. ఆ తర్వాత 2003లో స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కన్వీనర్‌గా పని చేశారు.

వీఎస్ అచ్యుతానందన్

కేరళ మాజీ ముఖ్యమంత్రి. 2006 నుంచి 2011 వరకు సీపీఎం తరఫున ముఖ్యమంత్రిగా పని చేశారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. 1923 అక్టోబరు 20న జన్మించిన ఆయన 101 ఏళ్ల వయసులో 2025 జులై 21న కన్నుమూశారు. 82 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సంక్షేమం, అవినీతి నిర్మూలన, భూసంస్కరణలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో కచ్చితంగా వ్యవహరించి పేరు పొందారు. సీఎంగా దిగిపోయిన తర్వాత ఆ రాష్ట్ర పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్ హోదాలో కొనసాగారు. కేరళ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన నాయకుడిగా పేరుపొందారు. పార్టీలకు అతీతంగా అభిమానాన్ని సంపాదించుకున్నారు.


పద్మభూషణులు వీరే...

భగత్ సింగ్ కోశ్యారీ



ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి. 2001 అక్టోబరు నుంచి 2002 మార్చి వరకు సీఎంగా సేవలందించారు. 2002-07 మధ్యకాలంలో భాజపా తరఫున ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా, 2008-14 మధ్యకాలంలో రాజ్యసభ సభ్యుడిగా, 2014-19 మధ్యకాలంలో లోక్‌సభ సభ్యుడిగా పని చేశారు. 2019 నుంచి 2023 వరకు మహారాష్ట్ర 22వ గవర్నర్‌గా, 2020-21 మధ్యకాలంలో గోవా గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. 2019 నవంబరు 23 తెల్లవారుజామున గవర్నర్ హోదాలో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌లతో ప్రమాణం చేయించి వివాదాస్పదమయ్యారు.

కల్లిపట్టి రామసామి పళని స్వామి



తమిళనాడుకు చెందిన ప్రముఖ జీర్ణకోశ వ్యాధి నిపుణుడు. 5 దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తూ వస్తున్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి 2004-05 మధ్యకాలంలో అధ్యక్షుడిగా పని చేశారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో సీనియర్ కన్సల్టెంట్‌గా సేవలు అందించారు. గతంలో పద్మశ్రీ పొందారు.

ఎస్.కె.ఎం.మైలానందన్



తమిళనాడుకు చెందిన సామాజిక కార్యకర్త. సామాజిక అభ్యున్నతి, పేద ప్రజల సాధికారత, సమ్మిళిత అభివృద్ధి కోసం విశేషంగా పని చేశారు. యోగా, ధ్యానం, ఉచిత వైద్య సేవలు, చిన్నారుల సంక్షేమ కార్యక్రమాల ద్వారా దాదాపు 3వేలకుపైగా గ్రామాలకు చేరువయ్యారు.

శతావధాని ఆర్.గణేష్



కర్ణాటకకు చెందిన శతావధానకర్త. సంస్కృతం, కన్నడ సాహిత్యాల్లో విశేష పట్టున్న మేధావి. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అష్టావధానం, శతావధానం నిర్వహించారు.

శిబు సోరెన్



ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు. 1944 జనవరి 11న జన్మించిన ఆయన 2024 ఆగస్టు 5న మరణించారు. గిరిజనుల అభ్యున్నతి, ఝార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం విశేష పోరాటాలు చేసి అనుకున్న లక్ష్యాలను సాధించారు. 2005 మార్చి 2 నుంచి 12 వరకు 10 రోజులు, 2008 ఆగస్టు 27 నుంచి 2009 జనవరి 19 వరకు 145 రోజులు, 2009 డిసెంబరు 30 నుంచి 2010 జూన్ 1 వరకు 153 రోజులు ముఖ్యమంత్రిగా పని చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు యూపీయే హయాంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా సేవలందించారు. నాలుగు సార్లు ఎంపీగా ఉన్నారు. 1994లో ప్రైవేటు సెక్రటరీ హత్య కేసులో దిల్లీ కోర్టు ఆయనకు శిక్ష విధించింది. పీవీ నరసింహారావు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేసేందుకు 1993లో జేఎంఎం ఎంపీలు లంచం తీసుకున్నారన్న ఆరోపణల సమయంలోనూ ఆ పార్టీ అధ్యక్షుడిగా శిబూ సోరెన్ పేరు విస్తృత ప్రచారంలోకి వచ్చింది. సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్న ఆయన ఎన్నడూ ఐదేళ్లు ముఖ్యమంత్రి పదవి పూర్తి చేసుకోకపోయినప్పటికీ ఆయన కుమారుడు హేమంత్ సోరెన్ వరుసగా రెండోసారి ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

వీకే మల్హోత్రా




దిల్లీకి చెందిన భాజపా నాయకుడు. దిల్లీ భాజపా అధ్యక్షుడిగా, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా, లోక్‌సభలో భాజపా ఉప నేతగా, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. 1931 డిసెంబరు 3న బ్రిటిష్ ఇండియాలోని లాహోర్ ప్రావిన్స్‌లో జన్మించిన ఆయన 2025 సెప్టెంబరు 30న కన్నుమూశారు. 1999లో ఆయన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మీద భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఐదుసార్లు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేశారు.

వెల్లప్పల్లి నటేశన్



కేరళకు చెందిన నటేశన్ సామాజిక సేవలో గుర్తింపు పొందారు. శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సుమారు 130 విద్యా సంస్థలు, వృత్తి విద్యా కళాశాలలు, సాంకేతిక విద్యా సంస్థలు స్థాపించారు. పేదలకు చదువును అందుబాటులోకి తెచ్చి వారి సాధికారతకు విశేష కృషి చేశారు.

పీయూష్ పాండే



వ్యాపార ప్రకటనల రంగంలో విశేషమైన ఖ్యాతి గడించారు. వినూత్న ఇతివృత్తాలతో కూడిన ప్రకటనల ద్వారా ఫెవికాల్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చూపిన సృజనాత్మకత అమోఘం. హర్‌ఘర్ కుచ్ కెహెతా హై నినాదంతో ఏషియన్ పెయింట్స్, కుచ్ ఖాస్ హై వ్యాఖ్యతో క్యాడ్‌బరీ చాక్లెట్‌ను ప్రజలకు చేరువ చేశారు. మిలే సుర్ మేరా తుమ్హారా అన్న గీతానికి సాహిత్యం అందించి, భారతీయ భిన్నత్వంలో ఉన్న ఏకత్వాన్ని చాటారు. 1955 సెప్టెంబరు 5న జన్మించిన ఆయన 2025 అక్టోబరు 23న మరణించారు. 2016లో పద్మశ్రీ పొందారు.

ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకుర్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

మరో ముగ్గురు ద.మ.రైల్వే సిబ్బందికి పోలీస్ మెడల్స్

ఈనాడు, హైదరాబాద్: ద.మ.రైల్వే జోన్‌కు చెందిన రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) ఐజీ-కమ్-ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకుర్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. 1993 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన ఆమె హౌరా రైల్వే డివిజన్‌లో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా ఉద్యోగ ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే రైల్‌నిలయంలో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఉత్తమ్‌కుమార్ బంద్యోపాధ్యాయ్, ఆర్పీఎఫ్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రావుల శ్రీనివాస్, విజయవాడ డివిజన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కర్నాటి మహేశ్వరరెడ్డికి మెరిటోరియస్ సేవలకు పోలీస్ మెడల్స్ అందనున్నాయి.

సివిల్ డిఫెన్స్ విభాగంలో కేఎల్ఎన్ స్వామికి సేవా పతకం

ద.మ.రైల్వే నుంచి సివిల్ డిఫెన్స్ విభాగంలో డిప్యూటీ కంట్రోలర్‌గా, జీఎంకు డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న కేఎల్ఎన్ స్వామికి రాష్ట్రపతి స్థాయిలో విశిష్ట సేవా పురస్కారం లభించింది. సివిల్ డిఫెన్స్ విభాగంలో ఆయన అందించిన సేవలకు ఈ గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించారు.

హెచ్-1బీ దరఖాస్తుదారులకు షాక్

(మొదటి పేజీ తరువాయి)

వీరిలో కొందరి భార్యాపిల్లలు అమెరికాలో ఉండగా.. తల్లిదండ్రులు భారత్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగ ఒప్పందాలు, ఇళ్ల సంబంధిత అగ్రిమెంట్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. వీసా గడువు ముగిసిన చాలామంది ఉద్యోగులకు వారి సంస్థల యజమానులు పొడిగింపులను ఇవ్వడంలేదు. దీనికి తోడు లక్ష డాలర్ల ఫీజు ఉండటంతో కొత్త హెచ్-1బీ వీసాల కోసం కంపెనీలు దరఖాస్తులు చేయడంలేదు. ఈ సమస్యను మరింత జటిలం చేసేలా అమెరికా విదేశాంగ శాఖ కొన్నాళ్ల క్రితం కీలక నిర్ణయం తీసుకొంది. భారతీయులు మరో దేశంలోని అమెరికా కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చేయించుకునే అవకాశాన్ని నిలిపివేసింది. దీంతో భారతీయ కాన్సులేట్లలో అపాయింట్‌మెంట్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

ధర్మపరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

'350 ఏళ్లు గడిచినా మనమంతా తేగ్ బహదూర్ బలిదానాన్ని స్మరిస్తున్నామంటే ఆయన త్యాగం చారిత్రక సంఘటనే కాదు.. ప్రతి మనిషిలోని వివేకానికి పరీక్ష. 1675 నవంబరు 24న దిల్లీలోని చాందినీ చౌక్ వద్ద తేగ్‌బహదూర్ బలిదానం నేడు పొరుగు దేశాల్లో ఉన్న హిందూ మైనారిటీల వేదనను గుర్తుచేస్తోంది. ఆయన త్యాగం ఒక చరిత్రే కాదు, మనందరికీ హెచ్చరిక. ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సింది ఒకటే. దేశానికి నేడు బలంగా మాట్లాడే స్వరం అవసరం లేదు.. ఉన్నతమైన వ్యక్తిత్వంతో కూడిన స్వరం అవసరం. స్వతంత్ర ఫలాలను అనుభవించే ప్రతి పౌరుడు ధర్మ పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు.



కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న సిక్కు మత పెద్దలు



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్‌లతో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మహనీయులను అందించిన నేల మహారాష్ట్ర

'ఆధ్యాత్మిక శక్తి సామాజిక జీవనానికి దారి చూపాలి. మహారాష్ట్ర ఎప్పుడూ ఇదే చెప్పింది. నిజమైన బలం ఆధిపత్యంలో కాదు పరోపకారంలో ఉంటుందని చాటిచెప్పింది. ఛత్రపతి శివాజీ నుంచి సంత్ తుకారాం, సంత్ జ్ఞానేశ్వర్, జ్యోతీబా ఫులే, బాబాసాహెబ్ అంబేడ్కర్ వంటి మహనీయులను దేశానికి అందించిన నేల మహారాష్ట్ర' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు. 'దేశానికి నేడు మానవీయ విలువలు కాపాడే వీరత్వం, ఆత్మ పరిశీలన చేసుకునే వివేకం కలిగిన నాయకత్వం అవసరం. ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ విజన్ కేవలం ఆర్థిక అభివృద్ధి మంత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయం, సామాజిక నిబద్ధత కూడా. యువత భాగస్వామ్యం లేకపోతే అది అసాధ్యం. నాందేడ్ పవిత్ర భూమి నుంచి మనమంతా సంకల్పం తీసుకుని గురు తేగ్ బహదూర్ లక్ష్యాలు ముందుకు తీసుకెళదాం' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, సిక్కు మత పెద్దలు కుల్వంతర్, బల్వేందర్, బాబూ సింగ్ మహారాజ్, వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి కృపాణం బహూకరణ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో కలిసి నాందేడ్‌లోని గురుద్వారాను సందర్శించిన పవన్ కల్యాణ్‌కు గురుద్వారా ఛైర్మన్ విజయ్ సత్పాల్‌సింగ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ సిక్కు తలపాగాను ధరించారు. గురుద్వారా గ్రంథాలు.. పవిత్ర వస్త్రాన్ని పవన్ కల్యాణ్‌కు వేసి ఆశీర్వదించారు. సిక్కు మత పెద్దలు సిక్కులు ధరించే పవిత్ర ఆయుధం కృపాణాన్ని బహూకరించారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ యంత్రాన్ని పవన్ కల్యాణ్ ప్రారంభించారు.

కల్లోలిత ప్రపంచంలో శాంతిదూత భారత్

(మొదటి పేజీ తరువాయి)

శాంతితోనే మానవాళి భవితవ్యం భద్రంగా ఉంటుంది. రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయ స్ఫూర్తికి, దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారు. భారతీయ మహిళలు సంప్రదాయ మూస పద్ధతులను బద్దలుగొట్టి ముందుకు సాగుతున్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నారు. స్వయం సహాయక బృందాల నుంచి అంతరిక్షం, రక్షణరంగం వరకు ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళా ప్రతినిధుల సంఖ్య దాదాపు 46 శాతంగా ఉంది. వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకమైనది. ఆ రెండింటిని విడదీసి చూడలేం.

అనూహ్యం.. ప్రజా భాగస్వామ్యం: స్త్రీ-పురుష సమానత్వంతో కూడిన సమ్మిళిత గణతంత్ర దేశానికి భారత్ ఉదాహరణగా నిలుస్తుంది. మన త్రివిధ దళాల సన్నద్ధత, శక్తిసామర్థ్యాలపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉంది. మనకున్న బలంతో శాంతి కోసం పాటుపడుతున్నాం. పరస్పర విశ్వాసంపై ఆధారపడిన సుపరిపాలన దిశగా వెళ్లే క్రమంలో పాతకాలం నాటి అనేక చట్టాలకు ప్రభుత్వం చెల్లుచీటీ రాసింది. దేశ లక్ష్యాల సాధనలో అనూహ్యరీతిలో ప్రజా భాగస్వామ్యం కనిపిస్తోంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ప్రపంచానికే మనం నాయకత్వం వహిస్తున్నాం. స్థానిక సంస్థలు కూడా పురోగమన మార్పులకు సాధనాలు కావాలి. వలసవాద మనస్తత్వం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎంతో ఆత్మవిశ్వాసంతో, వైభవోపేత సంప్రదాయాల బలమైన పునాదులపై జ్ఞాన భారతం దిశగా వేగంగా దూసుకువెళ్తున్నాం. ఆత్మనిర్భరత, స్వదేశీ అనే రెండు సిద్ధాంతాలపై ప్రపంచంలో మూడోపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన ప్రస్థానం సాగుతోంది" అని రాష్ట్రపతి వివరించారు.

పౌరులకు ప్రేరణనిచ్చారు: ప్రధాని

రాష్ట్రపతి చేసిన ప్రసంగం దేశ పౌరులందరికీ ప్రేరణను ఇచ్చి, ప్రజాస్వామ్య బలోపేతానికి వారి కట్టుబాటును పునరుద్ఘాటిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ విశిష్టత, దేశాన్ని ముందుకు నడిపిస్తున్న బృందస్ఫూర్తి గురించి ఆమె ప్రధానంగా ప్రస్తావించారని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

3 లక్షల మంది భక్తులు వచ్చారు

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: రథసప్తమికి తిరుమలకు మూడు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చి వాహన సేవలను తిలకించారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. మాడవీధిలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.

గ్రహం అనుగ్రహం

26-1-2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం
అష్టమి: రా. 7-06 తదుపరి నవమి
అశ్విని: ఉ. 10-58 తదుపరి భరణి
వర్జ్యం: ఉ. 7-11 నుంచి 8-42 వరకు
తిరిగి రా. 7-58 నుంచి 9-28 వరకు
అమృత ఘడియలు: తె. 4-58 నుంచి 6-28 వరకు
దుర్ముహూర్తం: మ. 12-35 నుంచి 1-20 వరకు
తిరిగి 2-49 నుంచి 3-34 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.48
భీష్మాష్టమి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	29.0
శ్రీకాకుళం	18.0	30.0
అనంతపురం	19.5	34.0
విశాఖపట్నం	19.6	31.4
కర్నూలు	19.7	33.0
తాడేపల్లిగూడెం	20.0	32.0
కడప	21.0	29.0
గుంటూరు	21.0	31.0
రాజమహేంద్రవరం	21.5	34.0
విజయవాడ	21.8	30.6
తిరుపతి	22.5	27.5
నెల్లూరు	23.0	30.8
ఒంగోలు	23.5	30.7
నరసాపురం	23.6	33.3

ఈనాడు

రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరాలంటే...

డెబ్బై ఆరేళ్ల కిందట ఇదేరోజున రాజ్యాంగం అమల్లోకి రావడంతో ఇండియా గణతంత్ర దేశంగా ఆవిర్భవించింది. అప్పటికి నిరక్షరాస్యత, నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక సామాజిక అసమానతలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. అవి సమసిపోయి సామాన్యుల జీవితాలు బాగుపడటమనేది సార్వత్రిక వయోజన ఓటు హక్కులోంచి ఉద్భవించే ప్రజాతంత్ర ప్రభుత్వాలతోనే సాధ్యపడుతుందని రాజ్యాంగ సభ సభ్యులు గట్టిగా విశ్వసించారు. అందుకుగానూ ఎన్నికల ప్రక్రియ లోపరహితం కావాలని వారు కోరుకున్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగకపోతే సంవిధాన సౌధ పునాదులే దెబ్బతింటాయని ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హెచ్చరించారు. ప్రజలు తమ ఓటు హక్కును ఎవరికీ దాసోహం చేయకూడదని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సైతం ఎన్నికల పవిత్రతకు ఎట్టి పరిస్థితుల్లో భంగం వాటిల్లకూడదని ఉద్ఘాటించారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎలక్షన్లను పకడ్బందీగా నిర్వహించేందుకు స్వతంత్ర ఎన్నికల యంత్రాంగం ఏర్పాటుకు జాతినిర్మాతలు ఓటేశారు. జనజీవనంలో వారు ఆశించిన మార్పులు ఎంతవరకు సాకారమయ్యాయని చూస్తే ఆవేదనే మిగులుతుంది!

ప్రజాస్వామ్యమూ ఎన్నికలపై ఓ అంతర్జాతీయ సదస్సుకు తాజాగా దిల్లీ ఆతిథ్యమిచ్చింది. ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించడం, ఎన్నికలను పారదర్శకంగా సక్రమంగా నిర్వహించడం, జనతంత్ర స్ఫూర్తిని కబళిస్తున్న తప్పుడు సమాచార వెల్లువను కట్టడి చేయడం వంటి తీర్మానాలను ఆ సదస్సులో పాల్గొన్న 40కి పైగా దేశాల ఎన్నికల నిర్వహణా యంత్రాంగాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. దశాబ్దాల క్రితమే దేశీయంగా ధనవంతుల క్రీడాంగణంగా, ప్రలోభాల జాతరగా తయారైన ఎన్నికల ప్రక్రియను చక్కదిద్దడం అంత తేలికేమీ కాదన్నది చేదు నిజం! అధికారమే పరమావధిగా రాజకీయ పార్టీలు ఆడుతున్న అరాచక క్రీడలో జాబితాల్లోంచి అర్హుల పేర్లు మాయమై బోగస్ ఓట్లు వచ్చి చేరుతుండటం జనస్వామ్య ప్రారబ్ధం. గతంలో తిరుపతి లోక్‌సభ ఉపఎన్నిక సందర్భంగా వేలాది నకిలీ ఓటర్ కార్డులు వెలుగు చూడటం దేశాన్ని దిగ్భ్రాంతపరిచింది. అప్పట్లో ఒకే డోర్ నంబర్‌తో పదికి పైగా ఓట్లు ఉన్న ఇళ్ల సంఖ్య ఏపీలో లక్షన్నరకు మించి తేలడమూ కలవరపరిచింది. పశ్చిమ్ బెంగాల్‌లోని ఓ అసెంబ్లీ నియోజకవర్గంలో 389 మంది ఓటర్లకు తండ్రిగా ఒకరి పేరే ఉందని, మరోచోట 310 మందికి మరో వ్యక్తి నాన్నగా నమోదయ్యాడని కేంద్ర ఎన్నికల సంఘమే సుప్రీంకోర్టుకు ఇటీవల సమాచారమిచ్చింది. ప్రజాస్వామ్యం నామమాత్రంగా మిగలకూడదంటే తప్పుడు ఓట్లన్నింటినీ జాబితాల్లోంచి పూర్తిగా ఏరేయాలి. అర్హుల్లో ఏ ఒక్కరూ ఓటుహక్కుకు దూరం కాకుండా చూడాలి!

నీతీ నిజాయతీ ప్రజాసేవానురక్తి పుష్కలంగా ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేనివారు నేడు ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడం అసంభవంగా మారిపోయింది. 1999 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలన్నీ కలిసి వెచ్చించిన సొమ్ము రూ.9 వేల కోట్లు అయితే, గత సార్వత్రిక సమరంలో ఆ మొత్తం రూ.1.35 లక్షల కోట్లకు చేరినట్లు అంచనా! నల్లధనాన్ని వెదజల్లి ఓట్లు గుప్పిటపడుతున్నవారు ఆపై అంతకంతా సంపాదించే ధ్యేయంతో ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారు. దానివల్ల ప్రజా ప్రగతి కుంటుపడుతోంది. అసమానతలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఎన్నికల్లో ధనస్వామ్యానికి అడ్డుకట్ట పడాలంటే ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పదునుతేల్చాలి. ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా ప్రచారమవుతున్న నకిలీ వార్తలు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి ప్రజాస్వామ్యాన్ని ప్రహసనంగా మారుస్తున్నాయి. వాటి ముసుగులను తొలగిస్తూ వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అత్యవసరం!



ప్రతి వ్యక్తీ ఆత్మగౌరవంతో బతకాలి. మానసికంగా నిత్యం ఎదుగుతూనే ఉండాలి. జీవితం సుదీర్ఘంగా ఉంటే సరిపోదు, గొప్పగా ఉండాలి. నా దృష్టిలో మహిళల ప్రగతే దేశాభివృద్ధికి కొలబద్ద.

– డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

మార్గదర్శి

సృష్టిలో సర్వోత్తమమైంది మానవ జన్మ. దానికి కారణం మనిషికి మాత్రమే ఉన్న బుద్ధిబలం. మనిషిలోని అంతర్గతమైన బుద్ధి ఒక నిర్ణయాత్మకమైన గుణవిశేషం. శక్తియుక్తులన్నీ అతడి బుద్ధిని అనుసరించే ఉంటాయి. మనిషి ఏ నిర్ణయం తీసుకోవడానికైనా బుద్ధి అనేది కీలకం. లోకంలో ఎవర్నైనా మంచి మార్గంలో నడిపించేది సకారాత్మకమైన బుద్ధి ఒక్కటే. అదే మార్గదర్శి. అదే అంతర్యామి.

సమాజంలో వ్యక్తి బుద్ధిమంతుడై ఉండాలంటే అనేక విషయాలు ప్రభావితం చేస్తాయి. పుట్టి పెరిగిన వాతావరణం, విద్య, సంస్కారం, జ్ఞానం వంటివన్నీ బుద్ధి బలాన్ని ఇనుమడింపజేస్తాయి. బుద్ధిమంతుడైన వ్యక్తి నిరంతరం ఎరుకతో ప్రవర్తిస్తాడు. తన చుట్టూ ఉన్న వాతావరణం పట్ల సరైన అవగాహన కలిగి ఉంటాడు.



అంతర్యామి

అటువంటి వారు ధర్మబద్ధమైన జీవనాన్ని గడపడం ద్వారా లోకంలో మానవత్వాన్ని ఉద్దీపనం చేస్తారు.

సృష్టిలో రూపురేఖావిలాసాల్లో మనుషులందరూ ఎలా ఒకేలా ఉండరో, బుద్ధి పరంగానూ ఒకేలా ఉండరు. కొందరు మంద బుద్ధి కలిగి ఉంటారు. మరికొందరు ఒక మోస్తరు తెలివిని, ఇంకొందరు చురుకైన బుద్ధిని కలిగి ఉంటారు. వారిది కుశాగ్రబుద్ధి లేదా బుద్ధికుశలతగా చెప్పవచ్చు. దర్భగడ్డి మొన ఎంత వాడిగా ఉంటుందో వారి బుద్ధి అంత పదునుగా ఉంటుందని అర్థం. అటువంటి వారు విషయాన్ని వెంటనే గ్రహిస్తారు. వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. జ్ఞానవంతులైన వారు ఎవరైనా ఇటువంటి బుద్ధికుశలతను కలిగి ఉంటారు. స్వామి వివేకానంద వంటివారు ఈ కోవలోకి వస్తారు.

బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, కబీర్ దాస్, పండిత రవిదాస్, గురునానక్ వంటి మహానుభావులు వారి బోధనల ద్వారా ఎంతో ఆధ్యాత్మిక ప్రగతిని సాధించారు. ప్రత్యక్షంగా అనుభూతి చెందిందే సత్యం అన్నాడు బుద్ధుడు. అహింస, సత్యం మనుషుల జీవితాలను ఆనందమయం చేస్తాయన్నాడు వర్ధమాన మహావీరుడు. అంతర్గత శుద్ధి లేని హృదయం సకల దుర్గుణాలతో నిండి ఉంటుందని రవిదాస్ ప్రబోధించాడు.

ప్రేమ, సోదరభావం, సమానత్వం, ఆధ్యాత్మిక భావనలు మానవజాతి పురోగతికి దోహదం చేస్తాయన్నాడు గురునానక్. ఇలాగే ఇంకా చాలామంది మహానుభావులు లోకానికి మేలుచేసే బోధనలు చేశారు. వీరంతా మామూలు మనుషుల్లోంచి వచ్చిన వారే. కానీ తమ బుద్ధికుశలతతో మానవ జీవితాన్ని కాచివడపోశారు. అందుకే వారి బోధనలు ఎప్పటికీ మనకు దారిదీపాలూ, మార్గదర్శకాలు.

సంస్కృత ధాతువైన బుద్ధి పదానికి సామాన్యంగా తెలివితేటలని అర్థం. ప్రాచీన కాలంలో ఈ తెలివితేటలను జీవన్ముక్తి, ఆధ్యాత్మిక చింతన కోసం వినియోగిస్తే, ఆధునికకాలంలో బతుకుతెరువుకు ఉపయోగిస్తున్నారు. బుద్ధి వక్ర మార్గంలో పడనంతవరకూ మనిషి చిరంజీవి. ఎందుకంటే రజస్తమో గుణాలు ఎప్పుడూ బుద్ధిని తప్పుదారి పట్టించడానికి పూనుకుంటాయి. అందుకే 'వినాశకాలే విపరీత బుద్ధిః' అన్నారు పెద్దలు. వెరసి దేశకాలాలకు అతీతంగా మనిషిని నడిపించేది బుద్ధి ఒకటే. అదే మార్గదర్శి.

– డాక్టర్ బండి సత్యనారాయణ

ఆసేతు హిమాచలం...

ఒకే కుటుంబం!

'భారతదేశం నా మాతృభూమి...' అనగానే పైడిమర్రి వెంకటసుబ్బారావు రాసిన ప్రతిజ్ఞ పాఠమే గుర్తుకొస్తుంది. అందులోని తొమ్మిది వాక్యాలు నవవిధ దేశభక్తి మార్గాలు. ఉత్తమ పౌరుడిగా ఎదగడానికి ఉపయోగపడే సంస్కరణాత్మక ప్రతిపాదనలు. ఈ ప్రతిజ్ఞలోని పరమార్థాన్ని అర్థం చేసుకున్నప్పుడే మనం ఉత్తమ పౌరులుగా ఎదుగుతాం.

● **భారతదేశం నా మాతృభూమి**

ఎన్నో భారతీయ గ్రంథాలు, గాంధీజీ, ఠాగూర్ లాంటి ప్రముఖులూ మాతృభూమి ప్రాశస్త్యాన్ని వివరించారు. రామాయణంలో రాముడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అంటూ తల్లితో జన్మభూమిని పోల్చాడు. మాతృమూర్తికి ప్రత్యామ్నాయం లేనట్లే మాతృభూమికీ ఉండదు. 'మాతృదేవోభవ' అంటూ తల్లిని పూజించడం మన సంస్కృతి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే పైడిమర్రి జన్మభూమిని 'మాతృభూమి' అనే ప్రయోగం చేశారు.

● **భారతీయులందరూ నా సహోదరులు**

సహ ఉదరులు అంటే ఒకే తల్లి గర్భం నుంచి పుట్టిన వారని అర్థం. ఎంతో పరిశోధన చేసిన తరవాతే పైడిమర్రి ఈ పదాన్ని వాడారు. ఏ భరత భూమిని మాతృభూమిగా భావించామో ఆ భరతమాత పిల్లలందరూ మనకు సహోదరులే. దేశదేశాల్లో ఎప్పుడైనా జీవిత భాగస్వామి, బంధువులు లభిస్తారు. కానీ, ప్రియసఖులైన సహోదరులు లభించరని రామాయణం యుద్ధకాండలో ప్రస్తావన ఉంది. అందుకే భారతీయుల మధ్య సహోదర బంధాన్ని ముడివేసి, జీవితాంతం కలిసి కట్టుగా ఉండాలని చెప్పారు పైడిమర్రి.



● **నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను**

ప్రేమ అనేది ఒక అత్యున్నతమైన నిస్వార్థ భావన. ప్రేమ భావన ముందుగా ప్రసరించేది, ప్రవహించేది రక్త సంబంధాల్లోనే. అయితే, భారతీయులమైన మనమంతా సహోదరులం అని చెప్పి, ఒకే తల్లి బిడ్డల మధ్య బంధాల్లో ఉద్భవించే నిష్కపటమైన ప్రేమనే దేశంపైనా చూపాలని పైడిమర్రి ఉద్బోధించారు.

● **సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం**

మన దేశానికి అతి గొప్ప, అమూల్యమైన భౌతిక, సాంస్కృతిక, చారిత్రక, సహజ వనరుల సంపద ఉంది. అది మన దేశ గర్వించ పునకు, నాగరికతకు, సంస్కృతీ సంప్రదాయాలకు, శాస్త్రవిజ్ఞానానికి ప్రతీక. దాన్ని మనం గర్వకారణంగా భావించాలి.

● **దీనికి అర్హుడు కావడానికి సర్వదా కృషి చేస్తాను**

దేశభక్తి విషయంలో పైడిమర్రి ఉన్న నిజాయతీ, నిబద్ధతకు ఈ వాక్యమే కొలమానం. ఈ దేశ వారసత్వ సంపదకు అర్హత పొందడానికి ప్రతి భారతీయుడు కృషి చేయాలి. అమూల్య సంపదలు సంక్రమించడానికి తగిన అర్హతలు ఉండాలి. దేశం పట్ల నిబద్ధత, మానవత్వం, నిస్వార్థం లాంటివి ఆ కోవకే వస్తాయి. వాటిని సంపాదించుకున్నప్పుడే భారతీయతకు వారసులమని సగర్వంగా చెప్పుకోగలం.

● **నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను**

పైడిమర్రి ప్రతిజ్ఞను రెండు భాగాలుగా చేసి, మొదటి అయిదు వాక్యాలను భారతీయులందరూ ఏ విధంగా ఒకే కుటుంబానికి చెందినవారో వివరించారు. చివరి నాలుగు వాక్యాలను ప్రతి కుటుంబ సభ్యుడు ఇతర సభ్యుల పట్ల ఎలా ప్రవర్తించాలి, అందుకోసం ఏం చెయ్యాలి వంటి వ్యక్తిగత బాధ్యతలను వివరించారు. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' అన్న ఉపనిషత్ సూక్తే దీనికి మూలం. ఈ నలుగురినీ దైవసమానులుగా భావించాలని చెప్పడం విద్య, సంస్కారం, గౌరవాలకు సమున్నత సంకేతం.

● **ప్రతివారితోను మర్యాదగా నడుచుకుంటాను**

'మర్యాద' అనేది మన జీవనయానంలో ఒక భాగం. దీనికి మూలం రామాయణంలో ఉంది. సుందరకాండలో హనుమంతుడు 'శ్రీరాముడు లోకంలోని మర్యాదలను స్థాపించేవాడు, ఇతరులను కూడా ఆచరించేలా చేసేవాడు' అని సీతమ్మకు వివరించాడు. అందుకే రాముణ్ని 'మర్యాదా పురుషోత్తముడు'గా వ్యవహరిస్తారు. ఆయనలో సత్యం, ధర్మం, నీతి, సత్ప్రవర్తన, ఆదర్శవంతమైన కుటుంబీకుడు, నిగర్వి, నిరాడంబరుడు, శాంతికాముకుడు వంటి ఎన్నో శ్రేష్ఠ గుణాలున్నాయి. మర్యాద సకల శ్రేష్ఠ గుణాల సమ్మిళితం. అందుకే పైడిమర్రి ప్రతి వ్యక్తీ సకల సద్గుణాలతో సంపూర్ణ వ్యక్తిగా ఉండాలని అభిలషించారు.

● **నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవా నిరతితో ఉంటాను**

ఎప్పుడైతే కుటుంబ సభ్యులతో అనుబంధం పెంచుకుంటారో సహజంగానే వారి కష్టనష్టాల్లో, సుఖసంతోషాల్లో తోడుగా ఉంటారు. త్యాగం, సేవ రెండూ కలిసి నడుస్తాయి. త్యాగనిరతి కలిగినవాడే ఇతరులను సేవించగలడు. సేవాతత్పరుడే ఇతరుల కోసం త్యాగం చేయగలడు. దేశభక్తి అనే సౌధానికి సేవానిరతి ఒక స్తంభమని చెప్పవచ్చు.

● **వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం**

ఇతరుల శ్రేయస్సు, అభివృద్ధి మనకు ఆనందాన్నివ్వడం దైవలక్షణం. ప్రతిజ్ఞలోని ముగింపు వాక్యం ఎంత పవిత్రమైనదో మనం అర్థం చేసుకోవాలి. దీనికి ఆదిశంకరుల అద్వైత సిద్ధాంతమే మూలం. ఎప్పుడైతే మనలో దేవుడున్నాడని నమ్ముతామో ఇతరులందరిలో కూడా దేవుడున్నట్లే. అద్వైతానికి మూలసూత్రం 'నీలో ప్రతి ఒక్కరు, ప్రతి ఒక్కరిలో నువ్వు'. ఎప్పుడైతే ప్రతి ఒక్కరిలో ఆ దైవత్వాన్ని చూడగలుగుతామో సహజంగానే వారికి శ్రేయోభిలాషిగా ఉండగలం. వారి అభివృద్ధిని కాంక్షిస్తాం. దానిలోనే ఆనందాన్ని పొందుతాం.

ఈ 'ప్రతిజ్ఞ' సమసమాజ స్థాపనకు, సమాజ సమతుల్య స్థితికి ఉపకరిస్తుంది. దేశమంతా ఒకే కుటుంబం అనే భావన జాతీయ సమగ్రతకు, సమైక్యతకు, సోదర భావాన్ని పెంచడానికి దోహదపడుతుంది. దీన్ని మనం త్రికరణశుద్ధిగా విశ్వసించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా నడుచుకోగలం.



ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు
మాజీ ఉపకులపతి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

జనవరి 26 అనగానే మనకు గుర్తొచ్చేది దేశ రాజధాని దిల్లీలోని పరేడ్, త్రివర్ణ పతాకావిష్కరణ, రాజ్యాంగ పీఠిక పఠనం, దేశ అత్యున్నత పురస్కారాల ప్రకటన మొదలైనవి. ఆ రోజు దేశమంతటా ఒకలాంటి గంభీర వాతావరణం కనిపిస్తుంది. కానీ గణతంత్ర దినోత్సవం జాతీయ వేడుక మాత్రమే కాదు. అది మన వ్యక్తిగత జీవితాల్లో, సామాజిక వ్యవహారాల్లో ప్రతిరోజూ తరచి చూసుకోవాల్సిన ఒక అంతర్గత స్థితి.

గణతంత్రం అంటే- పాలకుడు ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం... రాజు కాదు, సింహాసనం కాదు, మనమే! ఇది వినడానికి సరళంగా అనిపించినా, ఆచరించడానికి కఠినమైనది. ఎందుకంటే స్వయంపాలన అనేది కేవలం ఓటు వేయడంతో ముగిసిపోదు; అది మన నిర్ణయాల్లో,



ఏదీ గణతంత్ర స్ఫూర్తి?

మౌనాల్లో, నిర్లక్ష్యాల్లో కూడా పరీక్షకు నిలుస్తుంది. రైల్వేస్టేషన్‌లోనో మరోచోటో క్యూలో నిలబడి ఉండగా, ఎవరో మధ్యలో దూరతారు. చుట్టూ ఉన్నవాళ్లు చూసి కూడా మాట్లాడరు. మరోచోట మరెవరో అవినీతి, అన్యాయాలకు పాల్పడుతుంటారు. అది తెలిసిన వాళ్లలో చాలామంది మనకెందుకులే అని ఊరుకుంటారు. ఆ క్షణంలో గణతంత్ర స్ఫూర్తి ఓడిపోయిందా? లేక అది మనలో మౌనంగా కుదేలైందా? రాజ్యాంగం పుస్తకరూపంలో ఉన్నంత మాత్రాన ప్రజాస్వామ్యం నిలబడదు, సంవిధాన స్ఫూర్తి మన దైనందిన ప్రవర్తనలోకి రావాలి. అదే గణతంత్రానికి నిజమైన అర్థం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక గణతంత్రాన్ని ఎంచుకోవడం ఒక రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు; అది ఒక తాత్విక ప్రకటన. మనిషి తనకు తానే చట్టం అన్న ఆలోచన. కానీ ఇక్కడే ఒక విరోధాభాసం దాగుంది, మనమే చట్టం అనుకున్నప్పుడు, చట్టాన్ని ఉల్లంఘించే స్వేచ్ఛ కూడా మనకే ఉన్నట్లు ప్రవర్తిస్తాం. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగకపోవడం నుంచి, బలహీనుడి హక్కును కాలరాచే దాకా, ఈ చిన్నచిన్న ఉల్లంఘనలే గణతంత్రాన్ని లోపల నుంచి గాయపరుస్తాయి.

గణతంత్రం అనేది కేవలం హక్కుల జాబితా కాదు, అది బాధ్యతల ఒప్పందం కూడా. వాక్ స్వాతంత్ర్యం ఉందని, ఇష్టంవచ్చినట్లు మాట్లాడటం తప్పు. సమానత్వం చట్టంలో ఉందని చెప్పుకొంటూనే, మన ఇళ్లలో మనసుల్లో ఉన్న అసమానతలను ప్రశ్నించకపోతే గణతంత్రం కాగితాలకే పరిమితమవుతుంది. గణతంత్ర దినోత్సవం మనకు ఒక అద్దం లాంటిది. అందులో దేశాన్ని, మనల్ని మనం కూడా చూసుకోవాలి. నేను నా రోజువారీ జీవితం ద్వారా ఈ వ్యవస్థను బలపరుస్తున్నానా? లేక దాని బలహీనతకు కారణమవుతున్నానా? ఈ ప్రశ్నకు నిజాయతీగా సమాధానం చెప్పుకోవడమే ఈ రోజుకు అసలైన అర్థం.

జనవరి 26 సాయంత్రానికి జెండాలు మడత పెట్టేస్తాం, బ్యానర్లు తొలగిస్తాం. కానీ గణతంత్ర సంరంభం అక్కడితో ముగియకూడదు. అది మరుసటి రోజు ఆఫీసులో, బస్సుల్లో, పాఠశాలలో, సోషల్ మీడియాలో, మన ప్రతి చర్యలో కొనసాగాలి. ఎందుకంటే గణతంత్రం ఒక రోజు వారీ సాధన. దాన్ని మనం ప్రతిరోజూ ఆచరించినప్పుడే, ఈ దేశం నిజంగా ప్రజల చేతిలో ఉంటుంది.

– డాక్టర్ నూకరాజు బెందుకుర్తి

చేయాల్సింది చాలా ఉంది!

ఏ దేశమైనా అభివృద్ధిలో దూసుకుపోవాలన్నా, సమ్మిళిత ప్రగతి సాధ్యపడాలన్నా మహిళలూ ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలి. కానీ, స్త్రీల విషయంలో చాలా చోట్ల తీవ్ర వివక్ష నెలకొంది. దాన్ని తొలగించడానికి చాలా దేశాలు మహిళల సామాజిక, ఆర్థిక హక్కులకు దన్నుగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ స్త్రీల ప్రగతికి ప్రతిబంధకంగా మారిన పలు సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. 2023 నాటికి ఆయా అంశాలపై ఎన్ని దేశాల్లో స్త్రీలకు ప్రత్యేక హక్కులు, అవకాశాలు ఉన్నాయంటే...

వ్యాపార ప్రారంభ హక్కు	184
ఆస్తి హక్కు	170
గృహ హింస నిషేధం	164
ఉద్యోగాల్లో వివక్ష నిర్మూలన	161
తల్లులకు వేతనంతో కూడిన సెలవులు	122
సమాన పనికి సమాన వేతనం	97


(ఆధారం: ప్రపంచ బ్యాంక్ జెండర్ స్టాటిస్టిక్స్-2025)

అవిచ్ఛిన్న అభివృద్ధికి అణు విద్యుత్

చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాల వాడకంతో కర్బన ఉద్గారాలు, భూతాపం పెరిగిపోతున్నాయి. దాంతో మిగతా ప్రపంచం మాదిరిగానే భారతదేశమూ గ్రీన్ హైడ్రోజన్, బయోమాస్ వంటి ఇంధనాలవైపు మళ్లుతోంది. సౌర, పవన విద్యుత్కేంద్రాలను విరివిగా నెలకొల్పుతోంది. అయితే సూర్యుడు ఉన్నప్పుడే సౌర ఫలకాల ద్వారా విద్యుదుత్పాదన చేయగలం. గాలి వీచినపుడే గాలిమరలు తిరిగి పవన విద్యుత్ లభిస్తోంది. అయితే, నిల్వ చేయడం ముఖ్యం. సూర్యకాంతి ఉన్నప్పుడు ఉత్పన్నమయ్యే సౌర విద్యుత్తును రాత్రిపూట బ్యాటరీలలో నిల్వ చేసుకోవాలి. పవన విద్యుత్తును గాలి వీచనప్పుడు వాడుకోవడానికి వీలుగా బ్యాటరీలలో నిల్వచేయాలి. జల విద్యుత్తు నిల్వకు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు (పీఎస్‌పీ)లను చేపట్టాలి. ఇదంతా చాలా ఖరీదైన వ్యవహారం. మరోవైపు డేటా సెంటర్లకు, హైటెక్ పరిశ్రమలకు, ఆర్థిక సేవలకు నిరంతరం చవగ్గా విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. ముంబయి, దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి నగరాలకు ఆటంకాల్లేని విద్యుత్ సరఫరా తక్షణావసరం. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుంటే, 2047కల్లా భారతదేశానికి లక్ష మెగావాట్ల (100 గిగావాట్ల) అవిచ్ఛిన్న విద్యుత్ సరఫరా కావాలి. దానికి తగినట్లుగా ప్రైవేటు భాగస్వామ్యంతో చురుగ్గా విద్యుదుత్పాదనకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

నికరమైన ఒప్పందాలతో పెట్టుబడులు

ఈ కృత్రిమమేధా యుగంలో ఇళ్లు, పరిశ్రమలు, వ్యాపారాలకన్నా ఎంతో ఎక్కువ విద్యుత్ డేటా కేంద్రాలకు, క్లౌడ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ల తయారీ, ఏఐ సేవలకు అవసరపడుతుంది. ఈ సంస్థలకు విద్యుత్ సరఫరాలో ఏ కాస్త అంతరాయం జరిగినా ఆర్థిక నష్టం అపారంగా ఉంటుంది. బ్యాటరీలు, పీఎస్‌పీల వల్ల తాత్కాలిక ఉపశమనం లభిస్తుందే తప్ప శాశ్వత పరిష్కారం చిక్కదు. పైగా వాటి నిర్మాణానికి భారీ పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. పెద్దయెత్తున భూమి, జల వనరులు కావాలి. బ్యాటరీలలో వాడే లిథియం వంటి ఖరీదైన, అరుదైన లోహాలను విదేశాల నుంచి దిగుమతి



తక్కువ ఖర్చులో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగితేనే పరిశ్రమలు, వ్యాపార సంస్థలు బాగా ప్రగతి సాధిస్తాయి. ఏఐ రంగప్రవేశంతో విద్యుత్ అవసరాలు ఇంకా ఎక్కువవుతున్నాయి. కరెంట్‌కోసం శిలాజ ఇంధనాలపైనే ఆధారపడితే వాతావరణానికి మంచిది కాదు. ఈ నేపథ్యంలో అణు విద్యుచ్ఛక్తి ఒక మేలిమి ప్రత్యామ్నాయంగా ముందుకొస్తోంది.

చేసుకోవాలి. బ్యాటరీ నిల్వ, పీఎస్‌పీ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో సమయం పడుతుంది. అవి చిరకాలం మన్నలేవు కూడా. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం అణు విద్యుదుత్పాదన మాత్రమే. అణు కేంద్రాలు ఎండనకా వాననకా, పగలూ రేయీ తేడా లేకుండా నిరంతరం విద్యుదుత్పాదన చేయగలవు. 85-90 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌తో రోజులో 24 గంటలూ విద్యుత్తును అందిస్తాయి. సగటున ఒక్కో మెగావాట్ ఉత్పాదనకు కావాల్సిన భూమీ తక్కువే. కర్బన ఉద్గారాలకు తావు ఉండదు. ఒక్క అణు విద్యుత్కేంద్రాలతోనే భారత్‌కు కావాల్సిన 100 గిగావాట్ల విద్యుత్తును అందించవచ్చు-అదీ ఎటువంటి అంతరాయం లేకుండా.

బ్యాటరీలు గ్రిడ్ సమతౌల్యత సాధించడానికి తోడ్పడతాయి కానీ, వాటితో దీర్ఘకాలం నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యం కాదు. పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులకు ప్రాదేశిక, పర్యావరణ పరిమితులు, వ్యయభారం ఉంటాయి. వీటిని ఎక్కడంటే అక్కడ ఏర్పాటుచేయలేము. అణువిద్యుత్కేంద్రాలతో ఈ సమస్యలు ఉండవు. డేటా కేంద్రాలకు స్థిరమైన ధరకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం అణు కేంద్రాలతోనే సాధ్యం. అంతరాయాలు లేకుండా దీర్ఘకాలం విద్యుత్ సరఫరాకు నికరమైన ఒప్పందాలు కుదిరి పటిష్ఠ పంపిణీ యంత్రాంగం ఏర్పడితే అణు విద్యుత్ రంగంలోకి విదేశీ పెట్టుబడులు ప్రవహిస్తాయి. సాధారణ విద్యుత్ గ్రిడ్‌లపై ఒత్తిడి తగ్గి ఇళ్లకు, వ్యాపారాలకు కరెంటు సరఫరా మెరుగుపడుతుంది.

ఖర్చులూ సమస్యలూ తగ్గుతాయి...


అణు విద్యుత్కేంద్రాల స్థాపనకు భారీగా వ్యయమవుతుంది కానీ, వాటి నిర్వహణ ఖర్చు మాత్రం బాగా తక్కువ. వీటి నుంచి విద్యుత్ కొనుగోలుకు తాత్కాలిక ఒప్పందాలకన్నా దీర్ఘకాలిక ఒప్పందాలే మేలు. విద్యుత్ ఛార్జీలను 30-35 ఏళ్ల కాలావధికి ఒక ప్రత్యేక సంస్థ ద్వారా నిర్ణయించాల్సి ఉంటుంది. దీర్ఘకాలిక ధర స్థిరీకరణ వల్ల ఫైనాన్సింగ్ ఖర్చులు, ఇతర సమస్యలు తగ్గుతాయి. అణు విద్యుత్కేంద్రాలు 60 నుంచి 80 ఏళ్లపాటు పనిచేస్తాయి. వాటి విలువపై మొదట్లో ఎక్కువ తరుగుదలను అనుమతిస్తారు. మొదట్లో విద్యుత్ ఛార్జీలు ఎక్కువగానే ఉంటాయి. ఇలా కాకుండా మొదట్లోనే తక్కువ తరుగుదలను అనుమతించి దీర్ఘకాలంలో పెట్టుబడి రికవరీ జరిగేలా చూడాలి. దీనివల్ల ఛార్జీలను తగ్గించగలుగుతాం. భారతదేశ డిజిటల్, పారిశ్రామిక, పట్టణాభివృద్ధి అనేది అందుబాటు ధరలకు అవిచ్ఛిన్న విద్యుత్ సరఫరా మీద ఆధారపడి ఉంది. అందుకు హరిత ఇంధనాలు, స్టోరేజి బ్యాటరీల మీదనే పూర్తిగా ఆధారపడకుండా అణు విద్యుదుత్పాదనను పెద్దయెత్తున ప్రోత్సహించాలి. అందుకు పెట్టాల్సిన భారీ పెట్టుబడులకు అంతకంతా లాభాలు కచ్చితంగా లభిస్తాయి.



డి.రాధాకృష్ణ
మాజీ ఛైర్మన్, త్రిపుర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్, రెరా ట్రైబ్యునల్

రాజ్యాంగం ఎందుకంటే...

'తాతయ్యా! మాకు స్కూల్లో ఆటల పోటీలు పెట్టారు తెలుసా! నేను అన్ని ఆటలూ ఆడటానికి ప్రయత్నించాను.. ఈరోజు బహుమతులు ఇస్తారు' అన్నాడు కార్తీక్. 'అవునా! వెరీ గుడ్ కార్తీక్.. గెలిచినా ఓడినా అలాగే ఆడుతూ ఉండాలి' అన్నాడు తాతయ్య. 'అలాగే తాతయ్యా! కానీ నాకో సందేహం వచ్చింది.. అడగనా?' అన్నాడు కార్తీక్. 'ఏంటో చెప్పు!' అన్నాడు తాతయ్య. 'రాజ్యాంగం అమల్లోకి వచ్చినందుకు జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని చేసుకుంటాం కదా! అసలు రాజ్యాంగం ఎందుకు? దాన్ని అంత కష్టపడి ఎందుకు రాశారు. రాజ్యాంగం లేకపోతే ఉండలేమా?' అని అడిగాడు కార్తీక్. 'ఎందుకు ఉండలేం, ఉండగలం. కానీ అప్పుడు మన జీవితాలకు సరైన రక్షణ అనేది ఉండదు. ఉదాహరణకు ఇప్పుడు కబడ్డీ ఆడుతున్నావు అనుకో.. గెలిచావు అని ఎలా చెబుతారు? ఆ ఆటకు ఉన్న కొన్ని నియమ నిబంధనలను బట్టే కదా! ఆ నియమాలే లేకపోతే ఎవరికి నచ్చినట్లు వాళ్లు ఆడేసి నేనే గెలిచాను అనేస్తారు. దాంతో అందరికీ గొడవలు జరుగుతాయి. కానీ ఇప్పుడు ఆటకు నియమాలు ఉన్నాయి కాబట్టి.. అందరూ పద్ధతిగా ఆడతారు. మన రాజ్యాంగం కూడా అంతే! అందులో మనకు ఉండే హక్కులు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి ఉంటుంది. దేశ ఐక్యతను కాపాడటం.. అలాగే ప్రభుత్వాలు చేయాల్సిన పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార పంపకాలకు నియమాలు, స్వేచ్ఛ, సమానత్వం, ఎన్నికల విధానం ఇలా బోలెడు విషయాలు ఉంటాయి. ఒక మాటలో చెప్పాలంటే మన జీవన విధానానికి నియమ నిబంధనల పుస్తకం అని చెప్పొచ్చు. వాటిని అందరూ పాటిస్తేనే.. ప్రశాంతంగా ఉండగలం' అని చెప్పారు తాతయ్య. 'అర్థమైంది తాతయ్యా! రాజ్యాంగం అనేది మనకు దారి చూపే దిక్సూచి లాంటిదన్నమాట' అన్నాడు కార్తీక్. 'చాలా బాగా అర్థం చేసుకున్నావు.. సరే ఇక బయలుదేరు నాన్నా.. స్కూల్‌కు టైం అవుతుంది' అన్నారు తాతయ్య. 'వెళ్తున్నా తాతయ్యా! నువ్వు చెప్పిన విషయమే ఈరోజు స్కూల్లో ఉపన్యాసంగా చెబుతాను.. బై!' అంటూ స్కూల్‌కు వెళ్లిపోయాడు కార్తీక్. ★



నేనెవర్ని?

1. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'వెల'లో ఉంటాను కానీ 'పల'లో లేను. 'కాలు'లో ఉంటాను కానీ 'కాలం'లో లేను. 'గుడి'లో ఉంటాను కానీ 'బడి'లో లేను. నేనెవర్ని?
2. మూడు అక్షరాల పదాన్ని నేను. 'బరువు'లో ఉంటాను కానీ 'పరువు'లో లేను. 'అల'లో ఉంటాను కానీ 'అర'లో లేను. 'పంచె'లో ఉంటాను కానీ 'కంచె'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1. వెలుగు 2. బలపం

తెలుగునాట పద్మాలు వికసించాయి.. ప్రతిభకు తార్కాణంగా మనవారినీ వరించాయి. విశేష కృషికి లభించిన ప్రతిష్ఠాత్మక గుర్తింపు ఇది. విభిన్న రంగాల్లో నైపుణ్యానికి పట్టం కట్టిన సందర్భమిది. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే పద్మ పురస్కారాలకు.. ఈసారి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విశిష్ట వ్యక్తులు ఎంపికయ్యారు. విద్య, వైద్యం, శాస్త్ర సాంకేతిక, కళలు, పశుసంవర్ధక రంగాలకు చెందిన ప్రముఖులు వీరిలో ఉన్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేక నేపథ్యం.. అసమాన ప్రతిభ వారి సొంతం.

వికసిత పద్మాలు



మహమ్మారిపై సమరానికి వరించిన పురస్కారం

ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డా.నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్

క్యాన్సర్ మహమ్మారిపై ఆయనది అవిశ్రాంత పోరు. అమెరికాలో స్థిరపడినా ప్రతి మూడు నెలలకోసారి భారత్‌కు వచ్చి... క్యాన్సర్ నివారణపై అనేక కార్యక్రమాలు, అవగాహన సదస్సుల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్న ఆయన... రెండు రాష్ట్రాల్లో క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నారు. ఆయనే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు. ఆయనకు 2015లోనే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అందించగా... తాజాగా పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మంటాడ గ్రామంలో 1947 అక్టోబరు 21న ఆయన పేద కుటుంబంలో జన్మించారు. తండ్రి సత్యనారాయణ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తల్లి కనకదుర్గ గృహిణి. మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో పీయూసీ, బీఎస్సీ, కర్నూలులోని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాలలో ఎండీ పూర్తి చేశారు. 1972 ఫిబ్రవరి నుంచి ఏడాదిపాటు గాంధీ ఆసుపత్రిలో పనిచేశారు. 1973 నుంచి 1976 వరకు ఉస్మానియాకు అనుబంధంగా ఉన్న రేడియం ఇన్‌స్టిట్యూట్ అండ్ క్యాన్సర్ ఆసుపత్రిలో రెసిడెంట్ వైద్యుడిగా సేవలందించారు. అనంతరం అమెరికా వెళ్లారు. క్యాన్సర్‌పై 4 పుస్తకాలు, 300లకు పైగా శాస్త్రీయ వ్యాసాలు రాశారు. ఈయన ఆధ్వర్యంలో సుమారు 300 మందికిపైగా వైద్యులు శిక్షణ పొందారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. ప్రస్తుతం ఆసుపత్రి సలహాదారులుగా కొనసాగుతున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కార్నెల్ మెడికల్ సెంటర్‌లో ఆంకాలజీ ప్రొఫెసర్, ఛైర్మన్, డైరెక్టర్ వంటి పదవులను ఆయన నిర్వహించారు. అనేక క్యాన్సర్ చికిత్స పద్ధతులను అభివృద్ధి చేశారు. ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) సలహాదారులుగా కొనసాగుతున్నారు. 2014లో అమెరికాలో అత్యున్నత పురస్కారమైన "ది ఎల్లిస్ ఐలాండ్ మెడల్ ఆఫ్ ఆనర్", అమెరికా క్యాన్సర్ సొసైటీ అందించే ప్రతిష్ఠాత్మకమైన "ట్రిబ్యూట్ ఆఫ్ లైఫ్" అవార్డులు అందుకున్నారు.

మరింత బాధ్యత పెరిగింది

నాకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంతో నా బాధ్యత మరింత పెరిగింది. ఈ అవార్డు రావడానికి కృషిచేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు. దేశవ్యాప్తంగా క్యాన్సర్ నివారణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను.

\- నోరి దత్తాత్రేయుడు



వైద్య సేవలు.. సామాజిక బాధ్యతకు పట్టం

ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జీవీ రావుకు 'పద్మశ్రీ'



వైద్య రంగంలో విశేష సేవలందించిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మడి వెంకటరావు(జీవీ రావు)ను ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం వరించింది. 'ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ)' స్థాపనలో వ్యవస్థాపకుడిగా డాక్టర్ జీవీ రావు కీలక పాత్ర పోషించారు. ఆయన ఇప్పటివరకు 12 వేలకు పైగా క్లిష్టమైన జీర్ణకోశ శస్త్రచికిత్సలు, 16 వేలకు పైగా ఎండోస్కోపిక్ విధానాలను విజయవంతంగా నిర్వహించారు. దేశంలోనే తొలిసారిగా 'నో స్కార్ సర్జరీ' ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే తొలి 'ట్రాన్స్ ఓరల్ ఎండోస్కోపిక్ అపెండెక్టమీ' నిర్వహించిన ఘనత ఆయన సొంతం. ల్యాప్రోస్కోపిక్-ఎండోస్కోపిక్ హైబ్రిడ్ విధానాలను అభివృద్ధి చేసి... ప్రపంచవ్యాప్తంగా వైద్య ప్రామాణికాలను మార్చడంలో కీలకంగా వ్యవహరించారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సహకారంతో తొలి దేశీయ సర్జికల్ సిమ్యులేటర్‌ను, ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించే రోబోటిక్ నర్స్ సిస్టమ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంతాల్లో 'ఇరిటబుల్ బవెల్ డిసీజ్(ఐబీడీ)' కేసుల నిర్ధారణకు దోహదపడ్డారు. భారతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ రావు.. శస్త్రచికిత్స విద్యలో 'నాన్ టెక్నికల్ స్కిల్స్ ట్రైనింగ్' ప్రవేశపెట్టారు. ఆయన సేవలు వైద్య పరిమితులు దాటి.. సామాజిక బాధ్యత, సాంకేతిక ఆవిష్కరణ, గ్రామీణాభివృద్ధి దిశగా విస్తరించాయి. డాక్టర్ జీవీ రావు స్వస్థలం నల్గొండ. ఉస్మానియాలో ఎంబీబీఎస్ వైద్యవిద్య, బెంగళూరులో ఎంఎస్ జనరల్ సర్జరీ, మద్రాస్‌లో సర్జికల్ గ్యాస్ట్రో అభ్యసించారు. ఆయన సేవలకుగాను డాక్టర్ బీసీ రాయ్ జాతీయ అవార్డు(2009), ప్రైడ్ ఆఫ్ తెలంగాణ(2019), ఎకనామిక్ టైమ్స్ 'ఇన్‌స్పైరింగ్ డాక్టర్స్ ఆఫ్ ఇండియా'(2018) పురస్కారాలతో పాటు రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో(ఎఫ్ఆర్‌సీఎస్) నుంచి గౌరవ ఫెలోషిప్ అందుకున్నారు. "ఈ గౌరవం నా వ్యక్తిగత విజయం కాదు.. ఏఐజీ హాస్పిటల్స్‌లో పనిచేసే ప్రతి ఒక్కరిది. దీన్ని ఏఐజీకి అంకితమిస్తున్నా. నా వైద్య ప్రయాణంలో నిరంతరం సహకరించిన డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు" అని డాక్టర్ జీవీ రావు పేర్కొన్నారు.

'ఆకాశ్'మంత విజయం.. అవిశ్రాంత కృషికి గౌరవం



డీఆర్‌డీవో-డీఆర్‌డీఎల్ విశ్రాంత శాస్త్రవేత్త జి.చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌తో జరిగిన పోరులో డ్రోన్లు, క్షిపణుల దాడులను నిలువరించి భారత్ పైచేయి సాధించడంలో ఆకాశ్ క్షిపణిది కీలక భూమిక. ఉపరితలం నుంచి గగనతలంలోని బహుళ లక్ష్యాలను ఛేదించే సూపర్‌సోనిక్ క్షిపణి ఇది. ఈ ప్రాజెక్టుపై తన సర్వీసు మొత్తం శ్రమించారు డీఆర్‌డీవో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ గడ్డమణుగు చంద్రమౌళి. ప్రాజెక్టు మొదలైన తొలి రోజు నుంచి డైరెక్టర్‌గా 2018లో పదవీ విరమణ చేసే వరకు 34 ఏళ్లపాటు ఒకే ప్రాజెక్టుపై పనిచేసిన వ్యక్తుల్లో ఆయన ఒకరు. ఆయనకు భారత ప్రభుత్వం సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

ప్రతి దశలోనూ కీలకపాత్ర

ఖమ్మం జిల్లా మధిరలో 1959లో జన్మించిన చంద్రమౌళి అక్కడే ఇంటర్ వరకు చదివి, ఎన్ఐటీ వరంగల్ నుంచి బీటెక్ పూర్తి చేశారు. ఐఐటీ దిల్లీలో ఎంటెక్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ చేశారు. 1983లో హైదరాబాద్ డీఆర్‌డీవో మిసైల్ కాంప్లెక్స్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్)లో శాస్త్రవేత్తగా చేరారు. డాక్టర్ అబ్దుల్ కలాం డీఆర్‌డీఎల్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో మనదేశం ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఐజీఎంటీపీ) ప్రారంభించింది. ఐదు క్షిపణుల అభివృద్ధి ఒకేసారి చేపట్టారు. ఇందులో భాగంగానే మధ్యశ్రేణి ఉపరితలం నుంచి గగనతల క్షిపణి(సామ్) ఆకాశ్ ప్రారంభించారు. డాక్టర్ ప్రహ్లాద మొదటి ప్రాజెక్టు డైరెక్టరు కాగా ముగ్గురి బృందంతో ఇది ప్రారంభమైంది. క్షిపణి రూపకల్పన, అభివృద్ధి, పరీక్షలు, ఉత్పత్తి, భారత సైన్యానికి చేర్చడం వరకు ప్రతి దశలోనూ ఆయన భాగస్వాములయ్యారు. 13 డీఆర్‌డీవో ప్రయోగశాలలు, 9 రక్షణ రంగ ఉత్పత్తి సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలను ఏకం చేసి సుమారు రూ.33వేల కోట్ల విలువైన ఉత్పత్తి ఆర్డర్లు వచ్చేలా చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. 2015లో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ ఈయన హయాంలోనే వైమానికదళంలో చేరాయి. '95 శాతం స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణి పరిశోధనలో నా సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది' అని చంద్రమౌళి 'ఈనాడు'కు తెలిపారు.

క్యాన్సర్ చికిత్సలో ఆధునికం... సేవలో మానవత్వం



ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విజయానంద్ పి.రెడ్డికి 'పద్మ' పురస్కారం

క్యాన్సర్ చికిత్స రంగంలో విశిష్ట కృషికి గుర్తింపుగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ డైరెక్టర్, ప్రఖ్యాత రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విజయానంద్ పి.రెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. దశాబ్దాల పాటు ఆంకాలజీ రంగంలో సేవలందించిన డాక్టర్ రెడ్డి.. ఆధునిక చికిత్సా విధానాలను ప్రవేశపెట్టడం, ప్రపంచస్థాయి క్యాన్సర్ చికిత్సలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. డాక్టర్ విజయానంద్‌రెడ్డి కేవలం వైద్యుడిగానే కాకుండా.. సామాజిక సేవకుడిగానూ గుర్తింపు పొందారు. 'క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా విశేష సేవలందించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, గ్రామీణులు, క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా. తక్కువ ఖర్చుతో చికిత్సలందించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు, పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, పాలియేటివ్ కేర్ సేవలు, చికిత్సకు ఆర్థికసాయం వంటి కార్యక్రమాలను ఫౌండేషన్ నిర్వహిస్తోంది. 'పెరి ఆపరేటివ్ బ్రెయిన్ ఇంటర్‌స్టీషియల్ ఇంప్లాంట్' విధానాన్ని తొలిసారిగా విజయవంతంగా నిర్వహించి... క్యాన్సర్ చికిత్సలో కొత్త అధ్యాయాన్ని ఆయన ప్రారంభించారు. స్పర్శ్ హాస్పిస్ బోర్డు డైరెక్టర్‌గా తుది దశ క్యాన్సర్ రోగులకు సేవలందించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. డాక్టర్ విజయానంద్ పి.రెడ్డి ఉస్మానియాలో ఎంబీబీఎస్, రేడియేషన్ ఆంకాలజీ, పీజీఐ చండీగఢ్‌లో, డీఎన్‌బీ, యూరోపియన్ సర్టిఫికేషన్ ఇన్ మెడికల్ ఆంకాలజీ చేశారు. ఐఎంఏ ఒరేషన్ అవార్డు(2024-25), అపోలో క్లినికల్ పయనీర్(2025), అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్మాలజీ నుంచి ఏఓఎస్ అచీవ్‌మెంట్, టైమ్స్ హెల్త్‌కేర్ అచీవర్స్.. లెజెండ్ ఇన్ ఆంకాలజీ అవార్డులు అందుకున్నారు. 'ఐయామ్ ఏ సర్వైవర్.. 108 స్టోరీస్ ఆఫ్ ట్రయంఫ్ ఓవర్ క్యాన్సర్' అనే పుస్తకాన్ని రచించారు. "ఈ గౌరవం నాకే కాదు.. మొత్తం అపోలో కుటుంబానికి, క్యూర్ ఫౌండేషన్ బృందానికి, నిరంతరం సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి దక్కుతుంది. నాలో నిత్యం ప్రేరణ కలిగించే క్యాన్సర్ రోగులు, వారి కుటుంబాలకు పురస్కారాన్ని అంకితం చేస్తున్నా' అని డాక్టర్ విజయానంద్ పి.రెడ్డి పేర్కొన్నారు.

విద్యారంగ సేవకు విశిష్ట పురస్కారం



యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్‌కు పద్మశ్రీ

జాతీయ విద్యావిధానం రూపకల్పనలో కీలకపాత్ర పోషించడంతో పాటు యూజీసీ ఛైర్మన్‌గా పనిచేసి విద్యారంగంలో చేసిన సేవలకు నల్గొండ జిల్లా మామిడాలకు చెందిన యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. తిప్పర్తి మండలం మామిడాలలో రంగారావు, జయప్రద దేవి దంపతులకు జన్మించిన ఆయన మద్రాస్ ఐఐటీలో ఎమ్మెస్, పీహెచ్‌డీలు పూర్తిచేశారు. కెనడాలోని అంటారియోలోని వాటర్‌లూ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ చేశారు. దిల్లీలో ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2001-2006 వరకు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎలక్ట్రానిక్స్ గ్రూప్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2009-2011 వరకు వీఎల్ఎస్ఐ డిజైన్, టూల్స్ అండ్ టెక్నాలజీ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా, తర్వాత ఐఐటీ దిల్లీలో చీఫ్ ఇన్వెస్టిగేటర్‌గా పనిచేశారు. దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 200కి పైగా వ్యాసాలు రాశారు. నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్‌గా, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ బోర్డు సభ్యునిగా, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ పాలక మండలి ఛైర్మన్‌గా పనిచేశారు. అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్. ఐఎస్ఏవీఎస్ఐ టెక్నో మెంటార్, ఐఈటీఈ రామ్‌లాల్ వాధ్వా, ఐబీఎం ఫ్యాకల్టీ పురస్కారాలు పొందారు.

ఉమ్మడి జాతీయ కృషికి గుర్తింపు : జగదీశ్‌కుమార్

నన్ను 'పద్మశ్రీ'కి ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఉన్నత విద్యను మరింత సమ్మిళితంగా, సరళంగా అభ్యసన ఫలితాలపై దృష్టి సారించేలా చేసేందుకు సాగుతున్న ఉమ్మడి జాతీయ కృషికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాను. రానున్నరోజుల్లో మనం విశ్వవిద్యాలయాలను, కళాశాలలను మరింత బలోపేతం చేయాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చే విద్యార్థులకు అవకాశాలను విస్తృతం చేయాలి.

ప్రజలకు చేరువగా పరిశోధనలు

ఎన్ఎఫ్‌టీడీసీ డైరెక్టర్ డా.కృష్ణమూర్తి బాలసుబ్రమణ్యన్‌కు 'పద్మశ్రీ'



హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ) డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కృష్ణమూర్తి బాలసుబ్రమణ్యన్ భారతీయ మెటీరియల్ సైన్స్ రంగంలో అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరు. పరిశోధనలను ప్రయోగశాలకే పరిమితం చేయకుండా వాటి ఫలాలను సామాన్యులకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చడంలో ఆయన చేసిన కృషికి గాను సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీని ప్రకటించింది. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో ల్యాబ్‌లలో ఒకటైన డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్)లో డాక్టర్ కె.బాలసుబ్రమణ్యన్ వృత్తిజీవితం ప్రారంభించారు. క్షిపణులు, విమానాలకు అవసరమైన మిశ్ర లోహాలపై పట్టు సాధించారు. విదేశాల్లోనూ హై టెంపరేచర్ మెటీరియల్స్, పౌడర్ మెటలర్జీలో అధునాతన పరిశోధన చేశారు. 1990లో ఎన్ఎఫ్‌టీడీసీలో చేరారు. ప్రపంచస్థాయి పరిశోధన కేంద్రంగా మార్చడంలో కీలకపాత్ర పోషించారు. విదేశాలపై ఆధారపడకుండా దేశానికి అవసరమైన వ్యూహాత్మక ఖనిజాల వెలికితీత, ప్రాసెసింగ్‌లో డాక్టర్ కె.బాలసుబ్రమణ్యన్ కీలకపాత్ర వహించారు. ఇస్రో ప్రయోగించే రాకెట్లలోని క్రయోజెనిక్ ఇంజిన్లకు అవసరమైన ప్రత్యేక లోహ మిశ్రమాలను అభివృద్ధి చేశారు. తక్కువ ఖర్చుతో కూడిన, శరీరానికి అనుకూలమైన కృత్రిమ అవయవాలు, టైటానియం ఆధారిత ఎముక శస్త్రచికిత్స పరికరాలను రూపొందించారు. గుండె శస్త్రచికిత్సలకు అవసరమైన స్టెంట్లు, ఇతర పరికరాల తయారీలో మెటలర్జిని ఎలా ఉపయోగించవచ్చో నిరూపించారు.

ఈవీ(విద్యుత్ వాహనాల) కోసం అవసరమైన బ్యాటరీ మెటీరియల్స్, ఎలక్ట్రిక్ మోటార్ల సామర్థ్యాన్ని పెంచే అధునాతన అయస్కాంతాల అభివృద్ధిపైనా పనిచేశారు. అల్యూమినియం, మెగ్నీషియం, టైటానియం వంటి లోహాలను తేలికగా, బలంగా మార్చే సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఇది విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. రక్షణ, అంతరిక్ష రంగాల్లో క్లిష్టమైన విడి భాగాల దిగుమతులను తగ్గించి, దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. అందుకే ఆయన్ను మెటీరియల్స్ ఇంజినీర్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు.



సంస్కృతానికి పట్టం.. కుటుంబశాస్త్రికి పురస్కారం



సంస్కృత భాషా పరిరక్షణలో నిరుపమాన కృషి

సంస్కృతం అంటే భాషే కాదు.. భారతీయ సంస్కృతికి వెన్నెముక. ఆ వెన్నెముకను సుదృఢం చేస్తూ అక్షరమే ఊపిరిగా, బోధనే ప్రాణంగా సాగుతున్నారు ఆచార్య వెంపటి కుటుంబశాస్త్రి. కృష్ణా జిల్లాలో మొదలైన ఆయన అక్షర ప్రయాణం ప్రపంచ సంస్కృత మహాసభలకు అధ్యక్షత వహించే స్థాయికి చేరింది. ఆయన 'పద్మశ్రీ'కి ఎంపికయ్యారు. గుడ్లవల్లేరులో 1950 ఆగస్టు 12న వెంపటి జగన్నాథం, రాజ్యలక్ష్మి దంపతులకు ఆయన జన్మించారు. సమీపంలోని చిట్టిగూడురు సంస్కృత కళాశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించే విద్యాప్రవీణ కోర్సు పూర్తిచేశారు. అనంతరం తిరుపతిలోని ఎస్వీ వేద పాఠశాలలో రుగ్వేద అధ్యయనం చేశారు. రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ ద్వారా 'విద్యావారధి' (పీహెచ్‌డీ) పూర్తిచేసి, అద్వైత వేదాంతం, అలంకార శాస్త్రాల్లో అసమాన పాండిత్యాన్ని సంపాదించారు. తన వృత్తి జీవితాన్ని లెక్చరర్‌గా ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. దిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్‌కు తొలి వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు. వారణాసి, సోమ్‌నాథ్‌లలోనూ సంస్కృత విశ్వవిద్యాలయాలకు వీసీగా వ్యవహరించారు. ప్రస్తుతం కంచిలోని శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఉన్నారు. గుర్రం జాషువా ఫిరదౌసి, జంధ్యాల పాపయ్యశాస్త్రి పుష్పవిలాపం సహా అనేక రచనలను సంస్కృతంలోకి కుటుంబశాస్త్రి అనువదించారు. కొత్తగా సంస్కృత భాషను నేర్చుకునే వారికోసం ఐదు స్థాయిల్లో సంస్కృత స్వాధ్యాయ పేరుతో పుస్తకాలు రాశారు. వాటిని కేంద్ర ప్రభుత్వం ప్రచురించింది. అంతర్జాతీయంగా సంస్కృత భాషకు కుటుంబశాస్త్రి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. ప్యారిస్ కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్'కు వరుసగా రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. క్యోటో (జపాన్), దిల్లీ, బ్యాంకాక్, వాంకూవర్ (కెనడా) నగరాల్లో జరిగిన ప్రపంచ సంస్కృత మహాసభలకు ఆయన అధ్యక్షత వహించారు.

కుటుంబశాస్త్రి ప్రసంగాలకే పరిమితం కాకుండా 15కు పైగా గ్రంథాలు రచించారు. దాదాపు 50కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన పాండిత్యానికి గుర్తింపుగా 2014లో రాష్ట్రపతి నుంచి 'సర్టిఫికెట్ ఆఫ్ ఆనర్' అందుకున్నారు. శృంగేరి, కంచి పీఠాధిపతుల నుంచి 'శాస్త్రనిధి', 'వేదాంత విశారద' వంటి అనేక బిరుదులను, పురస్కారాలను స్వీకరించారు.

వలసలపై పరిశోధన.. జన్యు చరిత్ర విశ్లేషణ



సీసీఎంబీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కుమారసామి తంగరాజ్‌ను వరించిన 'పద్మశ్రీ'

సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) ప్రధాన శాస్త్రవేత్త, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్(సీడీఎఫ్‌డీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ కుమారసామి తంగరాజ్ భారతీయ జన్యుశాస్త్ర రంగంలో అత్యున్నత పరిశోధకులు. ఆయనకు భారత ప్రభుత్వం శాస్త్ర, సాంకేతికత విభాగంలో 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించింది. గత ఏడాది చివరలో ఆయన సైన్స్‌లో అత్యున్నత పురస్కారం 'విజ్ఞాన్ శ్రీ'ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లా చెయ్యూరులో 1963 జూన్‌లో జన్మించిన తంగరాజ్.. మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని సీసీఎంబీలో 1993లో శాస్త్రవేత్తగా చేరి వివిధ హోదాల్లో పరిశోధనలు చేశారు. 2020 నుంచి 2023 వరకు సీడీఎఫ్‌డీ డైరెక్టర్‌గా చేశారు. ప్రస్తుతం సీసీఎంబీలో ప్రధాన శాస్త్రవేత్తగా ఉన్నారు. తంగరాజ్ మూడు దశాబ్దాలుగా మానవ జన్యుశాస్త్రం, జనాభా శాస్త్రం, పరిణామ క్రమంపై విశేష పరిశోధనలు చేశారు. మన జన్యు చరిత్రను విశ్లేషించి పూర్వీకులు ఆఫ్రికా నుంచి సుమారు 65వేల ఏళ్ల క్రితం వలస వచ్చిన తీరు మొదలు... అండమాన్ నికోబార్ దీవుల్లోని విభిన్న తెగల ప్రజల వలసల గురించి వెలుగులోకి తెచ్చారు. దక్షిణాసియా జనాభాలో గుండె జబ్బుల సమస్యలకు కారణమయ్యే ప్రత్యేక జన్యు వైవిధ్య గుర్తింపు, ఒకే సామాజికవర్గంలోని అంతర్వివాహాలతో జన్యు వ్యాధుల ముప్పు వరకు పరిశోధనల ద్వారా వెల్లడించారు. భారతీయ జనాభా ప్రధానంగా రెండు భిన్న సమూహాల నుంచి ఉద్భవించిందని నిరూపించారు. తన పరిశోధనల ఆధారంగా జనాభాలో అరుదైన జన్యు వ్యాధుల భారాన్ని తగ్గించే లక్ష్యంతో పీడియాట్రిక్ రేర్ జెనెటిక్ డిసీజెస్ అనే మిషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు.

కేంద్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సైన్స్ ద్వారా పరిష్కరించాలన్న ఉత్సాహాన్ని ఈ అవార్డు మరింత పెంచుతుంది.

\- డా.తంగరాజ్

గరిమెళ్ల గళానికి 'పద్మ' పరిమళం



బాలకృష్ణప్రసాద్‌కు మరణానంతరం పద్మశ్రీ

ఆ గొంతు విప్పితే అన్నమయ్య పద కవిత పరవశిస్తుంది. ఆ స్వరం సాగితే ఏడుకొండలవాడు సైతం మైమరిచిపోతాడు. ఆయన వదిలివెళ్లిన గాన పరిమళం నేడు 'పద్మశ్రీ' పురస్కారమై వికసించింది. అన్నమాచార్యుల కీర్తనలకు ప్రాణం పోసి, ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిచేసిన ప్రముఖ సంగీత కళాకారుడు, తితిదే ఆస్థాన పూర్వ విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌ను మరణానంతరం పద్మశ్రీ వరించింది. బాలకృష్ణప్రసాద్ 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలోని సంగీత కుటుంబంలో జన్మించారు. తల్లి కృష్ణవేణి వయొలిన్ విద్వాంసురాలు కాగా, తండ్రి నరసింహారావు గాయకులు. సంగీత వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న బాలకృష్ణప్రసాద్, చిన్ననాటి నుంచే నాదోపాసనలో మునిగిపోయారు. 1978లో తితిదే అన్నమాచార్య ప్రాజెక్టులో గ్రేడ్-1 కళాకారుడిగా చేరారు. 2006లో తితిదే ఆయనను ఆస్థాన విద్వాంసునిగా నియమించుకుంది. తిరుమల క్షేత్రంలో ఆయన నిర్వహించిన సంగీత కచేరీలు అసంఖ్యాకం. 2025 మార్చి 11న ఆయన పరమపదించారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక, భార్య రాధ సైతం గతేడాది జూన్ 8న తనువు చాలించారు. ప్రస్తుతం ఆయన కుమారులు పవన్‌కుమార్, అనిల్‌కుమార్ తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారు. అనిల్‌కుమార్ అన్నమయ్య కీర్తనల ప్రచారంలో నిమగ్నమయ్యారు. మూడు దశాబ్దాలకు పైగా సంగీతయజ్ఞం చేసిన గరిమెళ్లకు గతంలో ఎన్నో రాష్ట్ర, కేంద్ర పురస్కారాలు లభించాయి. ఇప్పుడు 'పద్మశ్రీ' ఆయన కీర్తికిరీటంలో కలికితురాయిగా నిలిచింది.

అన్నమయ్య కీర్తనలను ఆలపించడమే కాదు, అద్భుత స్వరకల్పన చేసిన ఘనత బాలకృష్ణప్రసాద్‌ది. దాదాపు 5,000 పైచిలుకు కీర్తనలను స్వరపరిచి, కోట్లమంది భక్తులకు అన్నమయ్య సాహిత్యాన్ని చేరువ చేశారు. ఆయన గళం నుంచి జాలువారిన ప్రతి కీర్తనలో ఒక అలౌకిక భక్తి భావం ఉట్టిపడేది.

సహకార ఉద్యమనేత మామిడి రామారెడ్డి

మరణానంతరం పద్మశ్రీ పురస్కారం



రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన సహకార ఉద్యమనేత మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం లభించింది. గత అక్టోబరు 26న ఆయన తన 83వ ఏట హైదరాబాద్‌లో కన్నుమూశారు. శంషాబాద్‌లో 1943లో భోజిరెడ్డి, నీలమ్మ దంపతులకు జన్మించిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనమిక్స్ డిగ్రీ, అదే విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో, తర్వాత దిల్లీ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ చేశారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో స్థానిక ప్రభుత్వాలు, ఆర్థికాభివృద్ధి కోర్సు చేశారు. అక్కడి నుంచి స్వదేశానికి వచ్చి 1967-70లో రాజేంద్రనగర్ సర్పంచిగా, 1970-76లో సమితి అధ్యక్షునిగా పనిచేశారు. అనంతరం సహకార ఉద్యమాన్ని ప్రారంభించారు. సహకారచట్టంలో లోపాలపై, సహకార సంఘాలపై ప్రభుత్వ పెత్తనాన్ని ఆయన వ్యతిరేకిస్తూ విస్తృత స్థాయిలో సభలు, సమావేశాలు జరిపారు. ఇదే లక్ష్యంతో 1975లో సహకార అభివృద్ధి సంస్థ(సీడీఎఫ్)ను ఏర్పాటు చేశారు. 1990లో కంపెనీల చట్టం కింద సహకార సంఘాలను ఏర్పాటు చేయించారు. వాటికి ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో వాటి గుర్తింపునకు ఉద్యమించారు. రామారెడ్డి కృషి ఫలితంగా సహకార సంస్థలపై సభ్యుల నియంత్రణను కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం 1995లో పరస్పర సహాయ సహకార సంఘాల (మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్-మాక్స్) చట్టం తెచ్చింది. దీనికింద ఆయన సీడీఎఫ్ ద్వారా తెలంగాణలో 585 రైతు, మహిళాసంఘాలు, పురుషుల సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మాక్స్ చట్టం కింద తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో సంఘాలు ఏర్పాటయ్యాయి. 2002లో వేసిన రామ్‌నివాస్ మీర్ధా కమిటీతో పాటు 8 రాష్ట్రాల్లో మాక్స్ చట్ట రూపకల్పన కమిటీల్లో సభ్యునిగా చేర్పగా. ఆయా ప్రభుత్వాలకు సూచనలందించారు. తెలంగాణలో ఆయన ఏర్పాటు చేయించిన సంఘాల్లో 2.69 లక్షల మంది సభ్యులుండగా, రూ.570 కోట్ల వాటాధనంతో అవి నడుస్తున్నాయి.

- రామారెడ్డికి భార్య శ్యామల హైదరాబాద్‌లో ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు.. అమెరికాలో స్థిరపడ్డారు. పద్మశ్రీ పురస్కారం పట్ల శ్యామల హర్షం వ్యక్తం చేశారు. అనునిత్యం సహకారమే ఊపిరిగా, ఆ వ్యవస్థ బలోపేతమే ధ్యేయంగా జీవించారన్నారు. రైతులు, మహిళలు, ఇతరవర్గాల వారి అభ్యున్నతికి కోసం కృషి చేశారని తెలిపారు.

\- ఈనాడు, హైదరాబాద్, అమరావతి; ఈనాడు డిజిటల్-అమరావతి, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (తితిదే), మధిర పట్టణం


అమరావతిలో సిద్ధమైన గ్యాలరీలు

తొలి వేడుక.. త్రివర్ణ దీపిక..

గణతంత్ర దినోత్సవానికి ప్రజా రాజధాని సిద్ధం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉన్నతాధికారులు ఆయా ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం జరిగే వేడుకలో జంగారెడ్డిగూడెం ఏఎస్పీ, ఐపీఎస్ అధికారి ఆర్. సుస్మిత పరేడ్ కమాండర్‌గా వ్యవహరించనున్నారు. ఆర్మీ, 2వ, 16వ బెటాలియన్, సీఆర్పీఎఫ్, పోలీస్ సాయుధ దళాలు, ఎన్‌సీసీ బృందాలు ఇందులో పాల్గొననున్నాయి.


విద్యుత్తు కాంతుల్లో ఎన్టీఆర్ కలెక్టరేట్

విమానాశ్రయానికి వెలుగులు



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మువ్వన్నెల విద్యుత్తు కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేషంగా ఆకట్టుకున్న త్రివర్ణ రంగులతో దగదగలాడుతున్న విమానాశ్రయం ఆవరణలో ఫొటోలు దిగేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబర్చారు. పలు కేంద్ర ప్రభుత్వ భవనాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. జాతీయ జెండా రంగుల్లో దీపాలు అమర్చడంతో అమితంగా ఆకట్టుకుంటున్నాయి. -న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

కృష్ణా తీరం.. విరిసిన పద్మం

వెంపటి కుటుంబశాస్త్రి.. నటుడు రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ
డాక్టర్ నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్

ఈనాడు, అమరావతి - పామర్రు గ్రామీణం, మంటాడ, పమిడిముక్కల, న్యూస్‌టుడే



పశువుల చావిడిలో పుట్టి..
నట కిరీటిగా ఎదిగి..

నటకిరీటి.. వైవిధ్య భరిత పాత్రలకు చిరునామా.. ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను పద్మశ్రీ అవార్డు వరించింది. దీంతో ఆయన జన్మస్థలం పామర్రు మండలం నిమ్మకూరులో గ్రామస్థులు ఆదివారం హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి ఎన్టీఆర్, బాలకృష్ణ పద్మ అవార్డులు అందుకోగా తాజాగా రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. ఎన్టీఆర్ లాంటి మహానటుడి అడుగు జాడల్లో ప్రయాణం మొదలుపెట్టి ఒడుదొడుకులను తట్టుకుని ఇంతింతై చిత్ర సీమలో నట కిరీటిగా ఎదిగి పద్మశ్రీ అవార్డు రావడం గర్వకారణంగా గ్రామస్థులు భావిస్తున్నారు.

నిమ్మకూరు నుంచి కళారంగానికి...

రాజేంద్రప్రసాద్ తండ్రి నారాయణరావు కృష్ణా జిల్లా నిమ్మకూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. ఆ సమయంలో ఎన్టీఆర్ ఇంట్లో అద్దెకు ఉండేవారు. వారి పశువుల చావిడిలోనే రాజేంద్రప్రసాద్ జన్మించారు. ఆయనకు ఆరేడేళ్లు వచ్చే వరకు ఆ ఇంట్లోనే ఉన్నారు. ఆ సమయంలో సమవయస్కుడైన ఎన్టీఆర్ తనయుడు హరికృష్ణతో కలిసి ఆడుకున్నారు. తర్వాత తండ్రికి బదిలీ కావడంతో మరో ఊరికి వెళ్లిపోయారు. చిన్నతనంలోనే ఆయన తల్లి మాణిక్యాంబ చనిపోవడంతో తండ్రి సంరక్షణలోనే సిరామిక్ ఇంజినీరింగ్ చదువుకున్నారు. మందుల దుకాణం నిర్వహించే తన బావకు సహకరిస్తూ చాలా కాలం విజయవాడలోనే ఉన్నారు. ఎన్టీఆర్‌తో అనుబంధం.. కళలపై అనురక్తితో సినిమా రంగం వైపు నడిచారు. ఎన్టీఆర్ తమ్ముడు త్రివిక్రమరావు సలహాతో ఎన్టీఆర్ సిఫార్సుతో మద్రాస్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందారు. మైమ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు.

పాత జ్ఞాపకాలు నెమరేసుకుని:
కొన్నేళ్ల కిందట నిమ్మకూరు వచ్చిన ఆయన గ్రామంలో చాలా సమయం గడిపారు. చిన్నతనంలో ఎన్టీఆర్ తల్లి, ఎన్టీఆర్, హరికృష్ణతో ఉన్న అనుబంధాన్ని గ్రామస్థులతో ఆనందంగా పంచుకున్నారు.

కృష్ణా తీరం.. పద్మ పురస్కారాలతో మెరిసింది. 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో మనవాళ్లు ముగ్గురున్నారు. క్యాన్సర్ వైద్య చికిత్సలో ప్రపంచ స్థాయి ఖ్యాతిని ఆర్జించిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్ పురస్కారం వరించింది. ఈయన పమిడిముక్కల మండలం మంటాడలో పుట్టి.. గొప్ప వైద్యుడిగా ఎదిగారు. పామర్రు మండలం నిమ్మకూరు గ్రామంలో పుట్టి. తెలుగు చలనచిత్ర రంగంలో నటకిరీటిగా గుర్తింపు తెచ్చుకున్న గద్దె రాజేంద్రప్రసాద్‌కు.. పద్మశ్రీ పురస్కారం వరించింది. సంస్కృత సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన.. ప్రముఖ పండితులు వెంపటి కుటుంబ శాస్త్రికి పద్మశ్రీ పురస్కారం వచ్చింది. ఈయన కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరులో జన్మించారు. ఈ ఏడాది ముచ్చటగా మూడు పద్మాలతో.. కృష్ణా తీరం పులకించింది.


వెంపటి కుటుంబశాస్త్రి



మరపురాని జ్ఞాపకాలు

డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్ పురస్కారం వరించిన వేళ.. ఆయన జన్మస్థలమైన మంటాడ, పక్కనే ఉన్న తాడంకిలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆయనతో తమకున్న జ్ఞాపకాలను గ్రామస్థులు పంచుకున్నారు. 2025 మార్చిలో నోరి మంటాడ వచ్చారు. ఆ సమయంలో తాను పుట్టిన గ్రామంలో స్థానికులతో కలిసి సరదాగా గడిపారు. మంటాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తాను రాసిన మంటాడ టు మ్యాన్‌హ్యాటన్ పుస్తకాన్ని స్థానికుల చేతులమీదుగా ఆవిష్కరించారు.


తన పుస్తకం ప్రతిని అమ్మవారికి సమర్పించిన నోరి దత్తాత్రేయుడు

పిచ్చమ్మతల్లి అంటే ఎనలేని భక్తి..

దత్తాత్రేయుడికి పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో ఉన్న శ్రీరామఅవధూత పిచ్చమ్మతల్లి అంటే ఎనలేని భక్తి. నోరి కుటుంబం అమ్మవారికి భక్తులు. ఆశ్రమ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవారు. 50 ఏళ్ల కిందట నోరి కుటుంబానికి ఉన్న సాగుభూమిని అమ్మగా వచ్చిన డబ్బులను ఆశ్రమానికి సమర్పించారు. సొంతూరికి వచ్చిన ప్రతిసారీ కచ్చితంగా పిచ్చమ్మతల్లి ఆశ్రమాన్ని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సందర్శించేవారు. ఇటీవల ఆయన రాసిన.. 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్' పుస్తకం ప్రతిని అమ్మవారి విగ్రహానికి సమర్పించారు.

తాడంకి, మంటాడకు దక్కిన గౌరవమే ఇది..

–జక్కా శ్రీనివాసరావు, మాజీసర్పంచి, తాడంకి



ప్రముఖ క్యాన్సర్ వైద్యుడిగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మా తాడంకి, మంటాడ గ్రామాలకు చెందిన వారు కావటం గర్వకారణం. ఆయనకు పద్మభూషణ్ అవార్డు రావడంతో మా గ్రామాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

మా ఇంట్లోనే నోరి జన్మించారు..

– ఆనంద కాకుళస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు, తాడంకి



నోరి దత్తాత్రేయుడు తల్లిదండ్రులు తాడంకిలోని మా ఇంట్లో ఉండేవారు. ఆయన ఇక్కడే జన్మించారు. ఇటీవల ఆయన మంటాడ వచ్చినప్పుడు ఈ విషయం తెలిసి మా ఇంటికి వచ్చారు. ఇంటి పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వైద్యుడిగా ఎదిగిన నోరికి పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.


తాడంకిలో స్థానికులతో సరదాగా ముచ్చటిస్తూ..

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి..



నోరి ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మించిన మంటాడ వచ్చినప్పుడు అందరితో కలివిడిగా సౌమ్యంగా ఉండడం చూసి చాలా ఆశ్చర్యం వేసింది. ఆయన రాసిన మంటాడ టు మ్యాన్‌హ్యాటన్ పుస్తకంలో మా ఊరి విశేషాలు చూసి చాలా ఆనందం వేసింది.
- పులి శ్రీనివాసరావు, రోటరీ మాజీ అధ్యక్షుడు, మంటాడ

నోరి రచనను ఆవిష్కరించడం మా అదృష్టం..



నోరికి పద్మభూషణ్ రావడం ఆనందం కలిగిస్తోంది. ఆయన రాసిన 'మంటాడ టు మ్యాన్‌హ్యాటన్' పుస్తకం మా ఊరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మేము ఆవిష్కరించగలగటం మా అదృష్టంగా భావిస్తున్నాం. - నందమూడి బ్రహ్మేశ్వరరావు, మంటాడ

కృషికి తగ్గ గౌరవం దక్కింది..

-ప్రసాద్, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నప్రసాద సేవా ట్రస్టు కోశాధికారి, నిమ్మకూరు



రాజేంద్రప్రసాద్‌కి పద్మశ్రీ రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన సినీరంగంలో ఎంతో సేవ చేశారు. దశాబ్దాలుగా వివిధ పాత్రల్లో ఇమిడిపోయి నటించారు. కళారంగంలో ఆయన చేసిన విశేష కృషి ఈ గౌరవం. చిన్నతనంలో గ్రామంతో ఉన్న అనుబంధం గురించి ఆయన పలు ఇంటర్వ్యూల్లో చెప్పడం చూసి చాలా ఆనందించాం. ఆయన నిమ్మకూరులో జన్మించడం గర్వకారణం.

నాన్న గురువు..తనయుడు నటుడిగా..

- సూరపనేని చంద్రశేఖర్, గ్రామస్థుడు



రాజేంద్రప్రసాద్ తండ్రి వెంకటనారాయణ నిమ్మకూరులో ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు. వారి ఉన్నతికి కృషి చేశారు. రాజేంద్రప్రసాద్ సినీ రంగంలో ప్రతిభ చూపి ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రజా మన్ననలు పొంది గ్రామం పేరు నిలబెట్టారు. ఇద్దరూ వారి ప్రతిభతో గ్రామానికి మంచి పేరు తెచ్చారు. పద్మశ్రీ దక్కడం ఆనందంగా ఉంది.

ఎన్టీఆర్ అంటే ఎనలేని ఇష్టం

- నందమూరి శివరామకృష్ణ, గ్రామస్థుడు



రాజేంద్రప్రసాద్‌కి దివంగత ఎన్టీఆర్ అంటే ఎనలేని ఇష్టం. ఆయన బాల్యంలో కొంత కాలం ఎన్టీఆర్‌గారి ఇంట్లోనే పెరిగారు. ఆయన్ని చూస్తూ పెరిగిన ఆయన తర్వాత సినిమాల్లోకి వచ్చారు. తనదైన శైలిలో నటించారు. కష్టానికి మంచి గౌరవం దక్కింది. ఆయన ఏ స్థాయిలో ఉన్నా జన్మించిన గడ్డను మాత్రం మరువలేదు. ఇప్పటికీ నిమ్మకూరు వస్తుంటారు. తాను బాల్యంలో గడిపిన ప్రదేశాలను సందర్శిస్తుంటారు.

స్వామి చెప్పారు.. పూజ చేయాల్సిందే!

- సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం
- దుర్గగుడికి వచ్చి గొడవ పడుతున్న భక్తులు

✦ 'హైదరాబాద్ నుంచి వెయ్యి మంది వచ్చాం. విజయవాడ దుర్గమ్మ గుడిలో వెయ్యి మంది పారాయణం చేస్తే.. మంచి జరుగుతుందంటూ ఓ స్వామి సామాజిక మాధ్యమాల్లో చెప్పారు. మేం ఎక్కడ పారాయణం చేయాలో చెప్పండి. ఐయామైకులు, మైక్, దర్బారం, భోజన వసతి ఏర్పాటు చేయండి' అంటూ హడావుడి చేశారు.

✦ రాహు కాలంలో గుడిలో పారాయణం చేస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయంటూ మరొకరు ప్రచారం చేస్తే 500 మంది వచ్చి సిబ్బందితో గొడవపడ్డారు.

✦ విజయవాడ దుర్గగుడిలో నిత్యం జరిగే పూజలు, ఆర్జిత సేవల నిర్వహణలోనే అర్చకులు, ఆలయ సిబ్బంది తలమునకలై ఉంటారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో కొందరు చేస్తున్న ప్రచారం ఆలయంపై ఒత్తిడిని పెంచుతోంది. దుర్గగుడిలో పలానా పూజలు చేయించుకోండి, ప్రసాదాలు పంచండి, పారాయణం పెట్టండి.. అంటూ ఎవరికి తోచింది వాళ్లు చెబుతూ.. భక్తులను తండోపతండాలుగా ఆలయంపైకి పంపిస్తున్నారు. వీటిని నమ్మిన భక్తులు కొండపైకి చేరుకుని.. తమకు పలానా పూజలు చేయమంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అలాంటి పూజలేవీ ఇక్కడ చేయడం లేదంటే భక్తులు గొడవకు దిగుతున్నారు. చివరికి అధికారులు, అర్చకులు ఆపసోపాలు పడుతూ వారికి వాస్తవాలను వివరించి అమ్మవారి దర్శనం చేయించి పంపిస్తున్నారు. – ఈనాడు, అమరావతి

బయట నుంచి ప్రసాదం తెచ్చి..

ఎక్కడో బయట తయారు చేసిన ప్రసాదం తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో పంచుతామంటూ వస్తున్న వాళ్లు పెరిగిపోయారు. వారిని భద్రతా సిబ్బంది ఆపితే గొడవకు దిగుతున్నారు. తాజాగా దుర్గమ్మ ఆలయంలో ఐదు రకాల ప్రసాదాలను భక్తులకు పంచి, స్త్రీలకు రవికెలు, గాజులు ఇస్తే సంపద వృద్ధి చెందుతుందంటూ ఎవరో స్వామి చెప్పారంటూ.. కృష్ణా జిల్లాలోని ఒక గ్రామం నుంచి పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చారు. వారు తీసుకొచ్చిన ప్రసాదం.. ఆలయ ప్రాంగణంలో పంచేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది ఆపారు. ఇలా ఎక్కడెక్కడి నుంచో.. ఎవరెవరో ప్రసాదాలు తెచ్చి ఆలయంలో పంచితే.. ఏదైనా జరగరానిది జరిగితే.. పరిస్థితి ఏంటని.. సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో దుర్గమ్మ పేరుతో ప్రచారం చేస్తూ భక్తులను తప్పుదోవ పట్టిస్తున్న వారిని కట్టడి చేసేందుకు.. ఎలాంటి చర్యలు చేపట్టాలనే దిశగా అధికారులు ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌పై దండయాత్ర

మహిళా పోలీసుల వినూత్న ప్రచారం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

'డ్రగ్స్ బారినపడి సమాజం ముందు దోషిగా నిలబడిన ఒక యువకుడి తల్లి కన్నీళ్లు తెచ్చే వేదన... నన్ను కలిచి వేసింది. డ్రగ్స్‌పై దండయాత్రకు పూనుకున్నా.' - కవిరి రేవతి, ఎస్సై

'దొంగతనాలు, రౌడీయిజం, గూండాయిజం ఇవన్నీ డ్రగ్స్ పర్యవసానాలే. యువతలో చైతన్యం వస్తే తప్ప ఇవి ఆగవు.' - గుమ్మడి రేవతి, హెడ్ కానిస్టేబుల్

రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాలు, వాటి వల్ల దుష్పరిణామాలపై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఒక పక్క అవగాహన కలిగిస్తూనే.. మరో వైపు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు అవగాహన కలిగించేందుకు 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో మహిళా పోలీస్ సిబ్బంది సైకిల్ యాత్ర చేపట్టనున్నారు.


సైకిల్ యాత్ర చేస్తూ..

34 రోజుల్లో.. 510 కిలోమీటర్లు

మహిళా పోలీసుల సైకిల్ యాత్ర ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు బందరురోడ్డులోని మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభమవుతుంది. మహిళా ఎస్సై కవిరి రేవతి, హెడ్ కానిస్టేబుల్ గుమ్మడి హైమావతి, కానిస్టేబుళ్లు షేక్ బీబీ జైబా, రేపు ప్రవీణ్, వాయిలేటియన ఫపారాణి సైకిల్‌పై బయలుదేరుతారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా పర్యటించి.. మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రచారం చేస్తారు. ప్రారంభ కార్యక్రమంలో హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, ఇతర పోలీసు అధికారులు హాజరవుతారు. మార్చి 1న ముగింపు సమావేశం ఉంటుంది. మాదకద్రవ్యాలపై జరిగే దండయాత్రలో ప్రజలు భాగస్వాములు కావాలని.. అప్పుడే దీన్ని కూకటివేళ్లతో సహా పెకలించగలమంటున్నారు. నేటి యువత బంగారు భవిష్యత్తుకు చేయి చేయి కలుపుదాం... మాదకద్రవ్యాలను తుదముట్టిద్దామంటున్నారు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు.

దివ్య తేజాయ.. భవ్య రూపాయ



రథ సప్తమి సందర్భంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనారసింహస్వామి ఆదివారం ఏడు వాహనాలపై విహరించారు. సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, రాజాధిరాజ, చంద్రప్రభ వాహనాలపై స్వామి దర్శనమిచ్చారు.
- మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే

కలెక్టర్‌కు అవార్డు



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఉత్తమ ఎన్నికల విధానాలు (ప్రాక్టీసెస్) అవార్డు అందుకున్నారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నుంచి అవార్డు స్వీకరించారు. చిత్రంలో రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్, మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్
- న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

పీజీఆర్ఎస్ రద్దు

ఎన్టీఆర్ కలెక్టరేట్: సోమవారం గణతంత్ర దినోత్సవం కారణంగా కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సీపీ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. ప్రజలు, గమనించాలని ఆయన కోరారు.

చెబుతున్నా.. తలకెక్కదే..!



ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, నిబంధనల మేరకే ఒకరు లేదా ఇద్దరు ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా చెవికెక్కడం లేదు. ఇతరులు ప్రమాదం బారినపడేలా వాహనం నడిపిస్తున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కనిపించిన దృశ్యాలివి. -ఈనాడు, అమరావతి





పాల్ విధానం.. పిల్లల వికాసం

21 పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల విద్యా సామర్థ్యం తగ్గుతోంది. తరచూ తరగతులకు గైర్హాజరు అవుతున్నారు. చదువు మధ్యలో ఆపేస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ★ జిల్లాలో మొదటి విడత 8 రెసిడెన్షియల్ పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో 3 కేజీబీవీ, 2 ఏపీ మోడల్, ఒక గిరిజన, ఒక బీసీ సంక్షేమ, ఒక మైనారిటీ పాఠశాల ఉంది. ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, తెలుగు, ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. 6 నుంచి 9 తరగతి విద్యార్థుల ఐడీ, డేటాలను ట్యాబ్లో అనుసంధానించారు. ఓ గదిని ల్యాబ్‌గా తీర్చిదిద్ది వసతుల ఏర్పాటుకు ఒక్కో పాఠశాలకు రూ.22,500 చొప్పున మంజూరు చేశారు. వాటికి పాల్ కంటెంట్ లోడ్ చేసిన 30 ట్యాబ్‌లు, 30 అడాప్టర్లు, 30 ఇయర్ ఫోన్లు ఇచ్చారు. రెండో విడతలో 13 పీఎంశ్రీ పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలకు 30 చొప్పున 390 ట్యాబ్‌లు ఇచ్చారు. జిల్లాలోని 21 ల్యాబ్‌ల్లో 4954 మంది విద్యార్థులు ట్యాబ్‌లు వినియోగిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనికుమారి తెలిపారు.


ట్యాబుల్లో పాఠాలు నేర్చుకుంటూ..

అవగాహన కలిగించి...

విద్యార్థి ట్యాబ్‌లో ఒక సామర్థ్యాన్ని మొదలు పెట్టినప్పుడు అతనికి ఆ స్థాయి లేకపోతే వెనుక తరగతికి, మరీ అర్థం కాకపోతే ఇంకా వెనుక తరగతికి ట్యాబ్ తీసుకెళ్తుంది. అతనికి ఆ సామర్థ్యం వచ్చేలా ఆటలు, ప్రశ్నల ద్వారా విషయంపై అవగాహన కలిగిస్తుంది. ఫలితంగా విద్యార్థి ఆ పాఠం నేర్చుకుంటాడు. వెనకబడిన విద్యార్థులు ఆ తరగతి సామర్థ్యాలు పెంచుకోవడానికి, ప్రతిభావంతులు ఇంకా బాగా నేర్చుకోవడానికి పాల్ ఉపయోగపడుతుంది.

నైపుణ్యాల మెరుగుకు దోహదం

జిల్లాలోని 21 పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. చదువులో వెనుకబడిన పిల్లల విద్యా సామర్థ్యాల మెరుగుకు ఉపయోగపడుతుంది. ఫలితంగా పాఠశాల స్థాయిలోనే సాంకేతిక పరిజ్ఞానం అలవడుతుంది. సృజన, నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- ఎస్.అశోక్‌బాబు, సమగ్ర శిక్ష ఏఎంవో

గణతంత్ర వేడుకలకు ట్రాఫిక్ మార్గదర్శకాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవానికి వీవీఐపీ, వీఐపీ, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పలు ప్రాంతాల నుంచి భారీగా జనం రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా సులువుగా ప్రాంగణానికి చేరుకునేలా తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

రూట్-1: వీవీఐపీలు, ఏఏ, ఏ1, ఏ2 పాస్‌లు కలిగిన వారు, రైతులు విజయవాడ వైపు నుంచి లోటస్, కృష్ణానది కరకట్ట మీదుగా మంతెన సత్యనారాయణ ఆశ్రమం, సీడ్ యాక్సెస్ రోడ్డు ఎడమ వైపు మలుపు నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదుగా ప్రాంగణానికి చేరుకోవాలి.

రూట్-2: బీ1, బీ2 పాస్‌లు కలిగిన వారు, రైతులు సీడ్ యాక్సెస్ రహదారి నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా వెళ్లి ఈ-8 రోడ్డు అండర్ పాస్, మందడం, వెలగపూడి, మోదుగలింగాయపాలెం మీదుగా ఈ-4 రోడ్డులోని పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.

☛ గుంటూరు వైపు నుంచి వచ్చే సాధారణ వాహనాలు మురుగన్ హోటల్ సెంటర్ నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా ఈ-8 రోడ్డు అండర్ పాస్, మందడం నుంచి వెలగపూడి, మోదుగలింగాయపాలెం మధ్య ఈ-4 రోడ్డు పార్కింగ్ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది.

☛ విజయవాడ నుంచి సాధారణ వాహనాలు ప్రకాశం బ్యారేజీ, ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, మందడం, వెలగపూడి, మోదుగలింగాయపాలెం మీదుగా ఈ-4 రోడ్డు పార్కింగ్‌కు చేరుకోవాలి. ☛ గొల్లపూడి వైపు నుంచి వచ్చే వారు విజయవాడ, వెంకటపాలెం, ఈ-8 అండర్‌పాస్, మందడం, వెలగపూడి మీదుగా, తుళ్లూరు గ్రామం వైపు నుంచి వచ్చే వారు తుళ్లూరు, ఈ-6 రోడ్డు మీదుగా వెస్ట్ పార్క్ రోడ్డు- హైకోర్టు మీదుగా, హైకోర్టు న్యాయవాదులు, ప్రజలు ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, మందడం, వెలగపూడి మీదుగా ఈ-4 రోడ్డు పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చు.

ఇందిరాగాంధీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు

సందడి చేయనున్న ప్రగతి శకటాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ (ఐజీఎం) స్టేడియంలో ఈ నెల 26వ తేదీన సోమవారం తొలి సారిగా జిల్లా స్థాయి గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలను ఇక్కడే నిర్వహిస్తున్నారు. జిల్లాల పునర్విభజన జరిగి, విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లా ఏర్పడినా.. పూర్తి స్థాయిలో జిల్లా స్థాయి వేడుకలను నిర్వహించలేని పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి వేడుకలను అమరావతిలో నిర్వహిస్తున్నారు. దీంతో నగరంలోని ఐజీఎం స్టేడియంలో జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయిలో గతంలోలేని విధంగా 18 ప్రగతి శకటాల ప్రదర్శన ఉంటుంది. విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన వేదిక..

నేటి కార్యక్రమ వివరాలు ఇలా.. ఉదయం 8.30 గంటలకు : స్టేడియంలో గణతంత్ర ఉత్సవాలు ప్రారంభం. పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు రాక **ఉదయం 9.00 గంటలకు :** ప్రాంగణానికి చేరుకోనున్న కలెక్టర్ లక్ష్మీశ.అనంతరం వివిధ కాంటింజెంట్‌ల నుంచి పోలీసు గౌరవ వందనం స్వీకరణ **ఉదయం : 10.00** గంటలకు కలెక్టర్ గణతంత్ర సందేశం, తర్వాత సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత.

వీరమ్మతల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధం

28వ తేదీ నుంచి 15 రోజుల పాటు నిర్వహణ

ఉయ్యూరు, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా మాఘశుద్ధ ఏకాదశి నుంచి 15 రోజులు వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఉమ్మడి కృష్ణా నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటారు. 28వ తేదీ రాత్రి అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరి 29వ తేదీ రాత్రికి ఉత్సవ ఆలయాన్ని చేరుకుంటుంది. పట్టణంలోనే కాకుండా పొరుగు గ్రామాల్లోని ఇళ్లు.. తిరునాళ్లకు వచ్చే బంధుమిత్రులు, స్నేహితులతో సందడిగా ఉంటాయి.



వీరమ్మతల్లి, చింతయ్యల విగ్రహాలు

పోలీసు శాఖ సంప్రదాయం : వేడుకల ప్రారంభం రోజు అమ్మవారికి పోలీసు శాఖ ప్రథమ పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించడం సంప్రదాయం. ఉయ్యూరు పట్టణ పోలీసు స్టేషన్ అధికారి దంపతులు వాటికి స్టేషన్‌లో పూజలు నిర్వహించి అనంతరం డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పిస్తారు. ఆతర్వాత అమ్మవారు మెట్టినింటి నుంచి ఉత్సవ ఆలయానికి చేరుతుంది. ఈ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తారు.

గండదీపాల మొక్కులు..: వీరమ్మతల్లి మెట్టినింటి నుంచి బయలుదేరే సమయం నుంచి ఉత్సవ ఆలయ ప్రవేశం వరకు వేలాది మంది భక్తులు గండదీపాల మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారు బయలుదేరిన సమయంలో ఎదురు గండ దీపాలు, రెండో రోజు వరకు అమ్మవారితో గ్రామోత్సవంలో పాల్గొనే వారు తిరుగుడు గండదీపాల మొక్కులు తీరుస్తారు. అమ్మవారు రెండో రోజు ఉత్సవ ఆలయ ప్రవేశానికి ముందు ఊయల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు. లక్ష మంది వరకు ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

ఫిబ్రవరి 7వ తేదీన సిడిబండి ఉత్సవం..: తిరునాళ్ల 11వ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 'సిడిబండి' ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. శివాలయం రోడ్డులోని పాత ట్యాంకు వద్ద సిడిబండి తయారు చేసి దానిని ఊరేగింపుగా ఉత్సవ ఆలయ ప్రాంగణానికి తీసుకొస్తారు. అక్కడ పట్టణంలోని ఎస్సీవాడకు చెందిన త్వరలో పెళ్లికాబోయే యువకుడిని సిడిబండి గంపలో కూర్చోపెట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఆ సమయంలో ఆ యువకుడిని అరటి కాయలతో కొట్టడం సంప్రదాయం. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్ష మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నారు.

పోర్టు వద్దని సంతకం చేసింది ఎవరు పేర్నీ..

మంత్రి రవీంద్ర ధ్వజం



మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: బందరుకు పోర్టు అక్కర్లేదని, ఎక్కడికి తరలించినా ఇబ్బంది లేదని సంతకం చేసింది ఎవరు పేర్నీ అంటూ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. సోమవారం ఆయన విజయవాడలోని తన కార్యాలయం నుంచి వీడియో ప్రకటన విడుదల చేశారు. పేదల బియ్యాన్ని బొక్కేసింది ఎవరు.. బొక్కింది నిజమే డబ్బులు కట్టేస్తాన చెప్పింది ఎవరో ప్రజలకు తెలియదా పేర్నీ నానీ అంటూ మండిపడ్డారు. వైకాపా నాశనం చేసిన వ్యవస్థల్ని కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుంటే మతిభ్రమించిన వైకాపా నేతలు పిచ్చిగా వాగుతున్నారని విమర్శించారు. రీసర్వే పేరుతో జగన్‌రెడ్డి భూములు కొల్లగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వైకాపా పాలనలో 22ఎ పేరుతో ప్రజల భూములపై వైకాపా నాయకులు ఆక్రమించుకుంది వాస్తవం కాదా అని నిలదీశారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తికి రెవెన్యూ శాఖ ఇస్తే చూస్తు ఓర్వలేక పోతున్నారా అని ప్రశ్నించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ గురించి మాట్లాడే అర్హత నీకుందా అని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు రోడ్లపై పడటానికి కారణం నీవు కాదా పేర్నీ అంటూ ధ్వజమెత్తారు. ప్రజలకు ఎన్నికల ముందు నకిలీ పట్టాలు పంపిణీ చేయలేదా...వాటిని తీసుకుని నిలదీస్తుంటే సమాధానం చెప్పలేని నీవు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

పెద్దలకు గౌరవం ఆప్యాయత పంచడం పవిత్ర కర్తవ్యం

కానూరు, న్యూస్‌టుడే: మలిసంధ్యలో ఉన్న పెద్దలు గౌరవం, ఆప్యాయతల ప్రశాంతంగా జీవించేందుకు పూర్తి అర్హులని వారిని జాగ్రత్తగా చూసుకోవడం యువతతో సహా ప్రతి ఒక్కరి పవిత్ర కర్తవ్యమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం విజయవాడ సమీప కానూరులో సీనియర్ సిటిజన్స్ ఫోరం వృద్ధుల సంక్షేమ కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడున్న పెద్దలతో అల్పాహారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సమాజం, పిల్లల అభివృద్ధి కోసం తమ జీవితాన్ని త్యాగం చేసిన పెద్దలు వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడిపే వాతావరణం అవసరమన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 1991లో ఈ ఆశ్రమాన్ని స్థాపించి సేవలు అందించడం జరిగిందన్నారు. ఒక సమాజం తన పెద్దలతో వ్యవహరించే విధానమే ఆ సమాజ సంస్కృతికి, విలువలకు అద్దం పడుతుందన్నారు. మన పెద్దలు అపారమైన జ్ఞానాన్ని, అనుభవ సంపద కలిగినవారన్నారు. ప్రాచీన ఉమ్మడి కుటుంబ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధాశ్రమాలను పెద్దల ఆశ్రమాలుగా పిలవాలని వెంకయ్యనాయుడు సూచించారు. పెద్దల ఆశ్రమాలు అవసరం లేని రోజు ఆరోగ్యకర సమాజం సాకారమవుతుందన్నారు.



వృద్ధులతో కలిసి అల్పాహారం స్వీకరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కే ప్రసాద్, సెక్రటరీ జంపాల శరత్‌బాబు, జాయింట్ సెక్రటరీ వంగా శ్రీనివాసరావు, ముత్తవరపు మురళీకృష్ణ, మదిన రాజయ్య, పాలంకు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు పథకం' అవసరం ఏముంది? ప్రభుత్వాలు ప్రజలకు ఉచితాలు అలవాటు చేస్తున్నాయని వాటికి తాను వ్యతిరేకమని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. ప్రజలు ఎన్నుకుంటేనే ప్రజల డబ్బుతో ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. ఉచిత బస్సు పథకం ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని విమర్శించడం తన ఉద్దేశం కాదని పేర్కొన్నారు.



మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

దావోస్ పర్యటన విజయవంతంగా ముగించుకుని మంత్రి నారా లోకేశ్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌కు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ బైరెడ్డి శబరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో ఉండవల్లి బయలుదేరి వెళ్లారు. -న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో గొప్పది

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాల్లో కంటే భారతదేశంలోనే పటిష్ఠమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందని.. అది ఎంతో గొప్పదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. రాజుల కాలంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామాల్లో ఓటింగ్ జరిగిందని, ఆ విషయాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎన్నికలే లేవని, కొన్ని దేశాల్లో నియంతల పాలనలో ఉన్నాయని తెలిపారు. ఇస్లామిక్ దేశాల్లో పౌర హక్కులకు అవకాశం లేదన్నారు. ప్రజాస్వామ్యం రక్షించే పోరాటం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విద్యావంతుడు కావడంతోనే రాజ్యాంగాన్ని లిఖించారని తెలిపారు. అనంతరం జాతీయ జెండా పట్టుకుని విద్యార్థులతో కలిసి ప్రదర్శనగా వెళ్లారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా, పి.సురేష్, నిషీధారాజు, శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ప్రదర్శనగా వెళ్తున్న భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, నాయకులు తదితరులు

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఆత్మీయ సమావేశం

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల గౌరవ వేతనం పెంచాలని.. ఆ దిశగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ (టెన్యూర్) వెల్ఫేర్ అసోసియేషన్ తీర్మానించింది. ఆదివారం విజయవాడ న్యాయస్థానాల ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 13 జిల్లాల నుంచి ఏపీపీలు, పీపీలు, స్పెషల్ పీపీలు హాజరయ్యారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, గౌరవ వేతనంపై చర్చించారు. తర్వాతి సమావేశాన్ని ఫిబ్రవరి 14న ఏలూరులో నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకుందామని తీర్మానించారు. ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ (టెన్యూర్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో తీగల దుర్గాప్రసాద్, సూదులకుంట శివరామకృష్ణ, డి.వి.ఎస్.ప్రసాద్, కేశవరామకృష్ణ, గీత పూర్ణిమ, గుమ్మడి అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సహ చట్టం కమిషనర్ పరవాడ సింహాచలంనాయుడిని బీసీపీ అధ్యక్షుడు ఎ.కె.బాషా, గడ్డం రాజేశ్వరరావు, మట్ట జయకర్ తదితరులు ఘనంగా సన్మానించారు.




సింహాచలం నాయుడిని సన్మానిస్తున్న బాషా, రాజేశ్వరరావు, జయకర్

'వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : దేశంలో అత్యధికంగా 62 శాతం మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగానికి పార్లమెంట్‌లో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు అందిస్తున్న రూ.6వేలను రూ.12 వేలకు పెంచాలని, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన వారికి పెట్టుబడి రాయితీ పెంచాలని, బ్యాంకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దుచేసి, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. వ్యవసాయంలో శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధికి దోహదపడేలా పరిశోధనలకు అత్యధిక నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ.. కౌలు రైతులను వ్యవసాయంలో నిలబెట్టేందుకు రక్షణ చట్టం తేవాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఎం.యలమందారావు, గని రాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

బ్రాయిలర్ ధరలు

(కిలో ఒక్కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -149 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 165, 174, 185 చికెన్ విత్ స్కిన్ - 320 చికెన్ స్కిన్‌లెస్ - 330.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో రాష్ట్ర సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బడి అంటే ఉపాధ్యాయులు, విద్యార్థులు, పరీక్షలు మాత్రమే కాదని.. దాని చుట్టూ సమాజం ఉంటుందన్నారు. ప్రభుత్వ బడిలో చదువు, సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి, సమానత్వ భావన ఏర్పడుతుందన్నారు. పిల్లలను భావిభారత పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే అన్నారు. గతం కంటే సదుపాయాలు పెరిగాయని గుర్తుచేశారు. రాబోయే విద్యాసంవత్సరానికి ముందే ఫిబ్రవరి నుంచే పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజా సంఘాలతో కలిసి ప్రచారం ప్రారంభిస్తామని తెలిపారు. 'ప్రభుత్వ పాఠశాలను పరిరక్షిద్దాం... ఊరి బడిని కాపాడుకుందాం' అంటూ యూటీఎఫ్ చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని కోరారు. ఫిబ్రవరి 1, 8 తేదీల్లో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి.. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని వివరించారు. చదువు, ఆటలు, ఆరోగ్యం కలబోసి అమ్మప్రేమ, నాన్న భరోసా ఇచ్చే కేంద్రంగా ప్రభుత్వ బడి మారిందని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.సురేష్‌కుమార్, ఎ.ఎన్.కుసుమకుమారి, రెడ్డి మోహనరావు, జి.లక్ష్మీరాజా, ఎస్.పి.మనోహర్‌కుమార్, ఎస్.మురళీమోహనరావు, ఎస్.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉత్తమ బీఎల్వో సుధశ్రీ



ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పెనుగంచిప్రోలు 172 పోలింగ్ కేంద్రం బూత్ స్థాయి అధికారిణి (బీఎల్వో) పర్చా దివాకర సుధశ్రీ ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ అవార్డు పొందారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు స్వీకరించారు.

కృష్ణా వర్సిటీ సాఫ్ట్‌బాల్ ఛాంప్ 'ఏఎల్‌సీ'

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఆంధ్రా లయోల కళాశాల మైదానంలో జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రా లయోల కళాశాల (ఏఎల్‌సీ) జట్టు ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా.. ఉయ్యూరులోని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. లీగ్ పోటీల్లో మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడు, గుడివాడలోని ఏఎన్నార్ కళాశాల నాలుగో స్థానంలో నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి కృష్ణా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి పి.గోపి, వర్సిటీ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు ఆర్.రఘురామ్, డి.సురేష్ పీడీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపకులపతి రాంజీ నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కెప్టెన్

ఉత్సాహంగా మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కేవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో ఎనిమిది కళాశాలల జట్లు తలపడ్డాయి. నాకౌట్, లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాల క్రీడాకారిణులు ప్రథమ, నున్న విజయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల క్రీడాకారిణులు ద్వితీయ, మైలవరం డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు తృతీయ, నందిగామ కేవీఆర్ కళాశాల వారు నాలుగో స్థానంలో నిలిచారు. విజేతలకు షీల్డ్‌లు, బహుమతులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు యర్రంరెడ్డి బాబూరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయప్ప, పోటీల ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి వాసిరెడ్డి నాగేశ్వరరావులు అందజేశారు. దాత కొండబోలు ఆంజనేయులు తల్లిదండ్రులు రామారావు, రాజేశ్వరి జ్ఞాపకార్థం బహుమతులు సమకూర్చారు. కృష్ణా విశ్వవిద్యాలయ బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా మేజరు మన్నె స్వామి, నాగరాజులు వ్యవహరించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ రామకృష్ణప్రసాద్(నాని), విశ్రాంత పీఈటీ చెరుకుమల్లి శ్రీనివాసరావు క్రీడాకారిణులను అభినందించారు.



సిద్ధార్థ మహిళా కళాశాల క్రీడాకారిణులకు షీల్డ్ అందజేస్తున్న ఛైర్మన్ బాబూరావు

నేటి నుంచి తిరుకల్యాణ మహోత్సవాలు

మైలవరం, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరు కల్యాణ మహోత్సవాలను ఈ నెల 26 నుంచి ద్వారకాతిరుమల ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1న స్వామివారి తిరుకల్యాణం నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు భజన సప్తాహం నిర్వహించనున్నట్లు తితిదే ధర్మప్రచార మండలి సభ్యులు బాలాజీప్రసాద్, బి.సుధాకరరెడ్డి తెలిపారు.

పాత చట్టం కొనసాగించాలి

చీమలపాడు(ఎ.కొండూరు): చీమలపాడులో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పాత చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి మార్పులు చేసి కూలీల పొట్ట కొట్టి, రాష్ట్రాలకు అందాల్సిన నిధులు రాకుండా కుట్ర పన్నుతుందని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు, గోపి, కల్యాణ, సుధాకర్ పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

గొల్లపూడి, న్యూస్‌టుడే: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈనెల 27న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు ఉంటుందని ఏపీ అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారంలో ఐదు రోజుల పని దినాన్ని అమలు చేయకపోవటంతో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగినట్లు వెల్లడించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

చెత్త తొలగించారు

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెవుటూరు ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతమంతా చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోందని స్థానికులు న్యూస్‌టుడే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యపై ఈ నెల 22న 'డంపింగ్ యార్డు కాదు..అంగన్‌వాడీ..' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమాదేవి సిబ్బందితో చెత్తను మొత్తం తొలగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:

? పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించిన సిమెంటు రహదారిపై ఉన్న కంకర, ఇసుకతో వాహనదారులు ఇబ్బందిగా ఉంది. - కిరణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం

✔ గుత్తేదారునితో చెప్పి వాటిని తొలగిస్తాం. - మధు, పారిశుద్ధ్య మేస్త్రీ

? తూర్పు ఇబ్రహీంపట్నంలో వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. షరీఫ్, ఇబ్రహీంపట్నం.

✔ ఉన్నతాధికార్ల దృష్టికి తీసుకెళ్లి, కుక్కలను పట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - మధు, పారిశుద్ధ్య మేస్త్రీ

ఈ- నారీలొస్తున్నారు!

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై మహిళలకు అవగాహన కల్పించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈ-నారీ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న వారిని ఎంపిక చేసి వారి ద్వారా సంఘాల్లోని పొదుపు సంబంధిత అంశాలే కాకుండా సమాజానికి ఉపయోగకరమైన అంశాలపై లోతుగా అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తున్నారు. గ్రామ స్థాయిలోనూ ఇదే తరహాలో సంఘాలను పటిష్ఠ పరిచేందుకు సహకారం అందించే వ్యవస్థగా ఈ-నారీ సీఆర్పీలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అందుబాటులోకి తీసుకొస్తోంది.

ప్రతి పది వీవోలకు ఒకరు: గ్రామాలను స్వయం సహాయక సంఘాల సంఖ్య ఆధారంగా రెండుగా విభజించారు. 25 గ్రామైక్య సంఘాల కంటే తక్కువ ఉన్న గ్రామాలు ఒక కేటగిరీ, ఎక్కువ ఉన్న గ్రామాలు రెండో కేటగిరీగా గుర్తించారు. మొదటి కేటగిరీలో ఇద్దరు, రెండో కేటగిరీలో ప్రతి పది సంఘాలకు ఒక ఈ- నారీ ఉంటారు. వీరికి కేటాయించిన సంఘాల్లో నిర్దేశించిన కార్యక్రమాలు చూస్తారు.



ఇబ్రహీంపట్నం మండల స్థాయిలో శిక్షణ పొందుతున్న ఈ నారీలు

ఏం చేస్తారంటే:

★ సంఘాల్లోని పేద మహిళలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడం, వ్యవసాయేతర జీవనోపాధులపై అవగాహన పెంపొందిస్తారు.

★ వివిధ యాప్‌లపై అవగాహన కల్పిస్తారు. ★ పోషకాహారం, ఆరోగ్యం, పిల్లల పోషణ, రక్తహీనత సమస్యలను గుర్తించి వైద్యులతో సహకారంతో నివారణ మార్గాలు సూచిస్తారు. ★ మహిళలకు జీవన పాయల కల్పన, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తారు.

★ శారీరక వ్యాయామం, యోగా,

జిల్లాలో ఇలా:		
ఎస్‌హెచ్‌జీలు	:	24,741
సభ్యుల సంఖ్య	:	2,48,213
గ్రామైక్య సంఘాలు	:	766
సీఆర్పీలు	:	1202
ఈ-నారీలు	:	2418

ధ్యానం, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారు. ★ లింగ వివక్ష, రుణాలు సద్వినియోగం చేసుకుని వ్యాపార యూనిట్లు స్థాపించి విజయవంతంగా నడిపేలా చూస్తారు. ★ వృత్తిగత పరిశుభ్రత పర్యావరణహిత జీవనశైలిపై చైతన్యపరుస్తూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, మధ్యవయస్కులు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: గోసవీడుకు చెందిన గడ్డల సువార్త(80) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సదరు వృద్ధురాలు అనారోగ్యంగా ఉండగా ఈ నెల 19న మందు బిళ్లలు అధికంగా మింగారు. తదుపరి అనారోగ్యానికి గురవడంతో చికిత్స నిమిత్తం ఆమెను కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీధర్ కేసు నమోదు చేశారు.

రహదారి సౌకర్యం కల్పించరూ..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రెడ్డిగూడెం నుంచి గ్రామానికి తూర్పు వైపున ఉన్న కొండల వరకు గల పంటపొలాలు, మామిడి తోటలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 8 వేల ఎకరాలకుపైగా ఉన్న మామిడి తోటలు, పంటచేలకు ఎరువులు, మందులు తరలించడానికి నానా అవస్థలు పడుతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. గతంలో కోతులగూడెం నుంచి దగ్గరలో ఉన్న డొంక రోడ్డులో మామిడి తోటలకు వెళ్లేవారు. ఇటీవల వరద ఉద్ధృతికి రోడ్డు కోతకు గురై వాహనాలు వెళ్లే పరిస్థితులు లేకున్నాయి. పండించిన పంటలు, మామిడి కాయలు మార్కెట్‌కు తరలించలేక కష్టపడుతున్నామని వాపోయారు. డొంక రహదారులు అభివృద్ధి చేసి రాకపోకల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



డొంక రహదారిలో పెరిగిన చెట్లు

పేద విద్యార్థులకు ప్రోత్సాహక పారితోషికాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: కోప చారిటబుల్ ట్రస్ట్ విస్సన్నపేట, కృష్ణ దేవరాయ ట్రస్ట్ గుంటూరు వారి సంయుక్తంగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్థానిక వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ప్రోత్సాహక పారితోషికాలు ప్రదానం చేశారు. మొత్తం 9 మండలాల నుంచి 450 దరఖాస్తులు రాగా 240 మంది విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసి రూ.9,51,000 పారితోషికాలను అందజేసినట్లు విస్సన్నపేట కోప ట్రస్ట్ ఛైర్మన్ లయన్ డా.బండి గోపాలరావు, కృష్ణ దేవరాయ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీశరత్ నిధి మేనేజింగ్ ట్రస్టీ తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. కార్యక్రమంలో వికాస్ విద్యా సంస్థల అధినేత లయన్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి, డా అలీల్ దాడి, శ్రీకర గ్రూప్ హస్పిటల్స్ ఎన్నారైల చాపల నవీన్‌బాబు, రేణుక దంపతులు, తోట నారాయణరావు, కుప్పాల శంకరరావు, శ్రీ శారద విద్యా సంస్థల అధినేత, నూజివీడు, అర్జా లక్ష్మి కుమారి, పెద్ద లక్ష్మీకాంత దాతలతోపాటు నూజివీడు కోప ట్రస్ట్ డైరెక్టర్ వెంకట కృష్ణారావు, విస్సన్నపేట కోప ట్రస్ట్ ట్రెజరర్ తుంగల నూజివీడు, ఎన్నారై బత్తిన నవీన్ చంద్, డా సవరం వి. రామారావు, హైదరాబాద్, దానవ నరేంద్రబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇండియన్ బ్యాంక్ విజయవాడ, రామారావు, ప్రముఖులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో పారితోషిక ప్రదానోత్సవంలో పాల్గొన్న కోప చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సత్కారం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేతనకొండ గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మైలపల్లి అప్పారావును ఆదివారం కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలో సత్కరించారు. సంస్థ డైరెక్టరు మొగులూరి ఎలీషా మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 13 నుంచి 18 వరకు ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ప్రయత్నంలోనే క్వార్టర్ ఫైనల్ కి చేరుకున్నారని అభినందించారు. మార్చి 16 నుంచి 22 వరకు స్పెయిన్‌లో, మే నెలలో దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ టోర్నమెంటులకు కూడా ఎంపికై గ్రామానికి అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకొచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ చెందిన సుమలత, అబ్రహాం, మాణిక్యరావు, హరీష్ పాల్గొన్నారు.





మైలవరం మండలం కుంటముక్కలలో..



గంపలగూడెంలో ప్రదర్శన



ఎ.కొండూరు మండల పోలిశెట్టిపాడులో సీనియర్ ఓటర్లను సత్కరించిన అధికారులు, నాయకులు



సీనియర్ సిటిజన్‌ను సత్కరించిన మున్సిపల్ కమిషనర్ మనోజ, తిరువూరు ఎంఈవో 2 రాజు



కీర్తిరాయునిగూడెంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న నాయకులు



విస్సన్నపేటలో మానవహారం..

సీనియర్ ఓటర్లకు సన్మానం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఆదివారం సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. మానవహారాలు, ప్రతిజ్ఞలు చేయించారు.

-న్యూస్‌టుడే యంత్రాంగం



రెడ్డిగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మానసిక ఒత్తిడిని దూరం చేసుకుందాం

కొండపల్లి, న్యూస్‌టుడే: నూతన విషయాలపై జిజ్ఞాసను పెంచుకోవడం ద్వారా మానసిక సమస్యలను దూరం చేసుకోవచ్చని, మానసిక విద్య కో-ఆర్డినేటర్ కేశవ అన్నారు. వాసవి మహిళా మండలి, లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానసిక విద్య కార్యక్రమాన్ని ఈలప్రోలులో ఆదివారం నిర్వహించారు. మానసిక సమస్యలను అర్థం చేసుకోవడం ద్వారా వాటి పరిష్కారాలు త్వరగా అర్థమవుతాయన్నారు. మందులతోపాటు క్రమం తప్పకుండా ప్రాణాయామం, యోగా వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.ఝాన్సీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వంద రోజుల ప్రణాళికతో మెరుగైన ఫలితాలు

న్యూస్‌టుడే, జి.కొండూరు

కూటమి ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజులు ప్రణాళిక భవిష్యతులో మెరుగైన ఫలితాలు సాధనకు ప్రయోజనకరంగా మారుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడతున్నారు. డిసెంబర్ 6 నుంచి నూరు శాతం పది ఫలితాల కోసం 100 రోజుల ప్రణాళిక పేరిట విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి రోజు ఒక సబ్జెక్టులో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ విధంగా శిక్షణ ఇస్తే మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయని ఉపాధ్యాయులు కూడా అభిప్రాయపడుతున్నారు.



చెవుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతిలో 'పది' విద్యార్థులు

ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తూ..

వంద రోజుల పాఠ్య ప్రణాళికలో భాగంగా రోజుకు ఒక సబ్జెక్టులో షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతిలోని పాఠ్యాంశాలను రివిజన్ చేసి, అదే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో వారి ప్రగతిని గుర్తించి షైనింగ్ స్టార్లు, రైజింగ్ స్టార్లుగా విభజిస్తున్నారు. ఏ, బీ గ్రేడు సాధించిన వారిని షైనింగ్ స్టార్లుగా గుర్తిస్తున్నారు. సీ, డీ గ్రేడ్లు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంవత్సరాంత పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక అమలులోకి తేవడం పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా మారుతోందని, నూరు శాతం ఫలితాలు సాధిస్తే వచ్చే ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు నమోదు పెరిగే అవకాశముంటుందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా అందించే స్ఫూర్తి స్టడీ మెటీరియల్, ఉపాధ్యాయ సంఘాలు అందించే మెటీరియల్‌ను విద్యార్థులు అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

నరసాపురంవాసికి అరుదైన గౌరవం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఉత్తమ మార్గదర్శి అవార్డుకు విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, దాత గొట్టేటి సుబ్రహ్మణ్యం (బుడ్డయ్య) ఎంపికయ్యారు. కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా సోమవారం జరగనున్న కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.



గొట్టేటి సుబ్రహ్మణ్యం

ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డుకు ఎంపిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ (శివ) చేస్తున్న సమాజ సేవకు గుర్తింపుగా జిల్లా స్థాయి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న గణతంత్ర వేడుకలలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.



శివసత్యనారాయణ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి.శ్రీనివాసరావు అందజేశారు. సుమారు 36 మందికి రూ.11 లక్షల చెక్కులను అందజేశారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.5.49 కోట్ల విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు.



సూర్య నమస్కారం శ్రేయస్కరం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సూర్య నమస్కారం ఎంతో శ్రేయస్కరమని యోగా గురువు ఎల్.జనార్దన్ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్, ఎన్టీటీపీఎస్ యోగా బృందం ఆధ్వర్యంలో 108 సూర్య నమస్కారాల పోటీలను కొండపల్లి దయానంద ఆంగ్లో వేదిక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. వేకువ జామున సూర్య నమస్కారాలు చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం విజేతలైన వారిని అభినందించి సత్కరించారు. కార్యక్రమాల్లో సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, పలు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు, పురపాలిక ప్రజలు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు



గొల్లపూడిలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

వాడవాడలా రథసప్తమి పూజలు

న్యూస్‌టుడే యంత్రాంగం

రథసప్తమిని పురస్కరించుకుని ఆదివారం మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీనివాసుని కల్యాణం జరిపించారు. తిరువూరు శిరిడీ సాయి బాబా కల్యాణ మండపంలో, గంపలగూడెం రామాలయంలో గొల్లపూడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, విస్సన్నపేట మండలం నరసాపురంలో వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాలు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గంపలగూడెం మండలం మెట్ట గుట్ట ఆలయంలో సూర్యప్రభపై ఆశీనులైన ఉత్సవమూర్తులు



గంపలగూడెం రామాలయంలో

నెమలిలో.. గంపలగూడెం: నెమలి కృష్ణాలయంలోవేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం, రథసప్తమి వేడుకలను నిర్వహించారు. ప్రధానార్చకులు గోపాలాచార్యులు, రుత్వికుల బృందం స్వామి మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించారు. 'గోపాల లక్ష్మీ సుదర్శన, సూర్యనారాయణ మహామంత్ర హోమం' నిర్వహించారు.

పంచముఖ సుందర హనుమాన్ వార్షికోత్సవం

గంపలగూడెం, న్యూస్‌టుడే: వినగడప హనుమత్ ఆశ్రమంలో పంచముఖ సుందర హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఎ. వెంకటప్పయ్యశాస్త్రి, పి. కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి విశేష పూజలు జరిపారు.



వైభవంగా భావనారుషి కల్యాణం

పద్మశాలీల ఆధ్వర్యంలో మైలవరం, కొండపల్లి, వెలగలేరులో భావనారుషి కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు. స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



మైలవరంలో కల్యాణ వేడుకల్లో స్వాముల విగ్రహాలు

రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవం

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: కంభంపాడు గంగా విజయదుర్గ సమేత నాగమల్లేశ్వరస్వామి గుడిలో రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం విజయదుర్గాంబ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్యామలాదేవి ఉత్సవాల ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు.



యువకుల అరెస్టు

ఇబ్రహీంపట్నం,న్యూస్‌టుడే: పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ బార్‌లో అలజడి సృష్టించి ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఇబ్రహీంపట్నం పోలీసులు నలుగురు యువకులను ఆదివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్సై బి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16 రాత్రి హైదరాబాద్‌కు చెందిన బుడిద సతీష్, వజ్రం యశ్వంత్. సతీష్‌రెడ్డి, కనకరాజు అతిగా మద్యం తాగారు. ఆ సమయంలో తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కుప్పాల వీరాంజనేయులతో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వీరాంజనేయులను బార్ సిబ్బంది ఆసుపత్రిలో చేర్పించారు. బార్‌లోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల వివరాలు సేకరించారు. ఎస్సై రాజు సిబ్బందితో హైదరాబాద్ చేరుకొని నిందితులు నలుగురుని అదుపులోకి తీసుకొన్నారు. ఆదివారం రిమాండ్‌కు పంపారు.

యువతి అదృశ్యం

విస్సన్నపేట: విసన్నపేటకి చెందిన యువతి(20) ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాత స్నేహితుడితో స్కూటీ మీద తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీల ద్వారా తెలుస్తోందని, మాకు భయంగా ఉందని మా కుమార్తెను అప్పగించాలని కుటుంబ సభ్యులు పోలీసు అధికారులను కోరారు. అదృశ్యం కేసుగా నమోదు చేశారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ పి.రంగారావు, వ్యాయామోపాధ్యాయుడు మన్నేస్వామి తెలిపారు. పతకం సాధించిన విద్యార్థినులను అభినందించారు.



క్రీడాకారులతో అధ్యాపకులు

డ్రెయినేజీ సమస్య పరిష్కారం



ఎన్టీఆర్ కాలనీలో డ్రెయినేజీ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో చిన్నరాట్నాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎన్టీఆర్ కాలనీకి శుక్రవారం సీసీ రోడ్డు శంకుస్థాపనకు విచ్చేసిన తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావుకు తమ కాలనీలో డ్రెయినేజీ సమస్యను స్థానికులు వివరించారు. యుద్ధప్రాతిపదికన పూడికలు తీయించమని ఆయన పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఈవో కేశవ హరికృష్ణకుమార్ క్షేత్రస్థాయిలో శనివారం ఉదయం 7 నుంచి పనులను దగ్గరుండి చేయించారు.

జూద శిబిరంపై పోలీసుల దాడి

తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు మండలం మల్లెల శివారు మామిడితోటల్లో నిర్వహిస్తున్న జూదశిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ. 11,850 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తిరువూరు సెక్టార్ 1 ఎస్సై శాతకర్ణి తెలిపారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెల్లటూరు శివారులో జూదమాడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్సై కె.సతీష్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి 13 మంది జూదరులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,300 నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించరూ..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కోడూరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి ఆక్రమణలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం మీదుగా వెళ్లే విజయవాడ - విసన్నపేట ప్రధాన రహదారిని విచ్చలవిడిగా ఆక్రమించుకుని ఇళ్ల ముందు మెట్లు నిర్మించుకోవడం, ఇసుక నిల్వ చేసుకోవడం, ఇటుకలు పరుచుకుంటున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణ చేపడితే ప్రమాదాలు తగ్గుతాయని గ్రామస్థులు వాపోతున్నారు.



ప్రమాదకరంగా పోసిన ఇటుక ముక్కలు

విలాసవంత ఇళ్ల ధరలు తగ్గొచ్చు: ఐఎస్ఐఆర్ సర్వే

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో దేశంలోని ప్రధాన నగరాల్లో విలాసవంత ఇళ్లు/ఫ్లాట్లకు గిరాకీతో పాటు ధరలూ తగ్గొచ్చని ఒక సర్వే పేర్కొంది. 'ఇండియా లగ్జరీ రెసిడెన్షియల్ అవుట్‌లుక్ 2026' నివేదికలో ఈ విషయాన్ని ప్రాపర్టీ కన్సల్టెంట్ ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ (ఐఎస్ఐఆర్) తెలిపింది. సుమారు 700 మంది అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ఐ), అల్ట్రా హెచ్ఎన్ఐల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది. సర్వేలో అభిప్రాయాలు తెలిపిన వారిలో 56% మంది ధరలు తగ్గుతాయనే భావిస్తున్నారు. 2026-27లో జీడీపీ వృద్ధి 6-7% ఉండొచ్చని 72% మంది పేర్కొన్నారు.



200–300 మెగావాట్ల పునరుత్పాదక ఇంధనంపై నాల్కో దృష్టి


దిల్లీ: అల్యూమినియం తయారీలో కర్బన ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వరంగ నాల్కో (నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్).. ఇందుకోసం 200-300 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని నెలకొల్పాలనే నిర్ణయంతో ఉంది. నాల్కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ ఈ విషయాన్ని తెలిపారు. దీనితో పాటు విద్యుత్తును నిల్వచేసే బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థనూ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం విద్యుత్తు అవసరాల కోసం 100% బొగ్గు ఆధారిత విద్యుత్తు వ్యయం యూనిట్ రూ.3-3.50గా ఉంది. పర్యావరణ హిత విద్యుత్తు వ్యయం రూ.4.50-5 అవ్వొచ్చని సింగ్ వివరించారు.

ఉదయ్ కోటక్‌కు పద్మభూషణ్

కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో వాణిజ్య, పరిశ్రమల విభాగం నుంచి నలుగురు ప్రముఖులకు లభించాయి. బ్యాంకింగ్ రంగ దిగ్గజం ఉదయ్ కోటక్‌ను పద్మభూషణ్ వరించింది. టీటీ జగన్నాథన్ (మరణానంతరం), అశోక్ ఖడే, సత్యనారాయణన్ నువాల్‌లకు పద్మశ్రీ ప్రకటించారు.



ఉదయ్ కోటక్ (పద్మభూషణ్): దేశంలోని దిగ్గజ బ్యాంకర్లలో ఉదయ్ కోటక్ ఒకరు. 1985లో కోటక్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఫైనాన్స్‌ను ఆయన స్థాపించారు. 2003లో ఆర్‌బీఐ బ్యాంకింగ్ లైసెన్స్ ఇవ్వడంతో, కోటక్ మహీంద్రా బ్యాంక్‌గా మారింది. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో 2000కు పైగా శాఖలతో కోటక్ బ్యాంక్ దూసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. బ్లూమ్‌బర్గ్ ప్రకారం.. ఆయన సంపద విలువ 15.5 బి.డాలర్లు (దాదాపు రూ.1.4 లక్షల కోట్లు).



అశోక్ ఖడే (పద్మ శ్రీ): దళిత కుటుంబం నుంచి వచ్చిన అశోక్ ఖడే, స్వయంకృషితో వ్యాపారవేత్తగా ఎదిగారు. ప్రస్తుతం డీఏఎస్ ఆఫ్‌షోర్ ఇంజినీరింగ్ ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఆఫ్‌షోర్ చమురు, గ్యాస్ పరిశ్రమలో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. డాక్‌యార్డ్ ట్రైనీ స్థాయి నుంచి ఆఫ్‌షోర్ ఫ్యాబ్రికేషన్ కంపెనీ అధిపతిగా అంచెలంచెలుగా ఎదిగారు.



సత్యనారాయణన్ నువాల్ (పద్మశ్రీ): ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోజివ్స్‌ను ఎగుమతి చేయడం కోసం 1995లో సోలార్ ఇండస్ట్రీస్ ఇండియాను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంస్థకు దేశంలో 25 తయారీ కేంద్రాలున్నాయి. ఫోర్బ్స్ జాబితా ప్రకారం.. ఆయన సంపద విలువ 5.5 బి.డాలర్లు (దాదాపు రూ.52,000 కోట్లు).



టీటీ జగన్నాథన్ (పద్మ శ్రీ): 'ది కిచెన్ మొఘల్'గా ప్రసిద్ధి చెందిన టీటీకే ప్రెస్టీజ్ గౌరవ ఛైర్మన్ టీటీ జగన్నాథన్‌కు మరణానంతరం పద్మ శ్రీ అవార్డు ఇచ్చారు. వంట, గృహోపకరణాల ఉత్పత్తుల్లో టీటీకే ప్రెస్టీజ్‌ను అగ్రగామి సంస్థగా మలచడంలో కీలక పాత్ర పోషించిన జగన్నాథన్, 2025 అక్టోబరులో మరణించారు. ప్రెజర్ కుకర్‌లకు జీఆర్ఎస్ భద్రతా విధానాన్ని ఆయన కనిపెట్టారు. ఐఐటీ చెన్నై నుంచి గోల్డ్ మెడల్ పొందిన జగన్నాథన్, అమెరికా కార్నెల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేశారు. టీటీకే ప్రెస్టీజ్ బోర్డులో 50 ఏళ్ల పాటు ఆయన ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, విద్యా రంగాల్లో ఆయన కృషి చేశారు.

మరింత ఆకర్షణీయంగా ఉడాన్ పథకం!



దేశంలో చిన్న నగరాలకూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ అనుసంధానత పథకాన్ని (ఉడాన్) మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. మారుమూల ప్రాంతాలకు నడుస్తున్న సర్వీసుల వల్ల విమానయాన సంస్థలకు ఏర్పడుతున్న నష్టాలను పూడ్చడానికి, వాటికి ఆర్థికంగా మద్దతు ఇచ్చే ప్రణాళికకు కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించాల్సి ఉంది.

● ఉడాన్ పథకాన్ని 2016లో తొలిసారి ప్రారంభించారు. విమాన ప్రయాణాన్ని సామాన్యులకూ అందుబాటు ధరల్లో అందించడానికి వీలుగా ఈ పథకాన్ని చేపట్టారు. విమానంలో సగం సీట్లకు ఛార్జీల గరిష్ఠస్థాయిపై పరిమితి (సీలింగ్) విధించారు. అయితే రద్దీ తక్కువగా ఉండటం, టికెట్ ఛార్జీల పరిమితుల కారణంగా కొన్ని సర్వీసులు లాభదాయకంగా ఉండటం లేదు. ఆయా సర్వీసులను సంస్థలు నిర్వహించలేకపోతున్నాయి. దీన్ని పరిష్కరించడానికి, ప్రభుత్వం విమానయాన సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. విమాన ల్యాండింగ్, నావిగేషన్ ఛార్జీలపై మినహాయింపులు, సబ్సిడీలు వీటిల్లో ఉన్నాయి.

ప్రస్తుత సబ్సిడీలు ఇలా

ప్రస్తుతం ఒక్కో వాణిజ్య విమాన సర్వీసుకు ఇస్తున్న సబ్సిడీలో సుమారు 80% (రూ.6,500) రుసుము రూపేణ సబ్సిడీ ఇస్తున్నారు. మిగిలిన భాగాన్ని విమానాశ్రయాలు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి.

ఇప్పటివరకు రూ.4,352 కోట్లు

ఉడాన్ పథకం ప్రారంభించినప్పటి నుంచి సబ్సిడీగా రూ.4,352 కోట్లకు పైగా సబ్సిడీగా అందించారు. విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు అదనంగా రూ.4,638 కోట్లు పెట్టుబడి పెట్టారు. అయినా మిశ్రమ ఫలితాలే లభించాయి. 649 మార్గాల్లో 60% మాత్రమే ప్రస్తుతం పని చేస్తున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ 15 ప్రాంతీయ విమానాశ్రయాలపై సుమారు రూ.900 కోట్లు ఖర్చు చేసినా, అవి ప్రస్తుతం పని చేయడం లేదు.

ఇవీ ప్రతిపాదనలు

ప్రస్తుతం ఉడాన్ మార్గాన్ని బిడ్‌లో గెలుచుకున్న సంస్థ, 4 నెలల్లో విమాన సర్వీసును ప్రారంభించాలి. మూడేళ్ల పాటు ఆ సంస్థ విమానాలే నడుస్తాయి. సబ్సిడీ వ్యవధిని ప్రస్తుత 3 సంవత్సరాలకు మించి పొడిగించాలి. మారుమూల ప్రాంతాల విమానాశ్రయాల్లో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై తక్కువ పన్నులుంటాయి. విమానాశ్రయ ఫీజులుండవు.

దేశంలో వాణిజ్య విమానాల తయారీ!

27న ఎంబ్రాయర్‌తో అదానీ గ్రూప్ ఒప్పందం

దిల్లీ: మన దేశంలో పౌర విమానాల తయారీ కోసం తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేసే ప్రణాళికను అదానీ గ్రూప్, బ్రెజిల్‌కు చెందిన విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్.. మంగళవారం ప్రకటించనున్నాయి. పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సమక్షంలో అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎంబ్రాయర్ ఎగ్జిక్యూటివ్‌లు ఈనెల 27న దిల్లీలో జరిగే కార్యక్రమంలో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేయనున్నారు. 'మన దేశంలో ఎంబ్రాయర్ జెట్‌లను తయారు చేయడానికి ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు చేసే ప్రణాళికగా ఇది ఉంటుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటిగా మనదేశం ఉంది. దేశంలో కొత్త విమానాశ్రయాలు నిర్మితమవుతుండగా, సేవల విస్తరణ కోసం విమానయాన సంస్థలు కొత్త విమానాలను సమకూర్చుకుంటున్నాయి. విమాన ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. 150 సీట్ల వరకు ఉండే వాణిజ్య జెట్‌లను ఎంబ్రాయర్ తయారు చేస్తోంది. ప్రస్తుతం మనదేశంలో 50 ఎంబ్రాయర్ విమానాలు సేవలందిస్తున్నాయి.

వెండి రీసైక్లింగ్‌లోకి ఎంఎంటీసీ-పాంప్

విలువైన లోహాలను శుద్ధి చేసే సంస్థ ఎంఎంటీసీ-పాంప్, తమ విక్రయశాలల్లోనూ వెండి రీసైక్లింగ్ ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. వచ్చే 3 నెలల్లోనే ప్రయోగాత్మక పద్ధతిలో వెండి రీసైక్లింగ్ ప్రక్రియ చేపడతామని సంస్థ ఎండీ, సీఈఓ సమిత్ గుహ తెలిపారు. వెండికి అధిక గిరాకీ ఏర్పడుతున్న నేపథ్యంలో, ధరలు గణనీయంగా పెరిగాయి. పాత వెండి ఆభరణాలను మార్చుకుని, కొత్తవి తీసుకోవాలనుకున్నా, విక్రయించాలనుకున్నా.. అందులో వెండి స్వచ్ఛతను నిర్ధారించడం ముఖ్యమవుతోంది. పాత వెండి అమ్ముకునే వారి వద్ద తీసుకుని, కొత్తగా విక్రయించేందుకు, దానిని శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ మరింత అనుకూలంగా ఉండటంతో, కంపెనీ వెండి రీసైక్లింగ్‌లోకి అడుగుపెడుతున్నట్లు సమిత్ పేర్కొన్నారు. వెండికి గిరాకీ గణనీయంగా పెరిగినా, అందుకు తగ్గట్టుగా అంతర్జాతీయ ఉత్పత్తి సామర్థ్యాలు పెరుగుతున్న సంకేతాలు కనిపించడం లేదని వివరించారు. వెండికి గిరాకీ ఇదే విధంగా కొనసాగితే, సరఫరా ఇబ్బందులు తలెత్తుతాయని, ఈ లోటును పూడ్చడంలో రీసైకిల్ చేసిన వెండి కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నారు.

తొలుత దిల్లీలో: వెండి రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని గుహ కోరారు. మన దేశంలో కుటుంబాల చేతిలో 25,000 టన్నుల బంగారం, అంతకంటే పది రెట్లు ఎక్కువ వెండి ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు వివరించారు. 'వెండి రీసైక్లింగ్ కోసం మా స్టోర్‌లలో పరికరాలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. సిబ్బందికి కొంత శిక్షణ కూడా ఇందుకు అవసరం. అందుకే తొలుత కొన్ని స్టోర్‌లలో ప్రయోగాత్మకంగా వెండి రీసైక్లింగ్ ప్రారంభించి, తర్వాత మిగతా వాటికి విస్తరిస్తాం. తొలుత 3-4 నెలల్లో దిల్లీలో సేవలు ప్రారంభించే అవకాశం ఉంది. వెండిని కరగబెట్టి, నాణ్యత నిర్ధారించే (రీసైక్లింగ్, అసేయింగ్) కేంద్రాల్లోకి టెక్నాలజీ పెట్టుబడులు, పరికరాల నవీకరణ అవసరం' అని వెల్లడించారు. గత 12 నెలల్లో పసిడి కంటే వెండి రెట్టింపు ప్రతిఫలాలను ఇచ్చిందని, ఇప్పుడు కొత్త బంగారంగా వెండి మారిందన్నారు.



ఇప్పుడు 20 కేంద్రాలు

పాత బంగారాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేసేందుకు (పసిడి రీసైక్లింగ్ కోసం) ఎంఎంటీసీ-పాంప్ 20 స్టోర్‌లు నిర్వహిస్తోంది. వాటిని వెండి కోసమూ వినియోగించనుంది. వచ్చే అయిదేళ్లలో ఈ స్టోర్‌ల సంఖ్యను రెట్టింపు చేయాలని కంపెనీ చూస్తోంది. దక్షిణ, తూర్పు రాష్ట్రాల్లో విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న 24 లక్షల నాణేల వార్షిక తయారీ సామర్థ్యాన్ని 36 లక్షలకు పెంచుకోనుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థల్లో నాణేలు, కడ్డీలు విక్రయించడం ద్వారా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

● గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ 40 టన్నుల బంగారం, 50 టన్నుల వెండిని దిగుమతి చేసుకుంది. ● ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు 36 టన్నుల బంగారం, 60 టన్నుల వెండి దిగుమతి చేసుకుంది.

● పసిడి, వెండి స్వచ్ఛతను నిర్ధారించేలా, ఎల్‌బీఎంఏ (లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్) అక్రెడిటేషన్ కలిగిన ల్యాబ్‌ను దేశీయంగా ఎంఎంటీసీ-పాంప్ మాత్రమే నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇండిగో సర్వీసులపై ఇరాన్ ప్రభావం

దిల్లీ: ఇరాన్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో తబిలిసి (జార్జియా), అల్మాటీ (కజక్‌స్థాన్), బకు (అజర్‌బైజాన్), తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్) నగరాలకు వెళ్లి, వచ్చే విమాన సర్వీసులను ఈనెల 26, 27, 28 తేదీల్లో రద్దు చేసినట్లు ఇండిగో ప్రకటించింది. ఈ విమాన సర్వీసులు ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణిస్తాయి. ఆదివారం నాడు తబిలిసి, అల్మాటీ సర్వీసులను ఇండిగో నిలిపేసింది.

రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు తగ్గాయ్



దిల్లీ: రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈనెల తొలి 3 వారాల్లో సగటున రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే దిగుమతి అయ్యింది. 2025 డిసెంబరులో రోజుకు 1.21 మి.బ్యారెళ్ల చమురు దిగుమతి అయ్యింది. గతేడాది మధ్యలో చూస్తే రోజుకు 2 మి.బ్యారెళ్ల చొప్పున ముడిచమురును రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుందని విశ్లేషణా సంస్థ కెప్లర్ వెల్లడించింది. దేశీయ ముడిచమురు అవసరాల్లో 90 శాతాన్ని మనదేశం దిగుమతి చేసుకుంటోంది. ఇక్కడి రిఫైనరీల్లో దీన్నుంచి పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలను ఉత్పత్తి చేస్తుంటారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు తీవ్రమవ్వడంతో.. డిసెంబరు నుంచి రష్యా ముడిచమురు దిగుమతులను మనదేశం వ్యూహాత్మకంగా తగ్గించుకుంటూ వస్తోంది. పశ్చిమాసియాలోని సంప్రదాయ సరఫరాదార్ల నుంచి మనదేశం దిగుమతులు పెంచుకుంటోంది.

● కెప్లర్ డేటా ప్రకారం, ఇరాక్ ఇప్పుడు రష్యా స్థాయిలో మనకు ముడిచమురు సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరులో సగటున రోజుకు 9,04,000 బ్యారెళ్ల చమురును ఇరాక్ సరఫరా చేసింది. సౌదీ అరేబియా నుంచి చమురు దిగుమతి పరిమాణం ఈ నెలలో రోజుకు సగటున 9,24,000 బ్యారెళ్లకు చేరింది. డిసెంబరులో ఇది 7,10,000 బ్యారెళ్లుగా ఉంది. 2025 ఏప్రిల్‌లో కనిష్ఠంగా 5,39,000 బ్యారెళ్లుగా నమోదైంది.

2022 తరవాత రష్యా నుంచి అధికంగా

ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభించిన రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, 2022 నుంచి భారీ తగ్గింపు ధరకు ముడిచమురును మనకు రష్యా ఆఫర్ చేసింది. అప్పటివరకు మన దేశానికి ముడిచమురును ఇరాక్ అధికంగా సరఫరా చేసేది. దాన్ని అధిగమించి మన దేశానికి అత్యధికంగా ముడి చమురు సరఫరా చేసే దేశంగా రష్యా నిలిచింది. 2022కు ముందు మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% కంటే తక్కువ కాగా, ఈ పరిణామాల్లో అది గరిష్ఠంగా సుమారు 40 శాతానికి చేరింది. రష్యా సరఫరాదార్లపై అమెరికా మరిన్ని ఆంక్షలను డిసెంబరులో విధించడంతో, మన కొనుగోళ్లు మందగించాయి.

కోడి గుడ్లు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495	తూ/ప గోదావరి	490
వరంగల్	497	విశాఖపట్నం	490
విజయవాడ	525	చిత్తూరు	563

చమురు సానుకూలమే!


కమొడిటీస్ ఈ వారం

పసిడి




అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరగడం పసిడి ధరపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తోంది. సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి పసిడిలోకి పెట్టుబడులను మదుపర్లు మళ్లిస్తున్నారు. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ బలహీనపడటం వల్ల, దేశీయంగా పసిడి ధర మరింత అధికంగా ఉంటోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగితే, పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు మరింత రాణించొచ్చు. కానీ రూ.1,62,402 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,68,767; రూ.1,78,308 వరకు పెరగొచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.1,46,496 వద్ద మద్దతు లభించొచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టుకూ అంతర్జాతీయ ఉద్రిక్తతలే దిశానిర్దేశం చేయనున్నాయి. ఈవారమూ సానుకూల ధోరణి కొనసాగితే రూ.3,52,050 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీని కంటే పైకి వెళితే రూ.3,69,402; రూ.3,98,877 స్థాయిలను పరీక్షించే అవకాశం ఉంది. ఒకవేళ కిందకు వస్తే రూ.3,05,223 వద్ద మద్దతు లభించొచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.1,341 కంటే పైకి వెళ్లకుంటే.. రూ.1,286; రూ.1,256 వరకు దిద్దుబాటు కావచ్చు.

● సీసం ఫిబ్రవరి కాంట్రాక్టుకు లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.192.65 సమీపంలో లాభాలు స్వీకరించొచ్చు.

● జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.323 కంటే పైన ట్రేడ్ కాకుంటే మరింత దిద్దుబాటు కావచ్చు.

● సరఫరావరంగా అంతర్జాతీయంగా నెలకొన్న అవరోధాలు అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టుపై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

ఇంధన రంగం



● ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టుకు అంతర్జాతీయ పరిణామాలు కీలకం కానున్నాయి. రూ.5,437 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే. . లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అయితే రూ.5,244 వద్ద స్టాప్‌లాస్ పరిగణించాలి.

● సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.338 కంటే పైన కదలాడకుంటే.. ప్రతికూల ధోరణి కొనసాగుతుంది. అయితే రూ.272.25 వద్ద మద్దతు లభించొచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.363.20 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.397.60; రూ.454.20 వరకు పెరగొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.17,141 కంటే కిందకు వస్తే రూ.16,567; రూ.15,993 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.17,715 కంటే పైకి వెళితే రూ.18,289; రూ.18,863 వరకు పెరగొచ్చు.

● జీలకర్ర మార్చి కాంట్రాక్టు కిందకు వస్తే రూ.23,081 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.22,648; రూ.22,196 వరకు దిగిరావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.23,966 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ.24,418; రూ.24,852 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,43,321	1,56,037	8.87
వెండి (మార్చి)	2,93,100	3,34,699	14.19
రాగి (ఫిబ్రవరి)	1,325.15	1,316.50	-0.65
సీసం (ఫిబ్రవరి)	191.10	191.65	0.29
జింక్ (ఫిబ్రవరి)	318.20	316.25	-0.61
అల్యూమినియం (ఫిబ్రవరి)	321.90	318.05	-1.20
ముడి చమురు (ఫిబ్రవరి)	5,423	5,630	3.82
సహజ వాయువు (ఫిబ్రవరి)	250	328.80	31.52
పసుపు (ఏప్రిల్)	17,550	17,142	-2.32
జీలకర్ర (మార్చి)	23,195	24,235	4.48

బడ్జెట్‌పైనే మార్కెట్ దృష్టి



స్టాక్ మార్కెట్ ఈ వారం

● స్వల్పకాలంలో బలహీనతలు ● వాహన, యంత్రపరికరాల షేర్లకు ప్రతికూలతలు

● సిమెంటు స్క్రిప్‌లకు సానుకూలతలు ● విశ్లేషకుల అంచనాలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారమూ ఒత్తిడిలోనే ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. టారిఫ్ అనిశ్చితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో సెంటిమెంటు దెబ్బతినడం ఇందుకు కారణం. ఫిబ్రవరి 1న (ఆదివారం) ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు, సానుకూలతలు తేవచ్చని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఆరోజు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సాధారణ పనిగంటల్లో పనిచేయనున్నాయి. మూలధన లాభాల పన్నులో కొన్ని మార్పులు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు, పారిశ్రామికోత్పత్తి వృద్ధి గణాంకాలు, విదేశీ మదుపర్ల ధోరణి, రూపాయి కదలికలు ప్రభావం చూపుతాయి. నిఫ్టీ-50 కంపెనీలు 2025 తరహాలోనే ఈ ఏడాదీ 10% వృద్ధిని సాధించొచ్చని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి. శనివారం వెల్లడైన అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాల ప్రభావం మంగళవారం కనిపించొచ్చు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మార్కెట్లకు సోమవారం సెలవు కావడం ఇందుకు నేపథ్యం. రేట్ల కోతపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలనూ గమనించాలి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● టారిఫ్ పెంపు సమీప భవిష్యత్తులో ఉండకపోవచ్చు కనుక, **టెలికాం** షేర్లకు కంపెనీల ఆర్థిక ఫలితాలే కీలకంగా మారనున్నాయి. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సాంకేతిక చార్టుల్లో బలహీనంగా కనిపిస్తున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ రూ.1900 స్థాయికి పడొచ్చు. రూ.2020 వద్ద నిరోధం ఉంది. వొడాఫోన్‌ఐడియాకు రూ.8.8 వద్ద మద్దతు, రూ.10.20 వద్ద నిరోధం కనిపిస్తోంది.

● కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాలతో పాటు సోమవారం వెలువడే యాక్సిస్ బ్యాంక్ ఫలితాలు నిఫ్టీ **బ్యాంక్** సూచీకి దిశానిర్దేశం చేయొచ్చు. బ్యాంక్ నిఫ్టీ 58,000 కంటే కిందకు వస్తే 57,500-57,100కు దిద్దుబాటు కావచ్చు. పైకి కదిలితే మాత్రం 59,350 - 59,500కు పుంజుకోవచ్చు.

● దేశీయంగా సంకేతాలు లేనందున **ఐటీ** షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. తాత్కాలిక దిద్దుబాటు కనిపించొచ్చు. అమెరికా ఫెడ్ సమావేశంపై దృష్టిసారించాలి. ఐటీ సూచీకి 37,000 వద్ద మద్దతు, 39,000 వద్ద నిరోధం కనిపిస్తోంది.

● **యంత్రపరికరాల** కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. బుధవారం వెల్లడయ్యే ఎల్ అండ్ టీ ఫలితాల నుంచి ఈ రంగ కంపెనీలు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. రాబోయే బడ్జెట్‌లో మూలధన వ్యయాల పెంపులో వృద్ధి పెద్దగా ఉండకపోవచ్చన్నది అంచనా.

● **సిమెంటు** కంపెనీల షేర్లు రాణించొచ్చు. ఇటీవల పెంచిన సిమెంటు ధరలు ఇందుకు దోహదం చేయొచ్చు. ఉత్తర భారత్‌లో బస్తా ధర మరో రూ.5 చొప్పున పెరిగే అవకాశం ఉందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఏసీసీ ఫలితాలు బుధవారం ఉన్నాయి.

● ప్రాథమిక, విలువైన లోహ ధరల చలనాలతో పాటు బడ్జెట్ నుంచీ **లోహ** తయారీ కంపెనీ షేర్లు సంకేతాలు అందుకోవచ్చు. శుక్రవారం వెల్లడయ్యే జిందాల్ స్టీల్, సెయిల్, నాల్కో గణాంకాలను గమనించాలి.

● ముడి **చమురు** ధరలు పెరుగుతుండడంతో నిఫ్టీ చమురు-గ్యాస్ సూచీ నష్టపోవచ్చు. దీనికి 11,000-10,900 వద్ద మద్దతు, 11,500-11,550 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. చమురు మార్కెటింగ్ కంపెనీ షేర్లపై ప్రభావం పడొచ్చు.

● **ఔషధ** కంపెనీల షేర్లు ఫలితాల నుంచి సంకేతాలు అందుకోవచ్చు. క్యాన్సర్ మందు రెవ్లిమిడ్ విక్రయాలకు అనుగుణంగా, వీటి మార్జిన్లు తగ్గుతున్నాయి. సన్ ఫార్మా ఈ వారం ఫలితాలు వెల్లడించనుంది.

● **వాహన** కంపెనీల షేర్లు ఒత్తిడిని ఎదుర్కోవచ్చు. జీఎస్‌టీ కోత నేపథ్యంలో, డిసెంబరు ఫలితాలు కావడంతో వాహన కంపెనీలు వృద్ధిని నమోదు చేయొచ్చు. బుధవారం మారుతీ సుజుకీ, టీవీఎస్ మోటార్; శుక్రవారం బజాజ్ ఆటో, ఎక్సైడ్ ఫలితాలు ప్రకటించనున్నాయి.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	192.98	203.30	184.90
బజాజ్ ఆటో	9413.50	9645.20	9219.20
ఐషర్ మోటార్స్	6973.00	7151.00	6861.00
హీరో మోటోకార్ప్	5384.00	5582.00	5269.00
ఎం అండ్ ఎం	3543.40	3619.30	3496.90
మారుతీ	15469.00	15991.70	15177.70
టీవీఎస్ మోటార్	3549.80	3643.10	3489.50

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5835.00	6021.30	5720.30
కోల్గేట్ పామోలివ్	2166.30	2198.00	2142.20
డాబర్ ఇండియా	519.00	538.40	508.20
ఇమామీ	504.45	518.90	491.80
హిందుస్థాన్ యునిలీవర్	2409.50	2464.40	2349.40
ఐటీసీ	323.40	327.90	320.50
మారికో	740.95	759.80	729.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	242.50	260.50	232.70
సీజీ పవర్	549.10	586.40	528.70
ఎల్ అండ్ టీ	3743.80	3833.70	3675.10
సీమెన్స్	2900.40	2963.60	2858.40
థెర్మాక్స్	2920.60	2986.70	2866.90

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	916.10	934.00	900.30
ఐసీఐసీఐ బ్యాంక్	1343.40	1364.30	1325.30
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	82.99	86.30	80.70
ఇండస్‌ఇండ్ బ్యాంక్	892.45	924.80	872.10
కోటక్‌మహీంద్రా బ్యాంక్	422.80	433.70	414.90
పీఎన్‌బీ	120.15	129.00	115.10
ఎస్‌బీఐ	1029.50	1063.40	1008.60

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1132.50	1164.30	1104.90
బయోకాన్	366.20	379.70	358.40
సిప్లా	1315.00	1417.50	1251.70
డాక్టర్ రెడ్డీస్	1235.60	1262.90	1211.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	1967.70	2045.20	1923.00
నాట్కో ఫార్మా	831.95	855.60	813.20

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	950.30	969.60	938.80
హిందుస్థాన్ జింక్	698.70	720.90	677.00
ఎన్ఎమ్‌డీసీ	76.36	79.60	74.40
సెయిల్	149.03	159.30	143.30
టాటా స్టీల్	187.61	194.20	184.00
వేదాంతా	684.15	705.80	670.70

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1386.10	1417.40	1365.40
బీపీసీఎల్	349.15	366.80	339.40
హెచ్‌పీసీఎల్	414.85	438.10	402.20
ఐఓసీఎల్	156.03	162.10	152.60
ఓఎన్‌జీసీ	245.47	249.20	239.70
ఆయిల్ ఇండియా	435.70	447.80	421.00

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1707.00	1731.10	1686.70
ఇన్ఫోసిస్	1670.80	1683.10	1656.10
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6155.00	6461.30	5952.30
టీసీఎస్	3162.50	3212.20	3127.20
టెక్ మహీంద్రా	1701.10	1720.50	1679.50
విప్రో	238.40	245.60	234.20

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1669.10	1752.40	1622.20
అంబుజా సిమెంట్స్	518.60	563.50	488.70
ఇండియా సిమెంట్స్	431.50	472.50	406.30
శ్రీ సిమెంట్	27000.00	27783.30	26543.30
అల్ట్రాటెక్ సిమెంట్	12369.00	12673.00	12131.00


టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,984.70	2023.80	1960.60
ఎమ్‌టీఎన్ఎల్	28.85	31.10	27.50
టాటా కమ్యూనికేషన్స్	1560.20	1604.70	1518.70
వొడాఫోన్ ఐడియా	9.93	10.50	9.60

వసుంధర

vasundhara@eenadu.in

జన 'గణ' మన
అధినాయక జయహో





త్రివిధ దళాల్లో మహిళా నాయకత్వం పెరుగుతోంది. కవాతుల్లో పాల్గొంటూ, సేనల్ని నడిపిస్తూ... దేశ రక్షణలో నారీ భేరి మోగిస్తున్నారు. విధి నిర్వహణలో, వ్యవసాయంలో అహర్నిశలూ శ్రమిస్తూ సామాన్య మహిళలూ అసామాన్య ప్రతిభను కనబరుస్తూ... దేశ ప్రగతిలో నారీశక్తిని చాటుతున్నారు. తమ సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే గౌరవాన్ని పొందారీ మహిళలు.

కళలు, ప్రజాసేవ, వైద్యం... ఏ రంగంలో ఉన్నా తమ పాత్రకు నూటికి నూరు పాళ్లు న్యాయం చేస్తూ అక్కడ సమూల మార్పు తెస్తున్నారు మహిళలు. అందుకు ఉదాహరణే గణతంత్ర దినోత్సవం వేళ విరిసిన ఈ పద్మాలు...

ఇప్పపువ్వు రుచులతో...



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామం ఖైర్‌డాట్వా. ఇక్కడ ఇప్పపువ్వు లడ్డూలు తయారుచేస్తున్న శాంతాబాయికి రాష్ట్రపతి భవన్ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది.

రక్తహీనతతో బాధపడుతున్న ఆదివాసీ చిన్నారులకు ప్రొటీన్, విటమిన్-సి పుష్కలంగా ఉండే ఇప్పపువ్వుతో చేసిన తినుబండారాలు అందించాలనుకున్నారు వైద్యులు. దీంతో ఐటీడీఏ అధికారులు గతేడాది ఖైర్‌డాట్వాకు వచ్చి పెందోర్ శాంతాబాయికి లడ్డూల తయారీపై శిక్షణ ఇప్పించారు. తర్వాత గ్రామంలో లడ్డూల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు ఆమె. మహిళా సంఘానికి చెందిన మరో 12 మందికి తయారీని నేర్పించారు. 5 కిలోల ఇప్పపువ్వు, 2 కిలోల నువ్వులు, 40గ్రాముల చొప్పున బాదం, ఎండుద్రాక్ష, జీడిపప్పు, యాలకులు, రెండు కిలోల బెల్లం, కిలో చక్కెర, రెండు కిలోల వేరుసెనగలను మిక్సీ చేస్తారు. వీటన్నింటినీ నెయ్యిలో వేయించి చేతితోనే లడ్డూలు తయారుచేసేవారు. గతేడాది ఆగస్టులో జిల్లా కలెక్టర్ రాజర్షిషా చొరవతో మహిళా సంఘానికి ఇందిరా క్రాంతిపథం ద్వారా రూ.5 లక్షల రుణం మంజూరైంది. ప్రస్తుతం యంత్రంతో లడ్డూలు తయారుచేస్తున్నారు. వీటిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలల్లో అందిస్తున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లోనూ విక్రయిస్తున్నారు. 'ఆదివాసీల లడ్డూలకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో గర్వంగా ఉంది. రాష్ట్రపతి భవనానికి లడ్డూల్ని తీసుకువెళ్తున్నా. దీన్నో అదృష్టంగా భావిస్తున్నా. పోషకాలు కలిగిన ఈ లడ్డూలను అధికారులు గుర్తించి ప్రాచుర్యం కలిగించడం సంతోషకరం' అని చెబుతారు శాంతాబాయి.

– ఆడెపు రాజ్‌కుమార్, ఆదిలాబాద్

ప్రకృతి సాగుతో విజయం

మైసూర్ మల్లిక, బ్లాక్, రెడ్ రైస్... తదితర దేశీ వరి వంగడాలను సేంద్రియ విధానంలో పండిస్తున్నారు యర్రు స్వాతి. ప్రకృతి సాగు ఆమెకు ఆర్థిక బలాన్ని చేకూర్చడమే కాదు, రాష్ట్రపతితో తేనీటి విందులో పాల్గొనే గౌరవాన్నీ అందించింది.



గుంటూరు జిల్లా, ఆత్మకూరుకు చెందిన స్వాతి డిగ్రీ చేశారు. 2016లో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన స్వాతి... తర్వాత కోలుకున్నారు. దాంతో ఆమె ఆరోగ్య స్పృహ మరింత పెరిగింది. పొదుపు సంఘం మహిళలకు ప్రకృతి వ్యవసాయ విభాగం వాళ్లు సేంద్రియ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. 'అనేక అనారోగ్యాలకు రసాయనాలే కారణం, సహజ సాగుతో ఆ సమస్యను నివారించి భూమి నిస్సారం కాకుండా నియంత్రించవచ్చన్న మాటలతో, క్షేత్ర స్థాయి పర్యటనలతో స్ఫూర్తిపొందారు. భర్త సత్యనారాయణ ప్రోత్సాహంతో 2017లో తమకున్న రెండు ఎకరాల్లో ప్రకృతి సాగుకు సిద్ధమయ్యారు. అందుకు దేశీ వరి రకాలనే ఎంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోత్సాహం అందడంతో మరో 18 ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. ఆమె సాగు విధానాల్ని తెలుసుకునేందుకు పలు ప్రాంతాల రైతులు వస్తుంటారు. గతేడాది అక్టోబర్‌లో దిల్లీలో జరిగిన 'సేంద్రియ సాగు సదస్సు'లో ప్రధాని మోదీ నుంచి అభినందనలు పొందారు స్వాతి. అక్కడ 'పార్టిసిపేటరీ గ్యారంటీ సర్టిఫికెట్ (పీజీఎస్)' ధ్రువపత్రాన్నీ అందుకున్నారు. దీంతో సేంద్రియ ఉత్పత్తులకు మార్కెటింగ్ సులభంగా ఉంటుంది. తాజాగా గణతంత్ర దినోత్సవం రోజు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ఎట్ హోం కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్నారు. 'రైతులందరూ ఈ విధానాన్ని అవలంబిస్తే ఇటు ప్రజలకూ అటు భూమాతకూ ఎంతో మేలు' అని వివరిస్తారు స్వాతి.

– షేక్.అబ్దుల్. తాజుద్దీన్, తెనాలి; దాసరి వెంకటేశ్వరరావు, కొల్లిపర

ఆమె ప్రయాణం... ఓ మధుర గానం!

కొన్ని పాటలు కొందరు తప్ప వేరెవరు పాడినా... ప్రేక్షకుల మనసు దోచుకోలేవు. ఎందుకంటే... పాటలు మనల్ని అలరించడమే కాదు, ఒక థెరపీలానూ పనిచేస్తాయి. అలా తన మధురమైన గాత్రంతో అశేష ప్రేక్షకాదరణ సంపాదించుకున్నారు బాలీవుడ్ ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్.



'చమ్మా... చమ్మా', 'ఏక్... దో... తీన్' అంటూ నాటి అభిమానుల్ని ఉర్రూతలు ఊగించినా... 'అగర్ తుమ్ సాత్ హో' అంటూ నేటి తరాన్ని ఆకట్టుకున్నా ఆమెకే సొంతం. అల్కా గాత్ర సామర్థ్యం, బహుముఖ ప్రజ్ఞ, శాస్త్రీయ సంగీతానికి ఆమె అందించిన సేవల్ని ప్రశంసించని వాళ్లు లేరు. ఈ సేవలకు గానూ పద్మభూషణ్‌ని అందుకున్నారీమె. అయితే ఈ రంగంలో ఆమె ప్రవేశం అంత సులభంగా జరగలేదు. కోల్‌కతాలో పుట్టి పెరిగారీమె. అమ్మ శుభ, శాస్త్రీయ సంగీత కళాకారిణి. అల్కాకు నాలుగేళ్లు ఉన్నప్పట్నుంచే సంగీతం నేర్పడం మొదలుపెట్టారు శుభ. ఆరేళ్లప్పుడే ఆల్ ఇండియా రేడియోలో పాటలు పాడించారు. విన్నవారంతా మంత్రముగ్ధులై... 'సినీరంగంలో అమ్మాయికి మంచి భవిష్యత్తు ఉంటుంది' అన్నారట. దాంతో అల్కాను తీసుకుని ముంబయికి వచ్చారు శుభ. అసలు సవాళ్లు మొదలైంది అక్కడ్నుంచే. 'గొంతు బాగుంది కానీ, గాయనిగా పరిచయం చేయడానికి ఈమెకు ఇంకా వయసుంద'ని చెప్పేవారట. అలా ఎన్నో విఫలయత్నాల తర్వాత... 14ఏళ్ల వయసులో తొలిసారిగా సినిమాలో పాడారు అల్కా. అది మొదలు ఆమె వెనుదిరగలేదు. ఇప్పటివరకూ 25 భాషల్లో దాదాపు 22వేల పాటల్ని పాడారీమె. బాలీవుడ్ మహిళా విభాగంలో లతామంగేష్కర్, ఆశా భోస్లే తర్వాత అత్యధిక సోలో సాంగ్స్ పాడిన గాయని అల్కానే. పాత పద్ధతులు, బాణీలే పాడతాను అంటూ గిరిగీసుకోలేదామె. బీటీఎస్, టేలర్ స్విఫ్ట్ వంటి బ్యాండ్‌లతోనూ పోటీ పడి... యూట్యూబ్‌లో అత్యధికంగా స్ట్రీమింగ్ అయిన గాయనిగా గ్లోబల్ ర్యాంకునూ సాధించారు అల్కా.

దశాబ్దాల నృత్య ప్రస్థానం!



'మీ పాప మంచి నృత్యకారిణి అవుతుందేమోనమ్మా' అన్నారట డాక్టర్... దీపికా రెడ్డి పుట్టినప్పుడు. ఆ మాట నిజం చేస్తూ నిజంగానే కూచిపూడిలో తనదైన ముద్ర వేశారు దీపిక. దేశవిదేశాల్లో గుర్తింపు సాధించిన ఆమె కళారంగంలో తన కృషికి గుర్తింపుగా తాజాగా పద్మశ్రీకి ఎంపికయ్యారు.

తల్లి కూడా శాస్త్రీయ నృత్యకారిణి. దీంతో దీపిక కూడా నాట్యంవైపు ఆకర్షితురాలయ్యారు. ఆరేళ్ల వయసులోనే నేర్చుకోవడం మొదలుపెట్టారు. 11ఏళ్ల వయసులోనే ప్రదర్శనలూ ఇవ్వడం ప్రారంభించారీమె. చిన్నవయసులోనే అరంగేట్రం కూడా చేశారు. అయితే నేర్చుకున్నది మాత్రం కూచిపూడి. మొదట సుమతి కౌశల్ దగ్గర నాట్యంలో ఓనమాలు దిద్దిన ఆమె వెంపటి చిన సత్యం శిష్యరికంలో మరింత రాటుదేలారు. పెళ్లయ్యాకా నాట్యాన్ని వదల్లేదు. దేశీయంగా ఖజురహో, కోణార్క్, హంపి... వంటి ఎన్నో చరిత్రాత్మక ప్రాంతాల్లోనే కాదు... జర్మనీ, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, రష్యా, జపాన్... ఇలా ఎన్నో దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించారు. శివ సతీయం, శాంతి జీవనం, స్త్రీ త్రయం వంటి డ్యాన్స్- డ్రామాలనీ కంపోజ్ చేశారు. అయిదు పదుల వయసు దాటినా ప్రదర్శనలిచ్చారు. అయోధ్య రామమందిరం, తాజా మహా కుంభమేళాల్లోనూ నర్తించారు. కూచిపూడి కళాకారిణిగా తనకంటూ గుర్తింపు సాధించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న, తెలంగాణ రాష్ట్ర అవార్డు, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ వంటి పురస్కారాలెన్నో అందుకున్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీకి ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. కూచిపూడి నృత్యాన్ని తరవాతి తరాలకీ అందించాలని భావించిన ఆమె 2000వ సంవత్సరంలో 'దీపాంజలి' పేరుతో ఓ సంస్థను ప్రారంభించారు. అన్ని వర్గాలవారికీ శాస్త్రీయ నృత్యాన్ని అందుబాటులోకి తెచ్చి, ఎంతోమందిని నృత్యకారులుగానూ తీర్చిదిద్దారు. ఇప్పుడు తన శిష్యులు దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తున్నారు. నృత్యం మన సంస్కృతిలో భాగం. దాని ద్వారానూ సమాజాన్ని తీర్చిదిద్దొచ్చు అని నమ్ముతారీమె.

సామాజికాంశాలతో...




కూచిపూడి నాకు ఓ కళ కాదు.. భగవంతుడికి చేసే ఆరాధన. ఈ కళను భావితరాలకు అందించడమే కాదు... దీని వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు నా వంతు ప్రయత్నిస్తున్నా. పద్మశ్రీ అవార్డు ఆ కృషికి దక్కిన గౌరవంగా భావిస్తున్నా. వెంపటి చినసత్యంగారు నేర్పిన మెలకువలే నేనీ రంగంలో మరింత గొప్పగా రాణించేలా చేశాయి. అమ్మ కూడా నృత్య కళాకారిణే. 1961లో రవీంద్ర భారతి ప్రారంభోత్సవ సమయంలో చిత్రాంగద బ్యాలే చేసింది తను. నేనూ 11ఏళ్ల వయసులో ఆ వేదిక మీదే రంగ ప్రవేశం చేశా. ఆ కార్యక్రమానికి హాజరైన అక్కినేని నాగేశ్వరరావుగారు నేను కూచిపూడి నృత్యానికి టార్చ్‌బేరర్‌గా నిలుస్తానని చెప్పారు. ఇప్పుడు ఆ మాట సార్థకమైందని అంతా అంటుంటే నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. ఈ కళ భవిష్యత్తు తరాలకూ చేరువ కావాలనే ఆలోచనతో కూచిపూడి నృత్యాన్ని కేవలం పౌరాణిక, ఇతిహాస ఇతివృత్తాల మీదే కాదు... పర్యావరణం, మహిళా సమస్యలు, సహజ రంగులు, తెలుగు రాష్ట్రాల కళలు వంటివెన్నో చూపించడానికీ ప్రయత్నిస్తున్నాం. నా తల్లిదండ్రులతో పాటు నా భర్త శ్యామ్‌గోపాల్, పిల్లలు శ్లోక, అభినవ్‌ల ప్రోత్సాహం ఎంతో!

– దీపికా రెడ్డి

ఎడారిలో యాపిల్ పంట!

చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పండే యాపిల్‌ని...ఎడారి ప్రాంతంలో పెంచడం సాధ్యమేనా అనేది మనందరి ప్రశ్న అయితే, దాన్ని సుసాధ్యం చేసి చూపించారు రాజస్థాన్‌కి చెందిన రైతు సంతోష్ దేవి. ఈ కృషికి గుర్తింపుగానే రాష్ట్రపతి నుంచి ప్రత్యేక ఆహ్వానాన్ని అందుకున్నారు.



ఇది ఏళ్ల కష్టానికి దక్కిన గౌరవం అంటారామె. సంతోష్ దేవి ఖేదర్‌ది రాజస్థాన్‌లోని బెరి. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తితో 2008లో ఆమె ఇటువైపు వచ్చారు. భర్త ఉద్యోగానికీ, పిల్లలు స్కూలుకీ వెళ్లాక ఆమె పొలం పనులు మొదలుపెట్టేవారు. రకరకాల ప్రయోగాలూ చేసేవారు. ఆ అనుభవమే ఆమెకు యాపిల్ పండించాలన్న ఆలోచన కలిగించింది. ఇందుకోసం హిమాచల్ ప్రదేశ్‌కి చెందిన ఓ రైతు అభివృద్ధి చేసిన ప్రత్యేక యాపిల్ రకాన్ని ఎంచుకున్నారు. ఆ సమయంలో ఆమెను చూసి అంతా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే చోట అసాధ్యమని కొట్టిపారేశారు. కానీ, తాను మాత్రం అవేవీ పట్టించుకోలేదు. మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఆవుమూత్రం, వేప, ఉమ్మెత్త... లాంటివి వాడి సొంతంగా ఎరువులు తయారు చేసుకునేవారు. జీవామృతం, పంచగవ్య లాంటివి వాడేవారు. నీటికొరతను అధిగమించడానికి డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని ఎంచుకున్నారు. ఇవన్నీ ఫలించాయి. రెండో ఏడాది నుంచే కాపు మొదలైంది. ఎటువంటి రసాయనాలూ వాడకుండా సహజంగా పండించడంతో మంచి ధర కూడా పలుకుతోంది. దాంతో అదే వ్యాపారంగా మలుచుకున్నారామె. వీటితో పాటు దానిమ్మ, బత్తాయి, నిమ్మ, సపోటాలనూ పండిస్తున్నారు. ఎకరం భూమిలో పండ్లతోటలు సాగు చేస్తుండగా, మరో అరెకరంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఏటా లక్షల రూపాయలు ఆదాయన్ని అందుకుంటున్నారు. ఔత్సాహికులకు సేంద్రియ సాగులో శిక్షణా అందిస్తున్నారు.

ఏవియేషన్ దళం... నాయకురాలు!

పోరాటం, కృతనిశ్చయం, ఆత్మవిశ్వాసాలకు ఓ రూపం ఇవ్వమంటే కెప్టెన్ హంసజా శర్మని చూపించొచ్చేమో! సైన్యంలోకి రావడానికీ, తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవడానికీ ఆమె చేసిన కృషి ఎంతో. కాబట్టే, గణతంత్ర దినోత్సవం నాడు ఏవియేషన్ స్క్వాడ్రన్‌ని ముందుండి నడిపే అవకాశాన్ని అందుకున్నారామె.



'నీతో నువ్వు కఠినంగా ఉండు'... హంసజాని చిన్నప్పట్నుంచీ ఎక్కువ ఆకర్షించిన వాక్యమిది. స్కూల్లో పరిచయమైన దీన్ని తను జీవితాంతం పాటిస్తూనే ఉన్నారు. కాబట్టే, తను కోరుకున్న రంగంలోకి అడుగుపెట్టగలిగారామె. హంసజాది జమ్మూ. చుట్టూ ఎన్నో ఆకర్షణలున్నా... ఆమెను ఆకట్టుకున్నది మాత్రం సైన్యం. అమ్మాయివి, కష్టమని ఎవరైనా అన్నా... 'అవును అమ్మాయినే! అయితేనేం రెక్కలు కట్టుకుని ఎగురుతూ దేశాన్ని రక్షిస్తా. నాకు ఆ బలముంది' అని సమాధానమిచ్చేవారట. కాబట్టే, తిరస్కరణలు ఎన్ని ఎదురైనా తలవంచలేదామె. అర్హత సాధించాకా అనారోగ్యం అడ్డుపడింది. అయినా సర్జరీ చేయించుకుని మరీ నాసిక్‌లోని కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో అడుగుపెట్టారు. టాపర్‌గా నిలిచి బెస్ట్ కంబాట్ ఏవియేటర్లు అందుకునే 'సిల్వర్ చీతా ట్రోఫీ'ని గెలిచారు. దాన్ని పొందిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. రుద్ర ఆర్మ్‌డ్ హెలికాప్టర్‌ని నడిపిన తొలి భారతీయ మహిళ హంసజా. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ నిర్వహిస్తోన్న ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎయిర్ లాస్ కోర్సునీ చేశారు. ఆ పట్టా అందుకున్న తొలి వ్యక్తి కూడా కెప్టెన్ హంసజానే. ఆ పట్టుదల, ధైర్యంతోనే తాజాగా గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆర్మీ ఏవియేషన్ నాయకత్వం వహించే అవకాశం అందుకున్నారు. 251 మందితో కూడిన బృందాన్ని ముందుండి నడిపించనున్నారామె. ఒంటరి తల్లి పెంపకంలో పెరిగారు హంసజా. జర్నలిస్ట్ అయిన తల్లి నుంచే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ వంటివి తనకు అలవడ్డాయంటారామె. కాబట్టే, అమ్మాయిలు అరుదుగా ఉండే రంగంలోకి అడుగుపెట్టగలిగా అంటారు హంసజా. ఈమె విజయాల్ని సైన్యంలో నారీశక్తికి చిహ్నంగా అభివర్ణిస్తున్నారంతా.

ఆమె నాయకత్వంలో అతను!

రిపబ్లిక్ పరేడ్‌లో ఎంతోమంది మహిళలు దళాలను నడిపించారు. కానీ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా మాత్రం చరిత్ర సృష్టించారు. 'ఆల్ మేల్ సీఆర్‌పీఎఫ్ కంటింజెంట్'ను ముందుండి నడిపించనున్నారామె. ఆ ఘనత సాధించిన తొలి మహిళా ఆఫీసర్‌గానూ నిలిచారు.



26ఏళ్ల సిమ్రన్ బాలాది జమ్మూ కశ్మీర్‌లోని నౌషెరా. సరిహద్దు ఊరది. సైనికులు, వాళ్ల విధులు, పాటించే క్రమశిక్షణ వంటివెన్నో ఆమెను ఆకర్షించాయి. దీంతో సైన్యంలోకి రావాలని కలలు కన్నారు. 2023లో యూపీఎస్‌సీ... సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ పరీక్ష రాసి, తొలి ప్రయత్నంలోనే ర్యాంకును సాధించారు. ఆ ఏడాది తన రాష్ట్రం నుంచి అర్హత సాధించిన ఏకైక మహిళ సిమ్రన్. తన ఊరి నుంచి ఆఫీసరైన తొలి మహిళ. దీంతో అక్కడి యువతకు స్ఫూర్తిగానూ నిలిచారామె. తాజాగా కర్తవ్యపథ్‌లో సీఆర్‌పీఎఫ్ దళాన్ని నడిపించే అవకాశాన్ని అందుకున్నారు. 140 మంది బృందమది. మొత్తం పురుషులే. ఇలా ఒక మహిళా ఆఫీసర్ ఇంతమంది మగవాళ్లని నడిపించడం దేశ చరిత్రలోనే తొలిసారి. దీంతో ఆమె పేరు మారుమోగుతోంది. ఆమె ఆత్మవిశ్వాసం, కచ్చితత్వం, కంటింజెంట్‌ని కమాండ్ చేయగల నైపుణ్యం అన్నీ పై అధికారులను ఆకర్షించాయి. దీంతో సిమ్రన్‌కి ఈ అవకాశమొచ్చింది. తన ప్రతిభతో ఈ అవకాశాన్ని అందుకున్నారామె. ఒక యువ మహిళా ఆఫీసర్... ఇలా నాయకత్వం వహించడం, దళాన్ని ధైర్యంగా ముందుకు నడిపించడం సైన్యంలో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతోందనడం దానికి ఉదాహరణగా చెబుతున్నారంతా. అవకాశమిస్తే సైన్యంలో అందరితో సమాన పాత్ర పోషిస్తూ సత్తా చాటగలరనడానికి సంకేతంగానూ చెబుతున్నారు.

రాష్ట్రపతితో వేదికను పంచుకుంటూ...

మార్చింగ్ కంటింజెంట్లలో, యుద్ధ విమానాలకు సారథులుగా, బ్యాండ్‌లో వాద్యాలను మోగిస్తూ... తమదైన ముద్ర వేస్తున్నారు మహిళా అధికారిణులు. వీళ్లందరికీ భిన్నంగా ఈసారి గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సహాయకురాలిగా వ్యవహరించే అవకాశాన్ని దక్కించుకున్నారు ఫ్లైట్ లెఫ్టినెంట్ అక్షిత ధన్‌కర్.



'రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగం అవ్వడం నా చిన్ననాటి కల. నాన్న ఎప్పుడూ దేశభక్తి గాథలు చెబుతుండేవారు. గణతంత్ర దినోత్సవ కవాతులో ఆయన పాల్గొన్నారు కూడా. ఆయన్ని చూసే... నేను ఏదో ఒక రోజు దీనిలో పాల్గొనాలి అనుకున్నా. కానీ, వైమానిక దళంలో చేరిన అనతి కాలంలోనే ఈ అవకాశం వస్తుందని ఊహించలేద'ంటారు అక్షిత. ఈమె హరియాణాలోని కాస్నీ గ్రామంలో పుట్టారు. దేశానికి ఎందరో వీరుల్ని అందించిన కేంద్రపాలిత ప్రాంతం జాట్‌లో పెరిగారీమె. ఈ నేపథ్యమే దేశసేవపై ఆమెకు మక్కువను పెంచింది. అయితే సైన్యంలోకి వెళ్లాలన్న సంకల్పం ఏర్పడింది మాత్రం... కాలేజీ రోజుల్లోనేనట. 'దిల్లీలోని శ్రీ గురు తేజ్ బహదూర్ ఖల్సా కాలేజీలో చదువుతున్నపుడు ఎన్‌సీసీలో భాగం అయ్యా. అక్కడ నేర్పిన క్రమశిక్షణ, దేశభక్తి పాఠాలే సైన్యంలో భాగం కావాలన్న ఆలోచనల్ని పెంచాయ'ంటారామె. చదువు పూర్తయ్యాక అర్హత పరీక్ష రాసి పాసై 2023లో వైమానిక దళంలో చేరారు అక్షిత. అప్పట్నుంచి ఆర్మీ హెలికాప్టర్ విభాగంలో తనదైన శైలిలో రాణిస్తున్నారు. పలు గౌరవాలు పొందారు. ఇప్పుడు కర్తవ్య పథ్‌పై రాష్ట్రపతితో కలిసి వేదికను పంచుకునే అవకాశాన్ని అందుకున్నారు. ఈ బాధ్యతను అందుకున్న తొలి మహిళ ఈమే కావడం విశేషం.

మాతా శిశు సంరక్షణకు గుర్తింపుగా...!



నెలలు నిండకుండా, తక్కువ బరువుతో పుట్టిన వారితోపాటు తల్లిపాలు దొరక్క తీవ్ర అనారోగ్యానికి గురైన చిన్నారులెందరో. డా.ఆర్మిడా ఫెర్నాండెజ్ తన కెరియర్‌లో ఇలాంటి వాళ్లెందరినో చూశారు. ఆమె ముంబయిలోని లోకమాన్య తిలక్ మున్సిపల్ జనరల్(సియోన్) ఆసుపత్రిలో నియోనాటాలజిస్ట్‌గా పనిచేసేవారు. 1977లో ఆర్మిడా ఆ విభాగ బాధ్యతల్ని తీసుకున్నారు. ఎలాగైనా శిశు మరణాలను తగ్గించాలని అనుకున్నారు. కారణాలు అన్వేషిస్తున్నప్పుడు- నెలలు నిండకుండా చనిపోతున్న పిల్లలు డబ్బా పాలు తాగడం వల్ల ఓ రకమైన ఇన్ఫెక్షన్ బారిన పడుతున్నారని గుర్తించారామె. దానికి పరిష్కారం తల్లిపాలే... కానీ, అవి అందరికీ అందడం లేదు. దాంతో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు అవసరమని భావించారు. అదే సమయంలో యూకేలో ఫెలోషిప్ చేయడానికి వెళ్లిన ఆమె... ఆక్స్‌ఫర్డ్, బర్మింగ్‌హామ్‌ల్లో విజయవంతంగా నడుస్తోన్న తల్లిపాల బ్యాంకులను పరిశీలించారు. ఆ వివరాలు తెలుసుకుని తిరిగొచ్చాక తాను పనిచేస్తోన్న ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. ఇది దేశంలోనే కాదు... ఆసియాలోనే మొదటి తల్లిపాల బ్యాంకు. ఆమె చేసిన ఈ ప్రయత్నం ఫలించింది. క్రమంగా ఆసుపత్రిలో శిశు మరణాల రేటుని గణనీయంగా తగ్గించడానికి సాయపడింది. ఆపై 1999లో సొసైటీ ఫర్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ యాక్షన్(స్నేహ) పేరుతో ఎన్జీవోని ఏర్పాటుచేశారు. ఇది పట్టణ ప్రాంత మురికివాడల్లోని తల్లీ పిల్లల ఆరోగ్యానికి కృషి చేస్తోంది. కెరియర్ నుంచి పదవీ విరమణ తీసుకున్నాక... క్యాన్సర్ బారిన పడ్డ కూతుర్ని కోల్పోయారామె. తన జ్ఞాపకార్థం 'రోమిలా పాలియేటివ్ కేర్ సెంటర్'ని ఏర్పాటు చేసి జీవిత చరమాంకంలో తీవ్ర అనారోగ్యాల బారిన పడిన వృద్ధులకు సేవలందిస్తున్నారు. దశాబ్దాలుగా శిశు సంరక్షణ, ప్రజారోగ్య విభాగాల్లో ఆమె అందిస్తోన్న సేవలకు గుర్తింపుగానే పద్మశ్రీ అవార్డు వరించిందీమెను.

అనాథలకు అమ్మ... ఈ సుశీలమ్మ!



ఆకలి లేని ప్రపంచాన్ని చూడాలి అంటారు ఎస్.జి.సుశీలమ్మ అందుకే 'సుమంగళి సేవా ఆశ్రమం' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి అనాథలకు ఉచిత విద్య, ఆదరణలేని వృద్ధులకు, మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. అనాథలకు అమ్మా, నాన్న అన్నీ తానే అవుతున్నారు. వందమంది పిల్లలకీ, 400కు పైగా మహిళలకీ ఆశ్రయం కల్పిస్తున్నారు. 174 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించి చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ క్లినిక్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేశారు. రోజూ 800 మందికి ఉచిత భోజనం సరఫరా చేస్తున్నారు సుశీలమ్మ. అందుకే అంతా ఆమెను 'కర్ణాటక మదర్ థెరెసా' అని పిలుచుకుంటారు. కర్ణాటకలోని మారుమూల గ్రామంలో పుట్టిపెరిగారీమె. అమ్మానాన్నలు చెన్నమ్మ, గణేశప్ప. పద్నాలుగు మంది సంతానంలో ఈమె ఒకరు. నాన్నది నేత పని. సంపాదన అంతంత మాత్రమే. పేదరికం కారణంగా సరైన తిండి లేక చిన్నతనంలోనే నలుగురు తోడబుట్టినవాళ్లని పోగొట్టుకున్నారీమె. తరవాత వీళ్ల కుటుంబం బెంగళూరుకి వలస వచ్చింది. కానీ, తండ్రి మరణం కుటుంబాన్ని మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసింది. కుటుంబ పోషణకోసం ఆమె అన్నయ్యలు చదువు మానేసి వ్యాపారం చేశారు. సుశీలమ్మ మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు. ఒకరోజు ఉచితంగా అందించే పుస్తకాలు ఆలస్యం అయ్యాయట. ఆ క్షణం తన చదువు ఆగిపోయిందనుకున్నారట. అందుకే తనలా పేదరికంతో ఇబ్బంది పడే విద్యార్థులకు సహాయం చేయాలనుకున్నారు. బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం వచ్చాక సుశీలమ్మ తన జీతంలో కొంతమొత్తాన్ని విద్యార్థుల చదువుకు వినియోగించేవారు. '1975లో ముగ్గురు అనాథలు ఆశ్రయం కావాలంటూ వచ్చారు. వాళ్లకి ఎలాగయినా సాయం చేయాలనుకున్నా. అప్పుడు నా చేతిలో ఉన్నది రూ.15 మాత్రమే. కానీ ధైర్యంగా ముందడుగు వేశా. ఎం.కాంతమ్మ నేనూ కలిసి 'సుమంగళి సేవాశ్రమం' స్థాపించాం' అంటారీమె. దాదాపు ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న సుశీలమ్మ ఆశ్రమ నిర్వహణ కోసం తొలిరోజుల్లో కూలీగా మూటలు కూడా మోశారు. ఆశ్రమంలో ఉన్నవారి కడుపు నింపేందుకు ఎన్నోసార్లు పస్తులున్నారట కూడా. ఆ సేవల్ని మెచ్చి ఇప్పటికే దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, గ్రామ జ్యోతితో సహా మరెన్నో అవార్డులూ రాగా తాజాగా పద్మశ్రీ వరించిందీమెను.

గిరిజన సంక్షేమమే లక్ష్యంగా!



'పుట్టగానే పువ్వు పరిమళిస్తుంది' అన్నది బుధరీ తాతీకి చక్కగా సరిపోతుంది. ఈమెది ఛత్తీస్‌గఢ్, దంతేవాడలోని హిరానార్ గ్రామంలోని గిరిజన కుటుంబం. చిన్నప్పటి నుంచీ ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపడంతో తల్లిదండ్రులు బలవంతపెట్టలేదు. పదహారేళ్ల వయసులోనే దివ్య జీవన సంఘ్ ఆశ్రమంలో చేరారు. తరవాత అక్కడే దీక్ష తీసుకుని నాలుగు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమానికి అంకితమయ్యారు. హిరానార్, దంతేవాడ... వంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాలతోపాటు దక్షిణ బస్తర్ వంటి వెనకబడ్డ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధికీ వృద్ధుల సేవకీ కృషిచేస్తున్నారు. కుట్టుపనిలో శిక్షణ ఇప్పించడంతోపాటు బాలికలకు విద్యను అందించే సాహసం చేశారు. ఆమె వల్లే సుమారు ఆరు వందల మంది మహిళలు ఆర్థిక స్వావలంబన పొందారు. టైలర్లుగా, ఉపాధ్యాయినులుగా, నర్సులుగా తాము ఉపాధి పొందడమే కాదు, మరెందరో గిరిజనులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆల్ ఇండియా వనవాసి కళ్యాణ్ ఆశ్రమంతో కలిసి హిరానార్‌లో శబరి మహిళా ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులోని మహిళా సహాయక బృందం గురుకులంలోని పిల్లల బట్టలను చూడటంతోపాటు ఆరోగ్యం, పోషకాహారం పట్ల గిరిజన స్త్రీలకి అవగాహన కల్పిస్తారు. బాల్యవివాహాల్ని అడ్డుకుంటారు. వృద్ధులకోసం ఆశ్రమాన్నీ నిర్వహిస్తున్నారు బుధరీ.

భారత్-న్యూజిలాండ్ మూడో టీ20.. మొదట కివీస్ చాలా కష్టపడి 153 చేసింది. బౌలర్ల విజృంభణ చూస్తే టీమ్‌ఇండియాకు కూడా ఛేదన సులభం కాదేమో అనిపించింది. కానీ భారత్ ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు పడగానే మ్యాచ్ అయిపోయింది! టీమ్‌ఇండియా చేతిలో కివీస్ చిత్తయింది. మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్ సూర్య సేన సొంతమైంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విధ్వంసమే ఇందుకు కారణం. ఆకాశమే హద్దుగా సిక్స్‌లతో చెలరేగిన అభిషేక్, సూర్య భారత్‌కు ఘన విజయాన్ని అందించారు. అంతకుముందు బుమ్రా, హార్దిక్, రవి బిష్ణోయ్ బంతితో అదరగొట్టి న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు.

ఛాంపియన్స్

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

బెంగళూరు × ముంబయి

వేదిక: వడోదర, రా॥ 7.30

వేటాడేశారు

- విజృంభించిన బుమ్రా, హార్దిక్
- మూడో టీ20లో కివీస్‌పై భారత్ ఘనవిజయం

- అభిషేక్, సూర్య విధ్వంసం

10 ఓవర్లలోనే 154 పరుగుల ఛేదన

సిరీస్ కైవసం



సూర్యకుమార్ 57 నాటౌట్

అభిషేక్ 68 నాటౌట్

గువాహటి

భారత్‌ది అదే ఆధిపత్యం.. అదే దూకుడు..! బంతితో విజృంభించి బ్యాట్‌తో బాదేసిన సూర్య సేన.. మూడో టీ20లో న్యూజిలాండ్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. సిరీస్‌లో 3-0 ఆధిక్యం సంపాదించింది. ఆదివారం మొదట కివీస్ 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (48; 40 బంతుల్లో 6×4, 1×6), మార్క్ చాప్‌మన్ (32; 23 బంతుల్లో 2×4, 2×6), మిచెల్ శాంట్నర్ (27; 17 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్ప్రీత్ బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18), హార్దిక్ పాండ్య (2/23) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అభిషేక్ శర్మ (68 నాటౌట్; 20 బంతుల్లో 7×4, 5×6), సూర్యకుమార్ (57 నాటౌట్; 26 బంతుల్లో 6×4, 3×6) సుడిగాలి ఇన్నింగ్స్‌లతో భారత్ కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇషాన్ కిషన్ (28; 13 బంతుల్లో 3×4, 2×6) కూడా మెరిశాడు. బుధవారం విశాఖపట్నంలో నాలుగో టీ20 జరగనుంది.

ఆ ఇద్దరి బాదుడు: లక్ష్యమేమీ పెద్దది కాదు. కివీస్ కష్టపడిన తీరు చూస్తే.. మరీ తేలిగ్గా కూడా అనిపించలేదు. అలాంటి స్థితిలో ఛేదనలో తొలి బంతికే సంజు శాంసన్ (0) వికెట్ కోల్పోయింది టీమ్‌ఇండియా. వైఫల్యాలను కొనసాగిస్తూ.. హెన్రీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు శాంసన్. వికెట్ పడినా కూడా తొలి ఓవర్ ముగిసే సరికి భారత్ 16/1తో నిలిచింది. కారణం ఇషాన్. వరుసగా రెండు సిక్స్‌లు, ఫోర్ బాదిన అతడు భారత ఇన్నింగ్స్‌కు వేగాన్ని అందించాడు. ఆ తర్వాత ఓవర్లో అభిషేక్ సిక్స్‌తో ఆ జోరు కొనసాగింది. 3 ఓవర్లకు భారత్ 49/1తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. సోధి బౌలింగ్‌లో ఇషాన్ ఔటైనా.. అభిషేక్ తగ్గలేదు. డఫీ వేసిన ఆరో ఓవర్లో అతడు టాప్‌గేర్‌కు వెళ్లిపోయాడు. ఆ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన అభి.. కేవలం 14 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. గత మ్యాచ్‌లో ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ కూడా రెచ్చిపోయాడు. సోధి బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన అతడు..శాంట్నర్ బౌలింగ్‌లో మరో సిక్స్, ఫోర్ కొట్టాడు. అభిషేక్ బలమైన పుల్ షాట్లు, కట్ షాట్లతో పరుగులు చేస్తే.. సూర్య తన శైలిలో ర్యాంప్ షాట్లు, గ్లాన్స్ సిక్స్‌లతో అలరించాడు. దీంతో భారత్ సాధించాల్సిన లక్ష్యం కర్పూరంలా కరిగిపోయింది. సమీకరణం 66 బంతుల్లో 15 పరుగులుగా మారింది. ఫిలిప్స్ వేసిన పదో ఓవర్లో 6, 4, 4 కొట్టిన సూర్య.. 25 బంతుల్లో అర్ధసెంచరీ చేయడమే కాక భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. 60 బంతులు ఉండగానే టీమ్‌ఇండియా గెలిచింది.

కివీస్ కట్టడి: అంతకుముందు భారత బౌలర్లు న్యూజిలాండ్‌కు కళ్లెం వేశారు. తొలి ఓవర్లోనే డెవాన్ కాన్వే (1)ను హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ముందుకొచ్చి మిడాఫ్ మీదుగా షాట్ ఆడదామని ప్రయత్నించిన కాన్వే.. హార్దిక్ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఈ పర్యటనలో కాన్వేను ఔట్ చేయడం హర్షిత్‌కు ఇది అయిదోసారి కావడం విశేషం. ఆ తర్వాతి ఓవర్లో కివీస్‌కు మరో షాక్ తగిలింది. హార్దిక్ ఓ షార్ట్ బంతితో రచిన్ రవీంద్ర (4) కథ ముగించాడు. 2 ఓవర్లకు 17/2తో న్యూజిలాండ్ ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో ఫిలిప్స్ అడపాదడపా ఫోర్లు కొట్టి స్కోరు పెంచాడు. 5 ఓవర్లకు న్యూజిలాండ్ 34/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకుని తిరిగొచ్చిన బుమ్రా ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. ఆరో ఓవర్లో సీఫర్ట్ (12)ను అతడు ఓ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. దీంతో పవర్ ప్లే ఆఖరికి కివీస్ 36/3తో నిలిచింది. బుమ్రా, బిష్ణోయ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో కివీస్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేయలేకపోయారు. ఈ స్థితిలో కుల్‌దీప్ వేసిన తొమ్మిదో ఓవర్లో చాప్‌మన్ 6, 4.. ఫిలిప్స్ ఓ సిక్స్ బాదడంతో స్కోరు బోర్డు వేగాన్ని అందుకుంది. 11 ఓవర్లకు 82/3తో కివీస్ కోలుకుంది. కానీ గేర్లు మార్చాల్సిన సమయంలో చాప్‌మన్‌తో పాటు మిచెల్ (14), ఫిలిప్స్ ఔట్ కావడంతో ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కానీ కెప్టెన్ శాంట్నర్ పోరాడడంతో న్యూజిలాండ్ కాస్త గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది.



బుమ్రా 3/17

యువీ తర్వాత

అంతర్జాతీయ టీ20ల్లో యువరాజ్ తర్వాత అత్యంత వేగంగా అర్ధశతకం చేసిన భారత బ్యాటర్‌గా అభిషేక్ శర్మ ఘనత సాధించాడు. కివీస్‌తో మూడో టీ20లో అతడు 14 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. యువరాజ్ 2007 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే ఈ మైలురాయిని అందుకున్నాడు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ రాణా 1; సీఫర్ట్ (బి) బుమ్రా 12; రచిన్ రవీంద్ర (సి) బిష్ణోయ్ (బి) హార్దిక్ 4; ఫిలిప్స్ (సి) ఇషాన్ (బి) బిష్ణోయ్ 48; చాప్‌మన్ (సి) శాంసన్ (బి) బిష్ణోయ్ 32; మిచెల్ (సి) ఇషాన్ (బి) హార్దిక్ 14; శాంట్నర్ (సి) అభిషేక్ (బి) బుమ్రా 27; జేమీసన్ (బి) బుమ్రా 3; హెన్రీ రనౌట్ 1; సోధి నాటౌట్ 2; డఫీ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **153; వికెట్ల పతనం:** 1-2, 2-13, 3-34, 4-86, 5-112, 6-112, 7-132, 8-134, 9-144; **బౌలింగ్:** హర్షిత్ రాణా 4-0-35-1; హార్దిక్ పాండ్య 3-0-23-2; రవి బిష్ణోయ్ 4-0-18-2; బుమ్రా 4-0-17-3; కుల్‌దీప్ 3-0-32-0; శివమ్ దూబె 2-0-24-0

భారత్ ఇన్నింగ్స్: సంజు శాంసన్ (బి) హెన్రీ 0; అభిషేక్ శర్మ నాటౌట్ 68; ఇషాన్ కిషన్ (సి) చాప్‌మన్ (బి) సోధి 28; సూర్యకుమార్ యాదవ్ నాటౌట్ 57; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (10 ఓవర్లలో 2 వికెట్లకు) **155; వికెట్ల పతనం:** 1-0, 2-53; **బౌలింగ్:** హెన్రీ 2-0-28-1; జాకబ్ డఫీ 2-0-38-0; జేమీసన్ 1-0-17-0; ఇష్ సోధి 2-0-28-1; శాంట్నర్ 2-0-28-0; ఫిలిప్స్ 1-0-16-0

అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్

రోహిత్, హర్మన్‌లకు పద్మశ్రీ పురస్కారాలు

దిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌ను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ వరించింది. 2026లో ఈ అవార్డు పొందిన ఏకైక క్రీడాకారుడు అతడే. సారథులుగా భారత్‌కు ప్రపంచకప్‌లు అందించిన రోహిత్‌శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆదివారం పద్మ అవార్డులను ప్రకటించింది. భారత హాకీ మాజీ ఆటగాడు బల్‌దేవ్ సింగ్, మహిళల హాకీ మాజీ గోల్ కీపర్ సవిత పునియా, పారా హైజంపర్ ప్రవీణ్‌కుమార్, పారా పవర్ లిఫ్టర్లు భగ్వాన్‌దాస్ రైక్వార్, పజనివేల్‌లు కూడా పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. దిగ్గజ రెజ్లింగ్ కోచ్ వ్లాదిమర్ మెస్త్‌విరిష్విలి (జార్జియా)ని మరణానంతరం పద్మశ్రీ అవార్డుతో గౌరవించారు. సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, బజ్‌రంగ్ పునియా, విజయ్ దహియా వంటి రెజ్లర్లకు అతడు కోచ్‌గా వ్యవహరించాడు.



ఆల్‌రౌండర్ అమృత్‌రాజ్

డేవిస్‌కప్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ స్వస్థలం చెన్నై. కెరీర్‌లో సింగిల్స్ 15, డబుల్స్‌లో 13 టైటిళ్లు సాధించిన అతనికి 1983లో పద్మశ్రీ పురస్కారం లభించింది. 1974, 1987లో డేవిస్‌కప్ ఫైనల్స్ చేరుకున్న భారత జట్లలో అమృత్‌రాజ్ సభ్యుడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 18వ స్థానంలో నిలిచాడు. 1973, 1981 వింబుల్డన్.. 1973, 1974 యుఎస్ ఓపెన్‌లలో అమృత్‌రాజ్ క్వార్టర్‌ఫైనల్స్ చేరుకున్నాడు. అతడు 1976లో వింబుల్డన్ డబుల్స్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లాడు. సింగిల్స్ కెరీర్‌లో 405-312 గెలుపోటముల రికార్డు అమృత్‌రాజ్ సొంతం. ఆటగాడిగా రిటైరైన తర్వాత వ్యాఖ్యాతగా మారిన అతడు.. పలు సినిమాల్లో నటించాడు కూడా. 72 ఏళ్ల అమృత్‌రాజ్‌కు క్రీడాపాలకుడిగానూ అనుభవం ఉంది.



రోహిత్

దూకుడైన కెప్టెన్

దూకుడైన బ్యాటింగ్‌తో హిట్‌మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ భారత క్రికెట్‌పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్‌ఇండియా 2024లో టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. మిగతా రెండు ఫార్మాట్ల నుంచి అతడు రిటైరయ్యాడు.


ఆమె సారథ్యంలో..

భారత క్రికెట్‌కు 2025 మైలురాయిలా నిలిచిపోయిన నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. ఆమె సారథ్యంలోనే భారత జట్టును నిరుడు తొలిసారి ఐసీసీ మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను భారత జట్టు ఓడించిన సంగతి తెలిసిందే. ధోని తర్వాత సొంత గడ్డపై ప్రపంచకప్ అందుకున్న భారత రెండో కెప్టెన్‌గా హర్మన్ ఘనత సాధించింది. బ్యాటర్‌గానూ గొప్ప రికార్డు ఆమె సొంతం. హర్మన్‌ప్రీత్ వన్డేల్లో 4409, టీ20ల్లో 3784 పరుగులు చేసింది. 6 టెస్టుల్లో 200 పరుగులు సాధించింది.



హర్మన్‌ప్రీత్

గుకేశ్, అర్జున్ ఓటమి



అర్జున్

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ వరుసగా రెండో ఓటమి చవిచూశాడు. అతడు ఏడో రౌండ్లో అనీష్ గిరి (నెదర్లాండ్స్) చేతిలో కంగుతిన్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి.. యాగిజ్ కాన్ (తుర్కియే) చేతిలో పరాజయం పాలయ్యాడు. సుదీర్ఘంగా సాగిన గేమ్‌లో అతడు.. 52వ ఎత్తులో ఓడిపోయాడు. అర్జున్, గుకేశ్ మూడేసి పాయింట్లతో ఉన్నారు. మతియాస్ బ్లూబమ్ (జర్మనీ)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. అతడు 2.5 పాయింట్లతో అట్టడుగున ఉన్నాడు. అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్) 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

మెద్వెదెవ్ ఔట్

క్వార్టర్స్‌లో సబలెంకా, అల్కరాస్

ఆస్ట్రేలియన్ ఓపెన్



సబలెంకా

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. రష్యా స్టార్ ఆటగాడు ఆండ్రీ మెద్వెదెవ్ ప్రిక్వార్టర్స్‌లో ఇంటిముఖం పట్టాడు. ఆదివారం పురుషుల సింగిల్స్‌లో 11వ సీడ్ మెద్వెదెవ్ 4-6, 0-6, 3-6తో లెర్నర్ టియాన్ (అమెరికా) చేతిలో వరుస సెట్లలో ఓడాడు. తొలి సెట్ నుంచి టియాన్ దూకుడు ప్రదర్శించాడు. తొలి గేమ్‌లోనే మెద్వెదెవ్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ అమెరికా కుర్రాడు..3-1తో ఆధిక్యంలో నిలిచాడు. అదే జోరుతో సెట్‌ను గెలుచుకున్నాడు. రెండో సెట్ ఆట సైతం మొదటి సెట్‌నే తలపించింది. ఈసారి మెద్వెదెవ్ మరింత తేలిపోయాడు. తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయిన అతడు 0-5తో వెనుకబడి.. ఆ తర్వాత సెట్ చేజార్చుకున్నాడు. మూడో సెట్లోనూ మెద్వెదెవ్ పుంజుకోలేకపోయాడు. మరోసారి తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయిన అతడు.. ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. 6 డబుల్ ఫాల్ట్‌లు, 30 అనవసర తప్పిదాలతో మెద్వెదెవ్ మూల్యం చెల్లించుకున్నాడు. టాప్‌సీడ్ అల్కరాస్ (స్పెయిన్) క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో అతడు 7-6 (8-6), 6-4, 7-5తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించాడు. తొలి సెట్లో మాత్రమే అల్కరాస్‌కు పాల్ నుంచి పోటీ ఎదురైంది. మ్యాచ్‌లో అల్కరాస్ 2 ఏస్‌లు, 35 విన్నర్లు కొట్టాడు. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన నొవాక్ జకోవిచ్ (సెర్బియా) కూడా క్వార్టర్స్ చేరాడు. అతడి ప్రిక్వార్టర్స్ ప్రత్యర్థి జాకబ్ మెన్సిచ్ (చెక్) గాయంతో వైదొలగడంతో.. బరిలో దిగకుండానే నొవాక్ ముందంజ వేశాడు. మూడో సీడ్ జ్వెరెవ్ 6-2, 6-4, 6-4తో సెరున్‌డోలో (అర్జెంటీనా)పై, డిమెనార్ (ఆస్ట్రేలియా) 6-4, 6-1, 6-1తో బబ్లిక్ (కజకిస్థాన్)పై గెలిచారు.



అల్కరాస్

గాఫ్ ముందుకు: కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై గురిపెట్టిన అర్యానా సబలెంకా (బెలారస్) ఆ దిశగా మరో అడుగు వేసింది. ఈ టాప్‌సీడ్ ప్లేయర్ పెద్దగా కష్టపడకుండానే క్వార్టర్‌ఫైనల్ చేరింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సబలెంకా 6-1, 7-6 (7-1)తో ఎంబాకో (కెనడా)ను ఓడించింది. తొలి సెట్లో దూకుడుగా ఆడిన సబలెంకా.. 5-1తో ఆధిక్యంలో నిలిచింది. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి సబలెంకాకు ప్రతిఘటన ఎదురైంది. ఒక దశలో ఆమె 4-1తో తేలిగ్గా సెట్ గెలిచేలా కనిపించినా.. ఎంబాకో 5-5తో పుంజుకుంది. దీంతో టైబ్రేకర్ తప్పలేదు. టైబ్రేకర్‌లో పదునైన సర్వీసులతో అదరగొట్టిన సబలెంకా సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్‌లో సబలెంకా 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-1, 3-6, 6-3తో ముచోవా (చెక్)పై కష్టంగా గెలిచింది. తొలి సెట్లో 5-0తో ఆధిక్యంలో నిలిచిన గాఫ్.. ఆపై తేలిగ్గా సెట్ చేజిక్కించుకుంది. రెండో సెట్లో ముచోవా దూకుడుగా ఆడింది. రెండో గేమ్‌లోనే గాఫ్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ చెక్ అమ్మాయి.. సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. అయితే మూడో సెట్లో గాఫ్ సత్తా చాటింది. నాలుగో గేమ్‌లో బ్రేక్ సాధించిన ఆమె 3-1తో ఆధిక్యంలో నిలిచింది. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను దక్కించుకుంది. పన్నెండో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-2, 6-4తో ఎనిమిదో సీడ్ ఆండ్రీవా (రష్యా)ను ఓడించింది. జోవిచ్ (అమెరికా) కూడా క్వార్టర్స్ చేరింది. ఆమె 6-0, 6-1తో పుటింట్సెవా (కజకిస్థాన్)ను చిత్తు చేసింది.



మెద్వెదెవ్

మాయ, అర్ణవ్ ఔట్: ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్ విభాగంలో సింగిల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. బాలికల తొలి రౌండ్లో మాయ 4-6, 1-6తో అనా పష్కెరెవా (రష్యా) చేతిలో ఓడింది. బాలుర సింగిల్స్ తొలి రౌండ్లో అర్ణవ్ 3-6, 4-6తో విహాన్ రెడ్డి (అమెరికా)కి తలొంచాడు.

రషీద్ శతకం

విదర్భపై ఆంధ్ర విజయం



రషీద్

ఈనాడు, అనంతపురం: రంజీ ట్రోఫీలో ఆంధ్ర అదరగొడుతోంది. షేక్ రషీద్ (132 నాటౌట్; 144 బంతుల్లో 21×4) అజేయ శతకంతో చెలరేగడంతో ఆంధ్ర ఖాతాలో మరో విజయం చేరింది. ఆదివారం ముగిసిన ఎలైట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర 8 వికెట్ల తేడాతో విదర్భను చిత్తుచేసింది. 259 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓవర్‌నైట్ స్కోరు 93/1తో నాలుగో రోజు, ఆదివారం ఆంధ్ర.. ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ (ఓవర్‌నైట్ 50), కెప్టెన్ రికీ భుయ్ (64 నాటౌట్; 92 బంతుల్లో 7×4, 2×6) అభేద్యమైన మూడో వికెట్‌కు 145 పరుగులు జోడించారు. అంతకుముందు శ్రీకర్ భరత్ 43 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ గెలుపుతో 6 పాయింట్లు సాధించిన ఆంధ్ర.. గ్రూపు-ఎ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు 4 విజయాలు, 2 డ్రాలతో మొత్తం 28 పాయింట్లు సంపాదించింది. ఆంధ్ర గ్రూపు దశలో తన చివరి మ్యాచ్‌లో నాగాలాండ్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో నెగ్గితే ఆంధ్రకు రంజీ ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో స్థానం లభిస్తుంది.

హైదరాబాద్ పరాజయం: రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌కు రెండో పరాజయం ఎదురైంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో ముగిసిన ఎలైట్ గ్రూపు-డి మ్యాచ్‌లో ముంబయి 9 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 166/7తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 69.5 ఓవర్లలో 302 పరుగులకు ఆలౌటైంది. ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్ చేరడంతో సి.వి.మిలింద్ (85; 128 బంతుల్లో 12×4, 2×6) ఒంటరి పోరాటం చేశాడు. నితిన్ సాయి యాదవ్ (32; 57 బంతుల్లో 6×4), కెప్టెన్ మహ్మద్ సిరాజ్ (32; 36 బంతుల్లో 5×4, 1×6)లతో కలిసి జట్టు స్కోరును 300 పరుగులు దాటించాడు. ముంబయి బౌలర్ ముషీర్ ఖాన్ (5/79) విజృంభించడంతో హైదరాబాద్ కేవలం 10 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగలిగింది. ముంబయి 3.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో సత్తాచాటిన సర్ఫరాజ్‌ఖాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 560.. హైదరాబాద్ 267 పరుగులకు ఆలౌటయ్యాయి. ఇప్పటి వరకు ఒక గెలుపు, రెండు ఓటములు, మూడు డ్రాలతో హైదరాబాద్ 13 పాయింట్లతో గ్రూపు-డి పట్టికలో అయిదో స్థానంలో ఉంది. ముంబయి (30 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతోంది.

దారికొచ్చిన పాకిస్థాన్

టీ20 ప్రపంచకప్‌నకు జట్టు ప్రకటన



సల్మాన్ అలీ ఆఘా

లాహోర్: బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 ప్రపంచకప్‌ను బహిష్కరిస్తామంటూ బెదిరించిన పాకిస్థాన్ దారికొచ్చింది. భారత్, శ్రీలంకలో జరగనున్న పొట్టి కప్పునకు 15 మంది ఆటగాళ్లతో ఆదివారం జట్టును ప్రకటించింది. పాక్ జట్టుకు సల్మాన్ అలీ ఆఘా సారథ్యం వహించనున్నాడు. "మేము సెలక్టర్లం. జట్టును ఎంపిక చేయడమే మా పని. ఐసీసీ గడువు లోపు జట్టును ప్రకటించాం. టోర్నీలో పాక్ జట్టు ఆడటంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అంతకంటే నేనేమీ చెప్పలేను. పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ కూడా ఇదే విషయం చెప్పాడు. కాబట్టి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తాం" అని సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ అన్నాడు.

పాకిస్థాన్ జట్టు: సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజాం, ఫహీం అష్రాఫ్, ఫఖర్ జమాన్, ఖవాజా మహ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్ (వికెట్ కీపర్), సైమ్ అయూబ్, షహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్‌ఖాన్ (వికెట్ కీపర్), ఉస్మాన్ తారిక్

బంగ్లా దూరమవడం విచారకరం

ప్రపంచ క్రికెటర్ల సంఘం

లండన్: టీ20 ప్రపంచకప్‌నకు బంగ్లాదేశ్ దూరమవడంపై ప్రపంచ క్రికెటర్ల సంఘం (డబ్ల్యూసీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామం విచారకరమని వ్యాఖ్యానించిన డబ్ల్యూసీఏ.. దీనిపై లోతైన సమీక్ష అవసరమని పేర్కొంది. "టీ20 ప్రపంచకప్‌నకు బంగ్లా దూరమవడం క్రికెట్‌కు, ఆ దేశ ఆటగాళ్లకు, అభిమానులకు విచారకరమైన క్షణం. దీనిపై లోతైన సమీక్ష అవసరం. ప్రతి జట్టును.. ఆటగాడిని గౌరవంతో చూసినప్పుడు.. వారికి సముచితంగా మద్దతు లభించినప్పుడు.. నిష్పక్షపాత నిబంధనలతో పాల్గొనగలిగినప్పుడు క్రికెట్ మరింత బలంగా తయారవుతుంది. ఆటగాళ్లంతా క్రికెట్ విజయానికి నిజమైన సహకారం అందించినప్పుడే ఆట అత్యుత్తమంగా ఉంటుంది. విశ్వ వేదికపై పోటీపడే అవకాశాన్ని కోల్పోయిన బంగ్లాకు, ఆ దేశ క్రికెటర్లకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లు, సంఘాల తరపున మా మద్దతు కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ బలోపేతానికి బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తో సహా ఇతర భాగస్వాములందరితో నిర్మాణాత్మకంగా కలిసి పని చేయాలనే మా నిబద్ధతలో ఎలాంటి మార్పు లేదు" అని డబ్ల్యూసీఏ సీఈఓ టామ్ మోఫాట్ తెలిపాడు. డబ్ల్యూసీఏలో పలు దేశాలకు చెందిన ప్రొఫెషనల్ క్రికెటర్లు సభ్యులుగా ఉన్నారు. భారత ఆటగాళ్లు ఈ సంఘంలో లేరు.

వందల కి.మీ. దూరం చిన్నబోతుంది!

- శత్రు దేశాల యుద్ధ నౌకలే లక్ష్యంగా యాంటీ షిప్ హైపర్‌సోనిక్ గ్లైడ్ మిసైల్ డిజైన్
- గణతంత్ర వేడుకల్లో తొలిసారి ప్రదర్శన

ఈనాడు, కర్నూలు: సముద్రంపై సుదూరంగా ఉన్న శత్రు దేశాల యుద్ధనౌకలను తుత్తునియలు చేసేందుకు సిద్ధం చేసిన దేశ తొలి లాంగ్‌రేంజ్ యాంటీ షిప్ హైపర్‌సోనిక్ గ్లైడ్ మిసైల్ (ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎం) మొదటిసారి కనిపించనుంది. దిల్లీలో సోమవారం జరగనున్న గణతంత్ర వేడుకల కవాతులో దీనిని ప్రదర్శిస్తారు. ఈ క్షిపణి పరిధి 1500 కి.మీ. కాగా గంటకు 6,100 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. హైదరాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరీలో అభివృద్ధి చేసిన ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎంను 2024 నవంబర్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇందులో విజయం సాధించడంతో మరో రెండేళ్లలో సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు.



ప్రత్యేకతలివీ..


- సముద్రజలాల్లో వేగంగా ప్రయాణించే యుద్ధనౌకలను ఈ క్షిపణి కచ్చితంగా గుర్తించి 100 శాతం ధ్వంసం చేస్తుంది.
- హైపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించే ఈ క్షిపణిని శత్రుదేశ యుద్ధనౌక గుర్తించేలోపే పని ముగిసిపోతుంది. ఇందు కోసం ఏరో డైనమిక్ డిజైన్‌తో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.
- ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎంను ప్రత్యేకంగా తయారుచేసిన మొబైల్ లాంచర్ నుంచి ప్రయోగిస్తారు.
- 'బూస్ట్ అండ్ గ్లైడ్' సాంకేతికతను దీనికి వినియోగించారు. ప్రయోగించిన మరుక్షణమే గరిష్ఠ వేగంతో దూసుకెళ్తుంది.
- భూ ఉపరితలాలపై ఉన్న లక్ష్యాలను కూడా సునాయాసంగా ఛేదిస్తుంది.
- శత్రుదేశ రాడార్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీని రాకను గుర్తించలేవు.
- ఎలాంటి యుద్ధనౌకలనైనా క్షణాల్లో ధ్వంసం చేస్తుంది.
- అతితక్కువ ఎత్తులోనే ప్రయాణిస్తూ లక్ష్యాలను చేరుకోగలగడం దీనికున్న మరో ప్రత్యేకత. అన్ని రకాల పేలోడ్‌లనూ మోసుకెళ్లగలదు.

ప్రాజెక్టు డైరెక్టర్ తెలుగువారే..

డీఆర్‌డీవో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లుగా తెలుగువారైన ఎ.ప్రసాద్ గౌడ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఆయన.. 30 సంవత్సరాల కిందట డీఆర్‌డీవోలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

త్రివిధ దళాలకు ఉపయోగపడేలా..

– ఎ.ప్రసాద్‌గౌడ్, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎం ప్రాజెక్ట్



హైపర్‌సోనిక్ క్షిపణులతో సుదూరంలోని లక్ష్యాలను మరింత వేగంగా, అత్యంత కచ్చితత్వంతో ఛేదించవచ్చు. ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాయుసేన, పదాతి దళాల అవసరాలకు వీలుగా ఉండేలా మరిన్ని రకాల క్షిపణి వ్యవస్థలను తీర్చిదిద్దుతున్నాం.

అమరావతిలో తొలి ముచ్చటైన పండగ

గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం

ఈనాడు, అమరావతి-తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైంది. రాయపూడి సమీపంలో సీడ్ యాక్సెస్ రహదారి పక్కనున్న ఎమ్మెల్యే భవన సముదాయాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలో సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమరావతిలో తొలిసారిగా గణతంత్ర వేడుకలు నిర్వహిస్తుండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వేదికకు వెళ్లే మార్గాల్లో త్రివర్ణ పతాకాలు కనువిందు చేస్తున్నాయి. ముచ్చటైన గ్యాలరీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వివిధ దళాల కవాతుకు పరేడ్ ప్రాంగణం సిద్ధం చేయగా, శకటాల ప్రదర్శనకు రహదారి నిర్మించారు. వీవీఐపీ, వీఐపీ పార్కింగ్‌కు 15 ఎకరాలు.. సాధారణ ప్రజలు, రైతుల కోసం మరో 25 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించారు.



అమరావతిలో గణతంత్ర వేడుకలకు సిద్ధమైన పరేడ్ మైదానం



విద్యుద్దీపాల వెలుగుల్లో రాష్ట్ర సచివాలయం

అమరావతి రైతులకు ప్రత్యేక ఆహ్వానం

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానాలు పంపింది. వారి కోసం ప్రాంగణంలోనూ గ్యాలరీ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర మంత్రులు తదితరులు హాజరు కానున్నారు. మొత్తం 13 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. వేదిక వద్ద ఏర్పాట్లను పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం పరిశీలించారు.

22 శకటాలు సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా పలు శాఖలకు చెందిన 22 శకటాలను సిద్ధం చేశారు. గణతంత్ర దినోత్సవంలో వీటిని ప్రదర్శించనున్నారు. ఇందులో వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ ఇతివృత్తంతో సాంస్కృతిక శాఖ శకటాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. పేదరికం లేని సమాజం (జీరో పావర్టీ మిషన్) ఇతివృత్తంతో ప్రణాళిక, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, స్త్రీ, శిశు సంక్షేమం, నైపుణ్య శిక్షణ, ఉపాధి తదితర శాఖల ఆధ్వర్యంలో శకటాలు సందడి చేయనున్నాయి.

అనంతపురం ప్రజలకు ప్రధాని ప్రశంస

మన్ కీ బాత్‌లో అక్కడి జలసంరక్షణ చర్యలు ప్రస్తావించిన మోదీ



ప్రధాని 'మన్ కీ బాత్'లో ప్రదర్శించిన చిత్రాలు

ఈనాడు, దిల్లీ: కరవు పీడిత అనంతపురం జిల్లాలో ప్రజా భాగస్వామ్యంతో చేపట్టిన జల సంరక్షణ పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆదివారం ఆకాశవాణి ద్వారా చేసిన 'మన్ కీ బాత్' ప్రసంగంలో మోదీ అనంతపురం ప్రజల కృషిని ప్రస్తావించారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ప్రజా భాగస్వామ్యంతో జల సంరక్షణ చర్యలు చేపట్టారు. వర్షాభావ పరిస్థితులతో దీర్ఘకాలంగా సతమతమవుతూ వచ్చిన ప్రాంతాల్లో ఇదీ ఒకటి. ఇక్కడన్నీ ఎర్ర, ఇసుక నేలలు కావడం వల్ల రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. చాలా ప్రాంతాల్లో దీర్ఘకాలం వర్షాలు పడవు. అందుకే జనం చాలాసార్లు అనంతపురం పరిస్థితిని ఎడారి ప్రాంతాలతో పోలుస్తుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా స్థానికులు జలాశయాలను పునరుద్ధరించే పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ వ్యవస్థ సహకారంతో పదికి పైగా జలాశయాలకు పునరుజ్జీవం లభించింది. అవి ఇప్పుడు నీటితో నిండుతున్నాయి. భారీ ఎత్తున మొక్కలూ నాటారు. ఇప్పుడు ఇక్కడ పిల్లలు ఈత కొడుతూ ఆనందం పంచుకుంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇక్కడ వాతావరణం పూర్తిగా పునరుజ్జీవం పొందింది" అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.


మోదీ సందేశం.. జల సంరక్షణకు ప్రోత్సాహం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అనంతపురం జలసంరక్షణ చర్యల్ని 'మన్ కీ బాత్'లో ప్రస్తావించడంపై ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. మోదీ ప్రశంసలు జల సంరక్షణకు మరింత ప్రోత్సాహం అందిస్తాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బ్యారేజీకి గణతంత్ర శోభ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకాశం బ్యారేజీని విద్యుద్దీపాలతో అలంకరించారు. దేదీప్యమానంగా వెలిగిపోతున్న బ్యారేజీ వెలుగులు కృష్ణమ్మలో ప్రతిబింబించిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, మంగళగిరి అర్బన్



బౌద్ధం.. ఓ జీవన విధానం

ఉండ్రాజవరంలో వైభవంగా మైత్రేయ బుద్ధ విహార్ కలశస్థాపన



బుద్ధ విహార్‌లో కలశాల చెంత జ్యోతి వెలిగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో బౌద్ధ పీఠాధిపతి భంతేజీ అనాలయో తదితరులు



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన శాంతి ర్యాలీలో బౌద్ధ పతాకం ప్రదర్శన

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, ఉండ్రాజవరం: 'బౌద్ధం అంటే జీవన విధానం. ఒక జీవన కళ. ఇది అందరికీ సంబంధించింది. అన్ని మతాలు, భాషలు కులాలు, ప్రాంతాల వారి సమ్మేళనం. మనసు, దయ, కరుణ, మైత్రి, ప్రజ్ఞతో నిండిపోవాలని బుద్ధిజం చెబుతోంది' అని పలువురు బౌద్ధ ప్రముఖులు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ఆదివారం మైత్రేయ బుద్ధవిహార్ కలశ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ, గుజరాత్ నుంచి ప్రముఖ బౌద్ధ భిక్షువులు బుద్ధపాల భంతేజీ, సారిపుత్త భంతేజీ, సంఘపాల భంతేజీ, సిద్ధార్థ భంతేజీ, సద్ధారక్షి భంతేజీ హాజరై బుద్ధుడి బోధనలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ. . ప్రభుత్వపరంగా బౌద్ధ ఆరామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఛైర్మన్ బూరుపల్లి శేషారావు కలశాలతో పాదయాత్ర ప్రారంభించారు. ఉండ్రాజవరం వరకు నిర్వహించిన యాత్రలో 130 మీటర్ల బౌద్ధపతాకం ప్రదర్శించారు. అమెరికా నుంచి వచ్చిన కోనేరు సుధాకర్ దంపతులు బౌద్ధం గురించి పలు విషయాలు వివరించారు. బౌద్ధ పీఠాధిపతి భంతేజీ అనాలయో, గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ చెన్నూరు ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

వ్యోమగామి శుభాంశుకు అశోక చక్ర

రోదసి యాత్రికుడికి అత్యున్నత పురస్కారం

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగా రికార్డుకెక్కిన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు ప్రభుత్వం ఘనమైన గుర్తింపునిచ్చింది. శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర'కు ఎంపిక చేసింది. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'కు ఎంపికయ్యారు.

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా గత ఏడాది జూన్‌లో శుక్లా.. అమెరికా, పోలండ్, హంగరీల వ్యోమగాములతో కలిసి అంతరిక్షంలోకి వెళ్లారు. తద్వారా.. రాకేశ్ శర్మ రోదసిలోకి వెళ్లిన 41 ఏళ్ల తర్వాత మన దేశ పౌరుడొకరు ఆ ఘనత సాధించినట్లయింది. శుక్లా 18 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. అక్కడ ఆయన అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని భార రహిత పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల మధ్య అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తిచేశారు.

లఖ్‌నవూకు చెందిన శుక్లా.. 2006లో భారత వాయుసేనలో ఫైటర్ పైలట్‌గా చేరారు. 2వేల గంటల పాటు లోహవిహంగాలను నడిపిన అనుభవం ఆయన సొంతం. సుఖోయ్-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 వంటి విమానాలను ఆయన నడిపారు.

కీర్తి చక్రకు ఎంపికైన ప్రశాంత్.. 1998 డిసెంబరులో భారత వాయుసేనలో చేరారు. ప్రతిష్ఠాత్మక 'స్వోర్డ్ ఆఫ్ ఆనర్'ను కూడా అందుకున్నారు. పైలట్‌గా 3వేల గంటలకుపైగా గగనవిహారం చేశారు. యాక్సియం-4 మిషన్‌కు ఆయన ప్రత్యామ్నాయ వ్యోమగామిగా ఉన్నారు.

మొత్తం 70 మందికి..

విధి నిర్వహణలో అత్యుత్తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన 70 మంది త్రివిధ దళాల సిబ్బందికి శౌర్య పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రకటించారు. ఇందులో ఆరుగురిని మరణానంతరం ఎంపిక చేశారు. మొత్తం.. ఒక అశోక చక్ర, మూడు కీర్తి చక్రలు, 13 శౌర్య చక్రలు ప్రకటించారు.

ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌తోపాటు మేజర్ అర్ష్‌దీప్ సింగ్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బాలను 'కీర్తి చక్ర' పురస్కారాలు వరించాయి. శాంతికాలంలో ఇచ్చే మూడో అత్యున్నత సాహస పురస్కారమైన శౌర్య చక్రకు ఎంపికైనవారిలో నౌకాదళానికి చెందిన మహిళా అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఉన్నారు. వీరు తెరచాప నౌక ఐఎన్ఎస్‌వీ తరణిలో 8 నెలల పాటు ప్రపంచాన్ని చుట్టివచ్చారు. శౌర్య చక్రకు ఎంపికైనవారిలో లెఫ్టినెంట్ కర్నల్ ఆదిత్య శ్రీకుమార్, మేజర్ అంశుల్ బాల్టు, మేజర్ శివ్‌కాంత్ యాదవ్, మేజర్ వివేక్ మెచ్, మేజర్ లైషంగ్తెమ్ దీపక్ సింగ్, కెప్టెన్ యోగేంద్ర సింగ్ ఠాకు, సుబేదార్ పి.హెచ్.మోజెస్, బల్‌దేవ్ చంద్ (మరణానంతరం), రైఫిల్‌మ్యాన్ మంగళం సంగ్ వైపెయ్, ధ్రువ జ్యోతి దత్తాలు ఉన్నారు. సీఆర్పీఎఫ్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ విపిన్ విల్సన్‌ను కూడా ఈ పురస్కారం వరించింది. వీటికితోడు సైనిక దళాలకు చెందిన ఒకరికి బార్ టు సేనా మెడల్ (శౌర్య), 44 మందికి సేనా పతకాలు (శౌర్య), ఆరుగురికి నౌ సేనా పతకాలు (శౌర్య), ఇద్దరికి వాయు సేనా పతకాలను ప్రకటించారు.

అదనపు ఎస్పీ రవి మనోహరాచారికి రాష్ట్రపతి పోలీసు సేవా పతకం

- మరో 15 మంది పోలీసులకు సేవా పతకాలు
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ



గొల్లపోతు రవిబాబు

ఈనాడు, అమరావతి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదివారం పోలీసు పతకాలు ప్రకటించింది. తిరుపతి జిల్లా శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ రవి మనోహరాచారికి రాష్ట్రపతి పోలీసు సేవా పతకం (ప్రెసిడెంట్ మెడల్) లభించింది. మరో 15 మంది అధికారులకు పోలీసు సేవా పతకాలు (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) వరించాయి. జైళ్ల శాఖలో ముగ్గురికి సేవా పతకాలు వచ్చాయి. వివరాలివి.

రాష్ట్రపతి పోలీసు సేవా పతకం:

1. రవి మనోహరాచారి, అదనపు ఎస్పీ, తిరుపతి జిల్లా

పోలీసు సేవా పతకాలు

1. కామవరపు విక్రమరావు, ఎస్సై, డీటీసీ, పార్వతీపురం మన్యం జిల్లా
2. కృష్ణమోహన్ సింగల, అదనపు ఎస్పీ, ఏఆర్, కర్నూలు జిల్లా
3. నరసింహరావు కుందేటి, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నెల్లూరు
4. రాయపు శివరెడ్డి, డీఎస్పీ, ఫింగర్ ప్రింట్ బ్యూరో, సీఐడీ
5. శ్రీనివాసరెడ్డి చిన్నవ్వల, ఏఆర్ ఎస్సై, ఏపీఎస్పీ రెండో బెటాలియన్, కర్నూలు
6. రంగయ్య గల్ల, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, బాపట్ల జిల్లా
7. జయరామ్ కటారి, ఏఆర్ ఎస్సై, ఎస్ఏఆర్ సీపీఎల్, ఏపీ యూనిట్, హైదరాబాద్
8. మాదాసు గంగాధరరావు, ఏఎస్సై, తూర్పు ట్రాఫిక్ పోలీసుస్టేషన్, గుంటూరు
9. నరసింహులు కలిదేవి, హెడ్‌కానిస్టేబుల్ ఎస్ఎస్‌జీ, నిఘా విభాగం
10. ఈత వెంకటకృష్ణ మునేశ్వరరావు, ఏఆర్ ఎస్సై, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, అనకాపల్లి
11. అబ్రహం అన్నలదాసు, ఏఎస్సై, చిన్నచౌక్ పోలీసుస్టేషన్, కడప జిల్లా
12. రామకృష్ణ కొప్పిశెట్టి, ఏఎస్సై, ఉండ్రాజవరం పోలీసుస్టేషన్, తూర్పుగోదావరి
13. వెంకట శేష నాగ మల్లికార్జునరావు పోలవరపు, అసిస్టెంట్ కమాండెంట్
14. షేక్ షఫీఉల్లా, ఎస్సై, జిల్లా ఎస్‌బీ, అనంతపురం
15. కరణాడ రామారావు, అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్

జైళ్ల శాఖలో సేవా పతకాలు పొందిన వారు

1. గొల్లపోతు రవిబాబు, జిల్లా సబ్ జైళ్ల అధికారి, చిత్తూరు
2. దోనేపూడి వెంకట కృష్ణప్రసాద్, చీఫ్ హెడ్ వార్డర్, నరసరావుపేట స్పెషల్ సబ్‌జైలు
3. గెర ఆనందరావు, హెడ్‌వార్డర్, గుంటూరు

ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత

- జాతీయ ఓటర్ల దినోత్సవంలో సీఎస్ విజయానంద్

ఈనాడు డిజిటల్, అమరావతి: 'ఓటు వేయడం హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉంది. యువత ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకొని, ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలి' అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆకాంక్షించారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఓటింగ్‌లో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, యువ ఓటర్లను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధానోద్దేశం. ఈ ఏడాది 'నా భారత్ - నా ఓటు' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం' అని వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి జనవరి 1 ప్రామాణికంగా తీసుకునేవారన్నారు. ఇప్పుడు కొత్త చట్టం ప్రకారం.. 18 ఏళ్లు నిండిన వారు ఏడాదిలో జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1 తేదీల్లో ఎప్పుడైనా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ధన ప్రభావం నుంచి ఎన్నికలకు విముక్తి కల్పించాలి: నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ధన ప్రభావం నుంచి ఎన్నికలకు విముక్తి కల్పించాలన్నారు. ధనబలంతో పార్టీ టికెట్లు పొందడం, డబ్బు వెదజల్లి గెలవడం పరిపాటిగా మారిందని, ఈ కోవలో రాజకీయ సలహాదారులు రూ.కోట్లు దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 తిరుపతి పార్లమెంట్ ఎన్నికల్లో 25 వేల నకిలీ ఎపిక్ కార్డులతో దొంగఓట్లు వేశారని, అందుకోసం బస్సుల్లో జనాన్ని తీసుకొచ్చి ధర్మసత్రాల్లో ఉంచారని గుర్తుచేశారు. దీనికి సంబంధించి తరువాత కొంతమంది అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారని పేర్కొన్నారు. ఓ వ్యక్తికి ఎక్కడ ఓటు హక్కు ఉండాలనేది అతనే నిర్ణయించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.

ఉత్తమ ఎన్నికల నిర్వహణ.. కలెక్టర్లకు అవార్డులు

2025 ఏడాదిలో ఉత్తమంగా ఎన్నికల నిర్వహణ చేపట్టిన అప్పటి కలెక్టర్లకు అవార్డులు అందజేశారు. వీరిలో హరేంధిర ప్రసాద్, రామసుందర్‌రెడ్డి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఎస్.వెంకటేశ్వర్, జి.రాజకుమారి, డాక్టర్ లక్ష్మీశ, పి.రాజాబాబు, సుమిత్‌కుమార్, ఎస్.షాన్‌మోహన్, డీకే బాలాజీ, హిమాంశు శుక్లా, సి.నాగరాణి తదితరులున్నారు.



ఓటుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎస్ విజయానంద్. చిత్రంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

- ఓటర్లుగా కొత్తగా నమోదు చేసుకున్న నలుగురు యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేసి.. నిర్భయంగా ఓటు వేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వర్చువల్‌గా తన సందేశాన్ని వినిపించారు.

కడపలో ముగిసిన ఇస్తేమా



ఈనాడు, కడప: కడపలో మూడు రోజుల పాటు జరిగిన ముస్లింల ఇస్తేమా ఆదివారంతో ముగిసింది. మత పెద్దలు ఇస్లాం బోధనలు వినిపించారు. చివరి రోజు ప్రత్యేక దువా (సామూహిక ప్రార్థన) భారీగా పాల్గొన్నారు. ఇస్తేమా విజయవంతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకరించారంటూ తబ్లీగ్ జమాత్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూఖ్ షిబ్లీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు పెసా ర్యాంకులు

ఈనాడు, దిల్లీ: పెసా (పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) యాక్ట్ స్టేట్ ర్యాంకింగ్స్ 2024-25లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌లు తొలి మూడు ర్యాంకులు సాధించాయి. పెర్ఫార్మర్ విభాగంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వరుస స్థానాల్లో నిలిచాయి. యాస్పిరెంట్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆదివారం ఈ ర్యాంకులు విడుదల చేసింది.


గాయపడిన తాబేలుకు పునర్జన్మ
శాటిలైట్ ట్యాగ్‌తో ట్రాకింగ్



మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా తీరప్రాంత పట్టణం దహనులో జరిగిన ఓ ఘటన పర్యావరణవేత్తల దృష్టిని ఆకర్షిస్తోంది. తీవ్రంగా గాయపడి సముద్రతీరంలో పడున్న ఆలివ్ రిడ్లీ తాబేలు 2025 ఆగస్టు 10న స్థానిక మత్స్యకారులకు దొరికింది. అటవీశాఖ అధికారులు ఆ తాబేలును దహనులోని సముద్ర తాబేళ్ల చికిత్సా కేంద్రానికి తరలించారు. 29.6 కిలోల బరువు గల ఈ తాబేలుకు అత్యుత్తమ వైద్యం చేసి, ట్యూబు ద్వారా ఆహారం అందించారు. మూడున్నర నెలల తర్వాత కోలుకొంది. దహను ప్రాంత జలాల పేరు మీద 'ధవల్ లక్ష్మి' అని పేరు పెట్టిన ఈ ఆడ తాబేలును తిరిగి నవంబరు 20న సముద్రంలోకి విడిచిపెట్టారు. 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' సహకారంతో తాబేలు వీపుపై అధునాతన శాటిలైట్ ట్యాగ్ అమర్చిన అధికారులు సముద్రంలో అది రెండు నెలల్లో 1,847 కిలోమీటర్లు ప్రయాణించినట్లు గుర్తించారు. తాబేలు కదలికలను శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. సముద్రాన్ని శుభ్రం చేసి పర్యావరణానికి మేలు చేసే తాబేళ్లకు మత్స్యకారుల వలలు, సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రాణసంకటంగా మారుతున్నాయి.


నూటొక్క అంతస్తుల భవనం
తాడు లేకుండా ఎక్కిన అలెక్స్





ఇంటర్నెట్ డెస్క్: తైవాన్‌లోని అత్యంత ఎత్తైన భవనం తైపీ 101ని అమెరికా రాక్ క్లైంబర్ అలెక్స్ హానోల్డ్ తాడు సాయం లేకుండా సునాయాసంగా అధిరోహించారు. భవనం బయటి భాగంలో ఓ మూలగా ఉన్న 'ఎల్' ఆకారపు నిర్మాణాలను చేతో పట్టుకొంటూ ఎక్కాడు. ఈ సాహసాన్ని నెట్‌ఫ్లిక్స్ ప్రత్యక్ష ప్రసారం కోసం చిత్రీకరించారు. భవనంలో మొత్తం 101 అంతస్తులున్నాయి. మధ్యలో ఉన్న 64 అంతస్తులను ఎక్కడమే అత్యంత కష్టమైన భాగం. 508 మీటర్ల ఎత్తు ఉన్న ఈ భవనాన్ని ఎక్కేందుకు అలెక్స్ ఎటువంటి పరికరాలను వాడలేదు. వట్టి చేతులతో ఈ సాహసం చేయడం విశేషం. మొత్తం 1,667 అడుగుల ఎత్తుకు చేరుకొనేందుకు అతడికి 90 నిమిషాల సమయం పట్టింది. భవనంలో ఎత్తైన ప్రదేశానికి చేరుకున్నాక చేతులు ఊపుతూ కింద ఉన్న ప్రజలకు అభివాదం చేశాడు. గతంలో యస్మైట్ నేషనల్ పార్కులోని 900 మీటర్ల ఎత్తున్న ఎల్ క్యాప్టన్ అనే భారీ శిలను ఎక్కి అలెక్స్ పాపులర్ అయ్యాడు.

ప్రముఖ జర్నలిస్టు మార్క్ టుల్లీ కన్నుమూత



దిల్లీ: ప్రముఖ జర్నలిస్టు, రచయిత మార్క్ టుల్లీ(90) కన్నుమూశారు. 22 ఏళ్లపాటు ఆయన బీబీసీ దిల్లీ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న టుల్లీ.. దిల్లీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. మరో సీనియర్ జర్నలిస్టు, మార్క్‌కి సన్నిహిత మిత్రుడైన సతీష్ జాకబ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 1935 అక్టోబరు 24న పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో మార్క్‌టుల్లీ జన్మించారు. డార్జిలింగ్‌లో పాఠశాల విద్యను చదివిన ఆయన.. ఉన్నత చదువు కోసం ఇంగ్లాండ్ వెళ్లారు. 1964లో బీబీసీ కరస్పాండెంట్‌గా దిల్లీకి చేరుకున్నారు. దేశంలో జరిగిన పలు చారిత్రాత్మక ఘటనలను ఆయన బీబీసీ ద్వారా ప్రజలకు అందించారు. బీబీసీ రేడియో 4 కార్యక్రమం 'సమ్‌థింగ్ అండర్‌స్టడ్'కు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భారత్‌పై రూపొందించిన అనేక డాక్యుమెంటరీల్లో పాలుపంచుకున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా 2002లో నైట్‌హుడ్ లభించింది. 1992లో పద్మశ్రీ, 2005లో పద్మభూషణ్ అందుకున్నారు. 'నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా', 'ఇండియా ఇన్ స్లో మోషన్', 'ది హార్ట్ ఆఫ్ ఇండియా' వంటి అనేక పుస్తకాలు రాశారు. టుల్లీ మరణంపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.



ఈ రెండూ ఉంటేనే కలల జీవితం మీ సొంతం

మీ ప్రస్తుత జీవితానికి, మీరు కోరుకుంటున్న జీవితానికి మధ్య వారధి వేసేవి రెండు లక్షణాలు. అవేంటంటే.. 1.క్రమశిక్షణ 2.నిలకడ. అవి లేకపోతే మీరు ఎంతటి ప్రతిభావంతులైనా, ఎన్ని నైపుణ్యాలున్నా మీ లక్ష్యాన్ని సాధించలేరు.

– కెన్నీ, వెల్త్ కోచ్

ప్రలోభాలను వీడి..
వివేకాన్ని ఉపయోగించండి

- ఓటర్లకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు



దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్

దిల్లీ: దేశ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే సందర్భంలో ప్రలోభాలను, పక్షపాతాన్ని వీడి, వివేకాన్ని ఉపయోగించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇది కీలకమని పేర్కొన్నారు. ఓటు వేసే హక్కు ఎంత ముఖ్యమో, రాజ్యాంగ విలువల గుర్తుంచుకోవడమూ అంతే అవసరమని చెప్పారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, మారుమూల ప్రాంతాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటింగ్‌లో ప్రజల భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థాన్నిస్తుందని పేర్కొన్నారు.

యువత భాగస్వామి కావాలి: మోదీ

దేశంలో నిర్వహించే అన్ని ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగస్వామి కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకోవడం కేవలం దేశ ప్రజల హక్కు మాత్రమే కాదని.. దేశ భవిష్యత్తును రూపొందించడంలో మనకున్న బాధ్యత అని తెలిపారు. ఓటు ద్వారానే దేశ భవిష్యత్తుకు దారి ఏర్పడుతుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మై-భారత్ వాలంటీర్లకు రాసిన లేఖలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యం మసకబారుతోంది: ఖర్గే

ఎన్నికల సంఘం వంటి సంస్థలు నిరంతర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, అందువల్ల ప్రజాస్వామ్యం మనుగడ సాగించడమే కాకుండా నిజంగా అభివృద్ధి చెందేలా వాటి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం తమ బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఓటు చోరీ, ప్రణాళిక లేని 'సర్' ద్వారా ఓటు హక్కును లాక్కోవడం వల్ల భారత ప్రజాస్వామ్యం మసకబారుతోందని ఆరోపించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఓ నాటకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు.

అమెరికాను వీడని మంచు తుపాను


- విద్యుత్ అంతరాయాలు, వేలల్లో విమానాల రద్దు

వాషింగ్టన్: అమెరికాలో ఆదివారం కూడా భారీ మంచు తుపాను కొనసాగింది. దక్షిణ, న్యూ ఇంగ్లాండ్ అంతటా గడ్డకట్టుకుపోయే మంచువాన కురిసింది. అతి శీతల ఉష్ణోగ్రతలకు విద్యుత్ అంతరాయాలు తోడవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. సోమవారం వరకు దేశంలోని చాలా ప్రాంతాల్లో తుపాను కొనసాగే అవకాశం ఉందని జాతీయ వాతావరణ సర్వీసు తెలిపింది. దీంతో ప్రయాణాలు, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడనుందని వివరించింది. ఆదివారం ఉదయం టెన్నెసీ, మిసిసిపి, లూసియానాల్లో విద్యుత్ అంతరాయం లక్షలమందిపై ప్రభావం చూపింది. మరోవైపు మంచుతుపాను కారణంగా 10వేలకు పైగా విమానాలు రద్దు కాగా...మరో 8వేల విమానాలు ఆలస్యంగా నడిచాయి.

ఇరాన్ మృతులు 30 వేలకు పైనే!
'టైమ్' పత్రిక కథనం

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెల్లుబికిన నిరసనల్లో 30 వేల మందికిపైగా చనిపోయి ఉండవచ్చని 'టైమ్' పత్రిక తాజా కథనం వెల్లడించింది. ఒక్క జనవరి 8, 9 తేదీల్లోనే హింసాత్మక ఘటనల్లో ఇన్ని వేలమంది చనిపోయి ఉంటారని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులను ఉటంకిస్తూ తెలిపింది. భారీసంఖ్యలో ప్రజలను ఇరాన్ భద్రతా దళాలు ఊచకోత కోశాయని, మృతదేహాల తరలింపునకు అంబులెన్సుల స్థానంలో 18 చక్రాల ట్రక్కులను వినియోగించాల్సి వచ్చిందని పేర్కొంది. జనవరి 21న ప్రభుత్వ వర్గాలు ప్రకటించిన 3,117 కంటే మృతుల సంఖ్య చాలా ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల కార్యకలాపాల వార్తాసంస్థ ఇప్పటివరకు 5,459 మరణాలను ధ్రువీకరించగా.. మరో 17,031 మరణాలపై సమాచారం సేకరిస్తోంది.

మశూచి నిర్మూలన సారథి డాక్టర్ విలియం కన్నుమూత



అట్లాంటా: ప్రపంచ మానవాళి సాధించిన గొప్ప ప్రజారోగ్య విజయాల్లో ఒకటైన మశూచి నిర్మూలన కార్యక్రమ సారథి డాక్టర్ విలియం ఫోగ్ (89) శనివారం మృతిచెందారు. ఆయన సహ వ్యవస్థాపకుడిగా ఉన్న 'టాస్క్‌ఫోర్స్ ఫర్ గ్లోబల్ హెల్త్' ఈ విషయాన్ని ధ్రువీకరించింది. విలియం అంటువ్యాధుల నిర్మూలనలో గణనీయమైన పాత్ర పోషించారు. 1980ల ప్రాంతంలో అమెరికా డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సెంటర్స్‌కు డైరెక్టరుగా వ్యవహరించారు. ఆ తర్వాత అంతర్జాతీయ ఆరోగ్య సమస్యలకు వ్యతిరేకంగా జరిగిన ప్రచారాల్లో కీలకమైన సారథ్య బాధ్యతలు నిర్వహించారు. మానవ చరిత్రలో శతాబ్దాల తరబడి మశూచి సోకినవారిలో మూడోవంతు జనం చనిపోతూ వచ్చారు. ఈ వ్యాధి నిర్మూలనకు డాక్టర్ విలియం చేసిన కృషి గొప్ప సాధనగా నిలిచిపోతుంది.

అత్యుత్తమ నాణ్యతకు మారుపేరుగా నిలుద్దాం

- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు



దిల్లీ: దేశంలో ఏ ఉత్పత్తిని తయారుచేసినా అది ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని, ఆ మేరకు మనమంతా సంకల్పం తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. దీనిపై దృష్టి పెట్టాల్సిందిగా పారిశ్రామిక వర్గాలను, అంకుర పరిశ్రమలను ఆయన కోరారు. ఆదివారం 130వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో రేడియో ద్వారా ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. 2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియా ప్రయాణంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న యువత కృషిని ఆయన ప్రశంసించారు. "భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతోంది. యావత్ ప్రపంచం మనవైపు చూస్తోంది. ఇలాంటి సమయంలో ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టడమే అతిపెద్ద బాధ్యత. 'అలా జరిగిపోయిందిలే', 'జరుగుతుందిలే' అనే ఉదాసీనతే ఇకపై మనకు రాకూడదు. ఎలాంటి లోపాలు, దోషాలు లేని ఉత్పత్తులను పరిశ్రమలు తయారు చేయాలి. భారతీయ ఉత్పత్తి అంటేనే అత్యుత్తమ నాణ్యత అనేలా ఉండాలి. నాణ్యత.. నాణ్యత.. నాణ్యత.. ఇదే మన ఏకైక మంత్రం కావాలి. దాని ద్వారానే వికసిత్ భారత్ వైపు మన ప్రస్థానాన్ని వేగవంతం చేయగలం'' అని చెప్పారు.

అన్ని రంగాల్లోనూ మన అంకురాలు

"స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని పదేళ్ల క్రితం ప్రారంభించినప్పటికి దేశంలో 500 కన్నా తక్కువ అంకుర పరిశ్రమలే ఉండేవి. ఇప్పుడు 2 లక్షలకు పైగా ఉన్నాయి. అంకురాల్లో ప్రపంచంలో మూడో స్థానానికి ఎదిగాం. ఈ ప్రయాణానికి నిజమైన హీరోలు భారత యువ ఆవిష్కర్తలే. ఏ రంగాన్ని తలచుకున్నా అక్కడ ఒక భారతీయ స్టార్టప్ ఉంటుంది'' అని మోదీ చెప్పారు. 2026ని 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన యూఏఈని ఆయన అభినందించారు.

ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వి



పార్టీ సమావేశంలో తల్లిదండ్రులు లాలు, రబ్రీదేవీలతో తేజస్వి

పట్నా: రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) పార్టీ నూతన జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీయాదవ్ నియమితులయ్యారు. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం నిర్వహించిన ఆర్జేడీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ మేరకు ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతల సమక్షంలో తేజస్వికి నియామక పత్రాన్ని అందజేశారు. లాలు కుటుంబంలో వివాదాలు చెలరేగుతున్న సమయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్విని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వీ యాదవ్ పోటీ చేసినప్పటికీ ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరాజయానికి బాధ్యత ఎవరిదనే అంశంపై పార్టీలో అంతర్గత చర్చ సాగుతోన్న తరుణంలో తేజస్వికి పదవి అప్పగించడం చర్చనీయాంశమైంది.

కుట్రదారుల చేతుల్లోకి ఆర్జేడీ: రోహిణీ ఆచార్య

అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పార్టీని కొందరు వ్యక్తులు పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారని లాలు కుమార్తె రోహిణీ ఆచార్య మండిపడ్డారు. చొరబాటుదారులు, కుట్రదారుల చేతుల్లోకి పార్టీ వెళ్తోందని 'ఎక్స్' వేదికగా రోహిణి ఆవేదన వ్యక్తం చేశారు

అమరావతికి చట్టబద్ధత

(మొదటి పేజీ తరువాయి)



తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు


ఆదివారం ఉండవల్లి నివాసంలో చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు చంద్రబాబు, మంత్రి లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్, విభజన హామీల అమలు, విద్య, వైద్యం, జాతీయరహదారుల గురించి ప్రధానంగా చర్చించారు. రాబోయే పార్లమెంటరీ పార్టీ సమావేశాలకు జనసేన, భాజపా ఎంపీలనూ ఆహ్వానించాలని నిర్ణయించారు. "తెదేపా ఎప్పుడు పొత్తులో ఉన్నా కూటమి ఐక్యతను కాపాడుతుంది. కూటమి లక్ష్యాలకు విఘాతం కలిగించొద్దు. మీ దృష్టి కేంద్ర పథకాలపై ఉండాలి. వాటిని సాధించాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌లు, రైల్వేలైన్ల నిర్మాణం వేగంగా సాగాలి


రాష్ట్రంలో సుమారు రూ.లక్ష కోట్ల విలువైన రైల్వేలైన్లు, జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇవి మరింత వేగంగా పూర్తయ్యేలా ఎంపీలు చొరవ చూపించాలని చంద్రబాబు సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులన్నింటినీ పూర్వోదయ పథకంలో పెట్టించి పూర్తి చేసేలా చూడాలని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో లౌక్యంగా వ్యవహరించాలని సూచించారు. "పోలవరం తాజా అంచనాల్ని ఇప్పటికే కేంద్రానికి ఇచ్చాం. ప్రాజెక్టు నిర్మాణం, ఆర్‌అండ్‌ఆర్ పూర్తిచేయాలి. దీనికి రూ.12 వేల కోట్లు ఇంకా రావాలి. గోదావరి పుష్కరాలలోపు పోలవరం పూర్తిచేయాలి. రాష్ట్రంలో నిర్మించ తలపెట్టిన నీటి ప్రాజెక్టులపై పొరుగు రాష్ట్రాలతో వివాదాలు అవసరం లేదు. నల్లమలసాగర్ లాంటి అంశాలు పార్లమెంటులో ప్రస్తావనకు వస్తే రాష్ట్ర వాదనలు గట్టిగా వినిపించాలి'' అని తెలిపారు. "రాష్ట్ర అంశాలపై అవగాహనకు ఫిబ్రవరిలో జరిగే కలెక్టర్ల సదస్సులో ఎంపీలంతా వర్చువల్‌గా పాల్గొనాలి'' అని సీఎం సూచించారు. "ఇచ్ఛాపురం నుంచి తడ వరకు నాలుగు లేన్ల రైల్వేట్రాక్ వేసేలా చూడాలి. రైల్వే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. ఫ్లైఓవర్లు, ఆర్‌ఓబీలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు రైల్వేశాఖ సిద్ధంగా ఉంది. మీ నియోజకవర్గాల్లో అవసరాలు గుర్తించి నిధులు సాధించండి'' అని చంద్రబాబు తెలిపారు.

పార్టీ కేంద్ర కార్యాలయానికి విధిగా రండి: నారా లోకేశ్

ప్రతి ఎంపీ పార్టీ కోసం సమయం కేటాయించాలని, విధిగా పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు. చంద్రబాబు మాట్లాడాక ఎంపీలతో లోకేశ్ విడిగా సమావేశమయ్యారు. 'రాష్ట్రస్థాయి అంశాలతో పాటు జాతీయ స్థాయిలో ఎన్డీయే కార్యక్రమాలపై అవగాహన పెంచుకోండి. పార్లమెంటులో ప్రతిపక్షాలు భాజపాను విమర్శిస్తే వాటికి మనమూ దీటుగా సమాధానమివ్వాలి' అని లోకేశ్ తెలిపారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెదేపా ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం సమావేశ వివరాలను ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, బైరెడ్డి శబరి విలేకరులకు తెలిపారు.



పాఠశాల ఆట స్థలంలో చేసిన సమాధి



ఇళ్ల ముందునుంచి చూస్తే ఇలా..

పాఠశాల ఆవరణలో శవం పూడ్చివేత

- మార్కాపురం జిల్లాలో వైకాపా నాయకుడి దుశ్చర్య

తర్లుపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శవాన్ని పూడ్చిపెట్టిన ఉదంతమిది. మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలం గానుగపెంట ఎస్సీ కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం.. వైకాపా నాయకుడైన కిరణ్.. తన తండ్రి చనిపోగా, మృతదేహాన్ని ఇళ్ల మధ్య ఉన్న పాఠశాల ఆట స్థలంలో శనివారం సాయంత్రం పూడ్చేందుకు యత్నించారు. గ్రామస్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్న వెంగయ్య తొలుత దీన్ని అడ్డుకున్నారు. బడి పిల్లలు భయపడతారని వారు చెప్పినా కిరణ్ వినలేదు. తన తండ్రి శవాన్ని ఇక్కడే పూడ్చి పెట్టాలంటూ పట్టుబట్టి పాఠశాల ఆట స్థలంలోనే పూడ్చేశారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ అధికారి రామాంజనేయరెడ్డి దృష్టికి తాము తీసుకెళ్లినా ఆయన అడ్డుకోలేదని స్థానికులు వాపోయారు. ఘటనపై తహసీల్దార్ కె.కె.కిశోర్‌కుమార్ స్పందిస్తూ.. శవం పూడ్చిన స్థలం చుట్టూ గోడ కట్టాలని కిరణ్‌కు సూచించామని చెప్పారు.

చట్టాలపై సమగ్ర అవగాహన అవసరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు
- 'ఏ గ్లింప్స్ ఇన్‌టూ ద క్రిమినల్ మేజర్ యాక్ట్స్' పుస్తకావిష్కరణ

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయరంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ చట్టాలపై సమగ్ర అవగాహనతో ఉండాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సూచించారు. ఒంగోలులోని ఏడో అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి, ఆయన కుమారుడు హైకోర్టు న్యాయవాది టీవీఎస్ఎం కులదీప్ రూపొందించిన 'ఏ గ్లింప్స్ ఇన్‌టూ ద క్రిమినల్ మేజర్ యాక్ట్స్' పుస్తకావిష్కరణ ఆదివారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో జరిగింది. దీనికి జస్టిస్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత ద్వారా సమాచారాన్ని పొందుతున్నప్పటికీ ఈ పుస్తకంలోని అంశాలు న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ఇన్‌ఛార్జ్ జిల్లా జడ్జి టి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ న్యాయమూర్తిగా రాజావెంకటాద్రి తన అనుభవాలను, పాత, కొత్త క్రిమినల్ చట్టాలను మేళవించి విశ్లేషించారని తెలిపారు. తిరుపతి ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జి.రామగోపాల్ మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. పుస్తక ప్రధాన రూపకర్త రాజావెంకటాద్రి మాట్లాడుతూ.. కోర్టు విధులను, పుస్తక రూపకల్పనను సమన్వయం చేసుకుంటూ తన కుమారుడితో కలిసి ఆరేళ్లపాటు కష్టపడ్డామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు, లా సమ్మరీ పుస్తక ప్రచురణ సంస్థ అధినేత ఎ.వివేకానంద, న్యాయ కళాశాల కరస్పాండెంట్ సి.వి.రామకృష్ణారావు, హైకోర్టు రిజిస్ట్రార్లు డి.ఏడుకొండలు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసశర్మ, జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, పుస్తక సహరూపకర్త కులదీప్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు. చిత్రంలో టి.రాజ్యలక్ష్మి, జి.రామగోపాల్, టి.రాజావెంకటాద్రి తదితరులు

తెలుగు సాహిత్యానికి పురిటిగడ్డ ఉత్తరాంధ్ర

- సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్
- అనకాపల్లిలో 'సిరివెన్నెల' కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అనకాపల్లి, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యానికి ఉత్తరాంధ్ర పురిటిగడ్డ అని సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. గిడుగు రామ్మూర్తి, గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రి, రాచకొండ, సిరివెన్నెల వంటి ఎంతోమంది ఈ ప్రాంతం వారేనని గుర్తుచేశారు. అనకాపల్లిలోని గాంధీనగరంలో సినీ గేయ రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. సిరివెన్నెల సొంతూరిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జయంతి, వర్ధంతులకు పూలమాలలు వేయడానికి విగ్రహాలు కాదని, మహానుభావుల చేసిన గొప్పపనులు భావితరాలకు తెలియజేయడానికేనని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సిరివెన్నెల మన ఊరి వాడు కావడం మన అదృష్టమని అన్నారు. తాను తిరిగి రాజకీయ రంగప్రవేశం చేయడానికి త్రివిక్రమ్ కారణమని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సిరివెన్నెల కేవలం వినోదం కోసమే కాకుండా ఆలోచించే ఎన్నో మంచి పాటలు రాశారని ఉదహరించారు. ఆయన పాటల్లో మానవీయ విలువలు ఉంటాయన్నారు. పిల్లలను తెలుగుకు దూరం చేయవద్దని తల్లిదండ్రులను కోరారు. తానా సాహిత్య విభాగం, తానా ప్రపంచ సాహిత్య వేదిక, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి, తానా పూర్వ అధ్యక్షులు తోటకూర ప్రసాద్, యర్రాప్రగడ రామకృష్ణ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, చేబ్రోలు శ్రీరామశాస్త్రి, పద్మావతి పాల్గొన్నారు.



సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహావిష్కరణలో త్రివిక్రమ్ శ్రీనివాస్, మండలి బుద్ధప్రసాద్, కొణతాల రామకృష్ణ, రామజోగయ్యశాస్త్రి, తోటకూర ప్రసాద్, యర్రాప్రగడ రామకృష్ణ తదితరులు





భార్యకు సపర్యలు చేస్తున్న లోహర్ ★ రిక్షాపై జ్యోతిని తీసుకెళ్తున్న లోహర్

300 కి.మీ. రిక్షాపైనే ఆసుపత్రికి!

భార్యకు చికిత్స చేయించడానికి 75 ఏళ్ల భర్త అకుంఠిత సంకల్పం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అసలే పేదరికం.. ఆపై సహకరించని వయసు. అయినా అనారోగ్యానికి గురైన భార్యకు ఆసుపత్రిలో చికిత్స చేయించేందుకు 75 ఏళ్ల వయసులోనూ ఏకంగా 300 కిలోమీటర్లు తోపుడు రిక్షాను తొక్కారు భర్త. ఒడిశాలో చోటుచేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సంబల్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన బాబు లోహర్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య జ్యోతి(70)కి కొద్ది నెలల కిందట పక్షవాతం వచ్చింది. స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమెను సుమారు 300 కి.మీ. దూరంలోని కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల, ఆసుపత్రికి తీసుకెళ్లాలని లోహర్ నిశ్చయించుకున్నారు. చేతిలో చిల్లి గవ్వలేకపోవడం, వేరేవాళ్ల సాయం తీసుకోవడానికి మనసు ఒప్పుకోకపోవడంతో తనకున్న రిక్షాపైనే భార్యను తీసుకుని బయలుదేరారు లోహర్. పగలంతా రిక్షా తొక్కుతూ రాత్రివేళల్లో ఏదైనా దుకాణాల వరండాలో లేదా చెట్ల కింద సేద తీరేవారు. వీరి దీనస్థితి గమనించి ఎవరైనా తిండి పెడితే తినేవారు. ఆ విధంగా కటక్ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ రెండు నెలల చికిత్స అనంతరం జనవరి 19న జ్యోతిని డిశ్చార్జి చేశారు. అదే రిక్షాపై ఇంటికి తిరిగొస్తుండగా కటక్ శివారులోని గాంధీకూడలి పైవంతెన వద్ద ఓ ట్రక్కు వీరిని ఢీకొనడంతో జ్యోతికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో దగ్గరలో ఉన్న సీహెచ్‌సీలో ఆమెకు చికిత్స అందించారు. వీరి దుస్థితి చూసి తంగి పోలీసుస్టేషన్ పోలీసు అధికారి బికాష్ సెథి రెండు ఏసీ బస్సు టికెట్లను కొనుగోలు చేశారు. మనసొప్పని లోహర్ సున్నితంగా తిరస్కరించి ఈ నెల 20న రిక్షాపైనే మళ్లీ ప్రయాణం మొదలుపెట్టారు. 'నా జీవితంలో నాకంటూ ఇద్దరే ఉన్నారు. ఒకరు నా భార్య, మరొకరు రిక్షా' అని లోహర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రూటు మార్చిన పెద్ద పులి

- గేదె, ఆవులపై దాడి



మొక్కజొన్న చేను పక్కన పొదల్లో పులి (డ్రోన్ చిత్రం)

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని పలు ప్రాంతాల్లో నాలుగు రోజులుగా బెంబేలెత్తించిన పెద్ద పులి ఆదివారం వేకువజామున కొయ్యలగూడెం మండలంలోకి ప్రవేశించింది. బిల్లిమిల్లి గ్రామం పరిసరాల్లో కాకర్ల వివేకానంద అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో చూడి గేదెపై దాడి చేసి చంపింది. అక్కడి నుంచి కన్నాపురం సమీపంలో దిప్పకాయలపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని కామినేని ఆనందరావు అనే రైతు పొలంలోకి ప్రవేశించి అక్కడి ఆవులపై దాడి చేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రోన్ ఎగరవేసి పరిసరాలను గాలించగా.. మొక్కజొన్న చేను పక్కన పొదల్లో విశ్రాంతి తీసుకుంటున్న పులిని గుర్తించారు. డ్రోన్ శబ్దానికి, సమీపంలో అలికిడిని గుర్తించిన పులి గాండ్రించింది. అధికారుల హెచ్చరికలతో సమీపంలోని స్థానికులు పరుగులు తీశారు. పులిని బంధించడానికి రెండు బోనులు సిద్ధం చేశారు.

EENADU Vol: 52, Issue: 166 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఏ నటుడైనా సరే ఓసారి స్టార్‌డమ్‌ను అందుకున్నారంటే ఆ తర్వాత వాళ్ల ప్రయాణమంతా ఆ ఇమేజ్ లెక్కలకు తగ్గట్లుగానే సాగిస్తుంటారు. కానీ, ఈ స్టార్‌డమ్ సంకెళ్లకు, ఇమేజ్ చట్రాలకు చిక్కకుండా వైవిధ్యభరితమైన పాత్రలతో మెప్పిస్తూ.. ఎప్పటికప్పుడు సరికొత్త వినోదాన్ని వడ్డించే తారలు కొద్దిమందే ఉంటారు. అలాంటి అరుదైన కథానాయకుల్లో ఎప్పుడూ ముందువరుసలో కనిపించే పేరు మమ్ముట్టి. కమర్షియల్ చిత్రాలకైనా.. కళాత్మక సినిమాలకైనా ఆయనే చిరునామా. నటుడిగా, నిర్మాతగా అయిదున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో మలయాళం, తెలుగుతో సహా పలు భాషల్లో దాదాపు 400కి పైగా సినిమాల్లో నటించి, మెప్పించారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే మమ్ముట్టి సినీ ప్రయాణాన్ని ఓసారి తరచి చూస్తే..

ప్రయోగాల చిరునామా... మమ్ముక్క


మమ్ముట్టి

నీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపాన్ని సంతరించుకుంటుంది. మలయాళ చిత్రసీమలో అగ్రతారగా వెలుగొందుతున్న మమ్ముట్టి కూడా అంతే. వైవిధ్యతకు చిరునామాలా.. విలక్షణ నటనకు పెట్టిని కోటలా అయిదున్న దశాబ్దాలుగా భారతీయ వెండితెరపై కాంతులీనుతూనే ఉన్నారు. 'భ్రమయుగం'లో రాక్షసుడిలా భయపెట్టినా.. 'కాథల్- ది కోర్'లో గే పాత్రలో అలరించినా.. ఇప్పుడు 'కలాంకావల్'లో సైకో కిల్లర్‌గా అదరగొట్టినా ఆయనకే చెల్లింది. ఓవైపు కథానాయకుడిగా ఆకాశమంతా ఎత్తుకు ఎదిగినా.. నేలపైన ఉంటూ ఇన్నిన్ని ప్రయోగాలు ఎలా సాధ్యమనేలా ఎప్పటికప్పుడు సినీప్రియుల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. మమ్ముట్టి సినీ ప్రయాణంలో ఆరంభం నుంచి ఇంతే వైవిధ్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంటుంది.

న్యాయవాది నుంచి నటుడిగా..

తనని తాను హీరోగా కాకుండా నటుడిగా చెప్పుకునేందుకు ఇష్టపడే మమ్ముట్టి అసలు పేరు మహమ్మద్ కుట్టి పానపరంబిల్ ఇస్మాయిల్. 1951 సెప్టెంబరు 7న కేరళలోని వైకోమ్ సమీపంలో ఉన్న చెంపు గ్రామంలో ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో జన్మించాడు. సినిమాల్లోకి రాకముందు రెండేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన ఆయన ఆ తర్వాత నటపై ఆసక్తితో చిత్రసీమ వైపు అడుగులు వేశారు. 1971లో వచ్చిన 'అనుభవంగల్ పాలిచకల్' అనే సినిమాలో చిన్న పాత్రతో నటుడిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. 1980లో విడుదలైన 'విల్కనుండు స్వప్నంగల్' సినిమాతోనే తొలిసారి మమ్ముట్టి పేరు మలయాళ చిత్రసీమలో మారుమోగింది. ఇక అక్కడి నుంచి జోరందుకున్న ఆయన నట ప్రయాణం ఆ తర్వాతి కాలంలో మొత్తం మలయాళ చిత్రసీమ ముఖ చిత్రాన్నే మార్చేసింది. ఈక్రమంలోనే 'ఒరు వడక్కన్ వీరగథ', 'డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్', 'విధేయన్', 'మధిలుకల్', 'పొంథన్ మడ', 'తనియవర్తనం', 'అమరం', 'దళపతి', 'ది కింగ్', 'మధుర రాజా' తదితర విజయవంతమైన చిత్రాలతో తనలోని నటనా వైదుష్యాన్ని వెండితెరపై ఆవిష్కరించారు. ఇక 1992లో కె.విశ్వనాథ్ తెరకెక్కించిన 'స్వాతి కిరణం'తో తొలిసారి తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన ఆయన.. ఆ తర్వాత 'సూర్య పుత్రులు', 'రైల్వే కూలీ' చిత్రాల్లో అలరించారు. ప్రస్తుతం ఆయన తనయుడు దుల్కర్ సల్మాన్ మలయాళం, తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ భాషల్లో బిజీ కథానాయకుడిగా జోరు చూపిస్తున్నారు.

అవార్డులు - గౌరవాలు..

మమ్ముక్కగా సినీప్రియులు ప్రేమగా పిలుచుకునే మమ్ముట్టి తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో అవార్డులు, గౌరవాలు అందుకున్నారు. ఉత్తమ నటుడిగా మూడు జాతీయ పురస్కారాల్ని, పది కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, 11 కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ పురస్కారాలు, 15 ఫిల్మ్ ఫేర్ అవార్డులు గెలుచుకున్నారు. 1998లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అందుకున్న ఆయన.. ఇప్పుడు పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపిక య్యారు.

నా జీవితంలో మర్చిపోలేని సంక్రాంతి ఇది: చిరంజీవి


సాహు గారపాటి, వెంకటేశ్, కె.రాఘవేంద్రరావు, చిరంజీవి, సుస్మిత, అనిల్ రావిపూడి

'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో విజయాన్నిచ్చి గత వైభవాన్ని పునరావృతం చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు కథానాయకుడు చిరంజీవి. ఇది తనకు జీవితంలో మర్చిపోలేని సంక్రాంతి అని.. నిజంగా ఈ పండగ అదిరిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన.. నయనతార జంటగా నటించిన ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కించారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో నటించారు. ఈ సినిమా సంక్రాంతికి విడుదలైన నేపథ్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. "అమ్మ, అన్నం ఎప్పుడూ బోర్ కొట్టవు. నాకు విజయం కూడా అలాంటిదే. ఇలాంటి ప్రేమను గతంలో ఎన్నో సార్లు అనుభవించా. చాలా ఏళ్ల తర్వాత అలాంటి ఉత్సాహం పునరావృతం కావడం చాలా ఆనందంగా ఉంది. వింటేజ్ చిరంజీవినే కాదు.. ఇలాంటి వింటేజ్ సక్సెస్ వేడుకను తీసుకొచ్చిన క్రెడిట్ అనిల్‌దే. చిత్రీకరణ ఆఖరి రోజు చాలా భావోద్వేగానికి గురయ్యా. అలాగని మిగతా చిత్రాల్ని తప్పుబట్టను. ఎప్పుడైనా తప్పు నామీదే వేసుకుంటాను కానీ, ఒకళ్ల మీద నెట్టను. ఈ సంక్రాంతికి అందరికీ మంచి సక్సెస్ దొరికింది. ఈ చిత్ర సెట్‌లో వెంకటేశ్‌తో గడిపిన ప్రతి రోజూ నవ్వులతో నిండిపోయేది. నా పాటలకు తను.. తన పాటలకు నేను డ్యాన్స్ చేయడాన్ని దర్శకుడు అనిల్ చక్కగా బ్యాలెన్స్ చేశాడు. ఈ చిత్రాన్ని మా అమ్మాయి సుస్మిత.. సాహుతో కలిసి సొంతంగా నిర్మించింది. దీనికోసం నేను ఆమెకు నయా పైసా కూడా ఇవ్వలేదు. ఇటీవల ఈ చిత్ర విజయం పట్ల ఓ మహిళ భావోద్వేగంతో మాట్లాడిన వీడియో నన్ను కదిలించింది. కృతజ్ఞతతో నా కళ్లు చెమర్చాయి. ప్రేక్షకుల్ని సంతోషపరిచేందుకు పడే కష్టంలోనే నేను ఆనందాన్ని పొందుతున్నాను" అన్నారు. "ఈ సంక్రాంతికి ఇండస్ట్రీ అంతా డల్‌గా ఉన్న తరుణంలో చిరంజీవి సంజీవని తీసుకొచ్చి మొత్తం పరిశ్రమను బతికించారు" అన్నారు దర్శకుడు కె.రాఘవేంద్రరావు. హీరో వెంకటేశ్ మాట్లాడుతూ.. 'సంక్రాంతికి వచ్చి చిరంజీవి ధనాధన్ చేశారు. ఇక ఎప్పుడూ పండక్కి వస్తూనే ఉంటాం.. ధనాధన్ ఇస్తూనే ఉంటాం'' అన్నారు. ఈ చిత్ర విజయం నేపథ్యంలో చిరంజీవి దర్శకుడు అనిల్ రావిపూడికి ఓ లగ్జరీ కారును కానుకగా ఇచ్చారు. ఇక ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి, వీవీ వినాయక్, దిల్ రాజు, సాహు గారపాటి, భీమ్స్ సిసిరోలియో తదితరులు పాల్గొన్నారు.


అనిల్‌కు కారు తాళాలు అందజేస్తున్న చిరంజీవి

బహుముఖ ప్రజ్ఞ మాధవన్ సొంతం



మాధవన్

విలక్షణ నటనతో.. వైవిధ్యభరితమైన పాత్రలతో సినీప్రియుల మది దోచిన నటుడు ఆర్.మాధవన్. 'సఖి', 'చెలి' అంటూ అందమైన ప్రేమకథలతో అమ్మాయిల మనసుల్లో గిలిగింతలు పెట్టి ప్రేమ 'పరవశం'లో పడేసిన చాక్లెట్ బాయ్ అతను. 'అమృత'లో ఇద్దరు పిల్లల తండ్రిగా భావోద్వేగభరిత నటనతో కట్టిపడేసినా.. 'యువ'లో మాస్ నటనతో యువతరాన్ని వావ్ అనిపించినా.. 'సవ్యసాచి'తో ప్రతినాయకుడిగా తెలుగు ప్రేక్షకుల్ని తొలి అడుగులోనే భయపెట్టినా మాధవన్‌కే చెల్లింది. నటుడిగానే కాక 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగానూ సత్తా చాటారు. 'ఎవనో ఒరువన్', 'సాలా ఖడూస్' (తెలుగులో 'గురు'గా రీమేక్ అయింది) లాంటి విజయవంతమైన సినిమాలతో మంచి అభిరుచి గల నిర్మాతగానూ పేరు తెచ్చుకున్నారు. బహుముఖ ప్రజ్ఞతో వెండితెరపై చెరగని ముద్ర వేశారు. ఇక ప్రపంచ వేదికలపై భారతీయ సంస్కృతికి అంబాసిడర్‌గా, మోటివేషనల్ స్పీకర్‌గా నిజ జీవితంలో మాధవన్ పోషించే భిన్న పాత్రలు మరింత ప్రత్యేకం. ఇప్పుడా సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

సినీ రంగంలో యాభయ్యేళ్లకుపైగా కొనసాగుతూ.. . నాటి, నేటి తరాలకీ మధ్య ఓ వారధిలా నిలిచిన విశిష్ట నటుడు మురళీ మోహన్. నటనలోనే కాకుండా... తాను అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ జయభేరి మోగించిన స్ఫూర్తిదాయకమైన ప్రయాణం ఆయనది. 1973లో 'జగమే మాయ' సినిమాతో హీరోగా పరిచయమైన ఆయన నిర్మాతగానూ గుర్తుండిపోయే చిత్రాల్ని అందించారు. 53 ఏళ్లుగా చిత్ర పరిశ్రమకు ఆయన అందిస్తున్న సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

నాటి నేటి తరాల సినీ వారధి

శ్రమశిక్షణ... కష్టపడి పనిచేయడం...ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కావల్సింది ఇవే కదా. ఆ రెండింటినే తన ఆయుధాలుగా మార్చుకుని అటు సినిమా, ఇటు వ్యాపార రంగాల్లోనూ ఎదిగారు మురళీమోహన్. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రుకు చెందిన మాగంటి మాధవరావు, వసుమతి దేవిలకు 1940 జూన్ 24న జన్మించారు. ఆయన అసలు పేరు మాగంటి రాజారామ్ మోహన్‌రాయ్.


మురళీమోహన్

53 ఏళ్ల ప్రయాణం.... 350పైగా సినిమాలు

ఇరవై మూడో ఏట బంధువులతో కలిసి వ్యవసాయ పంపుసెట్లు, ఇతర పరికరాల వ్యాపారంలోకి అడుగుపెట్టిన మురళీమోహన్ అందులో బాగా రాణించారు. అయితే అప్పటికే నాటకాలతో ఏర్పడిన అనుబంధం ఆయన్ని సినీ రంగంలోకి అడుగుపెట్టేలా చేసింది. 33 ఏళ్ల వయసులో అనుకోకుండా వచ్చిన 'జగమే మాయ' సినిమా అవకాశం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'తిరుపతి', 'భారతంలో ఒక అమ్మాయి', కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో తెరకెక్కిన 'అమరదీపం', 'జ్యోతి', 'కల్పన', 'ఆమె కథ', 'ప్రేమ లేఖలు' తదితర చిత్రాలతో ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. ప్రతినాయక పాత్రలు మినహా కథానాయకుడిగా, రెండో హీరోగా, సహ నటుడిగా ఆయన ఎన్నో పాత్రలకి ప్రాణం పోశారు. కథానాయకుడిగా పరిమిత వ్యయంతో తెరకెక్కే బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో ఒక పక్క నటిస్తూనే... మరోవైపు ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్‌బాబు, కృష్ణ తదితర హీరోలు చేసే భారీ సినిమాల్లో కీలక పాత్రల్ని చేస్తూ అలరించారు. తొలితరం కథానాయకులతో కలిసి నటించి, వాళ్లతో మంచి అనుబంధాన్ని కొనసాగించిన మురళీమోహన్... నవతరంతోనూ అదే తరహాలో కలిసిపోతున్నారు. 53 ఏళ్లుగా కొనసాగుతున్న ఆయన కెరీర్‌లో 350కి పైగా సినిమాలు చేశారు. 'ఓ తండ్రి తీర్పు' సినిమాకిగానూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ నటుడిగా, 'ప్రేమించు', 'వేగు చుక్కలు' సినిమాలకిగానూ ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాల్ని అందుకున్నారు. నటుడిగానే కాకుండా, నిర్మాతగానూ 25కిపైగా సినిమాలు చేశారు మురళీమోహన్. బుల్లితెరపై కూడా నటుడిగా తనదైన ముద్ర వేశారు. శోభన్ బాబు సలహాతో రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టి అందులోనూ జయభేరి గ్రూప్‌ని ప్రత్యేకంగా నిలబెట్టారు. తెలుగుదేశం పార్టీలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన 2009లో ఎంపీగా ఓడిపోయినా, 2014లో గెలిచారు. తెలుగుదేశం పార్టీలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన 2009లో ఎంపీగా ఓడిపోయినా, 2014లో గెలిచారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మురళీమోహన్‌కు పద్మశ్రీ పురస్కారంపై పలువురు సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు సామాజిక మాధ్యమాల వేదికగా అభినందనలు తెలిపారు.

సామాన్యుడి నుంచి ప్రధాని వరకూ ఆయన నటనకు అభిమానులే. ఆ పేరు గుర్తొచ్చినా.. ఆయన రూపం కళ్ల ముందు మెదిలినా మొహంపై నవ్వు ప్రత్యక్షం కావల్సిందే. తెలుగు సినిమా హాస్యాన్ని హీరోయిజం స్థాయికి తీసుకెళ్లి... తరాలుగా ప్రేక్షకుల్ని నవ్విస్తున్న ఆ నటుడే రాజేంద్రప్రసాద్. హాస్యంతోనే కాదు... హృదయాల్ని బరువెక్కించే భావోద్వేగాలతోనూ ఆయన ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. తాజాగా ఆయన కీర్తి కిరీటంలో చేరింది పద్మశ్రీ గౌరవం.

నవ్వుల రారాజు

చార్లీ చాప్లిన్ కంటే గొప్ప హీరో ఎవరున్నారని ఆయన దారిలోనే అడుగులు వేశారు రాజేంద్ర ప్రసాద్. 'అప్పుల అప్పారావు' అయ్యారు, 'పేకాట పాపారావు'గా మెప్పించారు. 'మాయలోడు' ఆయనే, 'అల్లరోడు' ఆయనే. బద్ధకానికి మారుపేరులాంటి 'లేడీస్ టైలర్'గా... 'ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్లాం'లో పిసినిగొట్టుగా... ఇలా ఎన్నో పాత్రలతో కితకితలు పెట్టారు. 49 ఏళ్లుగా కొనసాగుతున్న ఆయన సినీ ప్రయాణంలో 300కిపైగా సినిమాలు చేశారు. 2009లో ఆంగ్ల భాషా చిత్రం 'క్విక్ గన్ మురుగన్'తో అంతర్జాతీయంగా ప్రేక్షకుల్ని అలరించారు.


రాజేంద్రప్రసాద్

ఎన్టీఆర్ ప్రభావంతో...

గద్దె వెంకట నారాయణ, మాణిక్యాంబ దంపతులకు కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్ ఇంటి పరిసరాల్లోనే ఆయన కుటుంబం నివాసం ఉండేది. ఎన్టీఆర్ ప్రభావం చిన్నప్పుడే రాజేంద్ర ప్రసాద్‌పై బలంగా పడింది. ఇంట్లోవాళ్లు వద్దన్నా చెన్నైలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నటనపై దృష్టిపెట్టారు. మద్రాస్‌లో పస్తులతో గడిపారు. ఆత్మహత్యే శరణ్యం అనుకున్న సమయంలో అనుకోని అవకాశంతో డబ్బింగ్ కళాకారుడిగా ప్రయాణం మొదలుపెట్టిన ఆయన... ప్రముఖ దర్శకుడు బాపు చిత్రం 'స్నేహం'తో తెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించిన ఆయన... ఉషాకిరణ్ మూవీస్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు వంశీ తెరకెక్కించిన 'ప్రేమించు పెళ్లాడు'తో కథానాయకుడిగా మెరిశారు. ఆ సినిమా తర్వాత ఆయన వెనుదిరిగి చూడలేదు.

అన్ని రకాల పాత్రల్లోనూ...

ఒకక కంట పన్నీరు, మరొక కంట కన్నీరు ఒలికించిన నటుడు ఆయన. 'ఏప్రిల్ 1విడుదల' చేస్తూనే, మరోవైపు 'ఎర్రమందారం'లో నటించారు. ఒకవైపు 'లేడీస్ టైలర్' చేస్తూ, మరోవైపు 'కాష్మోరా' చేశారు. 'పుణ్యస్త్రీ', 'ముత్యమంత ముగ్గు', 'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు'... ఇలా భిన్నమైన పాత్రల్నీ భుజానికెత్తుకుని అలరించారు. కొంతకాలం కిందట తన ఒక్కగానొక్క కుమార్తె గాయత్రి మరణంతో ఆయన కుంగుబాటుకు గురయ్యారు. ఆ విషాదం నుంచి బయటికొచ్చి, దుఃఖాన్ని దిగమింగుకుంటూనే ఆయన సినిమాల్లో నటించారు.

ఎన్నెన్నో పురస్కారాలు

తన 42వ ఏటే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న రాజేంద్రప్రసాద్ 'ఎర్రమందారం', 'ఆ నలుగురు' చిత్రాలకిగాను ఉత్తమ నటుడిగా, 'మేడమ్' చిత్రానికి స్పెషల్ జ్యూరీ, 'టామీ' చిత్రానికి ఉత్తమ సహాయ నటుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక నంది పురస్కారాలు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా కేరళ స్టేట్ ఫిల్మ్ పురస్కారాల వేడుక



కేరళ స్టేట్ ఫిల్మ్ పురస్కారాల వేడుక ఆదివారం రాత్రి తిరువనంతపురంలో ఘనంగా జరిగింది. ఈ వేదికపై సీనియర్ నటి శారదకు ప్రతిష్ఠాత్మక జేసీ డానియల్ పురస్కారాన్ని అందించారు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు మమ్ముట్టితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

సైన్స్ ఫిక్షన్ సినిమాతో..


నితిన్

కథానాయకుడు నితిన్ కొత్త కబురు వినిపించారు. తన 36వ చిత్రం కోసం దర్శకుడు వీఐ ఆనంద్‌తో చేతులు కలిపారు. 'ఊరు పేరు భైరవకోన' విజయం తర్వాత ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. శ్రీనివాస చిట్టూరి నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని రథ సప్తమి సందర్భంగా ఆదివారం అధికారికంగా ప్రకటించారు. "ఇదొక వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌టైనర్. సినీప్రియులకు ఇప్పటి వరకు చూడని విధంగా సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించేలా ఉంటుంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర బృందం తెలిపింది.

ఉస్తాద్ ఉత్సవం


పవన్ కల్యాణ్

ఈసారి వేసవి సీజన్‌ని 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఆరంభిస్తాడనే ప్రచారం ఊపందుకుంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా... హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ ఆరంభంలో విడుదల కావొచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. త్వరలోనే ఈ సినిమాలోని రెండో గీతం ఆవిష్కరణతోపాటు, సినిమా విడుదల తేదీపై కూడా స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. చిత్రబృందం అదే సంకేతాల్ని ఇచ్చింది. రథ సప్తమిని పురస్కరించుకుని ఆదివారం పోస్టర్‌ని విడుదల చేస్తూ, ఉస్తాద్ ఉత్సవానికి సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చింది. సాధారణంగా తెలుగులో మార్చి నుంచి వేసవి సినిమాల జోరు మొదలైపోతుంది. అయితే అగ్ర తారలు నటించిన సినిమాలు విడుదలైన రోజు నుంచే అసలైన సీజన్ మొదలైనట్టు ఉంటుంది. మార్చిలో రామ్‌చరణ్ 'పెద్ది', నాని 'ది ప్యారడైజ్' సినిమాలు విడుదల ఖరారు చేసుకున్నాయి. అయితే ఆ సినిమాలు ఇప్పటికీ చిత్రీకరణ దశలోనే ఉన్నాయి. మరోవైపు మార్చి నెల దగ్గర పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ రెండు సినిమాల విడుదల మార్చిలో సాధ్యమా అనే ప్రశ్న తలెత్తుతోంది. దాంతో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాతోనే ఈ ఏడాది వేసవి మొదలవుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

నేడు ఈటీవీలో రాజు వెడ్స్ రాంబాయి

మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రసారం

అఖిల్‌రాజ్, తేజస్వీ జంటగా ఈటీవీ విన్ ఒరిజినల్స్ నుంచి వచ్చిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని దర్శకుడు వేణు ఊడుగుల.. నిర్మాత రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మించారు. సాయిలు కంపాటి తెరకెక్కించారు. చైతు జొన్నలగడ్డ, శివాజీ రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. చిన్న చిత్రంగా విడుదలై భారీ విజయం అందుకున్న ఈ చిత్రం ఈ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఈటీవీలో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం కానుంది.



ఆ రెండింటి తర్వాతేనా!


అల్లు అర్జున్

కథానాయకుడు అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఇది పూర్తి చేసిన వెంటనే లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఇప్పుడీ లైనప్‌లోకి సందీప్ రెడ్డి వంగా సినిమా కూడా చేరింది. నిజానికి వీళ్లిద్దరి కలయికలో ఓ చిత్రం రానున్నట్లు గతంలోనే అధికారికంగా ప్రకటించారు. కానీ, 'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్ ప్రణాళికలన్నీ మారడం.. మరోవైపు దీనిపై ఇటీవల కాలంలో ఏ అప్‌డేట్ రాకపోవడం.. సందీప్ కూడా 'స్పిరిట్' కోసం రంగంలోకి దిగిపోవడంతో సినీప్రియులంతా ఇక ఈ సినిమా ఉండకపోవచ్చనుకున్నారు. అయితే ఇప్పుడీ ప్రాజెక్ట్‌పై నిర్మాత భూషణ్ కుమార్ స్వయంగా స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తమ టీ సిరీస్ బ్యానర్‌లో దర్శకుడు సందీప్ రెడ్డితో 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' సినిమాలతో పాటు అల్లు అర్జున్ చిత్రం చేయనున్నట్లు ప్రకటించారు. మరి భూషణ్ చెప్పినట్లు బన్నీ సినిమా ప్రభాస్, రణ్‌బీర్ చిత్రాలు పూర్తయిన వెంటనే పట్టాలెక్కుతుందా? లేదా? తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

అదనంగా ఏ కోర్సులు నేర్చుకోవాలి?

ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. ఈ విద్యార్హతతో ఐటీ సంస్థల్లో ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. అదనంగా ఏ కోర్సులు నేర్చుకోవాలి? - వెంకట్

■ ఐటీ సంస్థలు కేవలం టెక్నికల్ డిగ్రీ ఉన్నవారినే కాకుండా, ఎంబీఏ పూర్తిచేసిన వారినీ పెద్ద సంఖ్యలో నియమిస్తున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్ట్ నిర్వహణ, బిజినెస్ అనాలిసిస్, మానవ వనరుల నిర్వహణ, మార్కెటింగ్, ఫైనాన్స్ లాంటి విభాగాల్లో ఎంబీఏ చదివినవారికి మంచి డిమాండ్ ఉంది. ఐటీ సంస్థల్లో బిజినెస్ అనలిస్ట్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, ఫంక్షనల్ కన్సల్టెంట్, ప్రొడక్ట్ ఎగ్జిక్యూటివ్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్, ఐటీ/హెచ్‌ఆర్ స్పెషలిస్ట్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. టెక్నాలజీని నేరుగా అభివృద్ధి చేయకపోయినా టెక్నికల్ టీమ్‌కి, క్లయింట్‌కి మధ్య వారధిగా పనిచేసే పాత్రల్లో ఎంబీఏ గ్రాడ్యుయేట్లు కీలకంగా ఉంటారు.

● ఎంబీఏలో స్పెషలైజేషన్ చాలా ముఖ్యమైన అంశం. మార్కెటింగ్ స్పెషలైజేషన్‌తో ఐటీ సంస్థల్లో సేల్స్ కన్సల్టెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, డిజిటల్ క్యాంపెయిన్ మేనేజర్‌గా పనిచేయవచ్చు. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌తో టెక్ రిక్రూటర్, ట్యాలెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌గా ఉపాధి అవకాశాలు పొందవచ్చు. ఫైనాన్స్ స్పెషలైజేషన్ ఉన్నవారికి ఫైనాన్షియల్ అనలిస్ట్, రిస్క్ అనలిస్ట్, ప్రాజెక్ట్ ఫైనాన్స్ కోఆర్డినేటర్ లాంటి హోదాలు అందుబాటులో ఉంటాయి. ఆపరేషన్స్ లేదా సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉన్నవారు ఐటీ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఎదగవచ్చు.



● ఎంబీఏతో పాటు కొన్ని స్కిల్ బేస్డ్ కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు బాగా పెరుగుతాయి. ముఖ్యంగా బిజినెస్ అనలిటిక్స్, డేటా అనాలిసిస్ లాంటి రంగాల్లో పరిజ్ఞానం ఉంటే ఐటీ సంస్థల్లో వేగంగా ఎదగవచ్చు. డేటా విజువలైజేషన్ టూల్స్, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం ఇప్పుడు ప్రతి మేనేజర్‌కీ అవసరం. అలాగే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ టూల్స్‌పై అవగాహన ఉండటం చాలా ముఖ్యం.

● ఐటీ రంగంలో డిజిటల్ మార్కెటింగ్ కూడా కీలక పాత్ర పోషిస్తోంది. సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, కంటెంట్ స్ట్రాటజీ లాంటి అంశాలపై శిక్షణ తీసుకుంటే మార్కెటింగ్ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌కు హెచ్‌ఆర్ అనలిటిక్స్, ఏటీఎస్ టూల్స్ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుంది.

● ఐటీ సంస్థల్లో పనిచేయడానికి కోడింగ్ తప్పనిసరి కాదు. కానీ సాఫ్ట్‌వేర్ ఎలా పనిచేస్తుంది, డేటా ఎలా ప్రాసెస్ అవుతుంది, ప్రాజెక్ట్ లైఫ్ సైకిల్ ఎలా ఉంటుంది.. వీటిపై ప్రాథమిక అవగాహన ఉండాలి. క్లయింట్‌తో మాట్లాడేటప్పుడు, టెక్నికల్ టీమ్‌తో సమన్వయానికి ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయి. అందువల్ల టెక్నాలజీకి సంబంధించిన ప్రాథమిక శిక్షణను తప్పక పొందాలి.

● మీరు ఎంబీఏ మొదటి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్పులు, లైవ్ ప్రాజెక్టులు, ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు చేయాలి. కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలూ ఐటీ రంగంలో అత్యంత కీలకం. ఎంబీఏ డిగ్రీకి సరైన నైపుణ్యాలూ తోడైతే ఐటీ సంస్థల్లో మంచి కెరియర్ ఆశించవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్యలో పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- ✦ పీజీ డిప్లొమా కోర్సులు: (టెలివిజన్ జర్నలిజం, జ్యోతిర్వాస్తు)
- ✦ డిప్లొమా కోర్సులు: (లలిత సంగీతం, సినిమా రచన, జ్యోతిషం)
- ✦ సర్టిఫికెట్ కోర్సులు: (జ్యోతిషం, సంగీత విశారద, ఆధునిక తెలుగు)
- ✦ బీఎఫ్ఏ (నాలుగేళ్లు), బీడిజైన్ (నాలుగేళ్లు)

అర్హత: కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉండాలి. సంగీత విశారద కోర్సుకు మొదటి సంవత్సరంలో చేరే నాటికి అభ్యర్థి వయసు 12 ఏళ్లు నిండి ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-03-2026.
వెబ్‌సైట్: https://teluguuniversity.ac.in/

అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్).. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్: 101
- ✦ వెస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్: 136
- ✦ నార్తర్న్ రీజియన్ పైప్‌లైన్స్: 54
- ✦ సదరన్ రీజియన్ పైప్‌లైన్స్: 40
- ✦ సౌత్ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్: 63

ట్రేడులు/ విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, అసిస్టెంట్ హ్యూమన్ రిసోర్స్, అకౌంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్.
అర్హత: 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ.
వయసు: 31.01.2026 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** విద్యార్హతలు, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలనతో.
ఆన్‌లైన్ దరఖాస్తులు: 28.01.2026 నుంచి 10.02.2026 వరకు స్వీకరిస్తారు. **వెబ్‌సైట్:** https://iocl.com/apprenticeships

సీఎల్‌ఆర్ఐ, చెన్నైలో

సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై.. తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ జూనియర్ స్టెనోగ్రాఫర్: 01 ✦ జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: 06 ✦ మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 06
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు స్టెనోగ్రఫీ, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వేతనం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.53,628. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.39,545. మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.35,973.
వయసు: జూనియర్ స్టెనోగ్రాఫర్ 27 ఏళ్లు; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు; మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 25 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాత పరీక్ష, స్టెనోగ్రఫీ మొదలైన వాటితో.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులు/ ఎక్స్‌-సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.03.2026.
వెబ్‌సైట్: https://www.clri.org/

వాయుసేనలో వీరులవుతారా?

భారతీయ వాయుసేన అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్‌వాయు పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిప్లొమా విద్యార్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి.



అగ్నివీర్‌వాయు పోస్టుల భర్తీకి ఎయిర్‌ఫోర్స్ ఏటా రెండు సార్లు ప్రకటన వెలువరిస్తోంది. ప్రస్తుత నోటిఫికేషన్ 2027(1) ఇంటేక్‌కు చెందింది. ఇందులో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో పోస్టులు ఉన్నాయి. సైన్స్ విభాగంలో దరఖాస్తు చేసుకున్నవారు కావాలనుకుంటే నాన్ సైన్స్ ఖాళీలకూ పోటీ పడవచ్చు. ఇందుకోసం ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైనవారు నాలుగేళ్లు సేవలందిస్తారు. అనంతరం వీరిలో 25 శాతం మందికి శాశ్వత ఉద్యోగానికి అవకాశమిస్తారు. అందరికీ సర్టిఫికెట్, ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి.

ఎంపిక

మూడు దశల్లో నిర్వహించే వివిధ పరీక్షలతో నియామకాలు చేపడతారు.

ఫేజ్-1: ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి ఒక గంట. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. నాన్ సైన్స్ పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. సైన్స్, నాన్ సైన్స్ రెండిటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష వ్యవధి 85 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 సిలబస్ నుంచే వస్తాయి. ఎంచుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్ 20, ఫిజిక్స్ 25, మ్యాథ్స్ 25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు ఉంటాయి.

ఫేజ్-2లో: ఫేజ్-1 ప్రతిభావంతులకే ఫేజ్-2లో అవకాశం ఉంటుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 7, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటీ నిమిషం వ్యవధిలో.. 10 బస్కీలు, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్ అప్స్, నిమిషంలో 15 స్క్వాట్స్ చేయగలగాలి. వీటన్నిటిలోనూ అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్టు 1, 2లు ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. దీనిద్వారా అభ్యర్థి వాయుసేన ఉద్యోగం, వాతావరణానికి అలవాటు పడగలడా లేదా పరిశీలిస్తారు.

ఫేజ్ 3: అడాప్టబిలిటీ టెస్టులో అర్హులకు వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణకు ఎంపిక చేస్తారు.

విజయానికి

✦ అగ్నివీర్‌వాయు వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీ సిలబస్ వివరాలు ఉన్నాయి. అందులోనే మాదిరి ప్రశ్నలూ, మాక్ టెస్టూ అందుబాటులో ఉంచారు. వీటన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తే.. పరీక్ష స్వరూపం, ప్రశ్నల తీరు, చదవాల్సిన అంశాలు, వాటి స్థాయి తెలుస్తుంది.

✦ ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉంటాయి. అందువల్ల ఈ సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు బాగా చదువుకోవాలి.

✦ రీజనింగ్ ప్రశ్నలకు హైస్కూల్ మాథ్స్ పుస్తకాల్లోని జనరల్ అంశాలు బాగా చదివితే సరిపోతుంది.

✦ జనరల్ అవేర్‌నెస్ కోసం హైస్కూల్ సైన్స్, సోషల్ పుస్తకాల్లోని ముఖ్యాంశాలతోపాటు, వర్తమాన సంఘటనలను అనుసరించాలి.

✦ పాఠ్యపుస్తకాలు బాగా చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే ప్రయోజనం.

✦ పాత ప్రశ్నపత్రాలు బాగా చదవాలి. పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులు రాస్తే మేలు.

✦ ఈ పరీక్షకు సంబంధించి అందుబాటులో ఉన్న పలు పుస్తకాల్లో ఏదైనా ఒక దానికే పరిమితమై, అదే పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో అవకాశం వచ్చినవారికి తొలి ఏడాది ప్రతి నెలా రూ.30,000 చెల్లిస్తారు. రెండో సంవత్సరం నెలకు రూ.33,000 వేతనం ఉంటుంది. మూడో ఏడాది రూ.36,500 అందుతుంది. నాలుగో సంవత్సరం రూ.40,000 ప్రతి నెలా పొందుతారు. నాలుగేళ్ల సేవలకుగానూ పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు స్కిల్ సర్టిఫికెట్ ఇస్తారు. ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కు జమచేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ కలుపుతుంది. రెండూ కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని కలిపి, అగ్నివీర్‌వాయుకి నాలుగేళ్లు పూర్తయిన తర్వాత అందిస్తారు. వీరిలో ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని ఎయిర్‌ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగానికి ఎంపికచేస్తారు. ఇందుకోసం ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా అవకాశం వచ్చిన వారు పూర్తి కాలం సేవలు అందించవచ్చు. అనంతరం పింఛను, ఇతర సౌకర్యాలూ పొందవచ్చు. శాశ్వత ఉద్యోగంలో అవకాశం రానివారికి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్/ ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా చూస్తారు. వీరికి కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి.

వివరాలు

అర్హత: సైన్స్ విభాగానికి.. మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు ఇంటర్మీడియట్‌లో చదవాలి. 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచీల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులు పొందాలి. నాన్ సైన్స్ పోస్టులకు.. ఏదైనా గ్రూపుతో ఇంటర్‌లో 50 శాతం మార్కులు పొందినవారు అర్హులు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులు రావాలి. సైన్స్, నాన్ సైన్స్ రెండు పోస్టులకూ.. పది/ఇంటర్/ఒకేషనల్/డిప్లొమాలలో ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. ఉండాలి. **ఛాతీ:** ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు 5 సెం.మీ. వ్యత్యాసం తప్పనిసరి.

వయసు: జనవరి 1, 2006 - జులై 1, 2009 మధ్య జన్మించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: ఫిబ్రవరి 1 వరకు స్వీకరిస్తారు.

పరీక్ష ఫీజు: రూ.550. దీనికి జీఎస్టీ అదనం.

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: మార్చి 30, 31.

వెబ్‌సైట్: https://iafrecruitment.edcil.co.in

నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్‌లో

నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.. అప్రెంటిస్‌షిప్ ట్రెయినీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

CSIR-NAL

✦ అప్రెంటిస్‌షిప్ ట్రెయినీలు: 35 ఖాళీలు
ట్రేడులు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ మోటర్ వెహికల్, డ్రాఫ్ట్‌మ్యాన్ మెకానికల్, వెల్డర్.
అర్హత: సంబంధిత ట్రేడులు/ విభాగాల్లో ఐటీఐ.
వేతనం: నెలకు రూ.10,560. (వెల్డర్‌కు రూ.9,600).
ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 4, 5.
వేదిక: ఆర్‌ఏబీ మీటింగ్ కాంప్లెక్స్, సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://www.nal.res.in/

సైంటిస్టులు

సెంట్రల్ స్కిల్ బోర్డు, బెంగళూరు సైంటిస్ట్-బీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ సైంటిస్ట్-బీ: 28
అర్హత: సంబంధిత విభాగంలో బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** ఫిబ్రవరి 18, 2026 నాటికి 35 ఏళ్లు ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.56,100 - 1,77,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18.
వెబ్‌సైట్: https://csb.gov.in/job-opportunities/job/

సుప్రీంకోర్టులో క్లర్కు కొలువులు

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు.. 90 లా క్లర్క్-కమ్-రిసెర్చ్ అసోసియేట్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి భర్తీచేయనుంది. లా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక మూడు దశల్లో ఉంటుంది.



పార్ట్-1, పార్ట్-2ల్లో రాత పరీక్షలు, పార్ట్-3లో ఇంటర్వ్యూతో నియామకాలు ఉంటాయి. లా డిగ్రీ మూడో ఏడాది, ఇంటిగ్రేటెడ్ డిగ్రీ ఐదో సంవత్సరం చదువుతున్నవారూ దరఖాస్తుకు అర్హులే. అభ్యర్థులకు పరిశోధన, విశ్లేషణ, రాత నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. అవసరమైన సమాచారాన్ని ఈ-ఎస్‌సీఆర్, మనుపత్ర, ఎస్‌సీసీ ఆన్‌లైన్, లెక్సిస్‌నెక్సిస్, వెస్ట్ లా మొదలైన సెర్చ్ ఇంజిన్ల నుంచి సేకరించగలగాలి.

ఎంపిక

పార్ట్-1లో లా, కాంప్రహెన్షన్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పార్ట్-2లో రైటింగ్, అనలిటికల్ స్కిల్స్ తెలుసుకోవడానికి సబ్జెక్టు సంబంధిత రాత పరీక్ష ఉంటుంది. పార్ట్-3లో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పరీక్ష విధానం, కనీసార్హత మార్కులు, నియమ నిబంధనల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

- ◆ పార్ట్-1 పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుంది. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. పార్ట్-2 పరీక్ష ప్రశ్నలు కంప్యూటర్ స్క్రీన్‌పైన కనిపిస్తాయి. వీటికి సమాధానాలను పెన్నుతో పేపర్‌పై రాయాలి.
- ◆ పార్ట్-1, పార్ట్-2 పరీక్షలను దేశవ్యాప్తంగా 23 కేంద్రాల్లో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నాల్లో పరీక్షలు జరుగుతాయి.
- ◆ పార్ట్-1, పార్ట్-2ల్లో కనీసార్హత మార్కులు పొందినవారిని పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

వివరాలు

అర్హత: బీఎల్ చేసి.. బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా నమోదు కావాలి.
వయసు: 07.02.2026 నాటికి 20-32 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.750+ బ్యాంకు ఛార్జీలు.
వేతనం: నెలకు రూ.1,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.02.2026
రాత పరీక్ష తేదీ: 07.03.2026. **వెబ్‌సైట్:** https://www.sci.gov.in/

'ఎలా నేర్చుకోవాలో' తెలుసుకోండి



ఇటీవల జైపూర్‌లో జరిగిన లిటరేచర్ ఫెస్టివల్‌లో నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త ఎస్తేర్ డుఫ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విలువైన సూచనలెన్నో అందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని, రాణించాలంటే ఏం చేయాలో తెలిపారు. ఆ వివరాలు..

నేడు యువత అత్యంత వేగంగా నేర్చుకుంటున్న నైపుణ్యాలు వారు చదువు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించే నాటికే అవసరం లేకుండా పోవచ్చు. మారుతోన్న ఆర్థిక పరిస్థితులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విజృంభణ నేపథ్యంలో విద్యార్థులు కెరియర్ పట్ల వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

నైపుణ్యం కంటే సామర్థ్యం

చాలామంది విద్యార్థులు ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నారు. అంతేకానీ ఈ లక్ష్యాన్ని కచ్చితంగా సాధించాలని పూర్తి ఇష్టంతో శ్రమించడం లేదు. ఒకవేళ ఇప్పుడు శిక్షణ తీసుకుంటున్న సాఫ్ట్‌వేర్ లేదా టెక్నికల్ స్కిల్ ఐదేళ్లలో కనుమరుగైపోవచ్చు. అందువల్ల విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యా పరిష్కార సామర్థ్యం కలిగి ఉండాలి. ఇప్పుడున్న సాంకేతిక ప్రపంచంలో 'ఏమి నేర్చుకోవాలి' అన్న దానికంటే 'ఎలా వేగంగా నేర్చుకోవాలి' అనే దానిపై దృష్టి పెట్టాలి.

ఓటమి భయం

పోటీ పరీక్షలలో ప్రధానంగా ఉండేది భయం. ప్రయోగాలు చేసినప్పుడే ఫలితాలు ఉంటాయి. పరిశోధనలు చాలా సార్లు విఫలమవుతాయి. కానీ ఆ వైఫల్యాల నుంచే సరైన మార్గం తెలుస్తుంది. ప్రయత్నమే మొదటి మెట్టుగా భావించి ముందుకు సాగాలి. విఫలమవుతామేమో అన్న ప్రశ్నతోనే ఆగిపోకూడదు. వినూత్నంగా ఆలోచించే విధానాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలి.

హ్యూమానిటీస్

ఏఐ లాంటి టెక్నాలజీలు లెక్కలు, కోడింగ్‌ను సులభంగా చేయగలవు. కానీ, మానవ సంబంధాలు, సమాజంలోని సంక్లిష్టతలు, నైతిక విలువలు, సృజనాత్మకత లాంటి అంశాల్లో మనిషిని మించి ఏ యంత్రమూ ఉండదు. కాబట్టి మనుషుల మధ్య బంధాలను చదవడం కూడా గొప్ప నైపుణ్యం. సైకాలజీ లాంటి హ్యూమానిటీస్ కోర్సులు చదువుకున్న వారికి రాబోయే కాలంలో డిమాండ్ పెరుగుతుంది.

పూర్తి అవగాహన

ఏ సబ్జెక్టు చదువుతున్నా దానిపై పూర్తి అవగాహన పొందడానికి కృషి చేయాలి. దాని డేటాను విశ్లేషించేలా ఉండాలి. బట్టీ కొట్టే నైపుణ్యంతో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. అది తాత్కాలిక ఫలితాలను ఇస్తుందేమో కానీ భవిష్యత్తుపై పూర్తి భరోసాను మాత్రం ఇవ్వలేదు.

ఏకాగ్రత

సోషల్ మీడియా యుగంలో ఏకాగ్రత పూర్తిగా దెబ్బతింటోంది. ఏదైనా విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే కనీసం కొన్ని గంటల పాటు సాధన చేయాలి. కానీ, సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా గడపడం వల్ల మెదడు నేర్చుకునే సామర్థ్యం కోల్పోతుంది. చివరికి అది కెరియర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువల్ల సోషల్ మీడియా విషయంలో పరిమితులు విధించుకుంటేనే ప్రయోజనం పొందగలరు.

కృత్రిమ మేధస్సు

ఏఐ టెక్నాలజీ రావడంతో కార్పొరేట్ ఉద్యోగాల తీరు గతంలో కంటే వేగంగా మారుతోంది. నేడు అవసరమైన నైపుణ్యం కొన్నేళ్లకే పాతబడిపోవచ్చు. అందువల్ల నిత్య విద్యార్థిగా ఉండాలి. నేర్చుకోవడం దైనందిన జీవితంలో భాగం కావాలి.

మానవీయ శాస్త్రాలు

సాంకేతిక, వృత్తిపరమైన డిగ్రీల కోసం ప్రపంచం మొత్తం పరుగెడుతోంది. కానీ తత్వశాస్త్రం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు లాంటి మానవీయ శాస్త్రాల అధ్యయనం విద్యలో ప్రధానంగా ఉండాలి. ఇవి విద్యార్థులకు ప్రపంచం గురించి అవగాహన పెంచుకోవడానికి సహాయపడతాయి. మరొకరికి సాయపడడానికీ, సమాజ అభివృద్ధికీ దోహదపడతాయి.

ప్రాథమికాంశాలు

ఒక యంత్రాన్ని ఎలా ఉపయోగించాలో నేర్చుకోవడం కంటే దాని సృష్టి వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవాలి. ఆ ఆలోచనలను అర్థం చేసుకోవడం వల్ల ఎంతో జ్ఞానాన్నీ, సమాచారాన్నీ పొందవచ్చు. నేర్చుకోవాలన్న జిజ్ఞాస ఉండాలి. పుస్తకాల్లో ఉన్నది నేర్చుకోవడం ఎంత అవసరమో, దాన్ని అమలుపరచడమూ అంత కంటే ముఖ్యం. అప్పుడే నేర్చుకున్నది మర్చిపోకుండా ఉంటారు. కొత్తగా ప్రయోగాలు చేస్తూ, చురుకుగా ఆలోచించాలి. ఏఐని సృష్టించింది మానవ మెదడే అన్నది దృష్టిలో ఉంచుకుని, వినూత్నంగా ఆలోచిస్తూ విజయాలవైపు బాటలు వేయాలి.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

బిజినెస్ స్ట్రాటజీ
సంస్థ: నోమైస్లాట్స్
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, బిజినెస్ రిసెర్చ్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, నెట్‌వర్కింగ్ స్టైపెండ్: రూ.13,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/59k3j4er

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
సంస్థ: ఏక్‌లవ్య.మి
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డేటా స్ట్రక్చర్స్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, పైథాన్
స్టైపెండ్: రూ.5,000-6,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/2ncw483d

కంటెంట్ కంట్రోల్ అసోసియేట్
సంస్థ: ఎకర్త్ వెంచర్స్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, ప్రూఫ్‌రీడింగ్, రిపోర్ట్ రైటింగ్. స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/45jmnu92

బ్రాండ్ మార్కెటింగ్
సంస్థ: ఇన్నోనోవెక్స్
నైపుణ్యాలు: మార్కెట్ అనాలిసిస్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్
స్టైపెండ్: రూ.9,000-20,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/3rhtzmdr

డెవలపర్స్ ఆర్గనైజేషన్స్
సంస్థ: లీగలిటీ (గ్రే స్విఫ్ట్ ప్రై.లి.)
నైపుణ్యాలు: ఏడబ్ల్యూఎస్ క్లౌడ్‌ఫార్మేషన్, సీఐ/సీడీ, లినక్స్, పైథాన్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/yvvenb82

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్
సంస్థ: క్వాంటం ఐటీ ఇన్నోవేషన్
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, క్లౌడ్ ఫైర్‌స్టోర్, డార్ట్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://shorturl.at/1Tvlz

డేటా అనలిటిక్స్
సంస్థ: డీప్‌థాట్ కల్చర్‌టెక్ వెంచర్స్ ప్రై.లి.
నైపుణ్యం: డేటా అనలిటిక్స్
స్టైపెండ్: రూ.2,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://shorturl.at/3xVQ7

సమాజ గతిని మార్చిన ప్రేరకులకు జేజేలు

• పద్మశ్రీతో గుర్తించిన కేంద్రం

దిల్లీ: దేశానికి విశేష సేవలందించి సమాజ గతిని మార్చిన ప్రేరకులను కేంద్రం పద్మశ్రీలతో గుర్తించింది. వివిధ రంగాలలో వారు సేవలందించి పేరు సంపాదించారు. అలాంటి వారిలో కొందరు..

మాజీ బస్ కండక్టర్..



ప్రపంచంలోనే అతి పెద్ద ఉచిత లైబ్రరీని స్థాపించిన ఒకప్పటి బస్ కండక్టర్ అంకే గౌడ (75) ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. కర్ణాటకలోని హరలహళ్లికి చెందిన ఆయన ఉద్యోగాన్ని వదిలేసి 'పుస్తక్ మానె' పేరుతో లైబ్రరీ ఏర్పాటు చేశారు. అందులో 20 భాషలకు చెందిన 20 లక్షల పుస్తకాలున్నాయి. అరుదైన చేతిరాత ప్రతులూ ఉన్నాయి.

'కాలాజార్' గుర్తింపు పరీక్షకుడికి..

కాలాజార్ గుర్తింపునకు అతి చౌకగా చేసే పరీక్షను కనుగొన్న శ్యామ్ సుందర్‌కు పద్మశ్రీ దక్కింది.

సీనియర్ హెమటాలజిస్టు..

రక్త సంబంధ వ్యాధి హీమోఫీలియా రంగంలో విశేష కృషి చేసిన హెమటాలజిస్టు సురేశ్ హంగవాడికి పద్మశ్రీ లభించింది.

పురాతన టిబెటన్ ఔషధకర్త..




పురాతన టిబెటన్ ఔషధాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన లద్దాఖ్‌కు చెందిన పద్మా గుర్మీత్‌ను పద్మశ్రీ వరించింది.

సంప్రదాయ, ఆధునిక చికిత్సల మేళవింపునకు..

సీనియర్ శాస్త్రవేత్త పుణ్యమూర్తి నటేశన్‌కు పద్మశ్రీ దక్కింది. ఆయన సంప్రదాయ, ఆధునిక శాస్త్రాలను మేళవించి పశువులకు వైద్యం అందించారు.

అవయవ దానంపై కృషికి..



డొనేట్ లైఫ్ పేరుతో అవయవ దానంపై కృషి చేస్తున్న గుజరాత్‌కు చెందిన నీలేశ్ వినోద్‌చంద్ర మండ్లేవాలాను పద్మశ్రీ వరించింది.

తమిళ మార్షల్ ఆర్ట్స్‌కు..

తమిళనాడులో పురాతన మార్షల్ ఆర్ట్ అయిన శిలంబం శిక్షణనిస్తున్న పుదుచ్చేరికి చెందిన కె.పజనివేల్‌కు పద్మశ్రీ దక్కింది.

100 ఏళ్ల కళాకారుడికి..

మణిపుర్‌కు చెందిన నట సంకీర్తన కళాకారుడు, 100 ఏళ్ల యమ్నుం జత్రా సింగ్‌కు పద్మశ్రీ దక్కింది.

గిరిజన తర్పా వాయిద్యకారుడు..



మహారాష్ట్రకు చెందిన గిరిజన తర్పా వాయిద్యకారుడు భిక్లియా లడాకియా ధిండాకు (90) పద్మశ్రీ దక్కింది. సొరకాయ, వెదురు బొంగులతో ఈ వాయిద్యాన్ని దీనిని తయారు చేస్తారు.

రాజస్థానీ జానపదానికి..

రాజస్థాన్‌లో జానపద వాయిద్య కారుడు గఫ్రుద్దీన్ మేవాటి జోగికి పద్మశ్రీ దక్కింది. ఆయన భాపంగ్ అనే సంప్రదాయ పరికరంతో సంగీతాన్ని పలికిస్తారు.


విశ్వబంధుకు..

బిహార్‌కు చెందిన జానపద నృత్యకారుడు విశ్వబంధుకు పద్మశ్రీ దక్కింది.

గుజరాతీ కళకు..

గుజరాతీ సంప్రదాయ కళ అయిన మాన్‌భాత్ కళాకారుడు ధార్మిక్‌లాల్ చునీలాల్ పాండ్యాకు పద్మశ్రీ అవార్డు దక్కింది.

కళామతల్లి ముద్దుబిడ్డ..



మధ్యప్రదేశ్‌కు చెందిన బుందేలీ యుద్ధ కళ శిక్షకుడు భగవాన్‌దాస్ రాయ్‌కర్‌ను పద్మశ్రీ వరించింది.

అల్గోజా రక్షకుడికి..

రాజస్థాన్‌లోని సంప్రదాయ వాయిద్య పరికరం అల్గోజాను రక్షిస్తున్న సంగీతకారుడు తగా రామ్ భీల్‌ను పద్మశ్రీ వరించింది.

జానపద నటికి..

ఒడిశాలోని సఖి నాట జానపద థియేటర్ ఆర్టిస్టు సీమాంచల్ పాత్రోకు పద్మశ్రీ దక్కింది.

నాగా జానపద గురుకు..

నాగాలాండ్ జానపద గురు సాంగ్యుసంగ్ ఎస్ పొంగెనర్‌కు పద్మశ్రీ దక్కింది.

సినోగ్రాఫర్‌కు..

అస్సాంకు చెందిన సినోగ్రాఫర్ నూరుద్దీన్ అహ్మద్‌కు దేశ నాలుగో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దక్కింది.

భజన గాత్రానికి..

తమిళనాడుకు చెందిన భజన గాయకులు ఒతువర్ తిరుత్తణి స్వామినాథన్‌కు పద్మశ్రీ దక్కింది.


శతాబ్దాల కళారక్షకుడికి..

తమిళనాడులోని నీలగిరికి చెందిన శతాబ్దాలనాటి కురుంబ గిరిజన కళను కాపాడుతున్న ఆర్ కృష్ణన్‌కు పద్మశ్రీ దక్కింది.

అస్సాం సంగీతానికి..

అస్సాంలోని కర్బీ జానపద సంగీతానికి ఆధునికాన్ని మేళవించిన సంగీతకారులు పోకిలా లెక్‌తెపీకి పద్మశ్రీ దక్కింది.

ఢోలక్ వాయిద్యకారుడికి..



ఢోలక్‌ను ప్రధాన వాయిద్య పరికరంగా తీర్చిదిద్దిన మీర్ హాజీభాయ్ కాసంభాయ్‌ను పద్మశ్రీ వరించింది.

శానిటేషన్ ప్రచారకర్త..

అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన శానిటేషన్ ప్రచారకర్త టెకి గుబిన్‌ను పద్మశ్రీ వరించింది. ఆయన నిషి వర్గానికి చెందిన సంస్కృతిని పరిరక్షిస్తున్నారు.

మరెంతో మంది హీరోలు..

✦ ఇంకా సంతాలీ భాష రచయిత, కంపోజర్ చరణ్ హెంబ్రమ్ (ఒడిశా), హిందీపై 60 ఏళ్లుగా ప్రచారం చేస్తున్న జర్నలిస్టు కైలాశ్ చంద్ర పంత్, కశ్మీరీ రచయిత షఫీ షౌక్, త్రిపురకు చెందిన కోక్‌బొరక్ భాషను కాపాడుతున్న నరేశ్ చంద్ర దేబ్‌బర్మ, ఇత్తడితో కళాఖండాలు సృష్టిస్తున్న ఉత్తర్ ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన చిరంజీ లాల్ యాదవ్, కాంస్యంతో విగ్రహాలను తయారుచేసే తమిళనాడుకు చెందిన రాజస్తపతి కలియప్ప, కాంతా ఎంబ్రాయిడరీపై స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చే పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృప్తి ముఖర్జీలకు పద్మశ్రీ అవార్డులు దక్కాయి.



చరణ్ హెంబ్రమ్

✦ జందాని అల్లికపై శిక్షణ ఇచ్చే హరియాణాకు చెందిన ఖేమ్ రాజ్ సంద్రియాల్, 92ఏళ్ల పర్యావరణవేత్త కొల్లక్కియల్ దేవకీ అమ్మ (కేరళ), మేఘాలయలో ఖాసి టెక్నిక్‌లకు స్థానికులకు నేర్పుతున్న హాలీ వార్, 75,000 నీటి కుంటలను నిర్మించిన మధ్యప్రదేశ్‌కు చెందిన మోహన్ నగార్, మహారాష్ట్రలో వ్యవసాయ ఆవిష్కరణలకు నాంది పలికిన శ్రీరంగ్ దేవ్‌బా లాడ్ (దాదా లాడ్ కాటన్ సాగు టెక్నిక్ సృష్టికర్త), ఒడిశాలో గిరిజన వాయిస్‌లను రికార్డు చేసి భద్రపరుస్తున్న మహేంద్ర కుమార్, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చిన ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రఘుపత్ సింగ్, డ్రగ్స్ కట్టడిపై అవగాహన కల్పిస్తున్న మహారాష్ట్ర తమాషా కళాకారుడు రఘువీర్ తుకారామ్ ఖేడ్కర్‌లకు పద్మశ్రీ దక్కింది.

సామాజిక కార్యకర్త..

జమ్మూ కశ్మీర్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త బ్రిజ్‌లాల్ భట్‌ను పద్మశ్రీ వరించింది.

గిరిజనులకు చౌక వైద్యానికి..

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో గిరిజనులకు చౌకగా వైద్యం అందిస్తున్న రామచంద్ర, సునీత గాడ్బోలేలకు పద్మశ్రీ దక్కింది.

పద్మశ్రీ దక్కింది వీరికే..

పేరు	రంగం	రాష్ట్రం/దేశం
1. ఎ.ఈ.ముత్తునాయగన్	సైన్స్, ఇంజినీరింగ్	కేరళ
2. అనిల్ కుమార్ రస్తోగి	కళలు	ఉత్తర్ ప్రదేశ్
3. అంకే గౌడ	సామాజిక సేవ	కర్ణాటక
4. ఆర్మిదా ఫెర్నాండెజ్	వైద్యం	మహారాష్ట్ర
5. అర్వింద్ వైద్య	కళలు	గుజరాత్
6. అశోక్ ఖడే	వాణిజ్యం, పరిశ్రమలు	మహారాష్ట్ర
7. అశోక్ కుమార్ సింగ్	సైన్స్, ఇంజినీరింగ్	ఉత్తర్ ప్రదేశ్
8. అశోక్ కుమార్ హల్దార్	సాహిత్యం, విద్య	పశ్చిమ బెంగాల్
9. బల్‌దేవ్ సింగ్	క్రీడలు	పంజాబ్
10. భగవాన్‌దాస్ రాయ్‌కర్	క్రీడలు	మధ్యప్రదేశ్
11. భరత్ సింగ్ భారతి	కళలు	బిహార్
12. భిక్లియా లడకియా ధిండా	కళలు	మహారాష్ట్ర
13. విశ్వ బంధు	కళలు	బిహార్
14. బ్రిజ్ లాల్ భట్	సామాజిక సేవ	జమ్మూ కశ్మీర్
15. బుద్ధ రష్మీ మణి	ఆర్కియాలజీ	ఉత్తర్ ప్రదేశ్
16. బుధరీ తాతి	సామాజిక సేవ	ఛత్తీస్‌గఢ్
17. చంద్రమౌళి జి	సైన్స్, ఇంజినీరింగ్	తెలంగాణ
18. చరణ్ హెంబ్రమ్	సాహిత్యం, విద్య	ఒడిశా
19. చిరంజీ లాల్ యాదవ్	కళలు	ఉత్తర్ ప్రదేశ్
20. దీపికా రెడ్డి	కళలు	తెలంగాణ
21. ధార్మిక్‌లాల్ చునీలాల్ పాండ్యా	కళలు	గుజరాత్
22. గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్	కళలు	ఆంధ్ర ప్రదేశ్
23. గఫ్రుద్దీన్ మేవాతి జోగి	కళలు	రాజస్థాన్
23. గంభీర్ సింగ్ యోంజోన్	సాహిత్యం, విద్య	పశ్చిమ బెంగాల్
24. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్	కళలు	ఆంధ్ర ప్రదేశ్
25. గాయత్రి బాలసుబ్రమణియన్, రంజని బాలసుబ్రమణియన్	కళలు	తమిళనాడు
26. గోపాల్ జీ త్రివేది	సైన్స్, ఇంజినీరింగ్	బిహార్
27. గూడూరు వెంకట్రావు	వైద్యం	తెలంగాణ
28. హెచ్.వి.హండే	వైద్యం	తమిళనాడు
29. హాలీ వార్	సామాజిక సేవ	మేఘాలయ
30. హరి మాధబ్ ముఖోపాధ్యాయ్	కళలు	పశ్చిమ బెంగాల్
31. హరిచరణ్ సైకియా	కళలు	అస్సాం
32. హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లార్	క్రీడలు	పంజాబ్
33. ఇందర్‌జీత్ సింగ్ సిద్ధు	సామాజిక సేవ	చండీగఢ్
34. జనార్దన్ బాపూరావ్ బోథె	సామాజిక సేవ	మహారాష్ట్ర
35. జోగేశ్ దేవ్‌రీ	వ్యవసాయం	అస్సాం
36. జునెర్ వాసి	సైన్స్, ఇంజినీరింగ్	మహారాష్ట్ర
37. జ్యోతిశ్ దేబ్‌నాథ్	కళలు	పశ్చిమ బెంగాల్
38. కె.పజనివేల్	క్రీడలు	పుదుచ్చేరి
39. కె.రామస్వామి	సైన్స్, ఇంజినీరింగ్	తమిళనాడు
40. కె.విజయ్ కుమార్	సివిల్ సర్వీస్	తమిళనాడు
41. కబీంద్ర పురకాయస్థ	ప్రజా సంబంధాలు	అస్సాం
42. కైలాశ్ చంద్ర పంత్	సాహిత్యం, విద్య	మధ్య ప్రదేశ్
43. కలమండలం విమల మేనన్	కళలు	కేరళ
44. కేవల్ కిషన్ థక్రాల్	వైద్యం	ఉత్తర్ ప్రదేశ్
45. ఖేమ్ రాజ్ సంద్రియాల్	కళలు	హరియాణా
46. కొల్లక్కల్ దేవకీ అమ్మ	సామాజిక సేవ	కేరళ
47. కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్	సైన్స్, ఇంజినీరింగ్	తెలంగాణ
48. కుమార్ బోస్	కళలు	పశ్చిమ బెంగాల్
49. కుమారస్వామి తంగరాజ్	సైన్స్, ఇంజినీరింగ్	తెలంగాణ
50. లార్స్ క్రిస్టియన్ కోక్	కళలు	జర్మనీ
51. ల్యూడ్‌మిలా విక్టోరోవ్‌నా ఖోక్‌లోవా	సాహిత్యం, విద్య	రష్యా
52. మాధవన్ రంగనాథన్	కళలు	మహారాష్ట్ర
53. మాగంటి మురళీ మోహన్	కళలు	ఆంధ్ర ప్రదేశ్
54. మహేంద్ర కుమార్ మిశ్ర	సాహిత్యం, విద్య	ఒడిశా
55. మహేంద్ర నాథ్ రాయ్	సాహిత్యం, విద్య	పశ్చిమ బెంగాల్
56. మామిడాల జగదీశ్ కుమార్	సాహిత్యం, విద్య	దిల్లీ
57. మంగళ కపూర్	సాహిత్యం, విద్య	ఉత్తర్ ప్రదేశ్
58. మీర్ హాజీభాయ్ కాసంభాయ్	కళలు	గుజరాత్
59. మోహన్ నాగర్	సామాజిక సేవ	మధ్య ప్రదేశ్
60. నారాయణ్ వ్యాస్	ఆర్కియాలజీ	మధ్య ప్రదేశ్
61. నరేశ్ చంద్ర దేవ్ వర్మ	సాహిత్యం, విద్య	త్రిపుర
62. నీలేశ్ వినోద్ చంద్ర మాండ్లెవాలా	సామాజిక సేవ	గుజరాత్
63. నూరుద్దీన్ అహ్మద్	కళలు	అస్సాం
64. ఒతువర్ తిరుత్తణి స్వామినాథన్	కళలు	తమిళనాడు
65. పద్మా గుర్మీత్	వైద్యం	లద్దాఖ్
66. పాలకొండ విజయానంద రెడ్డి	వైద్యం	తెలంగాణ
67. పోఖిల లెక్‌తెపి	కళలు	అస్సాం
68. ప్రభాకర్ బసవప్రభు కోర్	సాహిత్యం, విద్య	కర్ణాటక
69. ప్రతీక్ శర్మ	వైద్యం	అమెరికా
70. ప్రవీణ్ కుమార్	క్రీడలు	ఉత్తర్ ప్రదేశ్
71. ప్రేమ్‌లాల్ గౌతమ్	సైన్స్, ఇంజినీరింగ్	హిమాచల్ ప్రదేశ్
72. ప్రసేన్‌జిత్ ఛటర్జీ	కళలు	పశ్చిమ బెంగాల్
73. పుణ్యమూర్తి నటేశన్	వైద్యం	తమిళనాడు
74. ఆర్.కృష్ణన్	కళలు	తమిళనాడు
75. ఆర్.వి.ఎస్.మణి	సివిల్ సర్వీస్	దిల్లీ
76. రబీలాల్ తుడు	సాహిత్యం, విద్య	పశ్చిమ బెంగాల్
77. రఘుపత్ సింగ్	వ్యవసాయం	ఉత్తర్ ప్రదేశ్
78. రఘువీర్ తుకారామ్ ఖేడ్కర్	కళలు	మహారాష్ట్ర
79. రాజేంద్ర ప్రసాద్	వైద్యం	ఉత్తర్ ప్రదేశ్
80. మామిడి రామారెడ్డి	పశు సంవర్ధకం	తెలంగాణ
81. రామ్మూర్తి శ్రీధర్	రేడియో బ్రాడ్‌కాస్టింగ్	దిల్లీ
82. రామచంద్ర గాడ్బోలే, సునీత గాడ్బోలే	వైద్యం	ఛత్తీస్‌గఢ్
83. రతీలాల్ బోరీసాగర్	సాహిత్యం, విద్య	గుజరాత్
84. రోహిత్ శర్మ	క్రీడలు	మహారాష్ట్ర
85. ఎస్.జి.సుశీలమ్మ	సామాజిక సేవ	కర్ణాటక
86. శాంగ్యుసంగ్ ఎస్.పొంగెనర్	కళలు	నాగాలాండ్
87. నిరంజన్ దాస్	ఆధ్యాత్మికం	పంజాబ్
88. శరత్ కుమార్ పాత్ర	కళలు	ఒడిశా
89. సరోజ్ మండల్	వైద్యం	పశ్చిమ బెంగాల్
90. సతీశ్ షా	కళలు	మహారాష్ట్ర
91. సత్యనారాయణ్ నువాల్	వాణిజ్యం, పరిశ్రమలు	మహారాష్ట్ర
92. సవిత పూనియా	క్రీడలు	హరియాణా
93. షఫీ షౌక్	సాహిత్యం, విద్య	జమ్మూ కశ్మీర్
94. శశి శేఖర్ వెంపటి	సాహిత్యం, విద్య	కర్ణాటక
95. శ్రీరంగ్ దేవ్‌బా లాడ్	వ్యవసాయం	మహారాష్ట్ర
96. శుభ వెంకటేశ అయ్యంగార్	సైన్స్, ఇంజినీరింగ్	కర్ణాటక
97. శ్యాం సుందర్	వైద్యం	ఉత్తర్ ప్రదేశ్
98. సీమాంచల్ పాత్రో	కళలు	ఒడిశా
99. శివశంకరి	సాహిత్యం, విద్య	తమిళనాడు
100. సురేశ్ హంగవాడి	వైద్యం	కర్ణాటక
101. స్వామి బ్రహ్మదేవ్ జీ మహారాజ్	సామాజిక సేవ	రాజస్థాన్
102. టి.టి.జగన్నాథన్	వాణిజ్యం, పరిశ్రమలు	కర్ణాటక
103. తగ రామ్ భీల్	కళలు	రాజస్థాన్
104. తరుణ్ భట్టాచార్య	కళలు	పశ్చిమ బెంగాల్
105. టెకి గుబిన్	సామాజిక సేవ	అరుణాచల్ ప్రదేశ్
106. తిరువరూర్ భక్తవత్సలం	కళలు	తమిళనాడు
107. తృప్తి ముఖర్జీ	కళలు	పశ్చిమ బెంగాల్
108. వీజినాథన్ కామకోటి	సైన్స్, ఇంజినీరింగ్	తమిళనాడు
109. వెంపటి కుటుంబ శాస్త్రి	సాహిత్యం, విద్య	ఆంధ్ర ప్రదేశ్
110. వ్లాదిమిర్ మెస్త్విరిష్విలి	క్రీడలు	జార్జియా
111. యమ్నుం జాత్ర సింగ్	కళలు	మణిపుర్

నోట్: పద్మశ్రీ అవార్డులు 111 అయినా రెండుచోట్ల ఇద్దరికి కలిపి ఒకటే అవార్డుగా ప్రకటించారు. దీంతో మొత్తం 113 మందికి అవార్డులు దక్కాయి.

రంగారెడ్డి, ఏలూరు జిల్లాలకు

తొలిసారిగా పద్మ అవార్డులు

దిల్లీ: పద్మ అవార్డులకు మొత్తం 39,000 దరఖాస్తులు వచ్చాయి. వాటిని వడపోసి 131 మందికి అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 84 జిల్లాలకు ఈసారి అవార్డులు దక్కాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతవరకూ పద్మ అవార్డుల్లో ప్రాతినిధ్యం దక్కని 10 జిల్లాలు ఈసారి చోటు సంపాదించాయి. వాటిలో మండ్య (కర్ణాటక), బేతుల్ (మధ్య ప్రదేశ్), పర్భణీ (మహారాష్ట్ర), బాగేశ్వర్ (ఉత్తరాఖండ్), రంగారెడ్డి (తెలంగాణ), దక్షిణ దినాజ్‌పుర్ (పశ్చిమ బెంగాల్), నౌపడా (ఒడిశా), దంతెవాడ (ఛత్తీస్‌గఢ్), ఏలూరు (ఆంధ్ర ప్రదేశ్), దీగ్ (రాజస్థాన్) ఉన్నాయి. పెద్ద నగరాల్లోని వారికే కాకుండా చిన్న పట్టణాలైన అలెప్పీ, భోజ్‌పుర్, కాకర్, డార్జిలింగ్, గోల్‌పారా, ఇంఫాల్, జునాగఢ్, కృష్ణ, మోకోచుంగ్, నౌపడా, పూర్వ బర్ధమాన్, శ్రీ గంగానగర్‌లకూ పద్మ అవార్డులు దక్కాయి.

మిగిలిన రాష్ట్రాల్లో త్వరలోనే సర్ అమలు

• సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

దిల్లీ: దేశవ్యాప్తంగా మిగిలిన రాష్ట్రాల్లో కూడా త్వరలోనే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) అమలు చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ వెల్లడించారు. పారదర్శక ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ సజావుగా జరుగుతోంది. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది. ఆ లక్ష్యంతోనే అర్హత గలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో చేర్చాం. అనర్హుల పేర్లను తొలగించడం కోసమే సర్‌ను ప్రారంభించాం. బిహార్‌లో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అక్కడ ఓటర్ల తుది జాబితాపై ఒక్క అప్పీల్ కూడా దాఖలు కాలేదు. ఇది ఈ ప్రక్రియ విశ్వసనీయతకు నిదర్శనం. అస్సాంలో సర్ ప్రక్రియ జరుగుతోంది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కూడా త్వరలోనే అమలు చేస్తాం" అని సీఈసీ వెల్లడించారు.



బ్రిటన్‌లో ఎఫ్‌బీఐ తరహా పోలీసు విభాగం

• ఉగ్రవాదం, మోసం కేసుల్లో దర్యాప్తు కోసమే..

లండన్: ఉగ్రవాదం, మోసం, ముఠా హింసకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు కోసం కొత్తగా ఒక జాతీయ పోలీసు సర్వీసును ఏర్పాటు చేయనున్నట్లు బ్రిటన్ హోంమంత్రి షబానా మహమూద్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగినవారితో ఈ విభాగం ఏర్పాటవుతుందని వివరించారు. ఇది అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తరహాలో ఉంటుంది. ఈ విభాగం అధికారుల వద్ద అధునాతన పరిజ్ఞానం అందుబాటులో ఉంటుంది. దీని సాయంతో ప్రమాదకరమైన నేరగాళ్లను పట్టుకుంటారు. ఈ కొత్త విభాగం ఏర్పాటుతో నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సీఏ), ప్రాంతీయ స్థాయి వ్యవస్థీకృత నేర దర్యాప్తు విభాగాలు ఒకే గొడుగు కిందకి వస్తాయి. ఈ మేరకు ప్రతిపాదనలను షబానా సోమవారం పార్లమెంటు ముందుంచుతారు. ప్రస్తుత వ్యవస్థలో స్థానిక అధికారులకు సంక్లిష్టమైన ఆధునిక నేరాలపై దర్యాప్తు చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, వనరులు ఉండటంలేదని ఆమె పేర్కొన్నారు.

అమెరికా చెప్పినవన్నీ అబద్ధాలే

• ప్రపంచ ఆరోగ్య సంస్థ



టెడ్రోస్ అధనోమ్

జెనీవా: ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా నిష్క్రమణపై ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసస్ కీలక ప్రకటన చేశారు. తమ సంస్థ నుంచి వైదొలగడానికి దారితీసిన కారణాలపై అమెరికా చేసిన ప్రకటనలో వాస్తవికత లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద ఈ పరిణామం అమెరికాకు, ప్రపంచ దేశాలకు సురక్షితమైంది కాదన్నారు. భవిష్యత్తులో మళ్లీ డబ్ల్యూహెచ్‌వోలో అమెరికా చేరి క్రియాశీల పాత్రను పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా టెడ్రోస్ ఓ ట్వీట్ చేశారు. కరోనా వ్యాప్తిపై డబ్ల్యూహెచ్‌వో సకాలంలో తమకు సమాచారాన్ని అందించలేదని అమెరికా ప్రభుత్వం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ జాప్యం వల్ల అమెరికాలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ మేరకు జనవరి 22న అమెరికా ఆరోగ్య మంత్రి కెనడీ జూనియర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. తాజాగా దీనికి డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ కౌంటర్ ఇచ్చారు. అమెరికా సర్కారు ప్రకటనపై డబ్ల్యూహెచ్‌వో అధికారిక స్పందనతో కూడిన నోటిఫికేషన్‌ను కూడా ఈ పోస్ట్‌కు జతపరిచారు.

మేం సకాలంలోనే స్పందించాం..

"కొవిడ్-19 కట్టడిలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని, ఈ కారణంతోనే సంస్థ నుంచి వైదొలిగామని అమెరికా చేసిన ప్రకటన అవాస్తవం. మేం కరోనా మహమ్మారిపై సకాలంలోనే స్పందించాం. ఆనాడు కీలకమైన సమాచారాన్ని వెంటనే ప్రపంచ దేశాలకు చేరవేశాం. కరోనా వ్యాప్తిపై సమాచారాన్ని మేం దాచినట్లు అమెరికా ఆరోపించడం సరికాదు" అని డబ్ల్యూహెచ్‌వో స్పష్టంచేసింది.

దయాగుణం లేని చట్టం క్రూరత్వానికి దారితీస్తుంది

• సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య

పణజీ: దయాగుణం లేని చట్టం క్రూరత్వానికి దారితీస్తుందని.. చట్టబద్ధంగా లేని జాలి గందరగోళానికి దారి తీస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గోవా న్యాయ సేవల విభాగం 30 రోజుల పాటు పణజీలో అవగాహన శిబిరాలు చేపట్టింది. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి సీజేఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "మత్తు పదార్థాల వినియోగం ఓ చిన్న నేర సమస్య మాత్రమే కాదు. దాన్ని మనం సామాజిక, మానసిక, వైద్య సమస్యగా చూడాలి. ఇన్ని రోజుల పాటు గోవా న్యాయ సేవల విభాగం నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ప్రజలను భయపెట్టకుండా, యువతను తక్కువగా చూడకుండా వారిలో చైతన్యం కలిగించింది. మన ఇళ్లు, తరగతి గదులు, సమాజంలోకి మాదకద్రవ్యాలు నిశ్శబ్దంగా వచ్చి చేరుతున్నాయి. అది భవిష్యత్తునూ నాశనం చేస్తుంది' అని జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ మన్మోహన్, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పాల్గొన్నారు.

సైనిక సత్తాను చాటనున్న కవాతు

• పరేడ్‌లో బ్రహ్మోస్, ఆకాశ్, అర్జున్

దిల్లీ: బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్ వ్యవస్థ, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి సోమవారం దిల్లీలో గణతంత్ర వేడుకల కవాతులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి మన సైనిక బలగాల సత్తాను చాటనున్నాయి. కొత్తగా ఏర్పడిన భైరవ్- లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్, రెండు మూపురాల ఒంటెలు, జన్‌స్కార్ గుర్రాలు వంటివి తొలిసారిగా కవాతులో పాల్గొనబోతున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం కూడా తొలిసారి కనిపించనుంది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ఈ వేదికగా కర్తవ్యపథ్‌లో ప్రదర్శనకు రానున్నాయి. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే కవాతు, శకటాల ప్రదర్శన 90 నిమిషాలసేపు కొనసాగనుంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్లు, నాగ్ క్షిపణి వ్యవస్థలు, ధనుష్ తుపాకులు, కొన్ని డ్రోన్లు కనిపించనున్నాయి. 300 కి.మీ. దూరం వరకు లక్ష్యాలను ఛేదించగలిగే సూర్యాస్త్ర వ్యవస్థల్ని కవాతులో తొలిసారి ప్రదర్శించనున్నారు. వివిధ పేలోడ్లను మోసుకుపోయే క్షిపణులను డీఆర్‌డీవో ప్రదర్శిస్తుంది. యుద్ధవిమానాలు వివిధ ఆకృతుల్ని ఏర్పరచనున్నాయి. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ఈసారి కనిపించనుంది.

982 మందికి పోలీసు సాహస పతకాలు

దిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్ర హోంశాఖ.. పోలీస్, అగ్నిమాపక, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 982 మందికి సాహస పతకాలు అందజేయనుంది. ఈ మేరకు ఆదివారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 125 సాహస పతకాలు, 101 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 756 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాల(మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్)ను ప్రకటించారు. సాహస పతకాలు దక్కించుకున్న వారిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తోన్న 33 మంది పోలీసులున్నారు. ఈ జాబితాలో మహారాష్ట్ర 31 పతకాలు, ఉత్తర్‌ప్రదేశ్ 18, దిల్లీ 14 పతకాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మరోవైపు, 31 మంది సీబీఐ అధికారులూ పోలీసు మెడల్ దక్కించుకున్నారు. వీరిలో కోల్‌కతా ఆర్జీకర్ హత్య కేసును పర్యవేక్షించిన సీబీఐ అధికారి వి.చంద్రశేఖర్ కూడా ఉన్నారు.

మొగల్ చరిత్రను తొలగించడంలో అర్థంలేదు

• ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్

కోళికోడ్: చరిత్ర అన్నది నిరంతర ప్రక్రియ అని, ఇది సంస్కృతులు, మనుషులు, వారి ప్రవర్తనా, ఆలోచన విధానాలను తెలిపే పరిణామమని ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ పేర్కొన్నారు. చరిత్రను ముక్కలు ముక్కలుగా బోధించలేమని, మొగల్ సామ్రాజ్యాన్ని పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడంలో అర్థంలేదని వ్యాఖ్యానించారు. కోళికోడ్ వేదికగా జరుగుతున్న 9వ కేరళ సాహిత్య వేడుక(కేఎల్ఎఫ్)లో 'చరిత్ర రచనల్లో మూడుతరాలుగా మహిళల పాత్ర' పేరుతో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో థాపర్ ప్రసంగించారు.

ఫ్రాన్స్ కస్టడీలోకి రష్యన్ ట్యాంకర్ కెప్టెన్

పారిస్: మధ్యధరా సముద్రంలో స్వాధీనం చేసుకున్న అనుమానిత రష్యన్ 'షాడో ఫ్లీట్' ఆయిల్ ట్యాంకర్ కెప్టెన్‌ను విచారణ నిమిత్తం ఫ్రాన్స్ ఆదివారం తమ కస్టడీలోకి తీసుకొంది. ఈ ఓడకు సంబంధించిన భారతీయ కెప్టెన్‌ను న్యాయ అధికారులకు అప్పగించారు. ఓడ సిబ్బందిలోనూ భారతీయులు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్‌పై తాను చేస్తున్న యుద్ధానికి సంబంధించిన ఆంక్షల నుంచి తప్పించుకోడానికి రష్యా 400 నౌకల సముదాయాన్ని ఉపయోగిస్తున్నట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఫ్రాన్స్ తదితర దేశాలు పట్టుదలతో ఉన్నాయి. ట్యాంకర్ కెప్టెన్, సిబ్బంది సహకరించేందుకు నిరాకరిస్తున్న కారణంగా ఫిబ్రవరిలో విచారణ జరపనున్నట్లు ఫ్రెంచ్ జ్యుడీషియల్ అధికారులు వెల్లడించారు.

రాచనగరి జైపుర్ వీధుల్లో

వింటేజ్ కార్ల సందడి


ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వందకుపైగా అరుదైన, చారిత్రాత్మక వింటేజ్ కార్లు రాజస్థాన్‌లోని జైపుర్ వీధుల్లో చక్కర్లు కొట్టాయి. 'రాజ్‌పూతానా ఆటోమోటివ్ స్పోర్ట్స్ కార్ క్లబ్' నిర్వహించిన ఈ క్లాసిక్ కార్ ర్యాలీ శనివారం స్థానిక తాజ్ జైమహల్ ప్యాలెస్ వద్ద ప్రారంభమై ఆదివారం కూడా కొనసాగింది. 1913 నాటి ఫోర్డ్ మోడల్ 'టి', 104 ఏళ్ల కిందటి ఆస్టిన్ 7 కార్లు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. సందర్శకులు ఈ కార్లతో సెల్ఫీలు తీసుకున్నారు. రాజకుమారి, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి దియాకుమారి ఈ ప్రదర్శనలో మాట్లాడుతూ.. వింటేజ్ కార్లు ఒక అభిరుచి మాత్రమే కాదు, మన వారసత్వపు నిధిగా కొనియాడారు. వింటేజ్ కార్ల కోసం అనేక విడిభాగాలు ఇప్పుడు దేశీయంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శనలో వందకుపైగా కార్లు పాల్గొన్నాయని క్లబ్ కార్యదర్శి అవిజిత్ సింగ్ తెలిపారు. వీటిలో దాదాపు 70 కార్లు జైపుర్ నుంచి.. మిగతా జోధ్‌పుర్, ధౌల్‌పుర్, ముంబయి, దిల్లీ, చండీగఢ్, లుధియానా వంటి నగరాల నుంచి వచ్చాయన్నారు.

18 ఏళ్లుగా..

పొట్టలో అరకిలో రాయి



మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లా దేవేంద్రనగర్ తహసీలుకు చెందిన 32 ఏళ్ల వ్యక్తికి స్థానిక వైద్యుడు శస్త్రచికిత్స చేసి కడుపులో నుంచి అరకిలో రాయిని తొలగించారు. గత 18 ఏళ్లుగా ఆ వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మూత్ర విసర్జన సమయంలో మంటతో తీవ్రమైన నొప్పి వచ్చేది. పలువురు డాక్టర్లకు చూపినా ఉపశమనం లభించలేదు. ఇటీవల నొప్పి మరింత తీవ్రం కావడంతో పన్నాలోని డాక్టర్ హెచ్.ఎన్.శర్మను సంప్రదించాడు. వైద్యపరీక్షలు చేసి కడుపులో పెద్దరాయి ఉన్నట్లు గుర్తించారు. జనవరి 22న విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తిచేసి ఆ రాయిని తొలగించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని, తన సర్వీసులో ఇంత భారీ పరిమాణంలో ఉన్న రాయిని తొలగించడం ఇదే మొదటిసారని డాక్టర్ శర్మ తెలిపారు.

వర్గసమీకరణాలు - I

ముఖ్యాంశాలు

- a, b, c లు వాస్తవ సంఖ్యలు లేదా సంకీర్ణ సంఖ్యలై $a \neq 0$ అయినప్పుడు $ax^2 + bx + c = 0$ రూపంలో ఉన్న సమీకరణాన్ని చలరాశి x లలో వర్గసమీకరణం అంటారు.
- సమీకరణం సాధన విలువలను మూలాలు లేదా సాధనలు అంటారు.
- వర్గసమీకరణ సాధనే దాని మూలాలు అవుతాయి.
- వర్గ సమీకరణానికి రెండు మూలాలు ఉంటాయి. (పరిమాణం ఆధారంగా నిర్ణయిస్తారు)
- $ax^2 + bx + c = 0$ మూలాలు, $x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a}$
- $b^2 - 4ac$ని $ax^2 + bx + c = 0$ వర్గసమీకరణ విచక్షణి అంటారు. దీన్ని Δ గుర్తుతో సూచిస్తారు. $\Delta = b^2 - 4ac$.

మాదిరి ప్రశ్నలు

1. $15x^2 - x - 6 = 0$ వర్గసమీకరణం ఒక మూలం $\frac{2}{3}$ అయితే రెండో మూలం విలువ ఎంత?

1) $\frac{3}{5}$ 2) $\frac{5}{3}$ 3) $\frac{-3}{5}$ 4) $\frac{-5}{3}$

సాధన: దత్త వర్గసమీకరణం, $15x^2 - x - 6 = 0$

ఒక మూలం $\alpha = \frac{2}{3}$, రెండో మూలం β అనుకుందాం.

$\Rightarrow a = 15, b = -1, c = -6$

$\alpha\beta = \frac{c}{a} \Rightarrow \frac{2}{3}\beta = \frac{-6}{15} \Rightarrow \beta = \frac{-3}{5}$

సమాధానం: 3

2. వర్గసమీకరణం $3x^2 - 5x + 7 = 0$ మూలాలు α, β అయితే $\frac{\alpha}{\beta}, \frac{\beta}{\alpha}$ లు మూలాలుగా ఉన్న వర్గసమీకరణం?

1) $21x^2 + 17x - 21 = 0$ 2) $21x^2 + 17x + 21 = 0$
3) $21x^2 - 17x + 21 = 0$ 4) $21x^2 - 17x - 21 = 0$

సాధన: $3x^2 - 5x + 7 = 0$ మూలాలు α, β అయితే

$\alpha + \beta = \frac{-(-5)}{3} = \frac{5}{3}, \quad \alpha\beta = \frac{7}{3}$

$(\alpha + \beta)^2 = \frac{25}{9}$

$\frac{\alpha}{\beta} + \frac{\beta}{\alpha} = \frac{\alpha^2 + \beta^2}{\alpha\beta} = \frac{(\alpha + \beta)^2 - 2\alpha\beta}{\alpha\beta}$

$= \frac{(\alpha + \beta)^2}{\alpha\beta} - 2$

$= \frac{25}{9} \times \frac{3}{7} - 2 = \frac{25}{21} - 2 = \frac{-17}{21}$

$\frac{\alpha}{\beta}, \frac{\beta}{\alpha}$ లు మూలాలుగా ఉన్న వర్గసమీకరణం

$x^2 - x\left(\frac{\alpha}{\beta} + \frac{\beta}{\alpha}\right) + \left(\frac{\alpha}{\beta} \times \frac{\beta}{\alpha}\right) = 0$

$\Rightarrow x^2 - x\left(\frac{-17}{21}\right) + 1 = 0 \Rightarrow x^2 + \frac{17}{21}x + 1 = 0$


$\Rightarrow 21x^2 + 17x + 21 = 0$

సమాధానం: 2

3. కింది వాటిలో $\sqrt{3}, -3\sqrt{3}$ మూలాలు ఉన్న వర్గసమీకరణాన్ని కనుక్కోండి.

1) $x^2 - 2\sqrt{3}x - 9 = 0$ 2) $x^2 + 2\sqrt{3}x - 9 = 0$
3) $x^2 + 2\sqrt{3}x + 9 = 0$ 4) $x^2 - 2\sqrt{3}x + 9 = 0$

వర్గసమీకరణ సాధనే.. మూలాలు!



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

సాధన: $\alpha = \sqrt{3}, \beta = -3\sqrt{3}$ అనుకుందాం

$\alpha + \beta = \sqrt{3} - 3\sqrt{3} = -2\sqrt{3}$,

$\alpha\beta = \sqrt{3}(-3\sqrt{3}) = -9$

లెక్కలో కోరిన వర్గసమీకరణం,

$x^2 - x(\alpha + \beta) + \alpha\beta = 0$

$\Rightarrow x^2 - x(-2\sqrt{3}) - 9 = 0$

$\Rightarrow x^2 + 2\sqrt{3}x - 9 = 0$

సమాధానం: 2

4. $2x^2 - 7x + y = 0$ వర్గసమీకరణం రెండు మూలాలు సమానమైతే y విలువ ఎంత?

1) $\frac{-7}{2}$ 2) $\frac{-49}{8}$ 3) $\frac{7}{2}$ 4) $\frac{49}{8}$

సాధన: $2x^2 - 7x + y = 0 \Rightarrow a = 2, b = -7, c = y$

దత్త వర్గసమీకరణం మూలాలు సమానమైతే...

$b^2 = 4ac \Rightarrow (-7)^2 = 4(2)y \Rightarrow 8y = 49$

$\Rightarrow y = \frac{49}{8}$

సమాధానం: 4

5. $5x^2 + (2k + 1)x - 12 = 0$ సమీకరణానికి $x = 2$ ఒక సాధన అయితే k విలువ ఎంత?

1) $\frac{5}{2}$ 2) $\frac{12}{5}$ 3) $\frac{-5}{2}$ 4) $\frac{-12}{5}$

సాధన: $5x^2 + (2k + 1)x - 12 = 0$

దీనికి ఒక సాధన $x = 2$

$5(2)^2 + (2k + 1)2 - 12 = 0 \Rightarrow k = \frac{-5}{2}$

సమాధానం: 3

6. $2x^2 - (3p + 2)x + (p - 5) = 0$ మూలాల మొత్తం మూలాల లబ్ధానికి సమానమైతే p విలువ ఎంత?

1) 0 2) $\frac{7}{2}$ 3) $\frac{5}{4}$ 4) $\frac{-7}{2}$

సాధన: $2x^2 - (3p + 2)x + (P - 5) = 0$

మూలాల మొత్తం = మూలాల లబ్ధం

$\Rightarrow \frac{3p + 2}{2} = \frac{p - 5}{2} \Rightarrow 2p = -7 \Rightarrow p = \frac{-7}{2}$

సమాధానం: 4

7. వర్గసమీకరణం $3x^2 - 17x + 5n = 0$ మూలాలు ఒకదానికొకటి వ్యుత్క్రమాలు అయితే n విలువ ఎంత?

1) $\frac{3}{5}$ 2) $\frac{5}{3}$ 3) $\frac{-3}{5}$ 4) $\frac{-17}{3}$

సాధన: వర్గసమీకరణం $3x^2 - 17x + 5n = 0$ మూలాలు పరస్పరం వ్యుత్క్రమాలు అయితే వాటి లబ్ధం = 1

$\Rightarrow \frac{5n}{3} = 1 \Rightarrow n = \frac{3}{5}$

సమాధానం: 1

8. $3x^2 - 8x + q = 0$ మూలాలు 3 : 5లో ఉంటే q విలువ?

1) 8 2) $\frac{8}{3}$ 3) 5 4) $\frac{-8}{3}$

సాధన: $3x^2 - 8x + q = 0$ మూలాలు $3\alpha, 5\alpha$ అనుకుందాం.

$3\alpha + 5\alpha = \frac{8}{3} \Rightarrow \alpha = \frac{1}{3}$

$(3\alpha)(5\alpha) = \frac{q}{3} \Rightarrow \frac{q}{3} = 15 \times \frac{1}{3} \times \frac{1}{3} \Rightarrow q = 5$

సమాధానం: 3

9. $2x^2 - 15x + 7 = 0$ వర్గసమీకరణం మూలాలు α, β అయితే $(\alpha + \beta), (\alpha - \beta)$లు మూలాలు అయ్యే వర్గసమీకరణం?

1) $2x^2 - 22x + 14 = 0$ 2) $4x^2 - 30x + 49 = 0$
3) $2x^2 - 56x + 195 = 0$ 4) $4x^2 - 56x + 195 = 0$

సాధన: $2x^2 - 15x + 7 = 0 \Rightarrow \alpha + \beta = \frac{15}{2}, \alpha\beta = \frac{7}{2}$

$(\alpha - \beta)^2 = (\alpha + \beta)^2 - 4\alpha\beta = \left(\frac{15}{2}\right)^2 - 4\left(\frac{7}{2}\right)$

$= \frac{225}{4} - 14 = \frac{169}{4}$

$(\alpha - \beta) = \pm\frac{13}{2}$

లెక్కలో కోరిన వర్గసమీకరణం ↓

$x^2 - x\left(\frac{15}{2} + \frac{13}{2}\right) + \frac{15}{2}\left(\frac{13}{2}\right) = 0$

$\Rightarrow x^2 - 14x + \frac{195}{4} = 0$

$\Rightarrow 4x^2 - 56x + 195 = 0$

సమాధానం: 4



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

902 Word of the Day

Hubris

Telugu meaning: గర్వం, అహంకారం

English meaning: The word hubris (హ్యూబ్రిస్) is a noun that refers to excessive pride or selfconfidence, often leading to downfall.

Synonyms: Arrogance, Pride

Antonyms: Humility, Modesty

Usage: 1. The leader's hubris prevented him from accepting advice, which eventually resulted in serious policy failures.

2. History shows that unchecked hubris often blinds individuals to their own limitations.

కరెంట్ అఫైర్స్



రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటైన గ్రంథ్ కుటీర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2026, జనవరి 23న ప్రారంభించారు. ఇందులో తెలుగు, తమిళం, కన్నడ, ఒడియా సహా 11 ప్రాచీన భారతీయ భాషల పుస్తకాలు, రాతప్రతులకు చోటు దక్కింది. ఇందులో పురాణాలు, తత్వ శాస్త్రం, భాష, చరిత్ర, పాలన, సైన్స్ లాంటి అంశాల పుస్తకాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఈ విభాగంలో వలస పాలనకు సంబంధించిన పుస్తకాలు ఉండేవి. తాజాగా వాటిని రాష్ట్రపతి ఎస్టేట్‌లోని ప్రత్యేక ప్రదేశానికి తరలించారు.



ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి తమ దేశం వైదొలిగే ప్రక్రియ పూర్తయిందని అమెరికా ప్రభుత్వం 2026, జనవరి 23న ప్రకటించింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలు చేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నట్లు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది.

రిజిస్ట్రేషన్ శాఖలోని ప్రజాసేవలను పూర్తిస్థాయి కాగితరహితంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తీసుకొచ్చింది. సీఎం స్టాలిన్ 'స్టార్ 3.0 స్ప్రింట్ 1' సాంకేతిక వ్యవస్థను 2026, జనవరి 22న ప్రారంభించారు. ఆధార్ కార్డు ఓటీపీ, బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా తొలివిడతగా 18 రకాల సేవలను పొందేలా ఏర్పాట్లు చేశారు.

నాలుగో పారిశ్రామిక విప్లవంలో భాగంగా ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అయిదు కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిలో ఒకదాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ తరహా కేంద్రాలు ప్రస్తుతం ముంబయి, హైదరాబాద్‌ల్లో మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రపంచ ఆర్థిక వేదిక ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

77వ గణతంత్ర దినోత్సవం

జనవరి 26
చరిత్రలో ఈనాడు

భారత్ అతిపెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన గణతంత్ర రాజ్యం. దేశ పరిపాలనకు సంబంధించిన నియమాలూ, సూత్రాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం. పౌరులు, పాలకులు, పాలనా యంత్రాంగం పాటించాల్సిన అత్యున్నత చట్టం. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తేదీకి గుర్తుగా ఏటా మన దేశంలో జనవరి 26న 'గణతంత్ర దినోత్సవం'గా నిర్వహిస్తారు. భారత సంస్కృతిలో భాగమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తించడంతోపాటు స్వాతంత్ర్యోద్యమంలో అమరులైన వారిని గౌరవించుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు

- క్రిప్స్ మిషన్ 1942లో మొదటిసారిగా రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు గురించి ప్రతిపాదించింది. రాజ్యాంగ పరిషత్ ఆవశ్యకత గురించి మొదట చెప్పింది ఎం.ఎన్. రాయ్.
- కేబినెట్ మిషన్ సూచన మేరకు రాజ్యాంగ పరిషత్‌ను 1946లో ఏర్పాటు చేశారు. 1946, డిసెంబరు 9న దీని మొదటి సమావేశం జరిగింది. దీనికి డాక్టర్ సచ్చిదానంద సిన్హా తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరించారు.
- 1946, డిసెంబరు 11న డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్‌కు శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- 1947 జులై 22న జాతీయ పతాకాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది.
- రాజ్యాంగ ముసాయిదా కమిటీని 1947 ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. దీనికి బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షుడిగా ఉన్నారు. రాజ్యాంగ రచనకు పట్టిన సమయం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు



వేడుకలు ఇలా.. 2026లో జరిగేది 77వ గణతంత్ర దినోత్సవం. ఈ రోజున న్యూదిల్లీలోని కర్తవ్యపథ్‌లో మన సైనిక శక్తి, సాంస్కృతిక వైవిధ్యం ప్రతిబింబించేలా పరేడ్ నిర్వహిస్తారు. భారత రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వం విదేశీ ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తుంది. ఈసారి యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ముఖ్య అతిథులు.

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్, ఎంటీఎస్, ఎన్‌టీపీసీ తదితర పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

భారతీయ సామాజిక నిర్మితి



సాధారణ పరిభాషలో సమాజాన్ని అధ్యయనం చేయడాన్ని సమాజశాస్త్రంగా పరిగణిస్తారు. ఇది అనేకమంది శాస్త్రవేత్తల కృషి వల్ల వృద్ధి చెంది, వివిధ సామాజిక ప్రక్రియలను, మార్పులను అధ్యయనం చేసేందుకు దోహదపడింది. సమాజశాస్త్రాన్ని ఒకప్పుడు సామాజిక తత్వశాస్త్రంగా నిర్వచించారు. తర్వాత దీన్నే చరిత్ర తత్త్వశాస్త్రంగా, సామాజిక భౌతికశాస్త్రంగా పిలుస్తున్నారు.

పరిచయం

19వ శతాబ్దం నుంచి సమాజశాస్త్రం ఒక స్వయం ప్రతిపత్తి గల శాస్త్రంగా ఆవిర్భవించింది. జాన్ స్టువర్ట్ మిల్ సోషియాలజీకి బదులుగా Ethnology అనే పదాన్ని ఉపయోగించారు. చాలామంది శాస్త్రవేత్తలు దీన్ని Sociologyగా వాడటంతో ఈ పదమే స్థిరపడిపోయింది.

- 1838లో Sociology అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించారు.

సమాజాల వర్గీకరణ

- జర్మనీకి చెందిన ఫెర్డినాండ్ టోనీస్ అనే శాస్త్రవేత్త సమాజాన్ని, అందులో ఉండే మనుషుల మధ్య సంబంధాల ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి...
1. జెమిన్ షాఫ్ట్
2. జెషల్ షాఫ్ట్

సమాజం నిర్మితి, ప్రకార్యాలు, సమాజం - స్వభావం, నిర్వచనాలు; వివిధ సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలు; ముఖ్య లక్షణాలు; శాస్త్రవేత్తలు సమాజాన్ని వర్గీకరించిన తీరుతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Professor Posts

The Indian Institute of Technology Guwahati (IIT Guwahati) is inviting applications for Associate Professor and Professor posts on a contractual basis. Total no.of posts is 26. Last date for online applications is 31 January 2026.

Manager Posts

National Aluminium Company Limited (NALCO), Bhubaneswar, Odisha is inviting applications for the Manager posts. Total no.of posts is 40. The application fee is Rs.1000. Last date for online applications is 2 February 2026.

Sports Quota Posts

The Railway Recruitment Cell - South Eastern Railway, under the Ministry of Railways, Government of India, Kolkata, is inviting online applications from eligible sportspersons who are Indian nationals for recruitment against Sports Quota (Open Advertisement) for the year 2025-26 in South Eastern Railway. Total no.of posts is 54. The application fee is Rs.500. Last date for online applications is 9 February 2026.

Did You Apply..?

Today (January 26) is the last date for the following Jobs

- 14 Individual Consultant posts at RITES Limited. *Eligibility:* B.Tech or PG (Civil Engineering).
- Project Associate posts in CFTRI. *Eligibility:* Bachelor's degree, M.Sc (Food Science and Technology, Chemistry).

For more information and other notifications - scan QR code

Sentence Improvement

***Directions (Qs. 1 - 18):** Select the most appropriate option to substitute the bold segment in the given sentence. If there is no need to substitute it, select No improvement as your answer.*

1. The committee **discussed about the proposal** for more than two hours.
A) discussed on the proposal
B) discussed for the proposal
C) discussed the proposal
D) No Improvement

2. She is **senior than me** in both age and experience.
A) senior to me
B) senior from me C) senior over me
D) No Improvement

3. The police **is investigating** the matter very seriously.
A) has investigating
B) are investigating
C) were investigated
D) No Improvement

4. He is very good **in mathematics but weak in physics**.
A) at mathematics but weak at physics
B) with mathematics but weak in physics
C) in mathematics but weak at physics
D) No Improvement

5. He is **more honest than** any other employee in the department.
A) most honest of
B) more honest of
C) honest than
D) No Improvement

6. The teacher **emphasized on the need** for regular practice.
A) emphasized about the need
B) emphasized the need
C) emphasized for the need
D) No Improvement

7. The manager insisted that the report **must be submitted before Monday**.
A) must submit before Monday
B) should be submitted before Monday
C) be submitted before Monday
D) No Improvement

8. No sooner did the train arrive when the passengers rushed inside.
A) No sooner did the train arrive than
B) No sooner did the train arrive then
C) No sooner did the train arrive as
D) No Improvement

9. Each of the employees **have been informed** about the new policy.
A) has been informed
B) were informed
C) are being informed
D) No Improvement

SSC Exams
English

10. He is confident **of winning the election** despite strong opposition.
A) about winning the election
B) for winning the election
C) to win the election
D) No Improvement

11. He denied **to have taken** the confidential files from the office.
A) having taken B) to take
C) that he took D) No Improvement

12. The child was punished because he **did not obey to his parents**.
A) did not obeyed his parents
B) did not obey his parents
C) did not obey with his parents
D) No Improvement

13. The principal as well as the teachers **were present** at the annual function.
A) are present B) have been present
C) was present D) No Improvement

14. He is one of those players who **has always performed** well under pressure.
A) have always performed
B) had always be performed
C) are always performed
D) No Improvement

15. The company is looking forward **to expand its operations** next year.
A) for expand its operations
B) to expanding its operations
C) towards expanding its operations
D) No Improvement

16. He acted **more smarter than** his elder brother in handling the situation.
A) more smart than
B) most smarter than
C) smarter than
D) No Improvement

17. The teacher asked the students **that why they were late**.
A) why they are late
B) why were they late
C) why they were late
D) No Improvement

18. The officer warned the driver **not to violate** the traffic rules again.
A) not violating
B) to not violate
C) against violating
D) No Improvement

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కరెంట్ అఫైర్స్



❖ ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచకప్ 2026కు అధికారిక టోర్నమెంట్ అంబాసిడర్‌గా ఏ భారత క్రికెటర్ నియమితులయ్యారు? (2026 ఫిబ్రవరి, మార్చిలలో భారత్, శ్రీలంకలు ఈ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.) **జ:** రోహిత్ శర్మ

మాదిరి ప్రశ్నలు

❖ ప్రపంచ జెల్లీ ఫిష్ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: నవంబరు 3

❖ స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజంలో 2025లో ఎన్నో వార్షికోత్సవాన్ని నిర్వహించారు?
జ: 150వ (1875లో స్థాపించారు.)

❖ స్వచ్ఛ భారత్ మిషన్ కింద విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 నివేదిక ప్రకారం దేశంలోని అత్యంత మురికి నగరాల జాబితాలో ఏది అగ్రస్థానంలో నిలిచింది?
జ: మధురై (లూధియానా, చెన్నై, రాంచీ, బెంగళూరు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.)

❖ 'వరల్డ్ స్ట్రోక్ డే' ను ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు?
జ: అక్టోబరు 29 (స్ట్రోక్ అనేది మెదడుకు రక్త సరఫరాలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడటం వల్ల కలిగే నాడీ సంబంధిత అత్యవసర పరిస్థితి.)

మరింత సమాచారం

❖ 2025, సెప్టెంబరులో ఆగ్నేయాసియాను అతలాకుతలం చేసిన సూపర్ టైఫూన్ ఏది? (తైవాన్, ఫిలిప్పీన్స్, హాంకాంగ్, చైనాల్లో ఇది తీవ్ర ప్రభావం చూపించింది.) **జ:** రగస

TENTH Physical Science — Chemical Reactions and Equations




Final Exams-2026 IMPORTANT Q & A

1. **Why do we apply paint on Iron articles?**
A: To prevent corrosion due to oxidation.
2. **Why do we keep food in air tight containers?**
A: To prevent rancidity due to oxidation.
3. **Predict, Exhalation air is hotter than inhalation air in respiration process.**
A: Exhalation air absorbs heat from the respiratory system and the body during gas exchange.
4. **Suggest one method to prevent corrosion.**
A: painting or oiling or greasing.

1 Mark

5. **A Magnesium ribbon is burnt in the presence of Oxygen to give Magnesium Oxide. Rewrite the above reaction as chemical equation.**
A: $2Mg + O_2 \rightarrow 2MgO$
6. **Why does the colour of Copper sulphate solution change when an Iron nail is dipped in it?**
A: Iron displaces Copper from Copper sulphate as Iron is more reactive than Copper.
7. **What happens when Iron nail is exposed to moisture and water?**
A: Iron gets rusted due to oxidation.
8. **Oil and fat-containing food items are flushed with Nitrogen. Why?**
A: To prevent rancidity due to oxidation.
9. **Why Hydrogen peroxide is kept in coloured bottle?**
A: Because in the presence of light, Hydrogen peroxide decomposes into water and Oxygen.
10. **Why should a Magnesium ribbon be cleaned before burning in air?**
A: To remove layer of Magnesium oxide on its surface.
11. **Why do Silver, Gold and Platinum not corrode in moisture air?**
A: They are less reactive.
12. **What are the conditions to get rusting of Iron?**
A: Air and water.
13. **A solution of substance 'x' is used for white washing. What is 'x'?**
A: Calcium oxide, formula CaO (quick lime)
14. **Write any one balanced chemical reaction.**
A: $C + O_2 \rightarrow CO_2$

More Imp Q & Ans




Writer: D. V. Subba naidu

మెరుగైన పాలనకు మేలైన మార్గాలు!

జనరల్ స్టడీస్ — ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

నేటి ప్రపంచంలో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల మధ్య సమతౌల్యత సాధించడానికి నిర్దేశించుకున్న మార్గాలే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు. ప్రస్తుత ప్రజల అవసరాలను తీరుస్తూ, భవిష్యత్తు తరాలు అన్ని విధాలుగా సురక్షితమైన జీవనాన్ని సాగించగలిగే పరిస్థితులను కల్పించాలనేదే వాటి ప్రధాన ఉద్దేశం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి నుంచి దేశంలో నీతిఆయోగ్ పర్యవేక్షణలో రాష్ట్రాల వరకు ప్రత్యేక దృష్టితో వాటిని అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీటి సాధనకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. మెరుగైన పాలన, పర్యావరణహిత ప్రాజెక్టులకు ప్రాధాన్యం, పథకాలపై సమగ్ర పర్యవేక్షణ తదితర విధానాలతో పేదరిక నిర్మూలనతోపాటు ప్రజల ఆర్థిక ప్రగతి ధ్యేయంగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లోని వివిధ అంశాలు, వాటి సాధనలో దేశం, రాష్ట్రం సాధించిన పురోగతిని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి.



ఏపీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు

పర్యావరణవేత్తలు తరచూ, విస్తృతంగా వాడే పదం 'సుస్థిరాభివృద్ధి'. 1983లో ఐక్యరాజ్యసమితి (యూఎన్‌ఓ) ఆధ్వర్యంలో అప్పటి నార్వే ప్రధాని 'బ్రంట్ లాండ్' అధ్యక్షతన నిర్వహించిన 'పర్యావరణం-అభివృద్ధి' సదస్సులో పర్యావరణ వేత్తలు ఈ భావనను తీసుకొచ్చారు. పర్యావరణ సమస్యలను ఎదుర్కొనే ఉద్దేశంతో అభివృద్ధి స్థానంలో 'సుస్థిరాభివృద్ధి' అనే నూతన భావనను ప్రవేశపెట్టారు.

అభివృద్ధి ఏదైనా భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జరగాలని సుస్థిరాభివృద్ధి సూచిస్తుంది. మానవ సంక్షేమాన్ని పెంపొందించుకోవడానికి ఆర్థిక వృద్ధి ఒక్కటే సరిపోదు. వనరుల వినియోగం, పునఃకల్పనల మధ్య సమతౌల్యత సాధించి అభివృద్ధి ప్రక్రియను కొనసాగిస్తేనే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది. 2002లో జరిగిన జోహన్నెస్‌బర్గ్ పర్యావరణ సదస్సులో 2005-2015 దశాబ్దాన్ని యూఎన్‌ఓ 'సుస్థిరాభివృద్ధి కోసం విద్య'గా ప్రకటించింది.

యూఎన్‌ఓ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) - 2030

యూఎన్‌ఓ 2015-30 మధ్య ప్రపంచ దేశాలు సాధించాల్సిన ఎస్‌డీ లక్ష్యాలను 'అవర్ వరల్డ్ - ది 2030 అజెండా ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' పేరుతో విడుదల చేసింది. దీనిలో భాగంగా 17 లక్ష్యాలు, 169 సూచికలను యూఎన్‌ఓ సాధారణ సభ ఆమోదించింది. ఈ లక్ష్యాల రూపకల్పనకు 30 మంది సభ్యులతో 2013లో ఏర్పాటైన ఓపెన్ వర్కింగ్ గ్రూప్ (ఓడబ్ల్యూజీ) కమిటీ 2015, సెప్టెంబరులో యూఎన్‌ఓకు నివేదిక సమర్పించింది. 2015, సెప్టెంబరు 25న యూఎన్‌ఓలోని 193 సభ్య దేశాలన్నీ దీనిని ఆమోదించాయి.

ఈ 'అజెండా 2030' ఆధారంగా 15 ఏళ్ల కాలపరిమితి ఉన్న సుస్థిరాభివృద్ధి కార్యాచరణ 2015 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ సుస్థిరాభివృద్ధి కార్యాచరణలో భాగంగా ప్రపంచ దేశాలన్నీ 17 లక్ష్యాలను, అందులో భాగంగా ఉన్న 169 సూచికలను సాధించాలి.






'ప్రస్తుత ప్రజల కనీస అవసరాలను తీరుస్తూ భవిష్యత్తు తరాల వారికి వనరులను మిగిల్చే విధంగా, వాటిని వివేకవంతంగా వినియోగించుకోవడం ద్వారా సాధించే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి.'
— బ్రంట్ లాండ్

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు

1) పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం 2) ఆకలి చావులను అంతం చేయడం, ఆహార భద్రత 3) ఆరోగ్యవంతమైన జీవితం 4) నాణ్యమైన విద్య 5) లింగ సమానత్వం, మహిళా సాధికారత 6) మంచినీరు, పారిశుద్ధ్యం 7) పునరుత్పాదక ఇంధనాలు 8) ఉపాధి, ఆర్థికాభివృద్ధి 9) పరిశ్రమలు, మౌలిక వసతులు 10) అసమానతల తగ్గింపు 11) నగరాలు, జనావాసాల సుస్థిరాభివృద్ధి 12) సుస్థిర ఉత్పత్తి, వినియోగం 13) పర్యావరణ పరిరక్షణ 14) నీటిలోని జలచరాల సంరక్షణ 15) నేలపై జీవచరాల సంరక్షణ 16) శాంతి, న్యాయం 17) లక్ష్య సాధనకు భాగస్వామ్యాలు.

ఎస్‌డీజీ ఇండియా ఇండెక్స్ (2023-24)



ఎస్‌డీజీలో పేర్కొన్న 17 లక్ష్యాల విషయంలో భారతదేశంలో రాష్ట్రాలు సాధించిన ప్రగతి ఆధారంగా నీతి ఆయోగ్ ర్యాంకులను ప్రకటించింది. ఉత్తరాఖండ్, కేరళ, తమిళనాడు తొలి మూడు స్థానాల్లో నిలవగా, ఆంధ్రప్రదేశ్ 10వ స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో ఉన్నాయి. బిహార్, ఝార్ఖండ్, నాగాలాండ్ చివరి స్థానాల్లో నిలిచాయి.

ఏపీ ప్రభుత్వ ప్రయత్నాలు- మెరుగైన స్థానాలు

◆ పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే ఎస్‌డీజీ-1ను సాధించేందుకు ఏపీ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖను నోడల్ ఏజెన్సీగా ప్రకటించింది. 2023-24లో ఎస్‌డీజీ-1 సాధనలో ఏపీ ప్రభుత్వం పొందిన స్కోరు 86, ర్యాంకు 3. ◆ ఆకలి చావులు లేని ఆహార భద్రతతో కూడిన సమాజం అనే ఎస్‌డీజీ-2 కోసం పౌర సరఫరాల శాఖను నోడల్ ఏజెన్సీగా ప్రకటించారు. ఈ విషయంలో ఏపీ 67 స్కోరుతో దేశంలో 10వ స్థానంలో నిలిచింది. ◆ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం అనే ఎస్‌డీజీ-3 సాధనకు రాష్ట్రంలో కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీ. ఇందులో ఏపీ 78 స్కోరుతో 11వ స్థానంలో నిలిచింది. ◆ పునరుత్పాదక ఇంధనాల వాడకాన్ని పెంచాలనే ఎస్‌డీజీ-7 సాధనలో ఆంధ్రప్రదేశ్ 100 స్కోరుతో దేశంలోనే మొదటి స్థానం సాధించింది. ఇందుకోసం రాష్ట్ర విద్యుత్తు, అడవులు, శాస్త్ర సాంకేతిక విభాగం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించింది. ఈ క్రమంలోనే కర్నూలులో 365 హెక్టార్లలో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు ప్రారంభమైంది. ◆ సుస్థిర నగరాలను సాధించాలనే ఎస్‌డీజీ-11 కోసం రాష్ట్ర ప్రభుత్వం పురపాలక, పట్టణాభివృద్ధి విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా ఎంచుకుంది. నగరాల్లో ఆన్‌లైన్‌లోనే బిల్డింగ్ ప్లాన్‌లకు ఆమోదం, పారిశుద్ధ్య ప్రాజెక్టుల అమలు లాంటి కార్యక్రమాలను చేపట్టింది. ఈ విషయంలో 85 స్కోరుతో 9వ స్థానం లభించింది. ◆ సుస్థిర ఉత్పత్తి, వినియోగాన్ని సూచిస్తున్న ఎస్‌డీజీ-12 సాధన కోసం రాష్ట్రంలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయం, తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి పొందే బిందుసేద్యం లాంటి విధానాలను అమలు చేస్తోంది. ఇందులో 93 స్కోరుతో 4వ స్థానంలో నిలిచింది. ◆ నీటిలో జలచరాల సంరక్షణకు సంబంధించిన ఎస్‌డీజీ-14 విషయంలో మత్స్య శాఖను నోడల్ ఏజెన్సీగా ప్రకటించగా 95 స్కోరుతో 2వ స్థానం పొందింది. ఈ క్రమంలో ప్రభుత్వం చెరువుల క్రమబద్ధీకరణ, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు మద్దతు ఇవ్వడంపై దృష్టి సారించింది.
◆ ఎస్‌డీజీ లక్ష్యాల సాధనలో ఏపీ ప్రభుత్వం మొత్తంగా 74 స్కోరుతో దేశంలో 10వ స్థానంలో నిలిచింది.



ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు



రచయిత: పి.వి. సుబ్బిరెడ్డి

సేంద్రియ సాగుకు సిక్కింలోనే శ్రీకారం!

ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ మార్పులు ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లు. ప్రకృతి సమతౌల్యత దెబ్బతినడం వల్ల సంభవిస్తున్న వరదలు, భూకంపాలు, తుపానులు తదితర విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడానికి భారత్ అనేక వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. జాతీయ వరదల నియంత్రణ కార్యక్రమం నుంచి నేటి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ వరకు ఎన్నో పథకాలు, సంస్థలు విపత్తు నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు, పర్యావరణ పరిరక్షణ కోసం చట్టాలను రూపొందించుకోవడంతోపాటు, పులులు, ఏనుగుల సంరక్షణకు ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ మొదలైన ప్రత్యేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కేవలం విపత్తులను ఎదుర్కోవడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు వనరులను భద్రంగా అందించే సుస్థిరాభివృద్ధి దిశగా దేశం అడుగులు వేస్తున్న తీరును పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అందులో భాగంగా సేంద్రియ వ్యవసాయం, పవన విద్యుత్తు, బయోగ్యాస్ లాంటి పునరుత్పాదక ఇంధన వనరులకు ఇస్తున్న ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ - పర్యావరణం, విపత్తు నిర్వహణ

మాదిరి ప్రశ్నలు

1. జాతీయ వరదల నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ఆవిష్కరించారు?
   1) 1984 2) 1974 3) 1964 4) 1954



2. మనదేశంలో ఏ ప్రాంతంలో తరచుగా భూపాతాలు సంభవిస్తాయి?
   1) తీర 2) హిమాలయ 3) పీఠభూమి 4) కనుమ
3. 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఎక్కడుంది?
   1) బెంగళూరు 2) నాగ్‌పుర్ 3) చెన్నై 4) హైదరాబాద్



4. భారత ప్రభుత్వం ఎడారి అభివృద్ధి కార్యక్రమం ఎప్పటి నుంచి అమలు చేస్తోంది?
   1) 1979-80 2) 1978-79 3) 1977-78 4) 1976-77
5. భారతదేశంలో తీరం వెంబడి టైడ్‌గేజ్ నెట్‌వర్క్ నిర్వహించే సంస్థ?
   1) ఎస్ఓఐ 2) ఏఎస్ఐ 3) సీఎస్ఓ 4) ఎస్ఎస్ఎస్ఓ
6. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ' ఎక్కడుంది?
   1) గువాహటి 2) రూర్కీ 3) రూప్ నగర్ 4) చెన్నై



7. సైక్లోన్ మధ్య భాగాన్ని ఏమని పిలుస్తారు?
   1) కోర్ 2) పాయింట్ 3) కరోనా 4) ఐ
8. 'వాతావరణ మార్పుల 62వ వార్షిక సదస్సు' 2025, జూన్ 16 నుంచి 26 వరకు ఎక్కడ జరిగింది?



   1) జర్మనీ, బాన్ 2) జర్మనీ, మ్యూనిచ్ 3) బ్రెజిల్, బెలెమ్ 4) బ్రెజిల్, మనాస్
9. భారతదేశంలో 'రామ్‌సర్ ప్రాంతాల' సంఖ్య ఎంత?
   1) 93 2) 92 3) 91 4) 90
10. ఐక్యరాజ్యసమితి (యూఎన్), మహాసముద్ర సమావేశం (యూఎన్ఓసీ-3) 2025, జూన్ 9 నుంచి 13 వరకు ఎక్కడ జరిగింది?
   1) ఫ్రాన్స్, నైస్ 2) ప్యారిస్ 3) టోక్యో 4) బెల్‌గ్రేడ్
11. ప్రపంచ వ్యాప్తంగా ఎడారీకరణ దుర్భిక్షాలను ఎదుర్కొనే దినోత్సవాన్ని ఏ రోజున పాటిస్తారు?
   1) జూన్ 5 2) జూన్ 17 3) ఏప్రిల్ 22 4) ఏప్రిల్ 17
12. అల్లా బండ్ సరస్సు ఏ విధంగా ఏర్పడింది?
   1) భూకంపాల వల్ల 2) అగ్నిపర్వతాల వల్ల 3) నదీప్రవాహం వల్ల 4) మానవ ప్రమేయం వల్ల
13. ప్రపంచ విపత్తు నివేదికను ఎవరు తయారు చేస్తారు?
   1) ఐక్యరాజ్యసమితి 2) జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 3) రెడ్‌క్రాస్, రెడ్‌క్రిసెంట్ 4) ప్రపంచ బ్యాంకు
14. 'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్' పురస్కారాన్ని ఏ రోజున అందజేస్తారు?
   1) జనవరి 23 2) జనవరి 26 3) జనవరి 25 4) జనవరి 21
15. భారత ప్రభుత్వం 'పర్యావరణ పరిరక్షణ చట్టం' ఏ సంవత్సరంలో రూపొందించింది?
   1) 1984 2) 1986 3) 1980 4) 1989
16. అత్యవసర స్పందనకు పట్టేకాలం?
   1) ఒక రోజు 2) వారం నుంచి నెలలు 3) ఒక రోజు నుంచి వారాలు 4) నెలల తరబడి
17. SLAR అంటే
   1) Side Looking Airborn Radar (సైడ్ లుకింగ్ ఎయిర్‌బోర్న్ రాడర్)
   2) Side Looking Aerial Radar (సైడ్ లుకింగ్ ఏరియల్ రాడర్)
   3) Side Living Airborn Radar (సైడ్ లివింగ్ ఎయిర్‌బోర్న్ రాడర్)
   4) Sonar Looking Airborn Radar (సోనార్ లుకింగ్ ఎయిర్‌బోర్న్ రాడర్)




18. భూమి మొత్తాన్ని అత్యంత కచ్చితంగా ప్రతిబింబింపజేసే విధానం ఏది?
   1) ఎయిర్ ఫొటోగ్రఫీ 2) గ్లోబ్ 3) మెర్కేటర్ ప్రక్షేపకం 4) ఉపగ్రహం నుంచి తీసిన ఫొటోగ్రాఫ్
19. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధ్యక్షుడు ఎవరు?
   1) ఉపరాష్ట్రపతి 2) మానవ వనరుల అభివృద్ధి మంత్రి 3) గృహమంత్రి 3) ప్రధానమంత్రి



20. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి ఎన్నో ఆర్థిక కమిషన్ ప్రతిఫలం?
   1) 11వ 2) 12వ 3) 13వ 4) ఏదీకాదు
21. భూకంపం సంభవించినప్పుడు విడుదలయ్యే శక్తి ఏ రూపంలో విస్తరిస్తుంది?
   1) కంపనాలు 2) ప్రకంపనాలు 3) కంపనాలు, ప్రకంపనాలు 4) ప్రకంపనాలు, తరంగాలు
22. 'రింగ్ ఆఫ్ ఫైర్' ఏ మహాసముద్రానికి చెందింది?
   1) హిందూ 2) పసిఫిక్ 3) అట్లాంటిక్ 4) అంటార్కిటికా
23. విపత్తు పునరుద్ధరణ ప్రక్రియలో ఎన్ని దశలున్నాయి?
   1) 7 2) 4 3) 8 4) 5
24. భారతదేశంలో ఎంత శాతం ప్రాంతం తుపాన్లకు గురవుతోంది?
   1) 15% 2) 10% 3) 8% 4) 20%
25. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం)ను ఎప్పుడు స్థాపించారు?
   1) 2002, సెప్టెంబరు 23 2) 2001, ఆగస్టు 14 3) 2003, అక్టోబరు 16 4) 2004, ఆగస్టు 14
26. అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల తగ్గింపు దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
   1) జూన్ 15 2) మార్చి 5 3) అక్టోబరు 13 4) సెప్టెంబరు 13
27. భారతదేశంలో మొదటి విపత్తు నిర్వహణ ప్రణాళికను ఎవరు విడుదల చేశారు?
   1) హెచ్‌డీ దేవేగౌడ 2) అటల్ బిహారీ వాజ్‌పేయీ 3) మన్మోహన్ సింగ్ 4) నరేంద్ర మోదీ
28. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం, గాలి ఎంత వేగంతో వీచినప్పుడు ఏ తుపానును 'సూపర్ సైక్లోన్'గా వర్గీకరిస్తారు?
   1) 200 కి.మీ. కంటే ఎక్కువ 2) 110 కి.మీ. కంటే ఎక్కువ 3) 220 కి.మీ. కంటే ఎక్కువ 4) ఏదీకాదు
29. పర్యావరణం విధ్వంసం లేకుండా జరిగే ఆర్థికాభివృద్ధిని ఏమంటారు?
   1) పర్యావరణ అభివృద్ధి 2) స్థిరాభివృద్ధి 3) సుస్థిరాభివృద్ధి 4) ప్రగతిపథం
30. 'ప్రస్తుత ప్రజల కనీస అవసరాలను తీరుస్తూ, భవిష్యత్తు తరాల వారికి వనరులను మిగిల్చేలా వాటిని వివేకవంతంగా వినియోగించుకోవడం ద్వారా సాధించే అభివృద్ధి సుస్థిరాభివృద్ధి' అని ఎవరు నిర్వచించారు?
   1) ఎర్నెస్ట్ హెకెల్ 2) బ్రంట్ లాండ్ 3) మిశ్రా 4) క్రెబ్స్
31. 'ప్రస్తుత తరాల అవసరాలు తీర్చుకుంటూనే భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని మరింతగా మెరుగుపరచడమే సుస్థిరాభివృద్ధి' అని ఎవరన్నారు?
   1) మైఖేల్ థామస్ నీధం 2) బ్రంట్ లాండ్ 3) మైఖేల్ మాథ్యూస్ 4) రాబర్ట్ వాట్సన్
32. 'సుస్థిరాభివృద్ధి కోసం విద్య' గా ఐక్యరాజ్యసమితి ఏ దశాబ్దాన్ని ప్రకటించింది?
   1) 2000-2010 2) 2005-2015 3) 2004-2014 4) 2010-2020
33. 'సేంద్రియ వ్యవసాయ పితామహుడు' గా ఎవరిని పిలుస్తారు?
   1) సర్ ఆల్బర్ట్ హోవార్డ్ 2) సర్ ఆల్బర్ట్ హిమ్మింగ్ 3) రామ్‌సెక్ ఆల్బర్ట్ 4) రాబర్ట్ వాట్సన్



34. సేంద్రియ వ్యవసాయాన్ని భారతదేశంలో మొదటిసారిగా ఏ రాష్ట్రంలో మొదలుపెట్టారు?
   1) సిక్కిం 2) ఉత్తర్‌ప్రదేశ్ 3) పశ్చిమ బెంగాల్ 4) ఆంధ్రప్రదేశ్
35. వాయుశక్తిని ఉత్పత్తి చేయడానికి ఎంత గాలి వేగం కావాలి?
   1) 18 కి.మీ./గం. 2) 20 కి.మీ./గం. 3) 22 కి.మీ./గం. 4) 24 కి.మీ./గం.
36. భారతదేశంలో తొలిసారిగా బయోగ్యాస్‌ను ప్రారంభించిన ప్రదేశం?
   1) కోల్‌కతా 2) తిరువనంతపురం 3) కొట్టాయం 4) బెంగళూరు
37. ప్రస్తుతం భారతదేశంలో వరిసాగులో ఏ బ్యాక్టీరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు?
   1) అలోసిరా బ్యాక్టీరియా 2) సయానో బ్యాక్టీరియా 3) నాస్టాక్ బ్యాక్టీరియా 4) సైటోనియా బ్యాక్టీరియా



38. భారతదేశంలో మొదటి పవన విద్యుత్తు కేంద్రం?
   1) ముప్పాండల్ (తమిళనాడు) 2) జోగిమట్టి (కర్ణాటక) 3) మాండవి (గుజరాత్) 4) సతారా (మహారాష్ట్ర)



39. భారతదేశం పర్యావరణ పరిరక్షణకు జీడీపీలో ఎంత శాతం ఖర్చు పెడుతోంది?
   1) 2.6% 2) 3.6% 3) 4.6% 4) 5.6%
40. భారతదేశంలోని ఏ ప్రాంతాన్ని పర్యావరణ పరంగా ఉష్ణ ప్రాంతంగా పిలుస్తారు?
   1) పశ్చిమ హిమాలయాలు 2) పశ్చిమ కనుమలు 3) తూర్పు కనుమలు 4) తూర్పు హిమాలయాలు
41. ప్రస్తుతం భారతదేశంలో మొత్తం ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
   1) 50 2) 51 3) 52 4) 58

సమాధానాలు

1-4; 2-2; 3-4; 4-3; 5-1; 6-2; 7-4; 8-1; 9-3; 10-1; 11-2; 12-1; 13-3; 14-1; 15-2; 16-2; 17-1; 18-1; 19-4; 20-1; 21-3; 22-2; 23-4; 24-3; 25-4; 26-3; 27-4; 28-3; 29-2; 30-2; 31-1; 32-1; 33-1; 34-1; 35-1; 36-1; 37-2; 38-3; 39-1; 40-2; 41-4.

కూర్చున్నచోటే కన్నుమూశారు

- ఒకరినొకరు పట్టుకుని ఇద్దరు చిన్నారులు
- వారిని కాపాడేందుకు వెళ్లి ఇద్దరు..
- బయటకు రాలేక మరో మహిళ సజీవదహనం
- నాంపల్లి అగ్నిప్రమాదంలో ఐదుగురి మృత్యువాత
- ఫర్నిచర్ దుకాణం యజమాని అరెస్ట్



నాంపల్లి ఫర్నిచర్ దుకాణం సెల్లార్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది ★ ఉస్మానియా మార్చురీ వద్ద రోదిస్తున్న ప్రణీత్, అఖిల్ తల్లిదండ్రులు

వారిద్దరూ చిన్నపిల్లలు.. ఇంట్లోనే ఆడుకుంటున్నారు.. ఇంతలో వారున్న భవనాన్ని అగ్నికీలలు చుట్టుముట్టాయి. బయటకు ఎలా వెళ్లాలో తెలియక ఒకరినొకరు పట్టుకుని గదిలో చివరకు వెళ్లి కూర్చున్నారు. పొగ తీవ్రతకు ఊపిరాడక అక్కడికక్కడే కన్నుమూశారు. పిల్లల్ని రక్షించడానికి వెళ్లిన మరో ఇద్దరు సిబ్బంది.. ఊపిరాడక చెరో పక్క విగతజీవులుగా పడి ఉన్నారు. అక్కడే పనిచేసే మహిళా స్వీపర్ కూడా మృత్యువు నుంచి తప్పించుకోలేకపోయింది. ఈ హృదయవిదారక దృశ్యం నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణం సెల్లార్‌లో కనిపించింది.

ఈనాడు, హైదరాబాద్, అబిడ్స్, ఉస్మానియా ఆసుపత్రి-న్యూస్‌టుడే: హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్‌లోని బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో శనివారం పార్కింగ్ సెల్లార్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. 22 గంటల పాటు పోలీసులు, అగ్నిమాపకశాఖ, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శ్రమించి ఆదివారం ఉదయం 11 గంటలకు ఐదు మృతదేహాలను వెలికితీశాయి. పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ఫర్నిచర్ దుకాణ యజమాని సతీష్‌బచ్చా(54)పై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఫర్నిచర్ దుకాణం సెల్లార్ గదిలో యాదయ్య, లక్ష్మి దంపతులు, పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)తో కలిసి ఉంటున్నారు. యాదయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. లక్ష్మి ఇళ్లల్లో పనిచేస్తోంది. సుభాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్(26) దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా.. సయ్యద్ హబీబ్(30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కర్ణాటక బీదర్‌కు చెందిన బీబీబీ(50) స్వీపర్‌గా పనిచేస్తోంది. ముందురోజు యాదయ్య కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లి రావటంతో ఆలస్యమైంది. దీంతో శనివారం ఉదయం యాదయ్య దంపతులు పిల్లలిద్దర్ని స్కూలుకు పంపకుండా ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దుకాణం వెనుకనుంచి వ్యాపించిన మంటలు సెల్లార్‌లోకి పాకాయి. రెండు సెల్లార్ల నిండా మూడు కంటైనర్ల ఫర్నిచర్, రసాయనాల ద్రవ్యాలుండటంతో ప్రమాద తీవ్రత పెరిగింది. క్షణాల్లో మంటలు, పొగ పెరగడంతో సెల్లార్‌లో ఉన్న ముగ్గురు బయటకు రాలేకపోయారు. దుకాణం బయట ఉన్న ఇంతియాజ్, హబీబ్ చిన్నారుల్ని కాపాడేందుకు సెల్లార్‌లోకి వెళ్లి తిరిగి రాలేకపోయారు. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆదివారం ఉదయం సెల్లార్‌లోకి ప్రవేశించి మొదటి మృతదేహం గుర్తించారు. వాచ్‌మెన్ కుటుంబం ఉంటున్న గదిలో నిర్జీవంగా పడివున్న చిన్నారులను చూశారు. స్వీపర్ బీబీబీ అగ్నికి ఆహుతైంది. ఇంతియాజ్, హబీబ్ మృతదేహాలు చెరోదిక్కున పడి ఉన్నాయి. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేశారు. ఉస్మానియా మృతదేహాలతో కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతదేహాలను నల్గొండ జిల్లా యాదగిరిగుట్టలోని గ్రామానికి తరలించారు. నాగ్‌పుర్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ప్రమాద స్థలాన్ని పరిశీలించింది.

రసాయనాలతో పెరిగిన ప్రమాద తీవ్రత

ఫర్నిచర్ దుకాణం సెల్లార్‌లో ఫర్నిచర్, రసాయనాలు నిల్వ చేయడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అగ్నిమాపకశాఖ డీజీ విక్రమ్‌సింగ్‌మాన్ తెలిపారు. సెల్లార్ చివర్లో రెండు గదులు ఏర్పాటు చేశారన్నారు. మెట్లమార్గంలో ఐరన్ షట్టర్‌కు తాళం వేసి ఉన్నట్లు గుర్తించామని.. లోపలివారు బయటకు వచ్చేమార్గం లేకపోవడంతో మరణాలకు కారణమని తెలిపారు. అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ(అనుమతి) తీసుకోలేదన్నారు. మిగిలిన అనుమతులున్నా సెల్లార్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు వివరించారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం: తెలంగాణ మంత్రి పొంగులేటి

ఈనాడు, హైదరాబాద్: నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రమాదంలో ఐదుగురు అమాయకులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు పరిహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిచందనకు ఆదేశాలిచ్చాం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

డిస్కంలకు మెరుగైన రేటింగ్

- సీఎం చంద్రబాబు సంస్కరణలే కారణం
- మంత్రి గొట్టిపాటి వెల్లడి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యుత్ రంగాన్ని కూటమి ప్రభుత్వం కోలుకునేలా చేసిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చేపట్టిన విద్యుత్ సంస్కరణల కారణంగా కేంద్రం ఇచ్చిన గ్రేడింగ్‌లో డిస్కంలు మెరుగైన రేటింగ్‌ను సాధించాయని అన్నారు. 'గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసింది. అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసింది. కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. సాంకేతిక, వాణిజ్య నష్టాలు తగ్గించడం, విద్యుత్ బిల్లుల వసూళ్లలో సామర్థ్యం పెంచింది. ఈ కారణంగా కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఇచ్చిన గ్రేడింగులు మెరుగయ్యాయి. గృహ, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ అందిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో యూనిట్‌కు రూ.1.19 చొప్పున విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా.. ప్రజలపై భారాన్ని తగ్గించే విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది' అని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు, ఇంజినీర్లను మంత్రి అభినందించారు.

ఈతకు దిగి ముగ్గురి మృతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాద ఘటన



స్నేహ, సిరి   శ్రీమాన్య

ఊర్కొండ, న్యూస్‌టుడే: కుంటలో ఈతకు దిగిన పిల్లల్ని మృత్యువు కబళించింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, రజిని దంపతులకు కుమార్తె సిరి(14), కుమారుడు శ్రీమాన్య(12)..., శ్రీకాంత్ సోదరి చంద్రకళకు కుమార్తె స్నేహ(17) సంతానం. హైదరాబాద్‌లో స్నేహ ఇంటర్, సిరి పదోతరగతి, శ్రీమాన్య ఏడో తరగతి చదువుతున్నారు. శ్రీకాంత్ తల్లికి అనారోగ్యంగా ఉండటంతో పాటు, సెలవులు రావడంతో ఈ ముగ్గురూ గ్రామానికి వచ్చారు. గ్రామ శివారున ఉన్న పొలానికి శ్రీకాంత్‌తో పాటు వెళ్లారు. సరదాగా గడిపారు. పిల్లలు ముగ్గురూ సమీపంలోని కుంటలో ఈతకు దిగి మునిగిపోయారు. కాపాడాలని పిల్లలు కేకలు పెడుతున్నా ఈత రాని శ్రీకాంత్‌రెడ్డికి ఏం చేయాలో పాలుపోలేదు. వడివడిగా వెళ్లి సమీపంలోని రైతుల్ని తీసుకొచ్చి వారిని బయటకు తీసేసరికే ముగ్గురి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

తెలుగు 'పద్మాలకు' గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: పద్మ పురస్కారాలకు ఎంపికైన తెలుగు ప్రముఖులకు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. వారు భవిష్యత్తులో మరిన్ని అత్యున్నత పురస్కారాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించగా, పలువురు తెలుగువారికి పద్మ పురస్కారాలు రావడం ఆనందాన్ని కలిగించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. దేశవ్యాప్తంగా పద్మ పురస్కారాలు పొందిన ప్రముఖులకు సీఎం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'తెలుగు జాతి ఖ్యాతి మరింతగా వెలుగొందాలని, ఈ అవార్డులు అందరికీ స్ఫూర్తి కావాలని కోరుకుంటున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. గత కొద్దికాలంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాల ఎంపికకు అనుసరిస్తున్న ప్రమాణాలు ఆదర్శవంతంగా ఉంటున్నాయని పవన్ కల్యాణ్ కొనియాడారు.

◆ పద్మ పురస్కార విజేతలకు వైకాపా అధినేత జగన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు వారికి 'పద్మ పురస్కారాలు' అభినందనీయం: లోకేశ్

ఈనాడు, అమరావతి: పద్మ అవార్డులకు ఎంపికైన తెలుగు వారికి మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. 'ఎంచుకున్న రంగాల ద్వారా విశిష్ట సేవలు అందించి తమదైన ముద్ర వేసిన ప్రముఖులకు అత్యున్నత పురస్కారాలు ప్రకటించడం సముచితం. తెలుగు వారి ఖ్యాతిని ఇనుమడింపజేసి పద్మ అవార్డులకు ఎంపికైన స్ఫూర్తిప్రదాతలకు హృదయపూర్వక అభినందనలు' అని లోకేశ్ పేర్కొన్నారు.

నీట్ పీజీ దివ్యాంగ అభ్యర్థులకు వైకల్య పరీక్షలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్ పీజీ కటాఫ్ మార్కులు తగ్గించిన తర్వాత ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటా సీట్లకు దివ్యాంగుల కేటగిరీలో అర్హత సాధించి, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మెడికల్ బోర్డు ఎదుట హాజరుకావాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు. మెరిట్ ర్యాంకు 1-14 వరకు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు, 15-28 మధ్య ర్యాంకర్లు 30న ఉదయం 10 గంటలకు మెడికల్ బోర్డు ఎదుట హాజరు కావాలన్నారు. అభ్యర్థుల పేర్లను ఇప్పటికే విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యార్హత పత్రాలు తీసుకురావాలని సూచించారు.

వేరుసెనగకు రికార్డు ధర

ఈనాడు, మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగకు రూ.12,009 రికార్డు స్థాయి ధర లభించింది. శనివారం ఇదే మార్కెట్‌లో క్వింటాకు రూ.11,029 పలకగా.. ఒక్క రోజులోనే రూ.980 పెరిగి రూ.12,009 కు చేరింది. ఆదివారం వనపర్తిలో క్వింటాకు రూ.12,002, అచ్చంపేటలో క్వింటాకు రూ.11,877 ధర లభించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్లకు అయిదారు రోజులుగా పల్లీ వస్తోంది. క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.10వేలకు పైగా పలుకుతోంది.



మేడారం.. భక్తజనసంద్రం

వనదేవతల మహా జాతర సందడి రోజురోజుకు పెరుగుతోంది. ములుగు జిల్లాలో సమ్మక్క-సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుండడంతో ముందుగానే భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఆదివారం వేల మంది భక్తులు తరలివచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చారు. దీంతో మేడారం, పరిసర ప్రాంతాలన్నీ భక్త జనంతో కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లలో బారులుదీరి.. గద్దెల ప్రాంగణం చేరుకొని బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– న్యూస్‌టుడే, తాడ్వాయి



మానవత్వాన్ని మరిస్తే.. సామాజిక అనారోగ్యం తప్పదు

సాటి మనిషి పట్ల మానవత్వం లేకపోవడం సామాజిక ఆరోగ్యానికి ప్రమాదకరం. మనుషుల్లో సహానుభూతి లేకపోతే, ఇతరులకు హాని కలిగించడం తప్పుగా అనిపించదు. అది మానసిక వికారాలకు దారితీస్తుంది. బాధితుల కష్టాలు చిన్నవిగా కనిపిస్తాయి. మనుషులను సమస్యల సమూహంలా పరిగణించడం మొదలవుతుంది. మనల్ని రక్షించాల్సిన వ్యవస్థలపైనా నమ్మకాన్ని కోల్పోతాం. వ్యక్తిగత ఆరోగ్యానికైనా, సామాజిక భద్రతకైనా మానవత్వమనేది అత్యంత కీలకమైన విషయం. అందుకే ప్రతి ఒక్కరితో దయతో వ్యవహరించండి.

– నిషా పటేల్, హెల్త్ ప్రొఫెషనల్

ఎస్ఐని బ్యానెట్‌పైనే అర కిలోమీటరు తీసుకెళ్లాడు!

- మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం



ఎస్ఐ మధు

ఈనాడు, హైదరాబాద్ - న్యూస్‌టుడే, యాచారం: మద్యం మత్తులో కారు నడుపుతున్న ఓ వ్యక్తి.. పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను తప్పించుకోవడానికి బీభత్సం సృష్టించాడు. ఎస్ఐ కారు బ్యానెట్ మీద ఉన్నా, పట్టించుకోకుండా అర కిలో మీటరు దూరం తీసుకెళ్లాడు. అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నవారిని ఢీకొట్టాడు. చివరకు కారు వేగం తగ్గించగా.. ఎస్ఐ రోడ్డుపక్కన దూకేసి ప్రాణాలు కాపాడుకున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం ఎస్ఐ మధు యాచారం పట్టణంలోని బస్టాండ్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన కారును ఆపాలని పోలీసులు సూచించారు. డ్రైవర్ పట్టించుకోకుండా వెళ్లడంతో ఎస్ఐ బ్యానెట్ మీదకు దూకారు. అయినప్పటికీ కారు డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. మార్గం మధ్యలో పట్టణానికి చెందిన వెంకట్‌రెడ్డి ఆయన కోడలు దివ్య, ఏడాది వయసున్న మనవడితో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఢీకొట్టడంతో వారు కిందపడ్డారు. ఈ క్రమంలో దివ్య చెయ్యి విరిగింది. వెంకట్‌రెడ్డి, చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. యాచారం పట్టణం దాటాక కారు వేగం తగ్గడంతో ఎస్ఐ దూకేయగా స్వల్పంగా గాయపడ్డారు. పరారైన డ్రైవర్‌ను పోలీసులు ఇబ్రహీంపట్నం సమీపంలోని ఖానాపూర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోహెడకు చెందిన శ్రీకర్‌గా గుర్తించారు. శ్వాస పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్లు తేలింది. అదే కారులో అతని స్నేహితుడు, హయత్‌నగర్‌కు చెందిన నితిన్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు(నంగునూరు), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెటకు చెందిన పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి (61) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టి వస్తానని భార్యతో చెప్పి వెళ్లారు. పొలానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్ వైరు (జంపర్ వైరు) తెగి.. ఆన్ ఆఫ్ చేసే హ్యాండిల్ పై పడి సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో పొలానికి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి.. విద్యుత్తు సరఫరా పునరుద్ధరించడానికి ట్రాన్స్‌ఫార్మర్ హ్యాండిల్ పట్టుకున్నారు. ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్సై వివేక్ తెలిపారు.

మహారాష్ట్ర బావి.. తెలంగాణ మోటారు



సాధారణంగా కొన్ని కాలనీలు, పంచాయతీలు వేర్వేరు మండలాల్లో ఉండడం చూస్తుంటాం. కానీ ఇక్కడ మాత్రం భిన్నం. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని కొన్ని గ్రామాలను తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు పాలిస్తుంటాయి. అలాంటి ఓ గ్రామమైన పరందొలిలో 100 కుటుంబాలు ఉంటాయి. 1987లో మహారాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి ప్రజల నీటి అవసరాల కోసం ఓ బావిని తవ్వించారు. ఏళ్లపాటు ప్రజలు చేద ద్వారా నీటిని తోడుకుని వాడుకునేవారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఈ బావికి మోటారు, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నీటి అవసరాలను తీరుస్తోంది. వేసవిలో సైతం తాగునీటి కోసం వాడుతుంటారు. మిషన్ భగీరథ ద్వారా మూడు, నాలుగు రోజులకోసారి నీరు సరఫరా అవుతుంది.

– న్యూస్‌టుడే, కెరమెరి

భావి అవసరాలకు ఇంధన సామర్థ్యం అవసరం

ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి

ఈనాడు, అమరావతి: ఇంధన సామర్థ్యం కేవలం కార్యాచరణ మాత్రమే కాదని.. భవిష్యత్తు తరాల ప్రయోజనాలు కాపాడుతూ దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందించేలా చూడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి అన్నారు. పర్యావరణ అనుకూల జీవనశైలి ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రయత్నంలో భాగంగా మిషన్ లైఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో వ్యక్తిగత, సంస్థాగత చర్యలను పోస్టర్ ద్వారా ప్రచారం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.


శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



చిన్నశేష వాహన సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి. చిత్రంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. తర్వాత న్యాయమూర్తి కుటుంబసభ్యులతో కలిసి రథసప్తమి పురస్కరించుకుని నిర్వహించిన వాహన సేవల్లో పాల్గొన్నారు. సూర్యప్రభ వాహనం, చిన్నశేష వాహనంపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామిని దర్శించుకున్నారు.

తిరుమలేశుని సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు



హనుమంత వాహనంపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు. చిత్రంలో తితిదే ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు



కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని రథసప్తమి రోజున ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ రవినాథ్ తిల్హరి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని న్యాయమూర్తులు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. తర్వాత న్యాయమూర్తులు సూర్యప్రభ, హనుమంత వాహనంపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారి సన్నిధిలో మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి



ఆలయం ఎదుట జస్టిస్ దుప్పల వెంకటరమణ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

దేవాదాయ కమిషనరేట్‌లో పదోన్నతుల వివాదం

ఈనాడు, అమరావతి: దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై వివాదం నెలకొంది. కృష్ణారెడ్డి, రుషేంద్రలకు పదోన్నతులు కల్పించగా.. వీరిలో రుషేంద్రకు గతంలో తగినన్ని సీనియర్ అసిస్టెంట్ పోస్టులు లేకపోయినా.. పదోన్నతి కల్పించారన్న వివాదం ఉంది. ఇప్పుడు ఆయనకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. మరోవైపు కార్యాలయంలో అదనంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు సృష్టించి ఎంత మందికి పదోన్నతులు కల్పించారనే వివరాలు ఇవ్వాలంటూ చాలా కాలంగా రాజశేఖరరెడ్డి అనే సీనియర్ అసిస్టెంట్ పలు విధాలుగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆయనకు పదోన్నతి రావాల్సి ఉంది. ఏడాదిగా ఆయనకు ఎలాంటి పని లేని ఆర్టీఐ విభాగంలో విధులు కేటాయించారు. ఇటీవల అక్కడా విధులు నిర్వర్తించడం లేదంటూ తాఖీదు ఇచ్చారు. దీన్ని కారణంగా చూపించి రాజశేఖరరెడ్డికి పదోన్నతి అవకాశం కూడా లేకుండా పక్కనపెట్టడం వివాదంగా మారింది.



77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' పేరిట చేపట్టిన కార్యక్రమంలో ఆదివారం అమృత్‌సర్‌లో సైకిళ్లు తొక్కుతున్న సరిహద్దు రక్షణ దళం సిబ్బంది

పరువు నష్టం కేసు.. నిర్దోషిగా మేధా పాట్కర్



దిల్లీ: పరువు నష్టం కేసులో సామాజిక కార్యకర్త, 'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమకారిణి మేధా పాట్కర్‌ను దిల్లీ కోర్టు నిర్దోషిగా తేల్చింది. 25 ఏళ్ల క్రితం నాటి ఈ కేసును ప్రస్తుత దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, సరైన ఆధారాలు సమర్పించడంలో సక్సేనా విఫలమయ్యారని పేర్కొంది. మేధా పాట్కర్, సక్సేనాల మధ్య 2000 సంవత్సరం నుంచి న్యాయపోరాటం కొనసాగుతోంది. తనపైనా 'నర్మదా బచావో ఆందోళన్'కు వ్యతిరేకంగా ప్రకటనలు జారీ చేశారని ఆరోపణలపై సక్సేనాపై మేధా పాట్కర్ కేసు వేశారు. ఆ సమయంలో ఆయన అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న 'నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే ఎన్జీవోకు అధ్యక్షుడిగా ఉన్నారు. మరోవైపు, ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు, పరువు నష్టం కలిగించేలా పత్రికా ప్రకటన జారీ చేశారని ఆరోపిస్తూ.. సక్సేనా సైతం పాట్కర్‌పై రెండు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియోలను గానీ, సరైన ఆధారాలను కానీ సమర్పించడంలో సక్సేనా విఫలమయ్యారని న్యాయస్థానం తెలిపింది.

కెనడాలో భారత సంతతి వ్యక్తి హత్య


దిల్ రాజ్ సింగ్ గిల్

ఇంటర్నెట్‌డెస్క్: కెనడాలో భారత సంతతికి చెందిన దిల్ రాజ్ సింగ్ గిల్ అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. ఈ ఘటన బ్రిటిష్ కొలంబియాలోని బర్నబీ వద్ద చోటు చేసుకుంది. వాంకోవర్ వాసి అయిన దిల్‌రాజ్ హత్య వెనుక గ్యాంగ్‌వార్ కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెల 22న '3700 కెనడా వే'లో కాల్పులు జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకొనేసరికి గిల్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. అతడిని కాపాడేందుకు పోలీసులు యత్నించినా.. ఫలితం లేకపోయింది.

ఎర్రకోట పేలుడు కేసు.. నిందితుడిపై త్వరలో రెడ్ కార్నర్ నోటీస్!

దిల్లీ: గతేడాది నవంబరులో జరిగిన ఎర్రకోట పేలుడు కేసుకు సంబంధించి నిందితుడిగా ఉన్న వైట్ కాలర్ ఉగ్రవాది ముజఫర్ రాథర్‌పై రెడ్ కార్నర్ నోటీసుకు రంగం సిద్ధమైంది. ఇంటర్‌పోల్ త్వరలోనే ఈ నోటీసును విడుదల చేయనుందని, ఆ ప్రక్రియ వేగంగా జరుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. జమ్మూకశ్మీర్‌కు చెందిన రాథర్.. చిన్నపిల్లల వైద్యుడు. ఎర్రకోట వద్ద కారు పేలుడుకు కారణమైన డా.ఉమర్ ఉన్ నబీకి ఆర్థిక సాయం, సమాచారం చేరవేయడం వంటి బాధ్యతలను చూసుకునేవాడని దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈ దాడి జరగడానికి కొద్ది రోజుల ముందే దేశం దాటేసిన అతడు.. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌లోని సురక్షిత ప్రాంతంలో తలదాచుకున్నాడని తెలుస్తోంది.

మారిన ట్రంప్ స్వరం



- బ్రిటన్ దళాలను ప్రశంసిస్తూ పోస్టు

ఇంటర్నెట్‌డెస్క్: అఫ్గాన్‌లో మరణించిన 457 మంది బ్రిటన్ సైనికులను, తీవ్రంగా గాయపడిన వారిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గొప్ప యోధులుగా అభివర్ణించారు. అఫ్గానిస్థాన్‌లో యుద్ధంలో నాటో దేశాలు దూరంగా ఉన్నాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. కాగా బ్రిటన్ సైనికుల కృషిని ప్రశంసిస్తూ.. ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ చేసిన పోస్టు చూస్తే ఆయన తన స్వరం మార్చుకున్నట్లు స్పష్టమవుతుంది. గొప్ప, ధైర్యవంతులైన బ్రిటన్ సైనికులు అమెరికాకు ఎప్పుడూ అండగా ఉంటారని ఆయన అన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న సైనిక బంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాలేనంత బలంగా ఉందన్నారు. ఇటీవల ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అఫ్గాన్ యుద్ధంలో అమెరికా సేనలే ముందు ఉన్నాయని, నాటో దేశాలు దూరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. దీనిపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు తమ సైనికులను అవమానించడమేనని.. దీనికి ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ సైనికులను ప్రశంసిస్తూ ట్రంప్ పోస్టు పెట్టడం గమనార్హం.

మినియాపొలిస్‌లో తీవ్ర ఉద్రిక్తత!

పౌరుల కాల్చివేతలపై ఆగ్రహం

మినియాపొలిస్: అమెరికా సరిహద్దు గస్తీ అధికారి కాల్పుల్లో శనివారం మినియాపొలిస్‌లో ఒక వ్యక్తి చనిపోయిన నేపథ్యంలో ఆందోళనలు మిన్నంటాయి. వందల మంది నిరసనకారులు వీధుల్లోకి రావడంతో నగరం అట్టుడుకుతోంది. మరోవైపు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని 37 ఏళ్ల అలెక్స్ ప్రెటీగా గుర్తించారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం 9 గంటలకు మినియాపొలిస్ నగరంలో ఈ ఘటన జరిగింది. అధికారుల వాదనకు భిన్నంగా ఉన్న వీడియోలో అతడి చేతిలో తుపాకీ కనిపించలేదు. సెల్‌ఫోన్ మాత్రమే ఉంది. అతడికి, అధికారులకు మధ్య పెనుగులాట జరిగింది. సిబ్బంది అతడిపై దాడి చేస్తూ, పెప్పర్ స్ప్రేను ప్రయోగించారు. అతడిని కిందకి పడదోసి పిడిగుద్దులు కురిపించారు. అతడి చేతులను వెనక్కి కట్టి బంధించేందుకు ప్రయత్నించారు. దీన్ని అలెక్స్ ప్రతిఘటించారు. ఈ క్రమంలో ఓ అధికారి ఒక వస్తువుతో అక్కడి నుంచి వెనక్కి వెళ్లారు. దాన్ని అలెక్స్ నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీగా చెబుతున్నారు. సరిగ్గా అదే సమయంలో ఓ అధికారి తుపాకీ తీసి అలెక్స్‌పై కాల్పులు జరిపారు.

తాజా కాల్పులపై డెమొక్రాట్ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ అధికారులు తక్షణం మిన్నెసోటా రాష్ట్రాన్ని వీడాలని డిమాండ్ చేశారు. తాజా ఘటనకు సంబంధించి మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్, మినియాపొలిస్ మేయర్ జాకోబ్ ఫ్రే లక్ష్యంగా సామాజిక మాధ్యమంలో ట్రంప్ విమర్శలు గుప్పించారు. అలెక్స్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న తుపాకీ ఫొటోలను ఆయన షేర్ చేశారు.

రెండేళ్ల చిన్నారి నిర్బంధం

అమెరికాలో ఐదేళ్ల బాలుడిని ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఇలాంటి ఘటనే మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. మినియాపొలిస్‌లో రెండేళ్ల చిన్నారిని ఆమె తండ్రితో సహా ఐసీఈ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక అధికారి జాసన్ చావెజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్ల క్లోయి రెనెటా టిపాన్, ఆమె తండ్రి ఎల్విస్ జోయెల్‌లు ఓ కిరాణా దుకాణం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా వారి కారుని ఓ అనుమానాస్పద వాహనం వెంబడించింది. కారు అద్దాలు పగలగొట్టి ఇమిగ్రేషన్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వాళ్లని టెక్సాస్‌కు తరలించినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాత చిన్నారి నిర్బంధం నుంచి బయటపడిందని, ఈ ఘటన ఆమెను భయభ్రాంతులకు గురిచేసిందని బాధిత కుటుంబ న్యాయవాది పేర్కొన్నారు. ఈ ఘటనను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం కూడా ధ్రువీకరించింది.


లొంగిపోయేందుకు 15 నిమిషాలే సమయం

- మదురో నిర్బంధం అనంతరం పరిస్థితిని వెల్లడించిన రోడ్రిగ్జ్


డెల్సీ రోడ్రిగ్జ్

ఇంటర్నెట్‌డెస్క్: వెనెజువెలాపై సైనిక దాడి చేసి ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించే సమయంలో తమకు ఎదురైన సవాళ్ల గురించి తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మాట్లాడిన వీడియో ఒకటి బయటికొచ్చింది. మదురో నిర్బంధం తర్వాత జరిగిన ఓ సమావేశానికి సంబంధించిన వీడియోలో.. అధికారాన్ని కాపాడుకోవడమే తన ప్రాధాన్యత అని రోడ్రిగ్జ్ ఫోన్ కాల్ మాట్లాడారు. 'అధ్యక్షుడిని నిర్బంధించిన మరు నిమిషం నుంచే మాకు బెదిరింపులు మొదలయ్యాయి. డిమాండ్లపై స్పందించేందుకు నాకు, అంతర్గత మంత్రి డియోస్డాడో కాబెల్లో, నా సోదరుడు, మంత్రి జార్జ్ రోడ్రిగ్జ్‌లకు కేవలం 15 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారు. లేకుంటే వారు మమ్మల్ని చంపేస్తానని బెదిరించారు. మదురో, ఆయన భార్యను కిడ్నాప్ చేయలేదు.. చంపేశాం అని అమెరికా దళాలు మాకు చెప్పాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించాల్సి రావడం బాధాకరం'' అని రోడ్రిగ్జ్ ఆ వీడియోలో పేర్కొన్నారు. మరోవైపు, దేశంలో అధికార మార్పిడి కోసం అమెరికాతో రోడ్రిగ్జ్ రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారనే ప్రచారం మొదలయ్యింది. మదురోని తొలగించి అధికారం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు గత ఏడాది నవంబరు నుంచే అమెరికా అధికారులతో ఆమె సంప్రదింపులు జరిపారని ది గార్డియన్ పత్రిక ఓ కథనం ప్రచురించింది. ఈ క్రమంలోనే రోడ్రిగ్జ్ మాట్లాడిన వీడియో బయటకు రావడం గమనార్హం.

కెనడా వస్తువులనే కొనండి



- ట్రంప్ హెచ్చరికతో ప్రజలకు ప్రధాని కార్నీ పిలుపు

ఒట్టావా: చైనాతో వాణిజ్యం చేస్తే తమ దేశ వస్తువులన్నింటిపై 100 శాతం పన్నులు విధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆదివారం స్పందించారు. ''ఇతర దేశాలు ఏం చేస్తాయన్నది మన చేతుల్లో లేదు. మనం దేన్నైతే నియంత్రించగలమో దానిపైనే దృష్టి పెడదాం. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థకు విదేశాల నుంచి ముప్పు పొంచి ఉంది. ఈ కీలక సమయంలో ఇతర దేశాల దయాదాక్షిణ్యాలపై మనం ఆధారపడకూడదు. మనమే మనకు అతిపెద్ద వినియోగదారులు కావాలి. అందుకే కెనడా వస్తువులనే కొనండి. కెనడాను నిర్మించండి. మనమంతా కలిసికట్టుగా ఉంటేనే బలంగా ఎదుగుతాం'' అని దేశ ప్రజలకు కార్నీ పిలుపునిచ్చారు. తన పోస్టులో కెనడా ప్రధాని కార్నీని ట్రంప్ గవర్నర్ అని సంబోధించారు. ఇది ఒక దేశాధినేతను పరోక్షంగా అవమానించడమేనని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేశారు.


అమెరికా ప్రతినిధి మైక్ రోజెర్స్‌తో చర్చిస్తున్న విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్

అమెరికా రాయబారితో జైశంకర్ భేటీ

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అత్యంత సన్నిహితుడు, రాయబారి సెర్గియో గోర్, మరో ముగ్గురు సభ్యుల ప్రతినిధి బృందంతో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఆదివారం భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య భద్రత, వాణిజ్యం, క్రిటికల్ టెక్నాలజీల్లో సహకారం వంటి అంశాలు పురోగతి సాధించేలా చర్చలు జరిగినట్లు ఎస్.జైశంకర్, గోర్‌లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నవేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో 25 శాతం సుంకాలను వెనక్కి తీసుకొనే అవకాశం ఉందని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య

పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్‌లోని నార్సింగ్డి ప్రాంతంలో ఓ దుకాణంలో నిద్రిస్తున్న హిందూ యువకుడిని కొందరు దుండగులు సజీవ దహనం చేశారు. శుక్రవారం రాత్రి దుకాణంపై అల్లరి మూకలు దాడి చేశాయి. షట్టర్ మూసివేసి పెట్రోల్ పోసి నిప్పంటించాయి. ఈ సమయంలో షాపులో నిద్రిస్తున్న చంచల్ భౌమిక్ (23) అనే యువకుడు సజీవదహనమయ్యాడు. చంచల్ మరణించాడని నిర్ధారించుకున్న తర్వాతే దుండగులు అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతుడికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. వీరిలో ఒకరు దివ్యాంగుడు. వీరి తండ్రి చాలా కాలం క్రితమే మృతి చెందాడు. చంచల్ ఆదాయంపైనే ఆ కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. కుటుంబ పోషణ కోసం నార్సింగ్డి ప్రాంతంలోని ఓ గ్యారేజీలో అతడు ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లు అతడి కుటుంబ సభ్యులు, చంచల్ యజమాని ఆరోపిస్తున్నారు. గతంలోనూ బంగ్లాదేశ్‌లో దీపు చంద్రదాస్, ఖోకాన్ చంద్రదాస్ అనే వ్యక్తులను కూడా ఇదే విధంగా అల్లరిమూకలు హత్య చేసిన విషయం తెలిసిందే.


చంచల్ భౌమిక్

ఉక్రెయిన్‌కు అమెరికా భద్రతపై ఒప్పందం సిద్ధం: జెలెన్‌స్కీ

విల్నియస్ (లిథువేనియా): రెండ్రోజుల చర్చల అనంతరం.. తమ భద్రతకు హామీ ఇచ్చే పత్రం 100% సిద్ధమైందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. లిథువేనియా పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం విల్నియస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒప్పందంపై సంతకం చేసే తేదీ కోసం నిరీక్షిస్తున్నామని, ఆ తర్వాత ఆమోదం నిమిత్తం ఆ పత్రం అమెరికా, ఉక్రెయిన్ చట్టసభలకు వస్తుందని చెప్పారు. ఆర్థికపరమైన భద్రతకు గ్యారంటీగా 2027 నాటికి తమకు ఈయూలో సభ్యత్వం కోసం గట్టి ప్రయత్నం చేస్తామని తెలిపారు. అబుధాబీలో జరిగిన చర్చలకు దౌత్యవేత్తలు, సైనిక ప్రతినిధులు కూడా హాజరుకావడంతో తొలిసారి సమగ్రంగా చర్చలు జరిగాయని చెప్పారు. తమ ప్రాదేశిక సమగ్రతను కచ్చితంగా గౌరవించాల్సిందేనని స్పష్టంచేశారు. రాజీ కుదిర్చేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని, దానికి అన్ని పక్షాలూ సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సూర్యప్రభ వాహనంపై యాదగిరీశుడు



యాదగిరిగుట్ట పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో ఆదివారం రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని.. సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీ సమేత నరసింహస్వామిని అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ స్థానాచార్య, ప్రధాన పూజారి కాండూరి వెంకటాచార్య సూర్యప్రభ వాహనోత్సవ విశిష్టతను వివరించారు. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ కనిపించింది. యాదగిరిగుట్ట ప్రధాన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 18న మొదలవుతాయి. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో 11 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలలో అలంకార, వాహన సంబరాలు, విశేష ఉత్సవాలు నిర్వహిస్తారు.

-న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట


జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా ఖ్వాజీగండ్‌లో ఆదివారం మంచుతో నిండిన పట్టాలపై ప్రయాణిస్తున్న రైలు

బాధ్యతల నుంచి పారిపోకండి



బాధ్యత అనేది బరువు కాదు, అది మీకు దక్కిన గౌరవం. మీకు బాధ్యతలు అప్పగిస్తున్నారంటే, మీ సామర్థ్యాలను చూసి మిమ్మల్ని గౌరవిస్తున్నారని అర్థం. ఎక్కువ కష్టపడాల్సి వస్తుందన్న ఆలోచనతో బాధ్యతల నుంచి తప్పించుకొనేవారు తమను తాము అవమానపర్చుకుంటున్నట్లే. వ్యక్తిగత జీవితంలోనూ కుటుంబాన్ని మీరు బాధ్యతగా భావించినప్పుడే, మీరు ఓ మంచి భర్తగా, మంచి తండ్రిగా గౌరవాన్ని అందుకుంటారు.

- జూలీ గుర్నెర్, పెర్ఫార్మన్స్ కోచ్

బరువుగా ఉన్నామని నడక మానేస్తే దుష్ప్రభావాలు

- తల్లిదండ్రులు.. పిల్లలతో కలిసి రోజూ వాకింగ్‌కు వెళ్లాలి
- దీని వల్ల కుటుంబ బంధాలూ మెరుగుపడతాయి
- హైదరాబాద్ సాహితీ వేడుకలో నిపుణుల ఉద్ఘాటన


చర్చలో పాల్గొన్న కీర్తనా స్వామినాథన్, రజత్ చౌహాన్

ఈనాడు, హైదరాబాద్: నిత్యజీవితంలో వ్యాయామం ప్రాధాన్యం.. యాంటీ బయాటిక్స్ ఔషధాల అధిక వాడకం వల్ల రోజురోజుకు పెరిగిపోతున్న ముప్పు, చికిత్స విధానాలు.. మూల కణాల పరిశోధనలకు లైఫ్ సైన్సెస్ రంగంలో పెరుగుతున్న ఆదరణ.. ఇలా భిన్న అంశాలపై హైదరాబాద్ సాహితీ వేడుకలో లోతైన సైన్స్ చర్చలు సాగాయి. ఆదివారం 'సైన్స్ అండ్ ది సిటీ' ఈవెంట్‌లో భాగంగా మూడు అంశాలపై జరిగిన చర్చలో నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. 'వ్యాయామం అనగానే చాలా మంది కనీసం అరగంట, గంట మాత్రమే కసరత్తులు చేయాలని భావిస్తారు. ఒకటి రెండు రోజులు చేశాక మానేస్తుంటారు. అలాకాకుండా ప్రారంభ దశలో ఐదు పది నిముషాలతో మొదలుపెట్టి క్రమంగా అలవాటయ్యాక ఎక్కువ సమయం కేటాయించుకోవాలి' అని వైద్య నిపుణులు సూచించారు. ఆదివారం 'హైదరాబాద్ సాహితీ పండగ' (హెచ్‌ఎల్‌ఎఫ్)లో నిర్వహించిన 'ది సైన్స్ ఆఫ్ మూవ్‌మెంట్ అండ్ యాన్ యాక్టివ్ లైఫ్‌స్టైల్' అంశంపై దిల్లీకి చెందిన క్రీడా వైద్యుడు డాక్టర్ రజత్ చౌహాన్, చెన్నైకి చెందిన స్పోర్ట్స్ సైకాలజిస్టు కీర్తనా స్వామినాథన్‌లు పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిపై వీరు ప్రసంగించారు. నిత్య జీవితంలో ఉత్సాహంగా ఉండాలంటే శారీరక శ్రమ తప్పనిసరి అని అన్నారు. చాలా మంది బరువు ఎక్కువగా ఉన్నామనే నెపంతో నడక మానేస్తారని దీని వల్ల ఆరోగ్యంపై మరిన్ని దుష్ప్రభావాలు పడతాయని హెచ్చరించారు. మారథాన్‌ల వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రేక్షకులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ప్రశాంతతకు మారథాన్‌లు దోహదం చేస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి రోజూ నడకకు వెళ్లాలని దీని వల్ల కుటుంబ బంధాలు, ఆరోగ్యం మెరుగు పడతాయని చెప్పారు.

'ఏఎంఆర్' ముప్పు వ్యవస్థ లోపమే

యాంటీ బయాటిక్స్ ఔషధాలు అధికంగా వాడడం వల్ల సంభవించే 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' (ఏఎంఆర్)కు వ్యవస్థలోని లోపాలే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయ పడ్డారు. 'గుడ్ వైరసెస్ మెడిసిన్స్ అన్‌లైక్లీ అలీస్' అనే అంశంపై ఉర్మి బాజ్‌పాయ్, ప్రణవ్ జోహ్రీ ప్రసంగించారు. ఉర్మి బాజ్‌పాయ్ దిల్లీలోని ఆచార్య నరేంద్రదేవ్ విశ్వవిద్యాలయంలో బయోమెడికల్ సైన్స్ విభాగంలో యాంటీ మైక్రోబియల్ డ్రగ్ డిస్కవరీ ప్రయోగశాలలో విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. ప్రణవ్ గతంలో ఏఎంఆర్ బారిన పడి 'ఫేజ్ థెరపీ'తో కోలుకున్నారు. ఏఎంఆర్ బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు దేశవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. 'స్కార్స్ టొటెమ్స్ ఆఫ్ మెమొరీ' అనే అంశంపై ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యుడు సయాన్ బసు, బెంగళూరు మణిపాల్ వర్సిటీ పరిశోధకురాలు డాక్టర్ శ్వేత చక్రబర్తి అవగాహన కల్పించారు.

వాతావరణ మార్పులే అతిపెద్ద ముప్పు

- మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ



ఈనాడు, హైదరాబాద్: ప్రపంచానికి భూతాపం, వాతావరణ మార్పులతో అతి పెద్ద ముప్పు పొంచి ఉందని మాజీ ఐఏఎస్ అధికారి, మాజీ దౌత్యవేత్త, మాజీ గవర్నర్, రచయిత గోపాలకృష్ణ గాంధీ తెలిపారు. గాలి, నీరు, భూమి కాలుష్యం, వేగంగా కరుగుతున్న హిమనీనదాలతో భూగోళం ప్రమాదంలోకి వెళ్తోందన్నారు. దేశాన్ని ఒకటిగా కలిపిన మాజీ ఉప ప్రధాని సర్దార్ పటేల్ లౌకికవాది అని, ఈ విషయాన్ని ఎవరూ కాదనలేరని పేర్కొన్నారు. హైదరాబాద్ సాహితీ పండగ కార్యక్రమంలో 'ఇండియా అండ్ హర్ ఫ్యూచర్స్' పుస్తకంపై జరిగిన చర్చలో మాట్లాడారు. ఈ పుస్తకంలో 100 వ్యాసాలు, ఏడు చాప్టర్లు ఉన్నాయన్నారు. బాల్యవివాహాలు తగ్గడంతోపాటు మహిళా సాధికారత సాధించినపుడే దేశం మరింత వృద్ధి సాధిస్తుందన్నారు. భారత భవిష్యత్తు ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుందన్నారు.

కులవివక్షతో విద్యార్థుల ఆత్మహత్యలు: కావేరీ నంబిసన్

దేశంలో ఇప్పటికీ కులవివక్ష కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రముఖ సర్జన్, రచయిత కావేరి నంబిసన్ ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీ పండగలో 'రైజింగ్‌సన్స్' పుస్తకంపై చర్చలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యురాలిగా పని చేసినపుడు అక్కడి ప్రజల పరిస్థితులు ప్రత్యక్షంగా చూశానని.. ఎక్కువగా చదివినపుడే చక్కగా రాయగలమని తెలిపారు.

న్యాయస్థానాల కార్యకలాపాల్లో పారదర్శకతకు సంస్కరణలు అవసరం

- ఒడిశా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్



ఈనాడు, హైదరాబాద్: న్యాయస్థానాల కార్యకలాపాల్లో పారదర్శకతకు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరముందని ఒడిశా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జస్టిస్ ఎస్.మురళీధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తరహాలో కింది స్థాయి కోర్టుల్లోనూ విచారణ లైవ్‌స్ట్రీమింగ్ అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ సాహితీ పండగ కార్యక్రమంలో ''(ఇన్)కంప్లీట్ జస్టిస్? ది సుప్రీంకోర్టు ఎట్ 75''పై జరిగిన చర్చలో మాట్లాడారు. ''ఆర్టికల్-142 కింద పూర్తిన్యాయం అందించాలనేది లక్ష్యం. హిందూ వివాహ చట్టం ప్రకారం వైవాహిక జీవితంలో ఇమడలేని ఇద్దరికి విడాకులు ఇవ్వడం సాధ్యం కాదు. అందుకే ఆర్టికల్-142 కింద ఈ తరహా కేసులకు పరిష్కారం లభించింది. పెగాసిస్ అంశంలో న్యాయమూర్తుల ఫోన్లు ట్యాప్ చేశారు. దీనిపై కమిటీ ఏర్పాటు చేసినా దాని పనితీరుపై ఎవరూ మాట్లాడటం లేదు. భీమా కోరేగావ్, ఈశాన్య రాష్ట్రాల అల్లర్ల కేసులు ఏడేళ్లు గడిచినా విచారణ లేదు. పదేళ్ల విచారణ అనంతరం నిర్దోషిగా విడుదలైనా కోల్పోయిన స్వేచ్ఛకు పరిహారం ఇచ్చే వ్యవస్థ ఈ దేశంలో లేదు. న్యాయస్థానాల కార్యకలాపాల్లో పారదర్శకత పెంచేందుకు మార్గాలున్నాయి'' అని తెలిపారు.


చర్చా వేదికలో మాట్లాడుతున్న సంజయ్‌బారు. చిత్రంలో సుచిత్ర షెనాయ్, కార్తిక్ మురళీధరన్

కేంద్ర ప్రభుత్వమే ఒక ఏజెంట్‌గా మారింది

- హైదరాబాద్ సాహితీ ఉత్సవంలో.. సంజయ్ బారు

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో సరైన పాలన లేకపోవడంతో సంపన్నులు, మేధావులు పెద్దఎత్తున విదేశాలకు వలస వెళ్తున్నారని ప్రధానమంత్రి మీడియా మాజీ సలహాదారు సంజయ్‌బారు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సాహితీ ఉత్సవంలో రెండోరోజైన ఆదివారం 'ఉదార ఆర్థిక వ్యవస్థ-ఉదార రాజకీయ వ్యవస్థ' అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'భారత్ నుంచి వలసలు పెరగడానికి నిర్మాణాత్మక కారణాలున్నాయి. భారత ప్రభుత్వమే ఒక ఏజెంట్‌గా మారి ఇజ్రాయెల్, తైవాన్ వంటి దేశాలతో ఒప్పందాలు చేసుకుని భారతీయులను అక్కడికి పంపుతోంది. 2015 నుంచి ఏటా వేల సంఖ్యలో మిలియనీర్లు దేశం విడిచి వెళుతున్నారు' అని పేర్కొన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తిక్ మురళీధరన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సుచిత్ర షెనాయ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కరాచీ అగ్ని ప్రమాదంలో 72కి చేరిన మృతుల సంఖ్య

కరాచీ: పాకిస్థాన్ కరాచీలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఈ నెల 17న జరిగిన భారీ అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 72కు చేరింది. ఇంకా 12 మంది ఆచూకీ తెలియరాలేదు. 1,200 హోల్‌సేల్, రిటైల్ దుకాణాలున్న గుల్ షాపింగ్ ప్లాజాలోని బేస్‌మెంట్‌లో చోటుచేసుకున్న ఈ అగ్ని ప్రమాదాన్ని అదుపులోకి తీసుకురావడానికి దాదాపు 36 గంటలు పట్టింది. శిథిలాల కింద శవాలు గుర్తుపట్టలేని విధంగా లభించాయి. దాంతో మరణించిన వారిని గుర్తించడానికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకూ 22 మంది వివరాలను కనుగొన్నట్లు అధికారులు తెలిపారు.

ఉగ్రవాదితో సంబంధాలు.. పంజాబ్‌లో జమ్మూ వ్యక్తి అరెస్ట్

చండీగఢ్: పాకిస్థాన్ ఆధారిత ఉగ్రవాది షాజాద్ భట్టితో సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జమ్మూకు చెందిన వ్యక్తిని పోలీసులు పంజాబ్‌లో అరెస్టు చేశారు. రమన్ కుమార్ అలియాస్ గోలును చండీగఢ్‌లో స్పెషల్ ఆపరేషన్ సెల్‌కు చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. షాజాద్‌కు రమన్ కీలక అనుచరుడని, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లో అతనితో ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉన్నట్లు తెలిపారు. అంబాలా పోలీస్‌స్టేషన్ పేలుడుతోనూ ఇతడికి ప్రమేయం ఉందని డీజీపీ వెల్లడించారు.

పాక్, బంగ్లా విదేశాంగ మంత్రుల చర్చ

స్నేహ సంబంధాలను కొనసాగించాలని పునరుద్ఘాటన

ఇస్లామాబాద్: పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ తౌహిద్ హుస్సేన్‌తో ఆదివారం ఫోన్లో మాట్లాడారు. ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక ఒప్పందాలను బలోపేతం చేసుకునే దిశగా, స్నేహ సంబంధాలను కొనసాగించడంపై వారి సంభాషణ జరిగినట్లు అధికారులు తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక సహకారంతో పాటు బహుళ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసే దిశగా వారు చర్చించినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారి చర్చ కొనసాగిందని, ప్రాంతీయంగా శాంతి, శ్రేయస్సులను నెలకొల్పే దిశగా వారు మాట్లాడుకున్నారని సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి.